


'గ్రామం ప్రగతిపథంలో ఉంటే
ఎవ్వరూ ముఠా కక్షల జోలికి వెళ్లరు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 352


శుక్రవారం 14-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భువిపై విరిసే ఇంద్రధనుస్సు

హోలీ సందర్భంగా ప్రత్యేక కథనాల సమాహారం..
- 15లో



డీ-డాకింగ్ సక్సెస్

విజయవంతంగా విడిపోయిన స్పేడెక్స్ జంట ఉపగ్రహాలు
- 6లో

న్యూస్‌రీల్

ఏపీఎల్‌కు గ్రీన్ రేషన్‌కార్డులు



రాష్ట్రంలో దారిద్య్ర రేఖకు ఎగువన (ఏపీఎల్) ఉన్న వారికి కూడా రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అసెంబ్లీ లాబీలో మీడియాకు చెప్పారు. అయితే ఏపీఎల్ వారికి ఇచ్చే కార్డులు ప్రస్తుతానికి గుర్తింపు కార్డులుగానే ఉపయోగపడతాయన్నారు. - 8లో

తమిళనాడులో 'రూ'పాయి రగడ



తమిళనాడు ప్రభుత్వం బడ్జెట్ లోగో నుంచి రూపాయి గుర్తును తొలగించడం సంచలనంగా మారింది. దేవనాగరి లిపిలో ఉండే సింబల్‌ను బడ్జెట్ లోగో నుంచి తొలగించి తమిళ అక్షరం 'రూ'ను చేర్చింది. - 6లో

కామెంట్స్.. కలకలం

శాసనసభలో దుమారం రేపిన జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలు

- స్పీకర్‌ను ఉద్దేశించి 'ఈ సభ నీ సొంతం కాదు..' అన్న బీఆర్‌ఎస్ సభ్యుడు
- 'మీరు పెద్ద మనిషిగా మాత్రమే ఆడ కూర్చున్నరు' అంటూ వ్యాఖ్య
- మాజీ మంత్రి వ్యాఖ్యలపై అధికారపక్ష సభ్యుల తీవ్ర అభ్యంతరం
- జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యల్లో తప్పు ఏముందన్న బీఆర్‌ఎస్ సభ్యుడు హరీశ్‌రావు
- గందరగోళం నడుమ సభ వాయిదా.. సుమారు 3 గంటలపాటు ప్రతిష్టంభన
- సభ తిరిగి ప్రారంభమైన తర్వాత జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌కు డిప్యూటీ సీఎం, మంత్రుల డిమాండ్.. బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకు సస్పెండ్ చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



గురువారం అసెంబ్లీలో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి గురువారం శాసనసభలో స్పీకర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. 'ఈ సభ నీ సొంతం కాదు..' అని ఆయన అనడంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. అధికార, ప్రతిపక్ష సభ్యుల నినాదాలు, అరుపులతో సభ దద్దరిల్లింది. దళిత స్పీకర్‌ను అవమానించిన, ఏక వచనంతో సంబోధించిన జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో జగదీశ్‌రెడ్డిని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకు సస్పెండ్ చేశారు.

అందరికీ సమాన హక్కులు: జగదీశ్‌రెడ్డి

ఉదయం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చలో పాల్గొన్న బీఆర్‌ఎస్ సభ్యుడు జగదీశ్‌రెడ్డి.. స్పీకర్‌ను ఉద్దేశించి 'ఈ సభ మనందరిది. మనందరికీ సమాన హక్కులున్నాయి. మనందరి తరఫున మీరు పెద్ద మనిషిగా మాత్రమే ఆడ కూర్చున్నరు తప్ప ఈ సభ నీ సొంతం కాదు..' అని వ్యాఖ్యానించడం వివాదానికి దారితీసింది. కాంగ్రెస్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగదీశ్‌రెడ్డి మాట్లాడిన ప్రతిపదం వెనక్కి తీసుకోవాల్సిందేనని శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. సభాపతిని దూషించినందుకు ఆయనతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ క్షమాపణ చెప్పాల్సిందేనన్నారు. దళిత స్పీకర్‌ను అవమానించిన జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయాల్సిందేనని కాంగ్రెస్ దళిత సభ్యుడు మిగతా 14వ పేజీలో ▶

వాళ్లకు దళితులు అంటే చులకన

జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధ్వజం

- వివరాలు 14లో▶

స్పీకర్ గౌరవాన్ని కాంగ్రెస్ తగ్గించింది

జగదీశ్‌రెడ్డి అనని మాటలను అన్నట్లుగా చూపారు: కేటీఆర్

- వివరాలు 14లో▶

పదేళ్ల తుప్పను వదిలిస్తున్నాం!



అంతా ఒకేసారి చేయాలంటే వ్యవస్థ దెబ్బతింటుంది: సీఎం రేవంత్‌రెడ్డి

- ఓ పక్క రాష్ట్రాన్ని సర్దుకుంటూ మరోపక్క ప్రతి హామీనీ అమలుచేస్తున్నా
- తెలంగాణ అభివృద్ధికి బీజేపీ అడ్డుపడుతోంది
- కిషన్‌రెడ్డి రాష్ట్రం కోసం మాట్లాడరు.. బండి సంజయ్ ఒక నిస్సహాయ మంత్రి
- హిందీని బలవంతంగా రుద్దడం సరికాదు
- అసెంబ్లీ చర్చలో కూడా కేసీఆర్ పాల్గొనాలి కదా?
- ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి

2 లో

కేంద్రం కుట్రలు తిప్పికొడతాం..

- అది నియోజకవర్గాల పునర్విభజన కాదు.. దక్షిణాది ప్రాధాన్యతను కుదించే ప్రయత్నం: ఢిల్లీలో రేవంత్
- దక్షిణాదిలో ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని బీజేపీ భావిస్తోంది
- కేంద్రం యత్నాలను అడ్డుకోవడం కోసం కార్యాచరణ చేపడతాం
- 22న చెన్నైలో భేటీకి హాజరవుతా

2 లో

డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం

- కుటుంబ నియంత్రణను అమలు చేసిన రాష్ట్రాలకు పార్లమెంటులో ప్రాతినిధ్యాన్ని తగ్గించాలని అనుకోవడం దారుణం
- దీనిపై సమష్టిగా పోరాడితేనే న్యాయం జరుగుతుంది
- డీఎంకే సమావేశానికి హాజరై తెలంగాణ వాదన వినిపిస్తాం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2 లో

కౌన్సెలింగ్.. గైడెన్సే కీలకం

- విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి సమస్యకు అవే పరిష్కారం
- స్కూలు స్థాయిలోనే కౌన్సెలింగ్ ప్రారంభం కావాలి
- పాఠశాలలు మానసిక వికాస ప్రాంగణాలుగా మారాలి
- మానసిక పరిపక్వత, భావోద్వేగ స్థిరత్వంపై శిక్షణ ఇవ్వాలి
- ఐసీ3 మూవ్‌మెంట్ వ్యవస్థాపకులు గణేశ్ కోహ్లి





సాక్షి, ఎడ్యుకేషన్: ప్రస్తుత విద్యా వ్యవస్థ కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి సమస్యను పరిష్కరించాలంటే... వారికి పాఠశాల స్థాయిలోనే కెరీర్ గైడెన్స్, వారి నైపుణ్యాలపై కౌన్సెలింగ్ ఇవ్వడం వంటి చర్యలు తీసుకోవాలని ఐసీ3 (ఇంటర్నేషనల్ కాలేజ్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్) మూవ్‌మెంట్ వ్యవస్థాపకులు, ప్రముఖ కెరీర్ కౌన్సిలర్, టెడెక్స్ స్పీకర్ గణేశ్ కోహ్లి చెప్పారు. పోటీ వాతావరణం, పరీక్షల్లో మార్కులనే ప్రతిభకు కొలమానంగా భావించడం, ఇతరులతో పోల్చుకోవడం వంటి పలు కారణాలతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. దీంతో వారి మానసిక ఆరోగ్యం కూడా దెబ్బతింటోందని, ఈ కారణంగానే ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలకు పాఠశాల స్థాయి నుంచే పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. 'కౌన్సెలింగ్ ఇన్ ఎవ్రీ స్కూల్' అనే ఉద్దేశంతో ఐసీ3 మూవ్‌మెంట్‌కు రూపకల్పన చేసి, దాదాపు 90 దేశాల్లో విద్యార్థులకు కౌన్సెలింగ్, కెరీర్ గైడెన్స్ నిర్వహిస్తున్న గణేశ్ కోహ్లి.. విద్యార్థుల మానసిక ఒత్తిడి అందుకు కారణాలు, పరిష్కార మార్గాలపై పలు సూచనలు ఇచ్చారు.

మానసిక ఒత్తిడికి ఎన్నో కారణాలు

విద్యార్థుల్లో నెలకొంటున్న మానసిక ఒత్తిడి సమస్యలు చివరికి వారు ఆత్మహత్యలకు పాల్పడే స్థాయికి చేరుకుంటున్నాయి. 2012లో 6,654గా ఉన్న విద్యార్థుల ఆత్మహత్యలు, 2022 నాటికి 13,044కు చేరాయి. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కావడానికి అకడమిక్స్‌తో పాటు మరెన్నో అంశాలు కారకాలుగా నిలుస్తున్నాయి. ఆర్థిక అస్థిరత, వ్యక్తిగత ఆహార్యం, సహచరులు- బంధువుల ఒత్తిడి, వైఫల్యం అంటే విపరీతమైన భయం వంటివి వీటిలో ముఖ్యమైనవిగా చెప్పొచ్చు. సంపూర్ణ వికాసం కల్పించడం కంటే అత్యున్నత గ్రేడ్లకే విలువనిచ్చే విద్యావ్యవస్థ ఇందుకు మరో ముఖ్యమైన కారణం. మరోవైపు చిన్నతనం నుంచే పిల్లలను వారి సహచరులతో పోల్చడం వల్ల తమ సామర్థ్యంపై అపనమ్మకం ఏర్పడి దీర్ఘకాలిక ఒత్తిడికి గురవుతున్నారు. దీన్ని గుర్తించకపోవడం వల్ల ఎన్నో ప్రతికూల పరిణామాలు చూడాల్సి వస్తోంది.

పాఠశాలల పాత్ర కీలకం

ప్రస్తుత పరిస్థితుల్లో మార్పు తేవాలంటే పాఠశాలలు ముందు నిలవాలి. మానసిక పరిపక్వత, భావోద్వేగ స్థిరత్వం వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వాలి. అదే విధంగా విద్యార్థులు ఆత్మవిశ్వాసం పెపొందించుకోవడానికి కెరీర్ కౌన్సెలింగ్ తోడ్పడుతుంది. నిర్దిష్టమైన కెరీర్ గైడెన్స్ పొందిన విద్యార్థులు వారి భవిష్యత్తు గురించి ఎంతో ఆత్మ విశ్వాసంతో ఉంటారని.. అనిశ్చితి, ఆందోళనలను తగ్గించుకుంటారని పలు పరిశోధనల్లో తేలింది.

విదేశాల్లో ఇప్పటికే నివారణ చర్యలు

ఇతర దేశాల్లోనూ విద్యార్థుల మానసిక ఆరోగ్యం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అయితే పలు దేశాలు ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నాయి. ఫిన్‌లాండ్, కెనడా, నెదర్లాండ్స్ తదితర పాశ్చాత్య దేశాల్లో పరీక్షల్లో మార్కుల కంటే సామర్థ్య ఆధారిత అభ్యసనానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. కౌన్సెలింగ్, మెంటార్‌షిప్, ప్రయోగాలతో కూడిన అభ్యసనం వంటి మార్గాల ద్వారా కెరీర్‌పై విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. కానీ మన దేశంలో అకడమిక్‌గా పొందిన ఘనతనే విజయంగా గుర్తిస్తున్నారు. సక్సెస్ అంటే మార్కులే అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఒత్తిడి, మానసిక సమస్యల విషయంలో కౌన్సెలింగ్ కార్యక్రమాలు ఎంతో సత్ఫలితాలనిస్తాయి. పలు దేశాల్లో ఇది నిరూపితమైంది. మన దేశంలోనూ కౌన్సెలింగ్ సమ్మిళిత సాధనాలను అందుబాటులోకి తెస్తే మానసిక దృఢత్వాన్ని సొంతం చేసుకుని సవాళ్లను స్వీకరించే స్థాయికి విద్యార్థులు ఎదుగుతారు.

సవాళ్లను ఎదుర్కొనేలా సంసిద్ధుల్ని చేయాలి

నేటి విద్యా వ్యవస్థను పరిశీలిస్తే పాఠశాలలు విద్యార్థులకు కేవలం అకడమిక్ అభ్యసన కేంద్రాలుగానే ఉంటున్నాయి. వాటిని విద్యార్థుల భావోద్వేగాలను, సామాజిక, మానసిక సమస్యలను తీర్చే ప్రాంగణాలుగా రూపొందించాల్సిన ఆవశ్యకత నెలకొంది. విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య సమస్యలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు తరగతి గదిలో, బాహ్య ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా సంసిద్ధులను చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

పిల్లల మాట తల్లిదండ్రులు వినాలి

విద్యార్థుల మానసిక ఒత్తిడి విషయంలో తల్లిదండ్రులు కూడా జాగ్రత్తగా వ్యవహరించాలి. పిల్లలు తమ సమస్యలను, ఆలోచనలను తమతో పంచుకునే వాతావరణాన్ని కల్పించాలి. దీనికి భిన్నంగా పిల్లల మాటలను తీసిపారేసేలా ప్రవర్తిస్తే వారు మరింత న్యూనతకు గురవుతారు. సక్సెస్ అంటే ఒక ప్రతిష్టాత్మక కాలేజీలో చేరడం మాత్రమే కాదని పిల్లల బలాలు, ఆకాంక్షలను నెరవేర్చుకునేలా వ్యవహరించడం అని గుర్తించాలి.

పరీక్ష విధానంపై పునరాలోచన చేయాలి

దేశంలోని పరీక్షల విధానంపైనా పునరాలోచన చేయాల్సిన ఆవశ్యకత నెలకొంది. కేవలం సబ్జెక్ట్ నాలెడ్జ్‌నే పరీక్షించే విధంగా ఉండడంతో విద్యార్థులపై విపరీతమైన ఒత్తిడి పడుతోంది. దీంతో విద్యార్థులు కూడా ఆయా పాఠ్యాంశాలకు సంబంధించిన భావనలను, నిజ జీవిత పరిస్థితుల్లో వాటిని అన్వయించే నైపుణ్యాలను పొందడంపై దృష్టి పెట్టకుండా..మార్కుల కోసం బట్టీ పట్టి చదువుతున్నారు. పర్యవసానంగా వాస్తవ పరిస్థితుల్లో ఆయా పాఠ్యాంశాల ప్రాధాన్యత ఏంటో తెలియట్లేదు. సామర్థ్య ఆధారిత మూల్యాంకనం దిశగా అడుగులు వేయాలని జాతీయ విద్యా విధానం సూచించిన సంగతి తెలిసిందే.

ఏం చేయాలి..

- పిల్లల్లోని ఒత్తిడి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించేలా టీచర్లకు శిక్షణనివ్వాలి.
- విద్యార్థులు భావోద్వేగాలను నియంత్రించుకోవడం, స్వీయ అవగాహన పెంపొందించుకోవడంపై బోధించాలి.
- మాధ్యమిక పాఠశాల స్థాయి నుంచే కెరీర్ కౌన్సెలింగ్‌ను కరిక్యులంలో భాగం చేయాలి.
- విద్యార్థులు సహచరులతో మానసిక సమస్యల గురించి చర్చించుకునే పరిస్థితిని, ఎక్స్‌ట్రాకరిక్యులర్ యాక్టివిటీస్‌లో పాల్గొనే వాతావరణాన్ని కల్పించాలి.

క్లుప్తంగా...

సమైక్యతకు నిదర్శనం హోలీ: గవర్నర్, సీఎం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కుల మతాలకతీతంగా అన్ని వర్గాలు జరుపుకొనే ఈ పండుగ సమైక్యతకు అద్దం పడుతుందని పేర్కొన్నారు. హోలీ పర్వదినాన్ని ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని మంత్రులు ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు వేర్వేరు ప్రకటనల్లో కోరారు. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ కూడా వేరే ప్రకటనలో హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు సీఎం ప్రజావాణికి సెలవు

హోలీ సందర్భంగా 18కి వాయిదా

లక్డీకాపూల్ (హైదరాబాద్): మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించాల్సిన ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమానికి ప్రభుత్వం సెలవు ప్రకటించింది. హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్టు ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఈ మార్పును గమనించి ఈ నెల 18న నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని ఆమె సూచించారు.

పదేళ్ల తుప్పును వదిలిస్తున్నాం!

అంతా ఒకేసారి చేయాలంటే వ్యవస్థ దెబ్బతింటుంది: సీఎం రేవంత్‌రెడ్డి

ఓ పక్క రాష్ట్రాన్ని సర్దుకుంటూ మరోపక్క ప్రతీ హామీని అమలుచేస్తున్నా

- తెలంగాణ అభివృద్ధికి బీజేపీ అడ్డుపడుతోంది
- కిషన్‌రెడ్డి రాష్ట్రం కోసం మాట్లాడరు..
- హిందీని బలవంతంగా రుద్దడం సరికాదు
- ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్



సాక్షి, న్యూఢిల్లీ: పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని తుప్పు పట్టించిందని, దానిని వదిలించే పనిలో తామున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో పట్టిన తుప్పును ఒకేసారి వదిలించాలంటే వ్యవస్థ దెబ్బతింటుందని, అందుకే నెమ్మది నెమ్మదిగా వదిలిస్తూ అభివృద్ధి దిశగా ముందుకుసాగుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ అడ్డుపడుతోందని, నిధుల సాధనలో ఇద్దరు కేంద్ర మంత్రులూ ఏమాత్రం పట్టింపులేని ధోరణితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గురువారం విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌ను కలిసేందుకు ఢిల్లీ వచ్చిన రేవంత్ కొద్దిసేపు మీడియాతో చిట్‌చాట్ చేశారు. 'ఏ ముఖ్యమంత్రికైనా అధికారం చేపట్టిన తర్వాత అన్నీ సర్దుకోవడానికి రెండేళ్ల సమయం పడుతుంది. వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబు ఇలా ఎవరి పాలనైనా చూడండి.. గత పాలకులు పరిపాలించిన దానిని చక్కదిద్దడానికే రెండేళ్ల సమయం పట్టింది. ఓ పక్క రాష్ట్రాన్ని సర్దుకుంటూ మరోపక్క ప్రతీ హామీని అమలుచేస్తూ ముందుకెళ్తున్నా' అని చెప్పారు.

కేంద్ర మంత్రి అయినందునే కిషన్‌రెడ్డి టార్గెట్

'కేంద్ర మంత్రివర్గంలో పనిచేసే వాళ్లు ఎవరైనా సొంత రాష్ట్రాల సమస్యలను లేవనెత్తుతారు. ఆయా రాష్ట్రాలకు అండగా నిలుస్తారు. నిర్మలా సీతారామన్ అలాగే చెన్నై మెట్రోను సాకారం చేశారు. కానీ, మన కిషన్‌రెడ్డి రాష్ట్రానికి సంబంధించిన అంశాలేవీ పట్టించుకోరు. నేను ముఖ్యమంత్రిని కాబట్టే కదా? అందరూ నన్ను టార్గెట్ చేస్తోంది. కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రి కాబట్టే ఆయనను టార్గెట్ చేస్తున్నాం. రాష్ట్రానికి ఏం తెచ్చారని అడిగితే తప్పేంటి? మూసీ, ట్రిపుల్ ఆర్, మెట్రో ఇలా ఎన్నో ప్రాజెక్టుల విషయంలో కేంద్రంతో ఆయన ఏమైనా మాట్లాడారా? ఆయన కేంద్రంతో మాట్లాడి అనుమతులు తెప్పిస్తే పనులు మొదలుపెట్టొచ్చు. కిషన్‌రెడ్డి రాష్ట్రం కోసం మాట్లాడరు, మరో మంత్రి బండి సంజయ్ ఒక నిస్సహాయ మంత్రి 'అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు.

హిందీని రుద్దడం ఏంటి?

మూడు భాషల విధానాన్ని రేవంత్‌రెడ్డి తప్పుబట్టారు. 'అసలు హిందీ జాతీయ భాష ఏంటి? మీరు అనుకుంటే సరిపోతుందా? హిందీ అనేది దేశంలో ఎక్కువ మంది మాట్లాడే భాష. ఆ తర్వాత అత్యధికమంది మాట్లాడే భాష తెలుగే. మూడో వరుసలో బెంగాల్ భాష ఉంటుంది. మీరు హిందీ మాట్లాడతారు కదా? అందరూ అదే మాట్లాడాలంటే ఎలా?' అని రేవంత్ అన్నారు. 'గాంధీ కుటుంబంతో సీఎంకు సాన్నిహిత్యం లేదని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవం. గాంధీ కుటుంబంతో అందరూ అనుకునేదానికంటే ఎక్కువే సాన్నిహిత్యం ఉంది' అని తెలిపారు.

ప్రజలకు చెప్పకపోతే ఎలా?

'రూ.7 లక్షల కోట్లు అప్పు ఉన్నప్పుడు ఆ విషయాన్ని ప్రజలకు చెప్పకపోతే ఎలా? పదవుల విషయంలో నేను సమీకరణాలను చూడలేదు, కేవలం నేను ఇచ్చిన మాటనే చేశా. రాజ్యసభ ఎంపీ, ఎమ్మెల్సీ, వివిధ చైర్మన్ పదవులు అన్నీ కూడా పార్టీ కోసం కష్టపడిన వారికే ఇచ్చాను. విజయశాంతి ఎన్నికల్లో పోటీ చేయనన్నారు, ఆమె పార్టీకోసం ఎంతో కాలం కష్టపడి పనిచేశారు అందుకే ఆమెకు ఎమ్మెల్సీ ఇచ్చారు. నేను ఇక్కడ కులగణన చేశాను మరి ఏపీలో బీజేపీ అధికారంలో ఉంది అక్కడ ఎందుకు చేయడం లేదు? కేసీఆర్ అసెంబ్లీలో జరిగే చర్చలకు కూడా రావాలి. ఓన్‌ట్యాక్స్ రెవెన్యూలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉంది. రాష్ట్రంలో నిరుద్యోగం గణనీయంగా తగ్గింది. నేను 2029 ఎన్నికలకు వెళ్లేటప్పుడు ప్రజలే ఈ విషయాలన్నీ గమనిస్తారు. చెప్పినవి చేస్తే వాళ్లే మనకు అండగా నిలుస్తారు'అని రేవంత్ చెప్పారు. వచ్చే మే నెలలో హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు నిర్వహిస్తున్నామని, ఆ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డికి తమిళనాడు సీఎం స్టాలిన్ రాసిన ఆహ్వాన లేఖను అందజేస్తున్న ఆ రాష్ట్ర మంత్రి నెహ్రూ, డీఎంకే నేతలు కనిమొళి, రాజా తదితరులు

కేంద్రం కుట్రలు తిప్పికొడతాం

- ఢిల్లీలో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- అది నియోజకవర్గాల పునర్విభజన కాదు.. దక్షిణాది ప్రాధాన్యతను కుదించే ప్రయత్నం
- దక్షిణాది రాష్ట్రాల్లో ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని బీజేపీ భావిస్తోంది
- 22న చెన్నైలో భేటీకి హాజరవుతానన్న సీఎం.. త్వరలో తెలంగాణలోనూ అఖిలపక్షం

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన పేరిట దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొడతామని ముఖ్యమంతి రేవంత్‌రెడ్డి చెప్పారు. కుట్రలను అడ్డుకునేందుకు తగిన కార్యాచరణ చేపడతామని తెలిపారు. రాష్ట్రాల ప్రాధాన్యతను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఏ ప్రయత్నాన్నీ సహించబోమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేయాలనుకుంటున్నది నియోజకవర్గాల పునర్విభజన కాదని.. అది స్పష్టంగా దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను కుదించే ప్రయత్నమని పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు కలిగే నష్టాలు.. చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించేందుకు చెన్నైలో ఈ నెల 22న జరిగే సమావేశానికి హాజరుకావాలంటూ రేవంత్ రెడ్డిని తమిళనాడు సీఎం స్టాలిన్ ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన రాసిన లేఖను ఆ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ ఆధ్వర్యంలోని డీఎంకే ప్రతినిధి బృందం గురువారం ఢిల్లీలో రేవంత్‌రెడ్డికి అందజేసింది. అనంతరం ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు.

మా భేటీకి కిషన్‌రెడ్డిని కూడా పిలుస్తాం

'దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఎంతో సేవ చేశాయి. అయితే దక్షిణాది రాష్ట్రాల నుంచి బీజేపీకి పెద్దగా ప్రాతినిధ్యం లేకపోవడం, ఆయా రాష్ట్రాల్లో ఓటమి నేపథ్యంలో ప్రతీకారం తీర్చుకోవాలని బీజేపీ భావిస్తోంది. ఈ కుట్రలను ఎదుర్కోవాలని కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించింది. అందువల్ల కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అనుమతి తీసుకుని చెన్నై సమావేశానికి హాజరవుతా. వాస్తవానికి దీనిపై తెలంగాణలోనూ త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. అన్ని పార్టీల నేతలను ఆహ్వానించాల్సిందిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మాజీ మంత్రి జానారెడ్డిలకు ఇప్పటికే సూచించాం. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కూడా ఆహ్వానిస్తున్నాం. ఈ భేటీలో వెల్లడయ్యే అభిప్రాయాలను కిషన్‌రెడ్డి కేంద్ర కేబినెట్ దృష్టికి తీసుకెళ్లాలి. దక్షిణాది రాష్ట్రాల హక్కుల రక్షణకు తెలంగాణ నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి పాటుపడాల్సి ఉంది. రాజకీయ పార్టీలకు అతీతంగా దక్షిణాది రాష్ట్రాల హక్కుల పరిరక్షణకు అంతా పాటుపడాలి..' అని సీఎం విజ్ఞప్తి చేశారు.

స్టాలిన్‌ది కీలక పాత్ర

'చెన్నైలో 22న నిర్వహించే సమావేశంలో కూడా నియోజకవర్గాల పునర్విభజనతో కలిగే నష్టాలు.. వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణను రూపొందిస్తాం. అన్ని పార్టీలు, పౌర సంఘాల అభిప్రాయాలు సేకరించేందుకు స్టాలిన్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ విషయంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు కాబట్టి ఆయన్ను ప్రోత్సహిస్తాం..' అని రేవంత్ చెప్పారు. కాగా నియోజకవర్గాల పునర్విభజన అంశం యావత్ దక్షిణాదిని ప్రభావితం చేస్తుందని డీఎంకే పార్లమెంటరీ పార్టీ నేత కనిమొళి అన్నారు. దక్షిణాదికి జరుగుతున్న నష్టంపై గొంతెత్తాలని స్టాలిన్ నిర్ణయించారని.. ఇందులో భాగంగా వివిధ రాజకీయ పార్టీలకు ఆయన ఆహ్వానం పలికారని తెలిపారు.

జేఏసీలో చేరేందుకు అంగీకరించండి: స్టాలిన్

2026 తర్వాత చేపట్టే జన గణన వరకు నియోజకవర్గాల పునర్విభజన చేపట్టకూడదని నిబంధనలున్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం అంతకుముందుగానే ఈ ప్రక్రియను తెరపైకి తెచ్చిందని రేవంత్‌కు రాసిన లేఖలో స్టాలిన్ పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై తమ రాష్ట్రంలో ఇప్పటికే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలతో కూడిన ఐక్య కార్యాచరణ కమిటీలో (జేఏసీ) చేరేందుకు అంగీకారం తెలపాలని కోరారు. జేఏసీలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తరఫున ఒక ప్రతినిధిని నియమించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌ని కలిసిన డీఎంకే ప్రతినిధి బృందంలో కనిమొళితో పాటు ఆ పార్టీ ఎంపీలు ఎ.రాజా, ఎన్ఆర్ ఇళంగో, కళానిధి వీరస్వామి, అరుణ్ నెహ్రూ, ప్రత్యేక ప్రతినిధి ఏకేఎస్ విజయన్ ఉన్నారు.



బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. శాసనమండలి సమావేశాల్లో పాల్గొనేందుకు వచ్చిన కవితకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రి మహమూద్ అలీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేక్ కట్ చేయించారు. బీఆర్ఎస్ ఎల్పీ చాంబర్‌లో కేటీఆర్, హరీశ్‌రావు తదితరులు కవితతో కేట్ చేయించారు.

'తెలంగాణ రైజింగ్'కు మద్దతుగా నిలవండి

విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి

సాక్షి, న్యూఢిల్లీ: రాబోయే 25 సంవత్సరాల్లో తెలంగాణను సమున్నతంగా నిలిపేందుకోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం ముఖ్యమంత్రి ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలసిన సందర్భంగా ఈ ఏడాది హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మిస్ వరల్డ్, గ్లోబల్ డీప్‌టెక్ సదస్సు, భారత్ సమ్మిట్, యానిమేషన్, వీఎఫ్ఎక్స్‌తో పాటు వినోద పరిశ్రమలో తెలంగాణ బలాన్ని చాటే ఇండియా జాయ్ అంతర్జాతీయ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమాల నిర్వహణ ద్వారా తెలంగాణ రైజింగ్ నినాదాన్ని ప్రోత్సహించేందుకు మద్దతు ఇవ్వాలని, అంతేగాక తెలంగాణ రైజింగ్‌ను విదేశాల్లో భారత్ చేపట్టే కార్యక్రమాల్లోనూ ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విదేశీ వ్యవహారాల శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, నాగర్ కర్నూలు, భువనగిరి ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

బూర్గుల రామకృష్ణారావుకు నివాళి

హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు జయంతి సందర్భంగా గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బూర్గుల బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు.



విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌తో కరచాలనం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఇదండీ సంగతి



డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం

పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుంది

- డీఎంకే సమావేశానికి హాజరై తెలంగాణ వాదన వినిపిస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి
- డీఎంకే ప్రతినిధి బృందంతో సమావేశం



కేటీఆర్‌కు ఆహ్వాన లేఖను అందజేస్తున్న తమిళనాడు మంత్రి కేఎన్ నెహ్రూ. చిత్రంలో మధుసూదనాచారి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: కొత్తగా నిర్వహించబోయే జనగణన ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన (డీ లిమిటేషన్) చేపడితే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు కుటుంబ నియంత్రణను పకడ్బందీగా అమలు చేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు పార్లమెంటులో ప్రాతినిధ్యాన్ని తగ్గించాలనుకోవడం దారుణమని విమర్శించారు. ఈ అంశంపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న చెన్నైలో నిర్వహించే సమావేశానికి హాజరై బీఆర్ఎస్‌తో పాటు తెలంగాణ వాదనను వినిపిస్తామని తెలిపారు. తమిళనాడు పురపాలక శాఖ మంత్రి కె.ఎన్.నెహ్రూ, రాజ్యసభ ఎంపీ ఎన్.ఆర్.ఎలాంగో బృందంతో తెలంగాణ భవన్‌లో కేటీఆర్ గురువారం సాయంత్రం సమావేశమయ్యారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సమావేశానికి రావాల్సిందిగా డీఎంకే బృందం బీఆర్ఎస్ పార్టీకి ఆహ్వానం అందజేసింది. ఈ సందర్భంగా ఇరుపక్షాలు మీడియాతో మాట్లాడాయి. 'డీ లిమిటేషన్ మీద దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాల్సిన సందర్భం ఇది. తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సమష్టిగా పోరాడితేనే దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరుగుతుంది. 1970–80 దశకంలో కుటుంబ నియంత్రణ సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంట్ స్థానాల సంఖ్యను కొత్తగా చేసే జనగణన ఆధారంగా నిర్ణయిస్తామని కేంద్రం చెప్పడం అన్యాయం. ఇదే జరిగితే పార్లమెంట్‌లో ఈ రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుంది. స్టాలిన్ ఏర్పాటు చేస్తున్న అఖిలపక్ష సమావేశానికి బీఆర్ఎస్ తరఫున హాజరుకావాలని పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశించారు. 22న చెన్నైలో జరిగే సమావేశానికి హాజరై బీఆర్ఎస్‌తోపాటు తెలంగాణ వాదనను బలంగా వినిపిస్తాం' అని కేటీఆర్ తెలిపారు. ఈ సమావేశంలో అన్ని పార్టీలతో చర్చించి ఉమ్మడి కార్యాచరణను ప్రకటిస్తామని డీఎంకే నేతలు ప్రకటించారు. అంతకుముందు డీఎంకే నేతలను కేటీఆర్ సత్కరించారు.

ఆ భూమి రాష్ట్ర ప్రభుత్వానిదే..

- కేంద్రీయ విశ్వవిద్యాలయానికి సంబంధం లేదు
- స్పష్టం చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలోని సర్వేనంబర్ 25లోని 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని, దీంతో కేంద్రీయ విశ్వవిద్యాలయానికి సంబంధం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. క్రీడా మౌలిక సదుపాయాల కల్పన కోసం ఐఎంజీ అకాడమీస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 2004లో జనవరి 13న 400 ఎకరాల భూమిని కేటాయించిందని వివరించింది. అయితే ప్రాజెక్టు ముందుకు వెళ్లకపోవడంతో 2006 నవంబర్ 21న అప్పటి ప్రభుత్వం ఈ భూమిని వెనక్కి తీసుకుందని పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ ఐఎంజీ భారత్ హైకోర్టును ఆశ్రయించిందని తెలిపింది. సుదీర్ఘ న్యాయపోరాటం అనంతరం హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునిచ్చిందని తెలిపింది. ఆ తరువాత ఐఎంజీ భారత్ సుప్రీం కోర్టులో లీవ్ పిటిషన్ దాఖలు చేయగా.. అక్కడా కొట్టేయడంతో ప్రభుత్వ అధీనంలోకి వచ్చిందని వివరించింది. ఆ తరువాత అక్కడ ఐటీ, ఐటీయేతర పరిశ్రమల కోసం కేటాయించాలని టీజీఐఐసీ విజ్ఞప్తి మేరకు.. ఆ సంస్థకు భూమి కేటాయించినట్లు తెలిపింది. ఈ 400 ఎకరాల పరిధిలోకి బఫెల్లో లేక్, పీకాక్ లేక్ రావని స్పష్టం చేశారు.

ఒక్కో పేపర్ 2సార్లు మూల్యాంకనం

ఎంపిక చేసిన పత్రాలు మూడోసారి కూడా పరిశీలన

- పకడ్బందీగా గ్రూప్–1 మెయిన్స్ మూల్యాంకనం
- నిపుణులైన ఎవాల్యుయేటర్లతో మూల్యాంకన ప్రక్రియ
- సోషల్‌మీడియాలో అసత్య ప్రచారం నమ్మొద్దు
- గ్రూప్–1 ఫలితాలపై టీజీపీఎస్సీ సుదీర్ఘ ప్రకటన

గ్రూప్–1 మెయిన్స్ ఎవాల్యుయేటర్స్ ఇలా..

పేపర్	ఎవాల్యుయేటర్ల సంఖ్య
జనరల్ ఇంగ్లిష్	33
పేపర్–1	57
పేపర్–2	48
పేపర్–3	70
పేపర్–4	38
పేపర్–5	65
పేపర్–6	40
మొత్తం	351

పేపర్ వారీగా అత్యధిక మార్కులు ఇలా..

పేపర్	అత్యధిక మార్కులు
(ఇంగ్లిష్–క్వాలిఫైయింగ్)	139.5
పేపర్–1	97.5
పేపర్–2	102.5
పేపర్–3	102.5
పేపర్–4	113.5
పేపర్–5	96.5
పేపర్–6	100

టాప్ 100 ర్యాంకుల్లో జెండర్, కమ్యూనిటీ వారీగా..

జెండర్	అభ్యర్థులు
పురుషులు	59
మహిళలు	41
సామాజికవర్గం	అభ్యర్థులు
ఓసీ	32
బీసీ	48
ఎస్సీ	3
ఎస్టీ	5
ఈడబ్ల్యూఎస్	12

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 జవాబుపత్రాల మూల్యాంకనం అత్యంత పకడ్బందీగా నిర్వహించినట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) స్పష్టం చేసింది. ప్రతి జవాబుపత్రాన్ని వేరువేరు ఎవాల్యుయేటర్లతో రెండుసార్లు మూల్యాంకనం చేయించినట్లు వెల్లడించింది. ఎంపిక చేసిన(ర్యాండమ్‌గా) కొన్ని జవాబు పత్రాలను మూడోసారి కూడా పరిశీలన జరిపినట్లు తెలిపింది. ఈ నెల 10వ తేదీన టీజీపీఎస్సీ గ్రూప్–1 అభ్యర్థుల మార్కులను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ మార్కులపై సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. జవాబు పత్రాల మూల్యాంకనం సరిగా చేయలేదని కొందరు వ్యక్తులు ఆరోపణలు చేస్తున్నారు. ఈ ప్రచారంపై స్పందించిన కమిషన్.. గురువారం సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది. మొత్తం 20,161 మంది అభ్యర్థుల జవాబు పత్రాలను 351 మంది నిపుణులైన ఎవాల్యుయేటర్లతో మూల్యాంకనం చేయించినట్లు తెలిపింది. మూల్యాంకనం తీరు, మాధ్యమాల వారీగా అభ్యర్థులు, పేపర్‌వారీగా వచ్చిన టాప్ మార్కులు, టాప్ 100 ర్యాంకులు, 500 ర్యాంకుల్లో జెండర్, కమ్యూనిటీ వారీగా అభ్యర్థుల వివరాలను వెల్లడించింది.

యూపీఎస్సీ స్థాయి నిపుణులతో మూల్యాంకనం

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో 563 గ్రూప్–1 ఉద్యోగాల భర్తీలో భాగంగా గతేడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలు జరిగాయి. ఈ జవాబుపత్రాల మూల్యాంకనం వెంటనే ప్రారంభించిన కమిషన్.. గత నెల 15వ తేదీనాటికే పూర్తి చేసింది. ఈ ప్రక్రియలో పాల్గొన్న చీఫ్ ఎగ్జామినర్లు, ఎవాల్యుయేటర్లు యూపీఎస్సీ పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో పాల్గొన్నవారేనని స్పష్టం చేసింది. వీరంతా శాశ్వత ప్రాతిపదికన వివిధ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో పనిచేస్తున్నవారు అని కమిషన్ తెలిపింది. తుది మార్కులను ఖరారు చేసే సమయంలో కూడా మరోమారు పరిశీలన జరిపిన తర్వాతే మార్చి 10వ తేదీన విడుదల చేసినట్లు వెల్లడించింది. అయితే గ్రూప్–1 మార్కులపై కొందరు సామాజిక మాధ్యమాల్లో ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి నిరాధార ఆరోపణలను పట్టించుకోవద్దని అభ్యర్థులకు సూచించింది. ప్రతి కేటగిరీలోని పోస్టులను నిబంధనల ప్రకారం నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా భర్తీ చేస్తామని కమిషన్ వివరించింది.

మీడియం వారీగా మొత్తం అభ్యర్థులు

ఇంగ్లిష్	12,323
తెలుగు	7,829
ఉర్దూ	9

500 ర్యాంకుల వరకు జెండర్, కమ్యూనిటీ వారీగా..

జెండర్	అభ్యర్థులు
పురుషులు	296
మహిళలు	204
సామాజికవర్గం	అభ్యర్థులు
ఓసీ	132
బీసీ	228
ఎస్సీ	50
ఎస్టీ	38
ఈడబ్ల్యూఎస్	52



పిన్నెల్లిలో గ్రామ బహిష్కరణకు గురైన ప్రజల గోడు వింటున్న వైఎస్ జగన్

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులకు ధైర్యం చెప్పిన వైఎస్ జగన్

సాక్షి అమరావతి, సాక్షి ప్రతినిధి, గుంటూరు: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, మద్దతుదారులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన అనంతరం పల్నాడు జిల్లాలో గ్రామ బహిష్కరణకు గురైన దళిత, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన దాదాపు 400 కుటుంబాలకు చెందిన బాధితులు వైఎస్ జగన్‌ను గురువారం పార్టీ కేంద్ర కార్యాలయంలో కలుసుకున్నారు. మాచవరం మండలం పిన్నెల్లి, తురకపాలెం, మాదినపాడు, చెన్నాయపాలెం, కొత్తగణేశునిపాడు గ్రామాలకు చెందిన వారంతా మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ జగన్‌ను కలిశారు. టీడీపీ నేతలు ఎన్నికల ఫలితాల అనంతరం వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులపై, ఇళ్లపై దాడులకు తెగబడి అక్రమ కేసులు బనాయించి పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారని తెలిపారు. ఈ అకృత్యాలను భరించలేక గ్రామాలు విడిచి ఇతర ప్రాంతాల్లో తల దాచుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. స్వగ్రామాలకు దూరంగా గడుపుతుండటంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే కారణంతో తమను ఊరి నుంచి బహిష్కరించారని, గ్రామంలోకి వస్తే చంపేస్తామని టీడీపీ కూటమి నేతలు బెదిరిస్తున్నారని పిన్నెల్లికి చెందిన బాధిత కుటుంబాల సభ్యులు వైఎస్ జగన్ ఎదుట వాపోయారు. 'అధైర్యపడొద్దు.. మీకు అన్ని విధాలా అండగా ఉంటాం..' అని వారికి వైఎస్ జగన్ ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలకు అండగా నిలిచి వారికి పూర్తి న్యాయ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కూటమి పాలన

ఏపీ గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బృందం వినతిపత్రం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కూటమి పాలన సాగుతున్నదని, తక్షణం జోక్యం చేసుకోవాలని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ను వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బృందం కోరింది. రాష్ట్రంలో నెలకొన్న పరిణామాలపై గురువారం గవర్నర్ ను కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం రాజ్‌భవన్ బయట పలువురు మాజీ మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. ఇటీవల గంగాధర నెల్లూరులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ అన్ని పనులు టీడీపీవారికే చేయాలని, వైఎస్సార్‌సీపీ వారికి పనులు చేస్తే పాముకు పాలు పోసినట్లేనని చేసిన తీవ్ర వ్యాఖ్యలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎలాంటి వివక్ష లేకుండా సమ దృష్టితో పాలన అందిస్తానంటూ రాజ్యాంగంపై ప్రమాణం చేసిన సీఎం చంద్రబాబు, దానికి విరుద్ధంగా చేసిన వ్యాఖ్యలపై తక్షణం చర్యలు తీసుకోవాలని గవర్నర్ ను కోరినట్లు చెప్పారు.

రేపటి నుంచి ఒంటిపూట బడులు

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 15వ తేదీ నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలల చివరి పనిదినమైన ఏప్రిల్ 23 వరకూ ఒంటిపూట బడులే ఉంటాయని స్పష్టం చేశారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పాఠశాలలు పనిచేస్తాయి. పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రత్యేక తరగతులు ఉంటాయి.

నైపుణ్యాల పెంపులో విద్యాసంస్థల పాత్ర కీలకం

ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



సాక్షి, హైదరాబాద్: సరళీకృత, ప్రపంచీకరణ విధానాల కారణంగా మన విద్యాసంస్థలు ఇతర దేశాలతో కలసి పనిచేయడం సాధ్యమైందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. గురువారం బ్రిటిష్ డిప్యూటీ హైకమిషన్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. యూకే, తెలంగాణ విశ్వవిద్యాలయాల ప్రతిని ,ధులు పరస్పర విద్యా విధానాల్లో ఉన్న అత్యుత్తమ పద్ధతులతో, సహకార అవకాశాలను అన్వేషించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం భారత ఆర్థిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తోందని, ఈ నేపథ్యంలో నైపుణ్య మానవ వనరులను తయారు చేయడంలో విద్యా సంస్థలు ముఖ్యమైన పాత్ర పోషించాలని పేర్కొన్నారు. బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ (తెలంగాణ, ఏపీ) గారెత్ విన్ ఓవెన్ మాట్లాడుతూ విద్యారంగంలో పురోభివృద్ధికి యూకే, తెలంగాణ కట్టుబడి ఉన్నాయన్నారు. తెలంగాణలోని ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, బ్రిటన్ విశ్వవిద్యాలయాల మధ్య భాగస్వామ్యాలను అన్వేషించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

వరల్డ్ బ్యాంక్ ఫెలోషిప్‌నకు ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్

- అభినందనలు తెలిపిన ఉపముఖ్యమంత్రి
- దేశం నుంచి ఎంపికైన ఏకైక అధికారి



కృష్ణభాస్కర్‌ను అభినందిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: వరల్డ్ బ్యాంక్ ఫెలోషిప్‌కు ట్రాన్స్‌కో సీఎండీ, డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శి డి.కృష్ణ భాస్కర్ ఎంపికయ్యారు. స్టాటిస్టిక్స్, అనాలిటిక్స్ సంబంధించిన అంశంపై గత సంవత్సరం నుంచి ప్రపంచ బ్యాంకు ఫెలోషిప్ కోర్సు నిర్వహిస్తుంది. మస్సాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ)లో మాస్టర్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ చదివిన కృష్ణభాస్కర్, ఆ సమయంలో చేసిన ప్రాజెక్టు వర్క్ ఆధారంగా ఈ ఫెలోషిప్‌కు ఎంపిక చేశారు. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 2,600 దరఖాస్తులు రాగా, 33 మంది ప్రభుత్వ అధికారులను ఎంపిక చేశారు. భారత్ నుంచి కృష్ణ భాస్కర్ ఒక్కరే ఎంపికయ్యారు. ఫెలోషిప్‌లో భాగంగా వాషింగ్టన్ డీసీలో తొమ్మిది రోజులపాటు నేరుగా శిక్షణ పొందేందుకు రావాలంటూ వరల్డ్ బ్యాంక్ అధికారులు ఆహ్వానం పంపారు. ఆరు నెలల కోర్సులో భాగంగా ప్రత్యేక శిక్షణ, అనుబంధంగా డిజిటల్ కోర్సు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఫెలోషిప్‌కు ఎంపికైన కృష్ణ భాస్కర్ అమెరికా వెళ్లడానికి ప్రభుత్వం అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కోర్సుకు సంబంధించిన వ్యయం మొత్తం వరల్డ్ బ్యాంక్ భరిస్తుంది. ఈనెల 18 నుంచి 27 వరకు అమెరికాలో ప్రత్యక్ష కోర్సు జరగనుంది. ఈ సందర్భంగా కృష్ణ భాస్కర్‌ను గురువారం అసెంబ్లీ ఆవరణలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందించారు.

ఏప్రిల్ 20 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: ఏప్రిల్ 20 నుంచి 26వ తేదీ వరకూ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలు జరుగుతాయని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ వెల్లడించింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, సాయంత్రం 2.30 నుంచి 5.30 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయని పేర్కొంది. పరీక్షల టైంటేబుల్‌ను సొసైటీ గురువారం విడుదల చేసింది.

“మేము ఏ ప్రాణిపై కూడా దాని శక్తికి మించిన భారం వేయము.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 14 మార్చి 2025

ఖాకీ రాజ్యం కళ్లు తెరవదా!

వ్యక్తి హక్కును తృణీకరించి అరాచకం రాజ్యమేలేచోట వ్యక్తికిగానీ, సమాజానికిగానీ రక్షణ ఉండదంటాడు ఆఫ్రో–అమెరికన్ రచయిత ఫ్రెడరిక్ డగ్లస్. జనాన్ని అన్ని విధాలా ఏమార్చి తొమ్మిది నెలల క్రితం అందలం ఎక్కిన కూటమి సర్కారు వల్ల ఆంధ్రప్రదేశ్‌లో అక్షరాలా ఆ పరిస్థితే కొనసాగుతోంది. ఎన్నికల్లో అడ్డూ ఆపూ లేకుండా ఇచ్చిన హామీలేమయ్యాయని అడిగితే... వరస వైఫల్యాలను ఎండగడితే... తప్పుడు ప్రచారాలను నిలదీస్తే... జైళ్లు నోళ్లు తెరుచుకుంటున్నాయి. ప్రాథమిక హక్కయిన భావప్రకటనా స్వేచ్ఛ బందీ అవుతోంది. అడుగడుగునా పౌరుల హక్కులను హరిస్తున్న పోలీసుల తీరును సహించబోమని రాష్ట్ర హైకోర్టు ఇప్పటికి మూడు సందర్భాల్లో ఆగ్రహం వ్యక్తం చేసింది. అయినా ఈ తోలు మందం ప్రభుత్వానికి వివేకం కలిగినట్టు లేదు. అందుకే మంగళవారం జస్టిస్ రావు రఘునందన్ రావు, జస్టిస్ మన్మథరావులతో కూడిన ధర్మాసనం మరో రెండు కేసుల్లో పోలీసులకు అక్షింతలు వేయాల్సివచ్చింది. పోలీసులైనాసరే చట్టానికి లోబడే వ్యవహరించాలని చీవాట్లుపెట్టింది. ఊహల ఆధారంగా కేసులు పెట్టడం, బెయిల్ రాకుండా తప్పుడు సెక్షన్లు బనాయించటం సహించబోమంది. చిన్న తప్పులే కదా అని వదిలేస్తే రేపు కోర్టుల్లోకొచ్చి కూడా అరెస్టు చేస్తారంది. ఈ వ్యాఖ్యలు చాలు... ఏపీలో పాలన ఎంత నిరంకుశంగా ఉందో చెప్పడానికి!

మనసంటే తెలియని, మనుషులంటే లక్ష్యంలేని కూటమి నాయకులకూ, కార్యకర్తలకూ మూడు నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు మనోభావాలు దెబ్బతింటున్నాయి! అంటురోగం ప్రబలినట్టు, ఊరంతా ఒకేసారి పూనకాలు వ్యాపించినట్టు వీరంతా ఉన్నట్టుండి ఫిర్యాదులు చేస్తున్నారు. ఏమైంది వీళ్లకు? ఇదే తీరు కొనసాగిస్తే చట్టాన్ని సవరించి ఇలాంటి కేసుల్లో మొదటగా ఫిర్యాదీదారులను సైకియాట్రిస్టుల దగ్గరకు పంపాలని... ఎన్నాళ్లుగా మనోభావాలు దెబ్బతిని వున్నాయో, పర్యవసానంగా వారిలో కనబడిన వైపరీత్యాలేమిటో కుటుంబసభ్యుల నుంచి తెలుసుకోవాలనీ నిబంధనలు చేర్చాలన్న డిమాండ్ బయల్దేరినా ఆశ్చర్యం లేదు. ఆ పనిచేస్తే ఇలాంటివారి రోగం కుదురుతుంది. అధికారంలో ఉన్నవారి మెప్పు పొందేందుకు ఫిర్యాదు అందిందే తడవుగా వెనకా ముందూ చూడకుండా పోలీసులు అరెస్టులకు దిగుతున్నారు. గొలుసు కేసులతో వందలాది కిలోమీటర్ల దూరంలోవుండే పోలీస్ స్టేషన్లకు మార్చి మార్చి తిప్పుతున్నారు. ఎవరిపై ఎన్ని కేసులు పెడుతున్నారో గమనిస్తే ఎవరంటే పాలకులు వణుకుతున్నారో అర్థమవుతుంది. ప్రముఖ సినీ రచయిత పోసాని కృష్ణమురళి సంగతే తీసుకుంటే, 67 ఏళ్ల ఆ పెద్దమనిషిపై లెక్కకు మిక్కిలి కేసులు పెట్టారు. ఒకటి రెండు కేసుల్లో బెయిల్ వచ్చిన వెంటనే మరో కేసు తగిలించి అరెస్టు చేస్తున్నారు. గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని పలు అనారోగ్య సమస్యలతో ఉన్న పోసానిని కేసుల పేరుతో వందల మైళ్లు తిప్పుతున్నారు.

సోషల్ మీడియా కార్యకర్త అవుతు శ్రీధర్ రెడ్డిపై పెట్టిన కేసు గమనిస్తే పోలీసుల అత్యుత్సాహం అర్థమవుతుంది. ఒక కేసులో మేజిస్ట్రేట్ ఆయన రిమాండ్‌ను తిరస్కరించి విడుదల చేయాలని ఆదేశించిన వెంటనే పోలీసులు అతి తెలివి ప్రదర్శించి తిరిగి అవే ఆరోపణలతో ఆయనను మరోసారి అరెస్టు చేశారు. ఈసారి న్యాయస్థానం ఆయన్ను రిమాండ్‌కు తరలించింది. ఈ విషయంలో పోలీసుల పనితీరును హైకోర్టు ధర్మాసనం నిశితంగా విమర్శించింది. ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఇష్టానుసారం అరెస్టు చేయటం, చట్టనిబంధనలను తుంగలో తొక్కడం చెల్లదని పేర్కొంది. ఈ విషయంలో యాంత్రికంగా వ్యవహరించినందుకు మేజిస్ట్రేట్‌ను తప్పుబట్టింది. తాచెడ్డ కోతి వనమంతా చెరచినట్టు పోలీసుల తీరు వల్ల కిందిస్థాయి న్యాయస్థానాలకు సైతం మందలింపులు తప్పటం లేదు. నిర్బంధంలోకి తీసుకున్న వ్యక్తికి ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పరు. ఆయన బంధువులకు సమాచారం ఇవ్వరు. అసలు ఆయనపై వున్న కేసులేమిటో చెప్పరు. ఇవి పాటించలేదని తెలిశాక కూడా యాంత్రికంగా రిమాండ్‌కు పంపుతున్న వైనాన్ని ధర్మాసనం ప్రత్యేకించి ప్రస్తావించింది. ఈ ధోరణి సరికాదని మందలించింది. మాదిగ మహాసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కొరిటిపాటి ప్రేమ్ కుమార్ అరెస్టు విషయంలో కూడా న్యాయమూర్తులు ఈ విధంగానే స్పందించారు. వ్యంగ్యంగా, ప్రతీకాత్మకంగా రూపొందించిన ఒక చిన్న రూపకం పోలీసులకు అభ్యంతరకరంగా తోచింది. అంతే... నిరుడు డిసెంబర్‌లో అర్ధరాత్రి దాటాక రెండున్నర గంటలకు కర్నూలు పోలీసులు తలు పులు బద్దలుకొట్టి ప్రేమ్‌కుమార్ భార్యాపిల్లలను వేరే గదిలో బంధించి ఆయన్ను ఈడ్చుకెళ్లారు. హాస్యాస్పదమైన విషయమేమంటే వినయ్‌కుమార్ దగ్గర దొరికిన రూ. 300 అక్రమ వసూళ్లట! పైగా సంఘటిత నేరాలకు పాల్పడ్డారంటూ ఆరోపించి బీఎన్ఎస్‌లోని సెక్షన్ 111 బనాయించారు. ఈ రెండు కేసుల విషయంలో మాత్రమే కాదు... ఇంతకు మునుపు మరో మూడు కేసుల్లో కూడా పోలీసుల తీరును హైకోర్టు తప్పుబట్టింది. డీజీపీని రప్పించాల్సివస్తుందని హెచ్చరించింది. అయినా పోలీసుల తీరు మారడం లేదు.

ఈ తెలివితక్కువ చర్యల్ని ఘనకార్యాలుగా భావిస్తూ పాలకులు సిగ్గువిడిచి ఊరేగుతున్నారు. తమకు ఎదురులేదని విర్రవీగుతున్నారు. అలవిమాలిన హామీలిచ్చి, ఈవీఎంలను నమ్ముకుని, డబ్బు సంచులు గుమ్మరించి అందలం ఎక్కిన కూటమి ఇకముందూ ఇదే దోవలో అధికారాన్ని శాశ్వతం చేసుకోవచ్చని కలలు కంటోంది. తప్పు మీద తప్పు చేస్తూ పోతోంది. ఈ క్రమంలో పోలీసులను ఉపయోగించుకుని సంఘటిత నేరాలకు పాల్పడుతోంది. ఎల్లకాలమూ ఈ వ్యవహారం సాగదు. జనం నిజం గ్రహించారు. కీలెరిగి వాత పెట్టే రోజు ఎంతో దూరంలో లేదు.

చేజారుతున్న విత్తన స్వాతంత్య్రం

విశ్లేషణ



డా॥ దొంతి నరసింహా రెడ్డి

వ్యవసాయంలో విత్తనాల సమస్య రోజు రోజుకూ తీవ్రమవుతున్నది. హరిత విప్లవం పేరిట మొదలుపెట్టిన పరిణామం విత్తనాలతోనే మొదలైంది. అధిక దిగుబడి వంగడాల హామీతో ఇది మొదలై, క్రమంగా రైతులను విత్తనాలకు దూరం చేసింది. 1960వ దశకంలో మొదలు పెట్టిన ఈ మార్పు 2025 నాటికి తీవ్రరూపం దాల్చింది. ఆహార నాణ్యత దిగజారడానికి విత్తనాలలో వచ్చిన మార్పులే కారణం. దేశీ విత్తనాలను తులనాడి, భారత వ్యవసాయాన్ని హీనపరిచి తెచ్చిన హరిత అధిక దిగుబడి వంగడాలు క్రమంగా రైతుల విత్తన స్వావలంబనను హరించాయి.

రసాయనాల దిగుబడి

విదేశీయుల ప్రోత్సాహంతో ప్రవేశపెట్టిన వంగడాలు అధిక దిగుబడి ఇవ్వడానికి ప్రధాన కారణం రసాయన ఎరువులు. రసాయన ఎరువులు ఉపయోగించని పరిస్థితులలో ఈ వంగడాలు ఉపయోగపడలేదు, ఉపయోగపడవు. ఆ విధంగా మొదలుపెట్టిన రసాయన ఎరువుల వాడకం ఇప్పుడు విధిగా, అత్యధికంగా ఉపయోగించాల్సిన పరిస్థితికి వచ్చింది. ఒకప్పుడు ఎకరాకు ఒకటో రెండో ఎరువుల బస్తాల వాడకం నుంచి ఇప్పుడు 15 బస్తాలు వాడే దుఃస్థితికి రైతు చేరుకున్నాడు. పరిశోధన చేసి ప్రవేశపెట్టిన హైబ్రిడ్ లేదా అధిక దిగుబడి వంగడాలు, ఎరువులు, కీటకనాశక రసాయనాల ఉపయోగాన్ని కూడా పెంచాయి. ఈ రకం విత్తనాలు మొదట్లో అధిక దిగుబడి చూపినా క్రమంగా ఉత్పాదకత తగ్గింది. దిగుబడి పెరిగి తగ్గుతోందని గుర్తించి ఒక కొత్త వాదన ప్రవేశపెట్టారు శాస్త్రవేత్తలు. విత్తనాలు ఎప్పటికప్పుడు మార్చాలి. మార్చితేనే దిగుబడి!

ఏ ఆధునిక విత్తనంలోనూ నూరు శాతం అంకురోత్పత్తి ఉండదు. దాంతో మభ్యపెట్టే సిఫారసు మొదలైంది. ఎకరాకు ఎన్ని గింజలు వెయ్యాలి? సాధారణంగా ఒక్కో పంటకు ఒక్క కొలమానం ఉంటుంది. ఆధునిక విత్తనాల్లో అంకురోత్పత్తి వంద శాతం ఎప్పుడూ ఉండదు కనుక ఈ కొలమానంలో మార్పులు తెచ్చి ఎకరాకు ఎక్కువ విత్తనాలు వాడే విధంగా సిఫారసు చేయడం మొదలు పెట్టారు. వరి పంటకు కొందరు రైతులు ఎకరాకు 18 నుంచి 20 కిలోలు వాడుతుంటే, పరిజ్ఞానం ఉన్న రైతులు కేవలం 250 గ్రాముల దేశీ వరి విత్తనాలు వాడుతున్నారు. ఎంత తేడా! మిర్చి, పత్తి, వరి, గోధుమ, టమాట వంటి పంటలలో నాసి రకం విత్తనాల వల్ల లాభపడుతున్నది ప్రైవేటు కంపెనీలు, నష్టపోతున్నది రైతులు.

పోయిన జ్ఞానం, నమ్మకం

ఆధునిక విత్తనాల వల్ల సాగు ఖర్చు పెరిగింది. ఒకప్పుడు రైతు తన విత్తనాలు దాచుకుని వాడే రోజులలో విత్తనాల మీద సున్నా ఖర్చు ఉండేది. రైతుకు తన విత్తనాల మీద పరిజ్ఞానం ఉండేది. వేరే రైతు దగ్గర తెచ్చుకున్నా నమ్మకం ఉండేది. రైతు తన విత్తనాలు కోల్పోయి ఆధునిక విత్తనాలకు అలవాటు పడ్డ తరువాత విత్తనాల మీద జ్ఞానం, నమ్మకం పోయినాయి. ఆధునిక విత్తనాలకు చీడ పీడ బెడద పెరిగింది. దానికి పరిష్కారంగా కీటక నాశనిల వాడకం పెరిగింది. వాటి వల్ల ఖర్చు పెరిగింది. ప్రమాదకరమైన రసాయనాలు కాబట్టి వాటిని వాడే క్రమంలో రైతు ఆరోగ్యం ప్రమాదంలో పడింది.



ఫలితంగా వలసలు, ఆత్మహత్యలు. వ్యవసాయ కూలీ కుటుంబాలతో మొదలైన వలసలు రైతులను కూడా తాకాయి. ఇంకొక వైపు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయం మీద సలహాలు ఇచ్చే కంపెనీలు పెరిగాయి. వాటి వార్షికాదాయం యేటా పెరుగుతున్నది.

బహుశా నార్మన్ బోర్లాగ్ కూడా ఈ పరిణామం ఊహించి ఉండక పోవచ్చు. బోర్లాగ్ ప్రవేశపెట్టిన 'అధిక దిగుబడినిచ్చే' విత్తనాలకు ఖరీదైన ఎరువులే కాక, ఎక్కువ నీరూ అవసరం. వ్యవసాయ ఉత్పత్తిలో అద్భుతాలు లేవు అని చెప్పిన ఈ వ్యక్తి, ప్రపంచానికి ఆహార భద్రత సాధించాలని మొదలు పెట్టిన 'ఆధునిక విత్తనాల' వ్యవసాయం జీవ వైవిధ్యాన్ని, జీవనోపాధులను నాశనం చేస్తున్న విషయం పట్ల స్పందించలేదు. 'అధిక వంగడాల' వల్ల దిగుబడి పెరుగుతుందనే ఏకైక సూత్రం మీద పని చేసిన ఆ మహానుభావుడు తద్వారా నిర్మాణమైన 'దోపిడీ' వ్యవస్థ గురించి ఆలోచించలేదు.

పెద్ద కంపెనీల గుప్పిట్లో...

ఇప్పుడు 'ఆధునిక విత్తనాలు' రైతుల చేతులలో లేవు. విత్తన, పెస్టిసైడ్ కంపెనీల గుప్పిట్లో ఉన్నాయి. 'మేధో హక్కుల సంపత్తి' పేరిట రక్షణ పొంది విత్తన మార్కెట్లను సురక్షితం చేసుకున్నాయి. ఎప్పటికప్పుడు దిగుబడులు తగ్గిపోతున్న నేపథ్యంలో యేటా కొత్త 'విత్తనాలు' మార్కెట్లో ప్రవేశపెట్టి అటు ప్రభుత్వాలనూ, ఇటు రైతులనూ మభ్యపెడుతూ తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి. మన దేశంలో విత్తనాలు, ప్రకృతి వనరుల మీద మేధో సంపత్తి హక్కులు పొందే అవకాశం లేదు కనుక ఇతర మార్గాలలో తమ వ్యాపారాన్ని సుస్థిరం చేసుకుంటున్నారు. పెద్ద కంపెనీలు సిండికేట్ అయ్యి చిన్న కంపెనీలను గుప్పిట్లో పెట్టుకుంటున్నాయి. మార్కెట్ ఒప్పందాలు చేసుకుని దేశీ, చిన్న కంపెనీలకు 'బంధనాలు' వేశారు. ప్రభుత్వం ఏదన్నా 'చర్య' చేపడితే కోర్టుకు వెళతారు. విత్తన కంపెనీలు కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల మీద వేసిన కేసులు కొన్ని వందల సంఖ్యలో ఉన్నాయి.

రైతులలో విత్తనాల విజ్ఞానం కొండలా పెరగాల్సిందిపోయి, ప్రైవేటు గుత్తాధిపత్యం వల్ల వారికి అందడం లేదు. రానురాను విత్తన విజ్ఞానాన్ని రహస్యంగా మార్చుతున్నాయి విత్తన కంపెనీలు. ఇక్రిసాట్, ఇర్రి వంటి అంతర్జాతీయ సంస్థలు విత్తన పరిశోధనల సాకుతో భారతీయ జన్యు సంపద తీసుకుని, క్రమంగా ప్రైవేటు పెట్టుబడిదారులకు అందజేస్తున్నాయి. 1966 తరువాత నిర్మాణమైన ప్రభుత్వ విత్తన వ్యవస్థ పూర్తిగా కుప్పకూలింది. ఇప్పుడు ఉన్న సంస్థలు, కమిటీల పరిశోధనలు ఉత్సవ పాత్రకే పరిమితమై, పరోక్షంగా ప్రైవేటు కంపెనీల ప్రయోజనాలను కాపాడుతున్నాయి. ప్రభుత్వ రంగంలో ఏదో జరుగుతున్న భ్రమ కల్పించటానికి ఉపయోగపడుతున్నాయి.

వ్యాపార సరళీకరణ లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యానికి, దేశాభివృద్ధికి మూలమైన విత్తన రంగాన్ని ప్రైవేటుపరం చేస్తూ, ఉన్న ఒకే ఒక చట్టాన్ని అమలు చేయడం లేదు. 1966లో ప్రభుత్వం రంగంలో చేసే విత్తనాల నాణ్యత, సరఫరా మీద శాస్త్రీయ నియంత్రణకు తెచ్చిన విత్తన చట్టం ప్రైవేటు విత్తనాలకు వర్తింపజేయడానికి సిద్ధంగా లేదు. 2004లో ఒక కొత్త చట్టం తెచ్చే ప్రయత్నం ప్రైవేటు విత్తన కంపెనీల వ్యాపార వెసులుబాటును సరళీకృతం చేయడానికే అని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో 20 యేళ్ల తరువాత కూడా అది రూపుదాల్చలేదు. ఇప్పటి వరకు ప్రతిపాదించిన 4, 5 ముసాయిదాలు రైతుల ప్రయోజనాలు కాపాడటానికీ, భారత దేశంలో ఉన్న అపర విత్తన సంపద స్వచ్ఛతను పరిరక్షణకూ ఉద్దేశించినవి కావు. రైతులు, కంపెనీల ప్రయోజనాల మధ్య కంపెనీల పక్షం వహిస్తున్న కేంద్రం కొత్త చట్టం తేవడానికి భయపడుతున్నది.

విత్తనాల మీద స్వావలంబన అత్యంత మౌలికమైన అవసరం. రైతులకు విత్తన స్వాతంత్ర్యం కోసం రాష్ట్రాలు చట్టాలు తేవాలి. రైతుల పరిజ్ఞానం పెంచే విధంగా విత్తన వ్యవస్థను నిర్మించాలి. విత్తన జన్యుసంపదను కలుషితం కాకుండా కాపాడాలి. పర్యావరణానికి, జన్యుసంపదకు హాని చేసే విత్తనాలను ప్రవేశపెట్టే కంపెనీలు, సంబంధిత వ్యక్తుల మీద క్రిమినల్ చర్యలు చేపట్టాలి. గ్రామీణ స్థాయి నుంచి విత్తనాలను రైతులు స్వేచ్ఛగా ఇచ్చి పుచ్చుకునే పద్ధతులను ప్రోత్సహించాలి.

వ్యాసకర్త వ్యవసాయ రంగ నిపుణులు

- ఒకప్పుడు రైతు తన విత్తనాలు దాచుకుని వాడే రోజులలో విత్తనాల మీద సున్నా ఖర్చు ఉండేది. తన విత్తనాల మీద పరిజ్ఞానం ఉండేది. ఆధునిక విత్తనాల వల్ల సాగు ఖర్చు పెరిగింది.
- మిర్చి, పత్తి, వరి, గోధుమ, టమాట వంటి పంటలలో నాసి రకం విత్తనాల వల్ల లాభపడుతున్నది ప్రైవేటు కంపెనీలు! నష్టపోతున్నది రైతులు!
- విత్తనాల మీద స్వావలంబన అత్యంత మౌలికమైన అవసరం. రైతుల పరిజ్ఞానం పెంచే విధంగా విత్తన వ్యవస్థను నిర్మించాలి. విత్తన జన్యుసంపదను కలుషితం కాకుండా కాపాడాలి.

సోషల్ మీడియా

రంగుల పండుగ



హోలీ – ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన రంగుల పండుగ. ప్రేమ, వసంతం, చెడు మీద మంచి విజయాన్ని ఉత్సవం చేసే హిందూ పండుగ. భారత్‌లోనూ, ప్రపంచమంతా ఉన్న భారతీయ స్నేహితులకు హోలీ శుభాకాంక్షలు.

– వాల్టర్ జె. లిండర్, ఇండియాలో జర్మనీ రాయబారి

మంచి నెల



రమదాన్ మంచి అలవాట్లు చేసుకునే నెల. ఈ నెలతో వచ్చే మంచినంతా అలవర్చుకోండి. అలా చేసుకునే మంచి అలవాట్లు, మంచి విలువలు, మంచి పని తాలూకు ప్రతిఫలం మీరు తప్పక పొందుతారు.

– ముఫ్తీ మెంక్, ఇస్లాం బోధకుడు

అంత తిరుగుతున్నారా?



జమ్మూ కశ్మీర్ శాసన సభ్యులు అరుదైన ఐక్యతను చూపుతూ తమ వేతనం (1,60,000) కనీసం తమ కార్ల పెట్రోల్‌కు కూడా చాలడం లేదని ఏకస్వరంతో చెబుతున్నారు. చూస్తుంటే అందరూ 24/7 కార్ల మీద ప్రపంచ యాత్ర చేస్తున్నట్టున్నారు!

– గౌహర్ గిలానీ, కాలమిస్ట్

భాషా నాటకం



మీ పిల్లలు, మనవలు ఏడాదికి 1–2 లక్షల రూపాయల ఫీజుండే ఇంటర్నేషనల్ స్కూల్స్‌లో చదువుతారు. అక్కడ లాంగ్వేజ్ ఆప్షన్స్‌లో హిందీ, ఫ్రెంచ్, స్పానిష్ ఉంటాయి. కానీ టీవీ చర్చల్లో మాత్రం జాతీయ విద్యా విధానం తమిళనాడు మీద ఎలా భారం మోపుతున్నదో మాట్లాడుతారు. తమిళనాడు అనేది నిజమైన అసంబద్ధ నాటకరంగం.

– సుమంత్ రామన్, టీవీ హోస్ట్

అవి చవక



ఒలింపిక్స్ కోసం ఒక నెలలో 30 బిలియన్ డాలర్లు, ఒక్క బుల్లెట్ ట్రెయిన్ నడపడం కోసం 20 బిలియన్ డాలర్లు వెచ్చించడానికి ఇండియా సిద్ధంగా ఉంది. కానీ ఆరోగ్యం, జీవిత బీమాల మీద ఉమ్మడిగా 2 బిలియన్ డాలర్ల జీఎస్టీని మాఫీ చేయడానికి మాత్రం సిద్ధంగా లేదు. భారతీయుల ఆరోగ్యం, జీవితాలకు విలువ లేదు!

– మనోజ్ అరోరా, ఫైనాన్సియల్ ప్లానర్

చివరికి మిగిలిందేమిటి?

రామ నామ జపముచే మున్ను వాల్మీకి, / బోయడయ్యు బాపడయ్యే! / కులము ఘనము కాదు గుణమే ఘనమ్మురా / విశ్వదాభిరామ వినురవేమ! అని వేమన వందల సంవత్సరాల క్రితమే చెప్పినప్పటికీ ఈనాటికీ ఆ పద్య భావం పెడచెవిన పెట్టబడుతోంది. వేమన, కులం కాదు 'గుణమే' ముఖ్యమన్నాడు. 'మంచి అన్నది మాల అయితే మాల నేనవుతాను' అని గురజాడ అన్నారు. ఇవేమీ పట్టించుకోని మిర్యాలగూడకు చెందిన అమృత తండ్రి మారుతీరావు 2018లో దళితుడైన ఆమె భర్త ప్రణయ్‌ను పాశవికంగా పరువు పేరుతో హత్య చేయించాడు. ఇలాంటివారు దేశమంతా ఎందరో ఉన్నారు.

ఆరేళ్ల తర్వాత నల్లగొండ జిల్లా సెషన్స్ కోర్ట్ ఇచ్చిన తీర్పు... మనిషి కంటే కులమే గొప్పదని నమ్మే హైందవ నాగరాజులకు చెంప దెబ్బనే చెప్పాలి. ఈ అంశం సమాజానికి ఎన్నో విషయాలను మరోసారి బహిర్గతం చేసింది. మరీ ముఖ్యంగా తల్లిదండ్రులు–పిల్లల బాంధవ్యాలు ఎలా ఉండాలి, ఎలా ఉండకూడదు అనేదాన్ని సుస్పష్టం చేసింది. ఈ మధ్యకాలంలో రచయిత డా॥ స్టీఫెన్ ఆర్... ఒక పనిని ప్రారంభించే ముందు, దాని ముగింపును దృష్టిలో పెట్టుకోవాలని పేర్కొన్నారు. అమృత తండ్రి మారుతీరావులో మొదలైన అల్లుణ్ణి హత్య చేయించాలనే ఆలోచన నేడు కొన్ని కుటుంబాల శోకానికి కారణమైంది. కన్న కూతురిపై అపారమైన ప్రేమను పెంచుకున్న మారుతీ రావు జీవితాన్ని కోల్పోయాడు. అతని భార్య భర్తను కోల్పోయింది. అతని కూతురు తండ్రిని కోల్పోయింది. ఇటు అమృత భర్తను కోల్పోయింది. ఆమెకు పుట్టిన బిడ్డకు కన్నతండ్రి లేకుండా పోయాడు. మొదటి ముద్దాయికి ఉరిశిక్ష ఖరారు అయింది. మిగిలిన వారికి జీవిత ఖైదు విధించబడింది. ఒక్క మాటలో చెప్పాలంటే అందరికీ శూన్యమే మిగిలింది.

నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అహ్మదాబాద్‌లో హరేన్ పాండ్యా హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నటువంటి అస్గర్ అలీ ఈ కేసులో కూడా నిందితుడు కావడం సామాన్య మనిషికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇలాంటి వ్యక్తులకు అసలు బెయిల్ మంజూరు కాకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.'పరువా, కులమా... మీ చిరునామా ఎక్కడ' అంటూ వెతికితే... దానికి సాహిత్యకారుల రచనల్లో సమాధానం దొరుకుతుంది. 'ఎంచి చూడగా మనుజులందున మంచి– చెడులు అను రెండే కులములు' అన్నాడు మహాకవి. సాటి మనిషిని మనిషిగా చూడలేని మనిషి మనోమందిరాలు 'అపరిశుభ్ర విసర్జన శాలలుగానే' మిగిలిపోతాయి. దీని ప్రక్షాళనకై అంతరంగ పారిశుద్ధ్య కార్మికులు కావాలి.

– డా॥ ఉదుము ఝాన్సీ । తెలుగు అధ్యాపకురాలు, ఆర్జీయూకేటీ, నూజివీడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

వర్గీకరణ అమలులో తెలంగాణ చొరవ

అభిప్రాయం



తోట లక్ష్మీకాంతారావు

ముప్పై ఏళ్లుగా షెడ్యూల్డ్ కులాల వర్గీకరణపై లక్షల మంది మాదిగ కులంవారూ, వారి ఉపకులాలవారూ చేస్తున్న పోరాటం ఎట్టకేలకు ఫలించింది. ఎస్సీలను వర్గీకరించి రిజర్వేషన్లను అమలు చేయడానికి సుప్రీం కోర్టు అనుమతిస్తూ తీర్పునిచ్చిన వెంటనే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించి అమలుకు శ్రీకారం చుట్టింది. సామాజిక సమస్యను న్యాయ సమస్యగా చూపి గత పదకొండేళ్లుగా వర్గీకరణను అడ్డుకున్న బీజేపీ ప్రభుత్వానికి తప్పని పరిస్థితుల్ని సృష్టించింది వర్గీకరణ ఉద్యమం. తెలంగాణ ఏర్పాటులో ఎలాగైతే సోనియా గాంధీ పాత్ర నిలిచి పోయిందో... అలాగే వర్గీకరణ అమలును చేపట్టిన వ్యక్తిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోనున్నారు. ఏక సభ్య కమిషన్ నివేదికను మంత్రివర్గ సమావేశంలో ప్రవేశపెట్టి... తద్వారా అసెంబ్లీలో ఆమోదించటానికి కృషి చేశారు ముఖ్యమంత్రి. 2007లో కాంగ్రెస్ నేతృత్వంలోని అప్పటి కేంద్ర ప్రభుత్వం 'జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్'ని నియమించింది. దాని నివేదికలోని అంశాల్లో ముఖ్యమైనది: "రాష్ట్రాలు జ్యుడీషియల్ కమిషన్ ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగానే రాష్ట్ర శాసనసభలు తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపాలి". అందుకే తెలంగాణ ప్రభుత్వం ముందు కమిషన్ వేసింది. దీని సిఫార్సులను ఆమోదిస్తూ శాసన సభ చేసిన తీర్మానాన్ని పార్లమెంట్‌కు నివేదించనుంది.

ఎస్సీ కులాల్ని గ్రూప్–1, 2, 3 లుగా విభజించిన కమిషన్... మొదటి గ్రూప్‌లో 15 కులాలు, రెండో గ్రూప్‌లో 18, మూడో గ్రూప్‌లో 26 కులాల్ని చేర్చింది. జనాభా, సామాజిక వెనుకబాటు ఆధారంగా పక్కాగా లెక్కలతో సమర్పించిన ఈ నివేదికను ప్రభుత్వం ఆమోదించింది. గతంలో వర్గీకరణను అమలు చేసినప్పుడు మాదిగలు ఉన్న గ్రూప్–బీకి ఉన్న 7 శాతాన్ని 9 శాతానికి పెంచింది ఈ ప్రభుత్వం. కేవలం క్రీమీలేయర్ విధానాన్ని సూచించిన కమిషన్ సిఫార్సును పరిగణనలోకి తీసుకోలేదు. ఎందుకంటే గతంలోనే ఎన్నో సార్లు సుప్రీం కోర్టు రిజర్వేషన్లను సామాజిక వెనుకబాటుతనాన్నే పరిగణనలోకి తీసుకోవాలి తప్ప ఆర్థిక పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని రాజ్యాంగంలో పొందుపర్చలేదని స్పష్టం చేసింది. అందుకే తెలంగాణ ప్రభుత్వం క్రీమీలేయర్ సిఫార్సును ఆమోదించలేదు. మాదిగలకు దశాబ్దాలుగా వాటా దక్కడంలేదన్న ఆందోళనలు 1960 నుంచే ఉన్నాయి. మొత్తం ఎస్సీ జనాభాలో 62 శాతంగా ఉన్న మాదిగలకు తమ జనాభాకు తగ్గ ప్రాతినిధ్యం ఎన్నడూ అందలేదు. 1965లోనే 'బీఎన్ లోకూర్ కమిటీ' మాదిగలు తీవ్రంగా వెనుకబడి ఉన్నారని



స్పష్టం చేసింది. ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ 'పి. రామచంద్ర రాజు కమిషన్' మాదిగలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో జరిగిన అన్యాయాన్ని తన నివేదికలో పొందుపరిచింది.

1990ల్లో మాదిగ ఉద్యోగులు, విద్యార్థులతో పాటు, యువజన సంఘాలు మెల్లగా కార్యాచరణను ప్రారంభించాయి. మాదిగల పోరాటం వివిధ దశల్లో సాగింది. అప్పటి తెలుగుదేశంపై ఒత్తిడి తీసుకువచ్చిన మాదిగలు, మాదిగ ఉపకులాలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి కమిషన్ నివేదికను ఆమోదించేలా చేశాయి. నాలుగేళ్లు సుప్రీం కోర్టులో వాదనలు సాగి చివరికి వర్గీకరణ కొట్టివేతకు గురయ్యింది. కానీ మాదిగ సంఘాల ఉద్యమం మాత్రం ఏనాడూ ఆగలేదు.

ఎస్సీ వర్గీకరణ ఉద్యమం 'ఎస్సీ ఉపకులాల్ని వర్గీకరించి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అందించాలి' అనే తేలికైన, అర్థవంతమైన డిమాండ్‌తో ప్రారంభమయ్యింది. కాబట్టే రాజకీయ పార్టీలతో సహా ప్రజా సంఘాలు, సామాన్య ప్రజలు వర్గీకరణకు తమ మద్దతునిచ్చారు.

గతంలోనే పంజాబ్, బిహార్, తమిళనాడు రాష్ట్రాలు వర్గీకరణకు ప్రయత్నించినప్పటికీ న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొని వర్గీకరణను అమలు చేయలేకపోయాయి. వీటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారి వర్గీకరణను విజయవంతంగా అమలు చేయటానికి అన్ని చర్యలూ తీసుకుంది. ఇక గ్రూప్–1కి ఒక శాతం, మధ్యస్థంగా లబ్ధిపొందిన గ్రూప్‌లో ఉన్న కులాలకి 9 శాతం, మెరుగైన ప్రయోజనాలు పొందిన కులాలకు 5 శాతం రిజర్వేషన్లు సిఫార్సు చేసిన కమిషన్... జనాభా, విద్య, ఉద్యోగ రంగాల్లో ఆ యా కులాల వెనుకబాటు ఆధారంగా శాస్త్రీయంగా రిజర్వేషన్లను విభజించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం జరిగిన వర్గీకరణలో మాదిగలకు సముచిత ప్రాధాన్యం లభించింది.

వర్గీకరణ వల్ల ఎస్సీ కులాల్లో అనైక్యత వస్తుందన్న వాదనల్లో నిజం లేదు. ఇప్పటికే బీసీల్లో నాలుగు గ్రూపులుగా ఉన్న కులాలు 42 శాతం రిజర్వేషన్ కోసం కలిసికట్టుగా పోరాడుతున్నాయి. అదే విధంగా వర్గీకరణ జరిగిన తర్వాత కూడా ఎస్సీ కులాలన్నీ సామాజిక అసమానతల్ని రూపుమాపేందుకు, ఎస్సీల అభ్యున్నతికి కృషి చేస్తాయి. ముంబయి మిల్లు కార్మికుల పోరాటంలో అంబేద్కర్ చెప్పిన మాటను మనం ప్రస్తావించుకోక తప్పదు... "సామాజిక అసమానతలు తొలగనంత వరకు ఐక్యత సాధ్యపడదు". అందుకే ఎస్సీ వర్గీకరణ ద్వారా అసమానతల్ని రూపుమాపి ఐక్యంగా మిగతా అంశాలపై పోరాటం కొనసాగించవచ్చు.

వ్యాసకర్త జుక్కల్ ఎమ్మెల్యే

కామ దహనం



ఫాల్గుణ పూర్ణిమ నాడు ఈ దేశమంతా పులకించి, రంగుల జల్లులలో తడిసి ముద్దవుతుంది. హోలీ వేడుకల వెల్లువలో ఓ పూటంతా ఒళ్ళు మరిచిపోతుంది. ఒకప్పుడు హోలీ ఉత్తర భారతానికే పరిమితమై ఉండేది. ఇప్పుడు దేశంలోని అన్ని భాగాలకూ విస్తరించింది. విదేశాలకూ వ్యాపించింది.

హోలీ అంటే ఔత్తరాహులకు దీపావళి తరవాత అంతటి పండగ. పెద్ద పండగ. ఈ పండగ వెనక ఎన్నెన్నో కథలూ, గాథలూ, ఐతిహ్యాలూ ఉన్నాయి. దక్షిణ భారత సంప్రదాయంలో ఫాల్గుణ పూర్ణిమ 'కాముడి పున్నమి'. దీని వెనక ఉన్న పురాణ కథ కామదహనం కథ. మహత్తరమైన తన ప్రతాపాన్ని మహాదేవుడి మీద చూపబోయిన మన్మథుడు, ఫాలాక్షుడి నేత్రాగ్నిలో ముందు భస్మమైపోయి, తిరిగి ఆయన కటాక్షంతోనే సజీవుడైన కథ. శివుడి ఉద్దేశ్యం కాముడిని నిర్మూలించటం కాదు, నిగ్రహించటం!

జ్యోతిర్మయం

కామం, అంటే ఇంద్రియ విషయాల మీద కోరిక! లోక సమ్మతమైన పురుషార్థమే. ధర్మ అవిరుద్ధమైన కామానికి దివ్యత్వం ఉంది. అయితే, కామం జీవుడి వశంలో ఉంటే అది ఆనందాన్నిస్తుంది. జీవుడు కామం వశంలోకి వెళ్ళిపోతే, అది వినాశన హేతువవుతుంది.

'మనిషి చేసే అన్ని పాపాలకూ కారణం కామమే. అది రజో గుణం నుండి పుడుతుంది. దాని వెనకనే క్రోధం ఉంటుంది. అద్దాన్ని మురికి కప్పినట్టు, గర్భస్థ శిశువును మావి కప్పినట్టు, జీవుడి జ్ఞానాన్ని కామం కప్పేస్తుంది. కామం తీరని ఆకలి. ఆరని అగ్ని. అది జీవుడి పరమ శత్రువు' అంటుంది గీత నిర్ద్వంద్వంగా.

కాబట్టి, హోలీ ముచ్చటలన్నీ ముగిసిన తరువాత, స్థిమితంగా కూర్చొని, కామరూపమైన దుర్జయమైన అంతః శత్రువును నియంత్రించి, నిగ్రహించటం మీద కొంత ధ్యాస పెట్టాలి అన్నది కాముని పున్నమి సందేశంగా స్వీకరించటం క్షేమకరం.

అందరికీ హోలీ పూర్ణిమ శుభాకాంక్షలు!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** పౌర్ణమి ఉ.11.29 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** ఉత్తర పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ప.1.31 నుండి 3.15 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.35 నుండి 9.23 వరకు, తదుపరి ప.12.35 నుండి 1.23 వరకు, **అమృత ఘడియలు:** రా.11.56 నుండి 1.40 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.14, **సూర్యాస్తమయం:** 6.05.



పంట జీవాలపాలు

లింగాలఘణపురం: అసలే కరువు ప్రాంతం.. దీనికి తోడు ఎండల తీవ్రత వల్ల భూగర్భ జలాలు అడుగంటడంతో ఒక రైతు గొర్రెలు, మేకలకు పంటను మేతగా వదిలేశాడు. జనగామ జిల్లా లింగాలఘణపురం రైతు కడకంచి గట్టయ్య తనకున్న ఎకరంలో వరి సాగు చేశాడు. బోరు ఎండిపోవడంతో అర ఎకరం పొలాన్ని తన గొర్రెలు, మేకలకు మేతకు వదిలేశాడు. 'మరో ఇరవై రోజులు నీళ్లు ఉంటే పంట చేతికొచ్చేది. ఏం చేయాలె.. నీళ్ల ఎక్కడి నుంచి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు'.. అంటూ వాపోయాడు.



9 బోర్లున్నా.. ట్యాంకరే దిక్కు

లింగాలఘణపురం: సాగునీరు లేక కళ్లముందే పంట ఎండిపోతుంటే తల్లడిల్లిన అన్నదాత పంటను కాపాడుకోవడానికి తండ్లాట పడుతున్నాడు. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం బండ్లగూడెంకు చెందిన రైతు చల్లా వెంకట్‌రెడ్డి తనకున్న రెండు ఎకరాల్లో రెండేళ్ల క్రితం 9 బోర్లు వేయగా.. అందులో ఒక బోరులోనే నీళ్ల పడ్డాయి. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఈసారి ఎకరంన్నరలో మాత్రమే వరి సాగు చేశాడు. వారం క్రితం ఉన్న బోరు ఎత్తిపోయింది. దీంతో పంటను కాపాడుకోవడానికి ట్యాంకర్‌ను కిరాయికి తీసుకుని.. పొలానికి నీరు పారిస్తున్నాడు.



పంటలు ఎండిపోతున్నాయని రోడ్డెక్కిన రైతులు

జనగామ రూరల్: అటు కాల్వల్లో నీరు రావడంలేదు.. ఇటు భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ఎండిపోతున్న తమ పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ రైతన్నలు గురువారం రోడ్డెక్కారు. జనగామ–హుస్నాబాద్ రహదారి గానుగుపహాడ్ స్టేజీ వద్ద ఎండిన వరి కర్రలు, పురుగు మందు డబ్బాలతో నిరసన తెలిపారు. పంటలు ఎండిపోతే తమకు మరణమే శరణ్యమని, గతంలో ఎన్నడూ ఇంతటి సమస్య ఎదుర్కోలేదని వాపోయారు. బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి వెంటనే కాల్వల ద్వారా సాగునీరు విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. పోలీసులు చేరుకుని సంబంధిత అధికారిని రైతులతో మాట్లాడించి వారిని శాంతింపజేశారు.



బ్యాంకోళ్లూ జెండాలు పాతారు

నేలకొండపల్లి: పంట రుణాలు చెల్లించలేదని రైతుల పొలాల్లో బ్యాంక్ అధికారులు ఎర్ర జెండాలు పాతుతున్నారు. ఖమ్మం డీసీసీబీ పరిధిలోని పలు బ్రాంచ్‌ల ద్వారా రైతులు రుణాలు తీసుకున్నారు. ఇందులో నేలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల రైతులు కూడా ఉండగా.. రుణాలు చెల్లించలేదంటూ కోనాయిగూడెం, ఆరెగూడెం తదితర గ్రామాల్లోని పొలాల్లో అధికారులు గురువారం ఎర్రజెండాలు పాతారు. నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడం వల్లే జెండాలు పాతుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీనిపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

టన్నెల్‌లో రోబో రెస్క్యూకు రూ.4కోట్లు

ఆ 40 మీటర్లు అత్యంత ప్రమాదకరం
అందుకే రోబోల వినియోగం : మంత్రి ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్ /సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాదవశాత్తు చిక్కుకుపోయిన కార్మికుల జాడ గుర్తించడానికి రోబో రెస్క్యూ కార్యక్రమాలకు రూ. 4 కోట్ల వ్యయం కానుంది. దానికి సంబంధించిన ఫైల్‌పై మంత్రి ఉత్తమ్ గురువారం సంతకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ఈ దురదృష్టకర సంఘటన జరగని పక్షంలో రెండేళ్లలో సొరంగం పూర్తయ్యేదన్నారు. ప్రమాదం జరిగిన దగ్గరనున్న 40 మీటర్లు అత్యంత ప్రమాదకరమని, అందుకే రోబోల సాయంతో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినట్టు తెలిపారు.

టీబీఎం లోపల తవ్వకాలు..

టన్నెల్‌లో సహాయకచర్యలు కొనసాగుతున్నాయి. ఏఐ ఆధారిత స్లడ్జ్ రిమూవల్ రోబో మిషనరీ ఇప్పటికే సొరంగంలో పనిచేస్తుండగా, శుక్రవారం మరో రెండు రోబోలు సొరంగం వద్దకు చేరుకోనున్నాయి. ప్రమాదస్థలంలో కడావర్ డాగ్స్ గుర్తించిన డీ2, డీ1 పాయింట్ల మధ్య 12 మీటర్ల దూరం ఉంది. ఈ ప్రాంతంలోనే ఉన్న టీబీఎం పైకప్పుగా మెటల్ ప్లాట్‌ఫాం ఉంది. దాని కింద హోల్ స్పేస్‌గా ఉన్న ఖాళీ ప్రదేశంలో కార్మికులు ఉండి ఉంటారని భావిస్తున్నారు. టీబీఎం లోపల ఖాళీ ప్రదేశమంతా మట్టి, బురద, శిథిలాలతో కూరుకొని ఉంది. వాటిని పూర్తిగా తొలగిస్తేనే కార్మికుల జాడ తెలిసే అవకాశముంది. డీ2, డీ1 మధ్య కార్మికులు నడిచేందుకు అవకాశమున్నట్టు భావిస్తున్న చోట ట్రెంచ్‌గా తవ్వకాలు జరుపుతున్నారు. గురువారం మధ్యాహ్నం కడావర్ డాగ్స్‌ను మరోసారి టన్నెల్‌లోకి తీసుకెళ్లారు. మట్టి, బురద తొలగించిన ప్రదేశాల్లో మరోసారి అన్వేషణ చేపట్టారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్‌కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్ సొరంగం వద్దే ఉండి క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.



టీబీఎం ప్లాట్‌ఫాం తొలగించి తవ్వకాలు జరుపుతున్న సింగరేణి బృందాలు

మేడిగడ్డ బరాజ్‌పై ఎన్‌డీఎస్‌ఏ నివేదిక వారంలోగా

మేడిగడ్డ బరాజ్ 7వ బ్లాక్‌లో పగుళ్లు రావడానికి సంబంధించి వారం పది రోజుల్లో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక వస్తుందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. బరాజ్‌లో నీరు నిల్వ చేసి వినియోగించుకోవడం లేదంటూ బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఓ విలేకరి మంత్రి దృష్టికి తీసుకుని రాగా..నీరు నిల్వ చేస్తే.. డ్యామ్ కొట్టుకొని పోయి దిగువన ఉన్న సీతారామ ప్రాజెక్టుతో సహా 44 వేల గ్రామాలు, భద్రాచలం కొట్టుకొనిపోవాలని వారు కోరుకుంటున్నారా అని ప్రశ్నించారు. డ్యామ్‌ల రక్షణపై నివేదికలు ఇవ్వడంలో ఎన్‌డీఎస్‌ఏ సుప్రీం అని.. దాని సూచనలు పాటిస్తామన్నారు. తుమ్మిడిహెట్టి వద్దనే ప్రాజెక్టును నిర్మించి ఉమ్మడి ఆదిలాబాద్‌కు నీళ్లు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామని మంత్రి చెప్పారు.

నేరం చేసేలా ఒత్తిడి చేస్తారు.. తప్పు ఎలా చేయాలో శిక్షణ ఇస్తారు

- క్రిప్టో కరెన్సీ మోసాలు నాకు అప్పగించారు.. టార్గెట్ చేరుకోలేదని జీతం తగ్గించారు
- మయన్మార్ కేకే పార్క్ కేంద్రంగా సైబర్‌మోసాల తీరును వివరించిన ప్రత్యక్ష సాక్షి మహమ్మద్ అర్బాజ్ బిన్‌బా బేజర్
- హైదరాబాద్‌కు తిరిగొచ్చిన తర్వాత టీజీసీఎస్‌బీలో ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్ : 'థాయ్‌లాండ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం పేరిట నన్ను బ్యాంకాక్ తీసుకెళ్లారు. అక్కడి నుంచి మయన్మార్‌లోని కేకేపార్క్ ప్రాంతంలోకి జాంటు అనే కంపెనీకి ఒక చైనీయుడు నన్ను తీసుకెళ్లాడు. అక్కడున్నవారు నన్ను సైబర్ మోసాలు చేయాలని ఒత్తిడి తెచ్చారు. తర్వాత వారే సైబర్ మోసాలు ఎలా చేయాలి? ఎదుటి వ్యక్తితో ఎలా మాట్లాడాలి? వారితో నమ్మకంగా ఎలా మెలగాలి? చివరకు ఎలా మోసగించాలి? ఇలా అన్నింటికి సంబంధించి శిక్షణ ఇచ్చారు. తర్వాత నాకు క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పేరిట మోసాలు చేసే పని అప్పగించారు' అంటూ మహమ్మద్ అర్బాజ్ బిన్‌బా బేజర్ తన ప్రత్యక్ష అనుభవాన్ని చెప్పారు. నగరానికి చెందిన మహమ్మద్ అర్బాజ్ బిన్‌బా బేజర్ ఉద్యోగం కోసం థాయ్‌లాండ్‌కు వెళ్లి సైబర్ నేరగాళ్ల ముఠా చేతికి ఎలా చిక్కాడు..ఎలా బయటపడ్డారో టీజీ సైబర్‌సెక్యూరిటీ బ్యూరో అధికారులకు గురువారం ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఏజెంట్ రూ.60,000 తీసుకొని...

ఫలక్‌నుమాలోని మీ సేవ కేంద్రంలో డేటాఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేసే తనకు థాయ్‌లాండ్‌లో అదే ఉద్యోగం ఇప్పిస్తానని ఏజెంట్ బషీర్ రూ. 60,000 తీసుకొని తనను 2025 జనవరి 1న బ్యాంకాక్ పంపినట్టు మహమ్మద్ అర్బాజ్ చెప్పాడు. 'బ్యాంకాక్ విమానాశ్రయంలో ఒక చైనీయుడు నన్ను రిసీవ్ చేసుకున్నాడు. తర్వాత ఒక ట్యాక్సీలో థాయ్‌లాండ్‌లోని మే సాట్‌లోని ఒక హోటల్‌కు తీసుకెళ్లాడు. ఆ తర్వాత అతను నన్ను మే సాట్‌లోని నది పాయింట్‌కు తీసుకెళ్లి, చిన్న పడవలో నదిని దాటించి మయన్మార్‌లోని మైవాడికి, ఆ తర్వాత కారులో కేకే పార్క్ ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ క్రిప్టోకరెన్సీలో పెట్టుబడుల పేరిట మోసాలు చేసే పని అప్పగించారు. ఆ ముఠావారు ముందు నకిలీ వివరాలతో ఒక ఫేస్‌బుక్ ఖాతా తెరిపిస్తారు. దానిలో పలువురికి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పెట్టాలి. స్పందించిన వ్యక్తులతో ఫొటోలు, శుభాకాంక్షలు పెడుతూ, వారి అభిరుచులు, అలవాట్లపై చర్చిస్తూ పరిచయం పెంచుకోవాలి. అలా వారి నమ్మకాన్ని పొందిన తర్వాత, టీమ్ లీడర్ మాకు నిజమైన యూఎస్ వాట్సాప్ నంబర్ ఇస్తాడు. వాట్సాప్‌లో సంభాషణను కొనసాగిస్తూ, చైనీయులు నిర్వహించే వెబ్‌సైట్ ద్వారా క్రిప్టోకరెన్సీని కొనుగోలు చేస్తే లాభాలు వస్తాయని, నాకు కూడా మీరు పెట్టే పెట్టుబడిలో ఒక శాతం కమీషన్ అందుతుందని ఒప్పించాలి. ఎదుటి వ్యక్తికి అనుమానం వస్తే వారి నమ్మకాన్ని తిరిగి పొందడానికి మేము వీడియో కాల్ చేస్తాం. ఇలా పెట్టుబడులు పెట్టించి మోసగించాలి. నేను ఇలా ఒకటిన్నర నెల పనిచేసిన తర్వాత, నాకు అప్పగించిన టార్గెట్ చేరుకోలేదని నా జీతం తగ్గించారు. భారత్‌తోపాటు ఎన్నో దేశాల వారు అక్కడ పనిచేస్తున్నారు. ఇటీవల మాలాంటి వారిని అక్కడి సైన్యం కాపాడుతున్నట్టు వార్తలు వచ్చాయి. అప్పుడు మా కంపెనీ వారు మమ్మల్ని పిలిచి..ఆసక్తి లేనివారు కంపెనీని విడిచి వెళ్లిపోవచ్చని చెప్పారు. 2025 ఫిబ్రవరి 23న సైన్యం మా కంపెనీ కార్యాలయానికి వచ్చింది. అప్పుడు నేను సైనిక బృందంతో భారత రాయబార కార్యాలయానికి వచ్చి, 2025 మార్చి 11న భారత్‌కు చేరుకున్నాను' అని టీజీసీఎస్‌బీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు బషీర్, ఇతరులపై కేసు నమోదు చేసిన టీజీసీఎస్‌బీ డీఎస్పీ కేవీఎం ప్రసాద్ దర్యాప్తు ప్రారంభించారు.



'పరీక్ష'ల భయంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



రోహిత్

చొప్పదండి: కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి పూసాల రోహిత్ (17) పరీక్షలు తప్పుతానన్న భయంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ అనూష తెలిపిన వివరాలివి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రోహిత్ పరీక్షల్లో తప్పుతానని తరచూ బాధపడేవాడు. బాధపడవద్దని తల్లి కవిత ధైర్యం చెబుతూ ఉండేది. ఈ క్రమంలో గురువారం ఉదయం రోహిత్ పెద్దమ్మ రావుల అరుణ నిద్రలేచి చూడగా.. వరండాలో చీరతో ఉరేసుకొని కనిపించాడు. ఆమె అరుపులు విని.. ఇరుగు పొరుగు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

భద్రాద్రి రామాలయంలో అర్చకుల నిరసన

- వసంతోత్సవ అంకురార్పణ ఆలస్యం



ఈవోతో మాట్లాడుతున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో గురువారం సాయంత్రం అర్చకులు నిరసనకు దిగడంతో.. మూడున్నర గంటలు ఆలస్యంగా రాత్రి 10 గంటలకు అంకురార్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివరాలివి. రామాలయ ఉప ప్రధాన అర్చకుడు అమరవాది శ్రీనివాస రామానుజాచార్యుల కుమార్తె రెండు రోజుల క్రితం ఆలయం నుంచి ఒక సంచితో వెళ్తుండగా స్పెషల్ ఫోర్స్ సిబ్బంది తనిఖీ చేశారు. సంచిలో ఓ పూల దండ, మూడు కండువాలు, రెండు జాకెట్ పీసులు, రూ.500 నోటును సిబ్బంది గుర్తించారు. దీనిపై అధికారులు ఈవోకు నివేదిక అందజేశారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆమె.. ఉప ప్రధాన అర్చకుడిని డిప్యుటేషన్‌పై పర్ణశాలకు పంపించారు. కాగా, ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా ఆలయంలో శుక్రవారం తలంబ్రాలు కలిపే ప్రక్రియతో పాటు వసంతోత్సవం జరగనున్నాయి. ఈ కార్యక్రమాలకు బ్రహ్మగా వ్యవహరించాల్సిన ఉప ప్రధాన అర్చకుడు శ్రీనివాస రామానుజాచార్యులు లేకపోవడంతో.. ప్రధానార్చకులు, ఇతర వైదిక సిబ్బంది కార్యక్రమాన్ని ప్రారంభించడానికి నిరాకరించారు. ఈ సందర్భంగా అర్చకులు, ఈవో నడుమ వాదోపవాదాలు జరిగాయి. స్పెషల్ ఫోర్స్ సిబ్బంది, ఏఈవో శ్రవణ్‌కుమార్ ఇచ్చిన నివేదిక ఆధారంగానే శ్రీనివాస రామానుజాచార్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని ఈవో స్పష్టం చేశారు.

మైనింగ్‌పై బహిరంగ విచారణ జరపాలి

- నాగర్‌కర్నూల్ జిల్లా మైలారం వాసుల డిమాండ్
- గుట్టమీద తవ్వకాలపై అదనపు కలెక్టర్ విచారణ
- ప్రజలతో మాట్లాడకుండానే వెళ్లిపోయిన అధికారులు
- అడ్డుకున్న గ్రామస్తులను చెదరగొట్టిన పోలీసులు



అదనపు కలెక్టర్ కారును అడ్డుకుంటున్న గ్రామస్తులు

బల్మూర్: నల్లమల ప్రాంతంలోని మైలారం గుట్టపై మైనింగ్ గురించి చేపట్టిన విచారణ గందరగోళానికి దారితీసింది. గుట్టపైకి గ్రామస్తులు, మీడియాను అనుమతించకపోవడంతో ప్రజలు అధికారుల కార్లను అడ్డుకొని ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని బల్మూర్ మండలం మైలారం గ్రామ శివారులోని గుట్టపై నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ తవ్వకాలు జరుపుతున్నట్లు గ్రామస్తులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఫిర్యాదు చేశారు. దీనిపై అదనపు కలెక్టర్ అమరేందర్ ఆధ్వర్యంలో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు గురువారం అదనపు కలెక్టర్ అమరేందర్ ఆధ్వర్యంలో అధికారులు గుట్టపైకి వెళ్లి విచారణ చేపట్టారు. అయితే గుట్టపైకి గ్రామస్తులు, మీడియాను వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. విచారణ అనంతరం అదనపు కలెక్టర్ శివాలయం వద్ద గ్రామస్తులతో మాట్లాడతారని అధికారులు తెలిపారు. కానీ, విచారణ జరిపిన తర్వాత అదనపు కలెక్టర్, అధికారులు గ్రామస్తులను కలవకుండా వెళ్లిపోతుండటంతో వారు కారుకు అడ్డుగా వెళ్లి తమ గోడు వినాలని నిరసన తెలిపారు. అదనపు కలెక్టర్ కారుకు అడ్డుగా వెళ్లిన గ్రామస్తులను పోలీసులు చెదరగొట్టి అధికారులను అక్కడి నుంచి పంపించారు. దీంతో గ్రామస్తులు తీవ్రంగా మండిపడ్డారు. మైనింగ్‌పై బహిరంగంగా విచారణ చేయాల్సిన అధికారులు మైనింగ్ కాంట్రాక్టర్ సమక్షంలో ఏకపక్షంగా విచారణ చేయడం ఏమిటని ప్రశ్నించారు. బహిరంగ విచారణ చేపట్టకపోతే కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

మద్యంపై టారిఫ్‌ల యుద్ధం

అమెరికా విస్కీపై 50 శాతం సుంకం విధిస్తామన్న యూరప్ దేశాలు

- నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ డిమాండ్
- లేకపోతే యూరప్ మద్యంపై 200 శాతం సుంకం విధిస్తామని హెచ్చరిక

వాషింగ్టన్: అమెరికా, యూరప్ మధ్య టారిఫ్‌ల యుద్ధం మరింత ముదురుతోంది. ఇరుపక్షాలు సై అంటే సై అంటున్నాయి. తగ్గేదేలే అన్నట్లుగా దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. అమెరికా నుంచి దిగుమతి అయ్యే విస్కీపై యూరప్ దేశాలు బుధవారం ఏకంగా 50 శాతం టారిఫ్ విధించడం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ఈ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయకపోతే ఫ్రాన్స్ సహా యూరప్ దేశాల నుంచి దిగుమతి అయ్యే అన్ని రకాల వైన్స్, షాంపేన్స్, ఇతర ఆల్కహాలిక్ ఉత్పత్తులపై 200 శాతం సుంకం విధిస్తామని హెచ్చరించారు. దీనివల్ల యూరప్ మద్యం అత్యంత ఖరీదుగా మారిపోతుందని, అంతిమంగా అమెరికాలో స్వదేశీ వైన్, షాంపేన్ వ్యాపారం లాభపడుతుందని తేల్చిచెప్పారు. ఈ మేరకు గురువారం సోషల్ మీడియాలో ట్రంప్ పోస్టు చేశారు. యూరప్ నుంచి వచ్చే స్టీల్, అల్యూమినియంపై 25 శాతం టారిఫ్ విధిస్తూ అమెరికా ప్రభుత్వం తొలుత నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ టారిఫ్ రద్దు చేయాలని యూరప్ దేశాలు కోరినా ట్రంప్ యంత్రాంగం లెక్కచేయలేదు. దాంతో ప్రతీకార సుంకాలకు తెరతీసిన యూరప్ దేశాలు అమెరికా ఉత్పత్తులను లక్ష్యంగా చేసుకున్నాయి. 28 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా పడవలు, మోటార్‌బైక్‌లపై వచ్చేనెల నుంచి సుంకాలు విధించబోతున్నట్లు ప్రకటించాయి. అమెరికా విస్కీని సైతం వదిలిపెట్టలేదు. 50 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు తాజాగా ప్రకటించాయి. అందుకు పోటీగా యూరప్ మద్యంపై 200 శాతం టారిఫ్‌ను విధించడం ఖాయమని ట్రంప్ ప్రకటించడం చూస్తే పరిస్థితి చెయ్యి దాటిపోతున్నట్లు తెలుస్తోంది. టారిఫ్‌ల వ్యవహారం చివరకు భీకరమైన వాణిజ్య యుద్ధానికి దారితీసినా ఆశ్చర్యం లేదని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



విస్కీపై సుంకం అసహ్యంగా ఉంది: ట్రంప్

తమ విస్కీపై యూరప్ దేశాలు 50 శాతం టారిఫ్‌ను ప్రకటించడం పట్ల అమెరికా మద్యం పరిశ్రమ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. యూరప్‌కు విస్కీ ఎగుమతులు మళ్లీ పెంచాలని ఇటీవలే నిర్ణయించామని, ఈ టారిఫ్‌ల వల్ల అది నెరవేరే అవకాశం లేదని అమెరికా డిస్టిల్డ్ స్పిరిట్స్ కౌన్సిల్ సీఈఓ క్రిస్ స్వాగ్నర్ చెప్పారు. బుధవారం యూరప్ నుంచి ప్రకటన వెలువడిన వెంటనే ట్రంప్ స్పందించారు. వైట్‌హౌస్ ఓవల్ ఆఫీసులో మాట్లాడారు. యూరప్ సుంకాలపై తగిన విధంగా బదులిస్తానని చెప్పారు. అన్నట్లుగానే గురువారం బాంబు పేల్చారు. 200 శాతం సుంకాలు అంటూ గట్టిగా బదులిచ్చారు. ప్రపంచంలోనే అత్యంత దారుణమైన పన్నులు, సుంకాలు యూరప్ దేశాల్లో ఉన్నాయని ఆరోపించారు. అమెరికా నుంచి దోచుకోవాలన్న యావ తప్ప మరొకటి లేదని యూరప్ దేశాల ప్రభుత్వాలపై ధ్వజమెత్తారు. ఆఖరికి విస్కీపై కూడా టారిఫ్ విధించడం అత్యంత అసహ్యంగా ఉందన్నారు.

అమెరికా మద్యం కంపెనీలకు ఇక్కట్లు: డొనాల్డ్ ట్రంప్

టారిఫ్ ప్లాన్లు ఆగవు

టారిఫ్‌లలో ఉన్న సమస్య ఏమిటంటే అవి మరిన్ని టారిఫ్‌లకు దారితీస్తాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అమెరికా, యూరప్ మధ్య ఈ టారిఫ్‌ల రగడ ఇప్పట్లో ఆగే సూచనలు కనిపించడం లేదు. ఒక్కసారి అందులో కూరుకుపోతే బయటపడడం అంత సులభం కాదు. తమ టారిఫ్ ప్రణాళికలను సమీప భవిష్యత్తులో ముగించే అవకాశం లేదని ట్రంప్ ఇప్పటికే సంకేతాలిచ్చారు. అంతర్జాతీయ ఒత్తిళ్లకు సైతం ఆయన తలొగ్గడం లేదు. పైగా అదనపు టారిఫ్‌లు ఉంటాయని చెబుతున్నారు. ఇండియా, చైనా సహా పలు దేశాల ఉత్పత్తులపై విధించిన సుంకాలు ఏప్రిల్ 2 నుంచి అమల్లోకి రాబోతున్నాయి.

అధికారంలో ఉన్నప్పుడల్లా అమెరికా మద్యం కంపెనీలు ఇబ్బందులకు గురవుతున్నాయి. ఎందుకంటే ఇతర దేశాలు అమెరికా మద్యంపై టారిఫ్‌లు వసూలు చేస్తున్నాయి. అమెరికాలోని కెంటకీ, టెన్నెస్సీ రాష్ట్రాల్లో విస్కీ కంపెనీలు అధికంగా ఉన్నాయి. గతేడాది జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఈ రెండు రాష్ట్రాలు ట్రంప్‌నకే మద్దతు పలికాయి. అయినా ట్రంప్ ఆ దిశగా ఆలోచించకపోవడం గమనార్హం. అమెరికా మద్యంపై పొరుగుదేశం కెనడా ఇప్పటికే సుంకాలు విధించింది. ఇతర దేశాల ఉత్పత్తులపై ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌లపై అమెరికాలోని జాక్ డేనియల్స్ కంపెనీ సీఈఓ బ్రౌన్ ఫార్మన్ ఇటీవల ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము ఉత్పత్తి చేసిన విస్కీని ఇతర దేశాల్లో విక్రయించకుండా చేస్తున్నారని ఆక్షేపించారు.

స్పేస్ ఎక్స్ ప్రయోగం నేటికి వాయిదా



కేప్ కనవెరాల్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చిక్కుకుపోయిన నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లను భూమిపైకి తీసుకువచ్చే స్పేస్‌ఎక్స్ ప్రయోగం వాయిదాపడింది. ప్రయోగానికి నాలుగు గంటల ముందు లాంచ్‌ప్యాడ్‌లోని కీలకమైన హైడ్రాలిక్ వ్యవస్థలో లోపాన్ని గుర్తించిన కెన్నడీ స్పేస్ సెంటర్ అధికారులు ఫాల్కన్ రాకెట్ ప్రయోగాన్ని వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఐఎస్ఎస్‌కు వెళ్లాల్సిన వ్యోమగాములు అప్పటికే క్యాప్సూల్‌లోకి చేరారని, లోపాన్ని సరిదిద్దేందుకు నిపుణులు ప్రయత్నిస్తున్నారని, శుక్రవారానికి ప్రయోగాన్ని వాయిదా వేసినట్లు నాసా ప్రకటించింది. అమెరికా, జపాన్, రష్యాలకు చెందిన వ్యోమగాములను ఐఎస్ఎస్‌కు చేర్చి, గతేడాది జూన్ నుంచి అక్కడే ఉండిపోయిన సునీత, విల్మోర్ తిరిగి తీసుకురావడమే ఈ మిషన్ లక్ష్యం.

15న హోలీ కారణంగా హిందీ పరీక్ష రాయలేని వారికి మరో అవకాశం: సీబీఎస్ఈ

న్యూఢిల్లీ: ఈ నెల 15వ తేదీన హోలీ పండుగ కారణంగా హిందీ పరీక్ష రాయలేని 12వ తరగతి విద్యార్థులకు మరో అవకాశం ఇస్తామని సీబీఎస్ఈ గురువారం తెలిపింది. 'దేశంలోని చాలా ప్రాంతాల్లో 14న హోలీ పండుగ జరగనుంది. కొన్ని చోట్ల 15వ తేదీన ఈ పండుగ జరుపుకోనున్నారు లేదా 15వ తేదీన కూడా కొనసాగనుంది. పండుగ కారణంగా 15వ తేదీన హిందీ పరీక్ష రాయలేని 12వ తరగతి విద్యార్థుల కోసం మరో రోజు పరీక్ష నిర్వహిస్తాం'అని సీబీఎస్ ఎగ్జామినేషన్ కంట్రోలర్ సన్యం భరద్వాజ్ చెప్పారు. మిగతా పరీక్షలు షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థుల తోపాటే వీరు కూడా పరీక్ష రాస్తార న్నారు.


సిసోడియా, జైన్‌లపై కేసుకు రాష్ట్రపతి అనుమతి

న్యూఢిల్లీ: ఢిల్లీలో ప్రభుత్వ పాఠశాలల తరగతి గదుల నిర్మాణంలో రూ.2,000 కోట్ల మేర కుంభకోణం జరిగిందన్న ఆరోపణలపై ఆప్ నేతలు మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లపై కేసు నమోదుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అనుమతి మంజూరు చేశారు. ఈ ఆరోపణలపై దర్యాప్తు చేపట్టిన సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సీవీసీ), 2022లో నివేదికను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందజేసింది. భారీగా అవకతవకలు జరిగాయని సీవీసీ అందులో పేర్కొంది. కుంభకోణం జరిగిన సమయంలో ఢిల్లీలోని కేజ్రీవాల్ ప్రభుత్వంలో సిసోడియా, జైన్‌లు మంత్రులుగా ఉన్నారు.

డీ-డాకింగ్ సక్సెస్

- విజయవంతంగా విడిపోయిన స్పెడెక్స్ జంట ఉపగ్రహాలు
- తొలి ప్రయత్నంలోనే సఫలమైన ఇస్రో

సాక్షి బెంగళూరు: ఖగోళంలో భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలకు ఉపకరించే కీలక సాంకేతికతను ఇస్రో విజయవంతంగా పరీక్షించింది. ఇప్పటికే అనుసంధానం(డాకింగ్) ద్వారా ఒక్కటిగా జతకూడిన స్పెడెక్స్ ఉపగ్రహాలను ఇస్రో బుధవారం తొలిప్రయత్నంలోనే విజయవంతంగా వేరు చేసింది. స్పెడెక్స్ ఉపగ్రహాల డీ-డాకింగ్(విడదీత) ప్రక్రియ సజావుగా సాగిందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ గురువారం 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ''చందమామపై పరీక్షలు, మానవ సహిత వ్యోమనౌక ప్రయాణాలు, చంద్రయాన్-4, గగన్‌యాన్ ప్రయోగాలకు బాటలు వేస్తూ ఛేజర్ (ఎస్‌డీఎక్స్01), టార్గెట్ (ఎస్ డీఎక్స్02) శాటిలైట్లతో డీ-డాకింగ్ సాంకేతికతను పరీక్షించాం. ఇస్రో బృందానికి అభినందనలు. ఈ ఘనత ప్రతి ఒక్క భారతీయుడి ఎదను ఉప్పొంగేలా చేసింది'' అని మంత్రి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్‌చేశారు. ఇప్పటికే ఇటీవల డాకింగ్ సాంకేతికతను పరీక్షించి ఆ టెక్నాలజీని అందిపుచ్చుకున్న దేశాల సరసన నిలిచిన భారత్ తాజాగా డీ-డాకింగ్ సాంకేతికతనూ ఒడిసిపట్టి అంతరిక్ష రంగంలో మరోసారి తన సత్తా చాటింది. డాకింగ్ సాంకేతికతను పరీక్షించేందుకు గత ఏడాది డిసెంబర్ 30వ తేదీన ఇస్రో స్పేడెక్స్ మిషన్‌ను ప్రయోగించింది. ఇందులో భాగంగా ఛేజర్ (ఎస్‌డీఎక్స్01), టార్గెట్ (ఎస్‌డీఎక్స్02) శాటిలైట్లను వేర్వేరు కక్ష్యల్లో నింగిలోకి ప్రవేశపెట్టింది. ఇవి కొద్దిరోజుల వ్యవధిలో దశలవారీగా చాలా నెమ్మదిగా ఒకే లక్ష్యంలోకి చేరుకున్నాక వీటి అనుసంధానం(డాకింగ్) కోసం ప్రయత్నించారు. పలుమార్లు విఫలయత్నంచేసి ఎట్టకేలకు ఈఏడాది జనవరి 16వ తేదీన విజయవంతంగా వాటి డాకింగ్‌ను పూర్తిచేసింది. స్పేడెక్స్ మిషన్‌లో భాగంగా వీటిని డీ-డాకింగ్ సైతం చేయాల్సి ఉంది. డాకింగ్‌ను విజయవంతం చేసేందుకు పలుమార్లు ప్రయత్నించిన ఇస్రో.. డీ-డాకింగ్‌ను మాత్రం తొలి ప్రయత్నంలో పూర్తిచేయడం విశేషం. శాటిలైట్లు, మాడ్యూళ్ల వంటి వస్తువులను అంతరిక్షంలో అనుసంధానం చేయగల్గితేనే భవిష్యత్తులో సొంతంగా అంతరిక్ష ప్రయోగ కేంద్రంవంటి వాటిని అంతరిక్షంలో నిర్మించగలం. '' 45 డిగ్రీల కోణంలో 460 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలో అన్‌డాకింగ్ ప్రక్రియను గురువారం విజయవంతంగా పరీక్షించిన నేపథ్యంలో తదుపరి ప్రయోగాలను త్వరలో మొదలుపెట్టబోతున్నాం. విడిపోయాక ఈ రెండు ఉపగ్రహాలు పూర్తి 'ఆరోగ్యవంతం'గా ఉన్నాయి. డీ-డాకింగ్‌కు మార్చి 10 నుంచి 25వ తేదీ వరకు అనువైన సమయం. అందుకే ఈ సమయంలోనే డీ-డాకింగ్ చేపట్టాం. బెంగళూరు, లక్నో, మారిషస్‌లోని గ్రౌండ్ స్టేషన్ల నుంచి నియంత్రిస్తూ ఈ అన్‌డాకింగ్‌ను పూర్తిచేశాం'' అని ఇస్రో ప్రకటించింది. '' ఇస్రో శాస్త్రవేత్తలకు అంతరిక్షంలో కూడా హద్దే లేదు. భారత ఘనత అంతరిక్షంలో మరోసారి ప్రభవించింది. డీ-డాకింగ్‌ను పూర్తిచేసిన ఇస్రో బృందానికి నా అభినందనలు. దేశం సొంతంగా అంతరిక్ష కేంద్రం నిర్మించుకోవాలన్న ప్రధాని మోదీ కల సాకారమయ్యేందుకు ఇస్రో బాటలువేసిందని గర్వపడాల్సిన క్షణమిది'' అని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆనందం వ్యక్తంచేశారు.



డీడాకింగ్ తర్వాత విడిపోయిన ఉపగ్రహాలు

తమిళనాడులో 'రూ'పాయి రగడ

- బడ్జెట్ లోగో నుంచి దేవనాగరి గుర్తు తొలగింపు
- తమిళ అక్షరం 'రూ'ను చేర్చిన స్టాలిన్ ప్రభుత్వం
- ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ.. మూర్ఖపు చర్య అని ధ్వజం

2025 LOGO

చెన్నై: తమిళనాడులో త్రిభాషా వివాదం రగులుకుంటున్న నేపథ్యంలో రాష్ట్ర బడ్జెట్ లోగో నుంచి రూపాయి గుర్తును ప్రభుత్వం తొలగించడం సంచలనాత్మకంగా మారింది. దేవనాగరి లిపిలో ఉండే సింబల్‌ను 2025-26 బడ్జెట్ లోగో నుంచి తొలగించి, తమిళ అక్షరం 'రూ'ను చేర్చారు. బడ్జెట్‌ను తమిళనాడు ఆర్థిక శాఖ మంత్రి తంగం తెన్నరసు శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టబోతున్నారు. బడ్జెట్ లోగోను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. రూపాయిని సూచిస్తూ దేశమంతటా ఉపయోగించే గుర్తు ఇందులో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. తమిళంలో రూపాయిని రూబాయి అంటారు. తమిళ 'రూ' అక్షరం మాత్రమే లోగోలో కనిపిస్తోంది. అంతేకాకుండా 'అందరి కోసం అంతా' అనే మాట చేర్చారు. అధికార డీఎంకే నినాదమైన సమీకృత ప్రభుత్వ మోడల్‌ను ఇది సూచిస్తోంది. బడ్జెట్ లోగో నుంచి దేవనాగరి గుర్తును తొలగించడం పట్ల తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ మూర్ఖుడిలా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. దేవనాగరి గుర్తును మన కరెన్సీ నోట్లపై ముద్రించారని, దేశవ్యాప్తంగా అందరూ ఇదే ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఈ సింబల్‌ను డీఎంకే మాజీ ఎమ్మెల్యే ధర్మలింగం తనయుడైన ఉదయకుమార్ రూపొందించారని గుర్తుచేశారు. అలాంటి సింబల్‌ను బడ్జెట్ లోగో నుంచి మాయం చేయడం ఏమిటని ప్రశ్నించారు. దేవనాగరి సింబల్‌తో ఉన్న 2024-25 బడ్జెట్ లోగోను సోషల్ మీడియాలో ఆయన పోస్టు చేశారు. స్టాలిన్ ప్రభుత్వ తీరు చాలా విచారకరమని బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందరరాజన్ అన్నారు. జాతీయ సమగ్రత, ఐక్యతను డీఎంకే వ్యతిరేకిస్తోందని ఆరోపించారు. ఇప్పటికిప్పుడు లోగోను మార్చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని మండిపడ్డారు. తాజా వివాదంపై డీఎంకే అధికార ప్రతినిధి శరవణన్ అన్నాదురై స్పందించారు. లోగోలో తమిళ అక్షరాన్ని వాడకుండా నిషేధిస్తూ చట్టమేదీలేదని పేర్కొన్నారు. తమిళ అక్షరాన్ని చేరిస్తే తప్పేంటని నిలదీశారు. ఇండియన్ కరెన్సీ సింబల్‌ను 2010 జూలై 10వ తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.

కాల్పుల విరమణకు ఓకే కానీ..

పరిష్కరించుకోవాల్సిన అంశాలున్నాయి: పుతిన్

మాస్కో: నెలల తరబడి రక్తమోడుతున్న ఉక్రెయిన్ రణక్షేత్రాల్లో శాంతి పవనాలు వీయొచ్చనే ఆశలు రేకెత్తుతున్నాయి. అమెరికా ప్రతిపాదించిన '30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం' సుసాధ్యమయ్యేలా ఉందని రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యాఖ్యానించారు. మాస్కో నగరంలో గురువారం పత్రికా సమావేశంలో పుతిన్ మాట్లాడారు. '' తొలుత 30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం జరగాలంటూ అమెరికా చేస్తున్న ప్రతిపాదన అద్భుతంగా ఉంది. సబబైంది కూడా. ఈ ప్రతిపాదనకు మేం సూత్రప్రాయంగా, సైద్ధాంతికంగా అంగీకారం తెలుపుతున్నాం. అయితే యుద్ధంలో ఇంకా పరిష్కరించుకోవాల్సిన అంశాలు ఉన్నాయి. వాటిని చర్చించాలి'' అని పుతిన్ అన్నారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కోఫ్ మాస్కో నగరానికి గురువారం విచ్చేసిన వేళ కాల్పుల విరమణ ప్రతిపాదనకు పుతిన్ సానుకూలంగా స్పందించడం గమనార్హం. ''అమెరికా మిత్రులు, సంబంధిత భాగస్వాములతో రష్యా ఈ విషయమై విస్తృతస్థాయిలో సమాలోచనలు చేయాల్సి ఉంది. ఈ కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పడకుండా, ఉల్లంఘనలు జరక్కుండా చూసుకునే ఒక వ్యవస్థను తొలుత సిద్ధంచేయాలి. దీంతోపాటు ఈ 30 రోజుల కాల్పుల విరమణ సమయాన్ని ఉక్రెయిన్ దుర్వినియోగం చేయకుండా చూడాలి. అంటే ఈ 30 రోజుల్లో సరిహద్దులకు అదనపు బలగాలను మోహరించడం, మరింతగా ఆయుధాలను సమకూర్చుకోవడం వంటివి చేయకుండా నిరోధించాలి. యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపాలనే ప్రతిపాదనలను మేం అంగీకరిస్తాం. అయితే ఈ తాత్కాలిక కాల్పుల విరమణ అనేది శాశ్వత శాంతికి బాటలు వేయాలి. ఈ సంక్షోభానికి మూలాలను తొలగించగలగాలి. యుద్ధానికి శాశ్వతంగా తెరపడాలి'' అని పుతిన్ అన్నారు. సంక్షోభానికి మూలకారణాలను రూపుమాపాలని పుతిన్ గతంలోనూ వ్యాఖ్యానించారు. జెలెన్‌స్కీ సారథ్యంలో కొలువుతీరిన ప్రభుత్వం సైతం సంక్షోభానికి కారణమని పుతిన్ గతంలో పరోక్షంగా అన్నారు. నాటో విస్తరణతోపాటు ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం ఇచ్చే ప్రతిపాదననూ పుతిన్ వ్యతిరేకిస్తున్నారు.



థాంక్యూ ట్రంప్

''ఉక్రెయిన్ సమస్యకు పరిష్కారం వెతికేందుకు శతథా కృషిచేస్తూ, ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టిసారించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నా కృతజ్ఞతలు. ఎంతో మంది ప్రాణాలు పోవడానికి కారణమైన ఈ యుద్ధానికి ముగింపు పలికేందుకు తమ వంతు కృషిచేస్తున్న చైనా, భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా అగ్రనేతలకూ నా కృతజ్ఞతలు'' అని పుతిన్ అన్నారు.

మళ్లీ రష్యా వశమైన సుడ్జా టౌన్

మాస్కో: ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా క్రమంగా పైచేయి సాధిస్తోంది. ఒకవైపు శాంతి ప్రయత్నాలు జరుగుతుండగానే, మరోవైపు ఉక్రెయిన్ ఆధీనంలో ఉన్న తమ భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకుంటోంది. రష్యా సరిహద్దు అయిన కర్స్క్ ప్రాంతంలోని అతిపెద్ద పట్టణం సుడ్జా మళ్లీ రష్యా సేనల చేతుల్లోకి వచ్చింది. అక్కడి నుంచి ఉక్రెయిన్ సైన్యాన్ని తమ బలగాలు తరిమికొట్టినట్లు రష్యా ప్రభుత్వం గురువారం ప్రకటించింది. కర్స్క్‌లోని తమ సైనిక కమాండర్లను రష్యా అధినేత పుతిన్ బుధవారం కలిశారు. ఆ తర్వాత గంటల వ్యవధిలో సుడ్జా టౌన్ రష్యా వశం కావడం గమనార్హం. సుడ్జా పట్టణం ఉక్రెయిన్-రష్యా సరిహద్దుకు అత్యంత సమీపంలో ఉంది. రష్యా పరిధిలోకి వచ్చే ఈ పట్టణాన్ని గతంలో ఉక్రెయిన్ సేనలు ఆక్రమించాయి. ఇక్కడ 5,000 మంది నివసించేవారు. యుద్ధం మొదలైన తర్వాత చాలామంది ఇతర ప్రాంతాలకు వలసవెళ్లారు. యుద్ధంలో తాము కోల్పోయిన భూభాగాన్ని మళ్లీ స్వాధీనం చేసుకోవడం అతిపెద్ద విజయంగా రష్యా సైనిక వర్గాలు భావిస్తున్నాయి. అయితే, దీనిపై ఉక్రెయిన్ అధికార వర్గాలు ఇంకా స్పందించలేదు.

ఢిల్లీ హోటల్‌లో బ్రిటిష్ మహిళపై అత్యాచారం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని మహిపాల్‌పూర్ ప్రాంతంలోని ఓ హోటల్‌లో బ్రిటిష్ మహిళపై వేధింపులు, అత్యాచారం జరిగాయి. ఘటనలకు సంబంధించి పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. బ్రిటన్‌కు చెందిన ఓ మహిళ నెల క్రితం ముంబైకి వచ్చింది. కొంతకాలం గోవాలో కూడా ఉంది. అంతకుముందే, దాదాపు నెలన్నర క్రితం తూర్పు ఢిల్లీకి చెందిన కైలాశ్ (24) అనే వ్యక్తితో సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయం ఏర్పడింది. ఢిల్లీకి వచ్చినప్పుడు ఇద్దరూ కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. మంగళవారం రాత్రి ఆమె ఢిల్లీకి చేరుకుంది. మహిపాల్‌పూర్‌లోని ఓ హోటల్‌లో రూం బుక్ చేసుకుని, అక్కడికి వెళ్లింది. ఆ సమయంలో లిఫ్టులోనే హోటల్ ఉద్యోగి ఒకడు ఆమెను వేధించాడు. అనంతరం, హోటల్‌కు వచ్చిన కైలాస్ రూంలో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత మహిళ బుధవారం పోలీసు లకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు వేధించిన హోటల్ ఉద్యోగిని, కైలాశ్‌ను అరెస్ట్ చేశారు. ఈ మేరకు రెండు వేర్వేరు కేసులు నమోదు చేశారు. నిందితులిద్దరికీ ఎటువంటి సంబంధం లేదని పోలీసులు తెలిపారు. కైలాశ్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇంకెవరినైనా ఇలాగే ట్రాప్ చేశాడా అనే విషయం పరిశీలిస్తున్నారు. ఘటనపై బ్రిటన్ రాయబార కార్యాలయానికి సమాచారం అందించారు.

సైన్యం విజయం ఉత్తదే

- కాల్పులు కొనసాగుతున్నాయి
- పాక్ సైన్యానికి భారీ నష్టం వాటిల్లింది
- జాఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులు మా అధీనంలో ఉన్నారు
- బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ ప్రకటన

ఇస్లామాబాద్: జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేసిన మిలిటెంట్లందరినీ మట్టుబెట్టామంటూ పాకిస్తాన్ సైన్యం చేసిన ప్రకటనను బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) గురువారం ఖండించింది. ఆపరేషన్ ఇంకా ముగియలేదని, సైన్యంపై కాల్పులు కొనసాగుతున్నాయని వెల్లడించింది. యుద్ధక్షేత్రంలో విజయం సాధించినట్లు సైన్యం చెప్పుకుంటోందని, అందులో ఎంతమాత్రం నిజం లేదని వివరించింది. తమ దాడిలో పాక్ భద్రతా బలగాలకు భారీగా నష్టం వాటిల్లినట్లు స్పష్టంచేసింది. ఇప్పటికే పాక్ సైనికులు చాలామంది మరణించారని పేర్కొంది. శత్రువుపై యుద్ధం ఆపే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు బీఎల్ఏ ఒక ప్రకటన జారీ చేసింది. చాలామంది ప్రయాణికులు తమ అధీనంలోనే ఉన్నారని ప్రకటించింది. మంగళవారం 440 మంది ప్రయాణీలకులతో క్వెట్టా నుంచి పెషావర్ వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను బలూచిస్తాన్ మిలిటెంట్లు హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. 33 మంది మిలిటెంట్లను అంతం చేశామని, 21 మంది ప్రయాణికులు, నలుగురు భద్రతా సిబ్బంది మరణించారని, మిగిలిన ప్రయాణికులను క్షేమంగా విడిపించామని పాక్ సైన్యం బుధవారం వెల్లడించింది. అయితే, పాక్ సైన్యం తప్పుడు ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందని బీఎల్ఏ ఆరోపించింది. యుద్ధ నియమాలు, అంతర్జాతీయ నిబంధనలు దృష్టిలో పెట్టుకొని.. రైలులో ఉన్న కొందరు సైనికులను తామే వదిలేశామని వెల్లడించింది. సైన్యం తమపై పోరాటం చేయలేక సామాన్య బలూచ్ పౌరులను వేధిస్తోందని విమర్శించింది. జైళ్లలో ఉన్న తమ మిలిటెంట్లను వదిలిపెడితే రైలులో మిగిలి ఉన్న సైనికులు, ప్రయాణికుల విడుదల చేస్తామని బీఎల్ఏ ప్రతిపాదించింది. తమ మాట వినకపోతే జరగబోయే పరిణామాలకు పాక్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని తేల్చిచెప్పింది. బలూచిస్తాన్‌లో యుద్ధవాతావరణం నెలకొన్న ప్రాంతాలను సందర్శించేందుకు జర్నలిస్టులకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించింది. ఇక్కడి పరిస్థితులు ఏమిటో బాహ్య ప్రపంచానికి తెలియాల్సిన అవసరం ఉందని బీఎల్ఏ స్పష్టం చేసింది.

రన్యా రావు ఇళ్లపై ఈడీ దాడులు

బనశంకరి: బంగారం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన నటి రన్యా రావు, ఆమె సన్నిహితుల ఇళ్లలో గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోదాలు చేపట్టింది. బెంగళూరులోని ల్యావెల్లి రోడ్డులోని రన్యా రావు ఇల్లు, కోరమంగళ, జయనగర, బసవనగుడి తదితర ప్రాంతాల్లోని ఆమె బంధుమిత్రుల నివాసాల్లో అధికారులు సోదాలు జరిపారు. రన్యా రావు విదేశాలకు వెళ్లడానికి విమానం టికెట్లు బుక్ చేసింది ఎవరు, ఈ టూర్లకు సాయం చేసిందెవరు, ఆమె వ్యవహారాల్లో ఎవరెవరి పాత్ర ఎంత? అనే విషయాలను తేల్చడానికి ఈ సోదాలు జరిపిన అధికారులు కొన్ని ఆధారాలు లభ్యమైనట్లు సమాచారం . బంగారం దందా చాలా పెద్దస్థాయిలో, దేశవ్యాప్తంగా ఉండి ఉండొచ్చని ఈడీ అనుమానిస్తోంది. రన్యా రావును కస్టడీలో విచారించిన డీఆర్ఐ అధికారులు ఆమె అప్పుడు, పారిశ్రామికవేత్త తరుణ్ రాజ్‌ను ప్రశ్నిస్తున్నారు. ఆమెపై డీఆర్ఐ కేసు నమోదుచేసి విచారిస్తుండగా, సీబీఐ రంగంలోకి దిగడం తెలిసిందే. ఈ రెండింటి ఆధారంగా తాజాగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ఈ నెల 3న దుబాయ్ నుంచి బెంగళూరులోని కెంపెగౌడ విమానాశ్రయానికి వచ్చిన రన్యా రావు వద్ద డీఆర్ఐ అధికారులు రూ.12.56 కోట్ల విలువైన బంగారం కడ్డీలను స్వాధీనం చేసుకోవడం తెల్సిందే.

థరూర్ సీపీఎంలో చేరబోరు: కారత్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ సీపీఎం పార్టీలో చేరతారంటూ వస్తున్న వార్తలను ఆ పార్టీ తాత్కాలిక సమన్వయకర్త ప్రకాశ్ కారత్ తోసిపుచ్చారు. ఆయన పార్టీ వీడుతున్నట్లు ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదన్నారు. కేవలం కేరళలో స్టార్టప్‌లు సాధిస్తున్న గణనీయమైన ప్రగతి గురించి మాత్రమే మాట్లాడారని చెప్పుకొచ్చారు. శశిథరూర్ సాధారణ వ్యక్తి కాదని ప్రశంసించిన కారత్.. ఆయన నిక్కచ్చి అభిప్రాయాలు కొన్నిసార్లు కాంగ్రెస్‌కు అసౌకర్యాన్ని కలిగిస్తాయన్నారు. కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం సాధిస్తున్న పారిశ్రామికాభివృద్ధిని ప్రశంసిస్తూ థరూర్ గత నెలలో ఓ ఆంగ్ల పత్రికలో వ్యాసం రాశారు. ఇది రాజకీయ దుమారం రేపింది. కాంగ్రెస్ దానిపై ప్రశ్నల వర్షం కురిపించగా.. సీపీఎం వ్యాసాన్ని స్వాగతించింది. అయితే తాను ప్రభుత్వాన్ని ప్రశంసించలేదని, కేవలం స్టార్టప్ రంగంలో రాష్ట్ర ప్రగతిని ఎత్తి చూపానని థరూర్ స్పష్టం చేశారు. ఆ తరువాత మలయాళంలో ఓ పాడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేరళలో పార్టీ నాయకత్వ బాధ్యతలకు తాను అర్హుడినని ప్రకటించారు. సంసిద్ధతను సైతం వ్యక్తం చేశారు. ఈ ప్రకటన కాంగ్రెస్‌లో ఒక వర్గాన్ని కలవరపరిచింది. అయితే తన వ్యాఖ్యలను తప్పుగా చిత్రీకరించారంటూ థరూర్ మీడియాపై మండిపడ్డారు.

పంచాయతీ ఎన్నికల జాప్యం.. సంక్షేమానికి విఘాతం

- అన్ని రాష్ట్రాల్లో సకాలంలో పంచాయతీ ఎన్నికలు జరిపేలా కేంద్రం చర్యలు చేపట్టాలి
- కేంద్రానికి పంచాయతీరాజ్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సులు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పంచాయతీ ఎన్నికల జాప్యం కారణంగా ప్రజాభివృద్ధికి విఘాత కలుగుతోందని పంచాయతీరాజ్ వ్యవహారాలకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆందోళన వ్యక్తంచేసింది. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అనేక అభివృద్ధి నిధులు నిలిచిపోయాయని గుర్తుచేసింది. సకాలంలో ఎన్నికలు నిర్వహించేలా కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ తగు చర్యలు చేపట్టాలని స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసింది. ఈ మేరకు సప్తగిరి శంకర్ ఉలక నేతృత్వంలోని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తమ డిమాండ్ ఫర్ గ్రాంట్స్ (2025-26) నివేదికను బుధవారం పార్లమెంట్‌కు సమర్పించింది. ఇందులో పంచాయతీ ఎన్నికల అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించింది. '73వ రాజ్యాంగ సవరణ ద్వారా అన్ని రాష్ట్రాలు గ్రామ స్థాయిలో ప్రతి ఐదేళ్లకు ఒకసారి పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడం తప్పనిసరి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243ఈ(3) ప్రకారం పంచాయతీ ఎన్నికలను ఆ గ్రామపంచాయతీ కాలపరిమితి ముగిసేలోపు లేదంటే రద్దయ్యాక ఆరు నెలల వ్యవధిలోపు పూర్తి చేయాలి. ఒక రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను సకాలంలో నిర్వహించడం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కచ్చితంగా పాటించాల్సిన రాజ్యాంగపరమైన నిబంధన' అని కమిటీ పేర్కొంది. '' పుదుచ్చేరి (2011), కర్ణాటక (2021), మహారాష్ట్ర (2022), మణిపూర్ (2022), లక్షద్వీప్ (2022), అస్సాం(2023), జమ్మూకశ్మీర్ (2023), లద్దాఖ్ (2023)లలో వివిధ కారణాల వల్ల పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేదు. తెలంగాణ, తమిళనాడు, ఉత్తరాఖండ్‌లలో 2024 ఏడాదిలోనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా ఇంకా నిర్వహించలేదు'' అని కమిటీ తెలిపింది. ఈ విషయంలో సంబంధిత రాష్ట్ర హైకోర్టు, ఎన్నికల కమిషన్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంచాయతీ ఎన్నికలను వీలైనంత త్వరగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశాయని తెలిపింది. పంచాయతీ ఎన్నికలు నిర్వహించడంలో జాప్యం వల్ల గ్రామ అభివృద్ధి ప్రాజెక్టులు, పథకాలకు కోట్ల రూపాయల కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లు ఆగిపోయాయని పేర్కొంది. ''ఈ గ్రాంట్లు, నిధులు మంజూరు పంచాయతీలకు సకాలంలో సాకారం అయి ఉంటే ఆయా గ్రామాల ప్రజలు వివిధ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి ఫలాలను అందుకుని ఉండేవారు'' అని కమిటీ వ్యాఖ్యానించింది. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగని కారణంగా నిధుల లభ్యత లేకపోవడంతో గ్రామాల్లో ప్రజల పరిస్థితి మెరుగ్గా లేదని రాష్ట్రాల పర్యటనల్లో తేలినట్లు కమిటీ పార్లమెంట్ దృష్టికి తెచ్చింది. రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీ ఎన్నికలను సకాలంలో నిర్వహించేలా పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ సత్వరం అత్యున్నత స్థాయి చర్యలు చేపట్టాలని కమిటీ సిఫార్సు చేసింది.

'ఉపాధి'కి నిధులు పెంచాలి

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, కార్మికుల కనీస వేతనాలను పెంచాలని కమిటీ కేంద్రానికి సిఫార్సు చేసింది. ' గతంతో పోలిస్తే 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లోనూ గ్రామీణ ఉపాధి పథకానికి కేటాయింపులు తగ్గాయి. ఇప్పుడు కేవలం రూ.86,000 కోట్ల కేటాయింపులు చేశారు. గ్రామాల్లో తీవ్ర పేదరికం, నిరుద్యోగాన్ని ఎదుర్కొంటున్న గ్రామీణులకు ఉపాధిహామీ పథకం ఇన్నాళ్లూ కీలకమైన రక్షణచక్రంగా నిలిచింది. కరోనా కాలంలో కోట్లాది మంది పేదలను ఈ పథకం ఆదుకుంది. అణగారిన వర్గాలకు ఉపాధిని కల్పించే ఈ పథకాన్ని సమర్థంగా అమలు చేసేందుకు తగినంత బడ్జెట్ కేటాయింపులు చేయడం చాలా అవసరం. అందుకే ఈ పథకానికి కేటాయింపులు సమధికంగా పెంచాలి. ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వ శాఖపై గ్రామీణాభివృద్ధి శాఖ ఒత్తిడి తీసుకురావాలి'' అని కమిటీ సిఫార్సు చేసింది. పెరుగుతున్న జీవన వ్యయం, గ్రామీణ కార్మికుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రోజువారీ వేతన రేట్లు తగిన విధంగా సవరించాలని సూచించింది.

మనోళ్ల కునుకు పాట్లు!



మార్చి 14 ప్రపంచ నిద్ర దినోత్సవం (వరల్డ్ స్లీప్ డే)

బిజీబిజీ జీవితం..
రోజంతా ఏదో ఒక వ్యాపకం..

అలసిన శరీరం పునరుత్తేజం పొందాలంటే సరైన నిద్రే అద్భుతమైన మందు. కానీ మన దేశంలోని దేశంలోని టాప్–10 నగరాల్లోని ప్రజల్లో చాలా మంది నిద్రకు సంబంధించి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సరైన సమయానికి నిద్రపోకపోవడం, బెడ్‌పైకి వెళ్లేముందు ఏదో ఓ వ్యాపకం ముందేసుకోవడం వంటివి దీనికి కారణంకాగా.. ఆ వ్యాపకాలే అలవాటుగా మారి అవి లేకపోతే నిద్రపోలేకపోవడం మరో సమస్యగా మారుతోందని యుగావ్, అమెజాన్ అలెక్సా సంయుక్తంగా ఫిబ్రవరిలో నిర్వహించిన సర్వేలో వెల్లడైంది.

రోజూ రాత్రి 8 తర్వాత నిద్రకు ఉపక్రమిస్తున్నవారు:	రాత్రి 10.30 గంటలు దాటాకే బెడ్‌పైకి వెళుతున్నవారు	దేశంలో రోజూ కచ్చితమైన నిద్ర అలవాటు ఉన్నవారు
86%	53%	52%

నిద్ర నుంచి స్మార్ట్ డివైజెస్ దాకా 'అసిస్టెంట్'

సర్వేలో పాల్గొన్నవారిలో వాయిస్ అసిస్టెంట్ సాయంతో నిద్ర సమయాలను నిర్దేశించుకుంటున్నవారు.

25–34 ఏళ్ల మధ్యవారికంటే.. 35–45 ఏళ్ల మధ్యవారు ఎక్కువగా వాయిస్ అసిస్టెంట్స్‌ను వినియోగించుకుంటున్నారు.

ఒంటరివారు, తల్లిదండ్రులతో ఉన్నవారితో పోలిస్తే.. వివాహమై పిల్లలు ఉన్నవారు నిద్ర సమయాలను నిర్దేశించుకునేందుకు వాయిస్ అసిస్టెంట్లను ఎక్కువగా వినియోగిస్తున్నారు.

45% స్మార్ట్ డివైజెస్‌లో మ్యూజిక్, మెడిటేషన్ మ్యూజిక్, ఆడియోబుక్స్ వినేందుకు, సినిమాలు చూసేందుకు వాయిస్ అసిస్టెంట్‌ను వినియోగిస్తున్నవారు

23% అలారం, రిమైండర్లు పెట్టుకునేందుకు వాయిస్ అసిస్టెంట్స్‌ను వాడుతున్నవారు

22% ఇంట్లో స్మార్ట్ లైట్స్, ఏసీలు, ఆటోమేటెడ్ కర్టెన్లు వంటి స్మార్ట్ పరికరాలను నియంత్రించేందుకు వాయిస్ అసిస్టెంట్స్‌ను వినియోగిస్తున్నవారు

నిద్రకు ముందు పెట్టుకుంటున్న వ్యాపకాలు..

- వీడియోలు చూస్తున్న వారు: **63 శాతం**
- కుటుంబ సభ్యులు, స్నేహితులతో మాట్లాడుతున్నవారు: **59 శాతం**
- సంగీతం, ఆడియోబుక్స్, పాడ్‌కాస్ట్స్ వింటున్నవారు: **58 శాతం**
- సోషల్ మీడియా యాప్స్‌తో గడుపుతున్నవారు: **57 శాతం**
- రిలాక్స్ చేసే పానీయాలు, స్నాక్స్ తీసుకుంటున్న వారు: **34 శాతం**
- నిద్రపోయే ముందే భోజనం, స్నాక్స్ తింటున్నవారు: **21 శాతం**

సాక్షి, సెంట్రల్ డెస్క్

కార్నియాకు మూలకణ చికిత్స

ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు ఆస్ట్రేలియా పేటెంట్



సాక్షి, హైదరాబాద్: కంటిలో అత్యంత కీలక భాగమైన కార్నియా చికిత్సకు హైదరా బాద్‌లోని ఎల్వీప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆవిష్కరించిన సరికొత్త మూలకణ (స్టెమ్‌సెల్ థెరపీ) వైద్య విధానానికి ఆస్ట్రేలియా పేటెంట్ లభించింది. ఈ ప్రత్యేకమైన 'సెల్ కాంపోజిషన్' ఆధారిత చికిత్స ఆప్తాల్మాలజీ, సెల్–బేస్డ్ థెరపీ రంగంలో గొప్ప మైలురాయి అని ఎల్వీపీ వర్గాలు తెలిపాయి. ఈ చికిత్సా విధానానికి భారత్‌లో ఇప్పటికే ఈ సంస్థ పేటెంట్ దక్కించుకుంది. లింబల్ ఎపీథీలియల్, స్ట్రోమల్ సెల్స్ సమ్మిళితంగా రూపొందించిన ఈ కొత్త చికిత్స, వివిధ రకాల జబ్బులతో దెబ్బతిన్న కార్నియాను పునరుద్ధరించటంలో ఉపయోగపడుతుంది. ఈ థెరపీ తయారీ పద్ధతులు, చికిత్సా ప్రయోజనాలకు కూడా ఆస్ట్రేలియా పేటెంట్ లభించింది. ప్రస్తుతం భారత ప్రభుత్వ అనుమతితో క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నాయి. మరింత పరిశోధన పూర్తయ్యాక మాత్రమే ఇది రోగులకు అందుబాటులోకి వస్తుంది. ఈ పేటెంట్ ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ సయన్‌బసు, డాక్టర్ వివేక్‌సింగ్‌లకు మంజూరైంది.

ఆ 50 ఎకరాలు 'భూదాన్'వే..

- ఉత్తర్వులు జారీ చేశామన్న 'భూదాన్'అధికారి నవీన్‌మిత్తల్

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా నాగారంలోని 181, 182 సర్వే నంబర్లలోని 50 ఎకరాలు భూదాన్ యజ్ఞ బోర్డుకు చెందినవేనని హైకోర్టుకు ఆ బోర్డు కాంపిటెంట్ అథారిటీ నవీన్‌మిత్తల్ తెలిపారు. భూదాన్ యజ్ఞబోర్డు అధికారి హోదాలో కక్షిదారుల వాదనలు విన్నామని, అనంతరం ఆ 50 ఎకరాలు 'భూదాన్'వే అంటూ ప్రొసీడింగ్స్ జారీ చేసినట్టు చెప్పారు. అనంతరం తదుపరి విచారణను న్యాయస్థానం ఏప్రిల్ 8కి వాయిదా వేసింది. సర్వే నంబర్ 182లో 10 ఎకరాలకు సంబంధించి ఖాదర్ ఉన్నీసాకు వారసత్వ ధ్రువీకరణ పత్రం జారీ చేశారని, ఈ విషయంలో అప్పటి కలెక్టర్ అమోయ్‌కుమార్, డీఆర్‌వో ఆర్‌పీ జ్యోతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటూ 2024, సెప్టెంబర్ 18న,అక్టోబర్ 26న ప్రభుత్వానికి ఫిర్యాదు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ ఆ భూమిలో వాటా ఉందంటూ నవాబ్ ఫరూఖ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి మరోసారి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా నవీన్‌మిత్తల్ కౌంటర్ దాఖలు చేశారు. 'నవాబ్ మహమ్మద్ హాజీఖాన్ నాగారంలోని భూములను భూదాన్ బోర్డుకు దానం చేశారు. ఆ భూములపై ఆయన వారసులకు ఎలాంటి హక్కులు ఉండవు. ఈ 50 ఎకరాలపై ఎలాంటి లావాదేవీలు జరిగినా అవి చెల్లవు. ఈ భూములపై హైకోర్టు స్టే ఇచ్చినందున సర్వే నంబర్ 181, 182లను నిషేధిత జాబితాలో చేర్చాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించాం. తీర్పు వచ్చాక.. రికార్డులను కూడా సవరించి, భూదాన్ భూమిగా చేర్చాలని చెప్పాం' అని కౌంటర్‌లో పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణ ఏప్రిల్ 8కి వాయిదా వేశారు.

ఆర్టీసీ ఏడేళ్ల వినతి బుట్టదాఖలు..

ఆరాంఘర్ స్థలం పోలీసుకు!

అక్కడి 16 ఎకరాల ప్రభుత్వ స్థలంలో భారీ బస్ టెర్మినల్‌కు ఏడేళ్లుగా ఆర్టీసీ విన్నపం

- నిత్యం 700 జిల్లా, అంతర్రాష్ట్ర బస్సులు, 1,500 సిటీ బస్సుల నిలిచే చోటు
- బస్టాండ్ నిర్మిస్తే ఆ బస్సులన్నీ సిటీలో వెళ్లకుండా ఇక్కడే నిలిచే వీలు
- ఆ స్థలం పరేడ్ మైదానం కోసం పోలీస్ శాఖకు ఇవ్వడానికి సిద్ధమవుతున్న ప్రభుత్వం



ఆరాంఘర్ కూడలిలో బస్టాండ్ ప్రతిపాదిత స్థలం

సాక్షి, హైదరాబాద్: అది ఆరాంఘర్ కూడలి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, ఏపీలోని రాయలసీమ జిల్లాలు, బెంగళూరు, రాయచూర్‌తోపాటు, సిటీలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు వస్తారు. కానీ వారికి నిలువ నీడ కూడా ఉండదు. మూత్రశాలలుండవు, మంచినీళ్లు దొరకవు. దీంతో అక్కడి డిమాండ్, ప్రయాణికుల కష్టాల దృష్ట్యా ఎంజీబీఎస్ తర్వాత అంతపెద్ద బస్టాండ్ కట్టాలని ఆర్టీసీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అయితే ఆ స్థలాన్ని ప్రభుత్వం పోలీస్ పరేడ్ మైదానం కోసం కేటాయించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

నగరంలో కీలక కూడలి

శంషాబాద్ ప్రధానరోడ్డు మీద ఉన్న ఆరాంఘర్ ప్రాంతం ఇప్పుడు నగరంలో కీలక కూడలి. పాలమూరుతోపాటు ఏపీలోని రాయలసీమ, కర్ణాటకలోని బెంగళూరు, రాయచూర్ తోపాటు, సిటీలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులు అన్నీ కలిపి నిత్యం 2,200 బస్సుల్లో వేలాది మంది ప్రయాణికులు తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు జమ అవుతారు. దీంతో ఈ ప్రాంతమంతా ప్రయాణికులతో కిక్కిరిసిపోతుంది. ఎంజీబీఎస్ దూరంగా ఉన్నవారు బస్సుల కోసం ఇక్కడికే వస్తారు. అలాంటి చోట వేలాదిమంది ప్రయాణికులు రోడ్డుమీదనే బస్సుల కోసం నిలబడాల్సి రావటం, వారి కోసం బస్సులు ఆగటం వల్ల అక్కడ మరింత రద్దీ ఏర్పడుతోంది. మహాలక్ష్మి పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య కూడా రెట్టింపు అయ్యింది. సరిగ్గా ఆ బస్టాప్‌ను ఆనుకునే ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ వెల్ఫేర్‌కు చెందిన 14 ఎకరాల ఖాళీ స్థలం ఉంది. మానసిక ఇబ్బందులున్న చిన్నారుల కోసం అక్కడ ఓ కేంద్రం నిర్వహణకు ప్రభుత్వం ఈ స్థలాన్ని గతంలో కేటాయించింది. ఇప్పుడు ఎలాంటి కార్యకలాపాలు లేక ఆ స్థలం ఖాళీగానే ఉంది. అందులో ఏడెకరాలు తమకు కేటాయిస్తే పెద్ద బస్టాండ్ నిర్మిస్తామని, నగరంలో మూడో పెద్ద బస్ టెర్మినల్ అందుబాటులోకి వస్తుందని ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి ఏడేళ్ల క్రితం విన్నవించారు. ఈ బస్టాండ్ నిర్మాణం వల్ల నిత్యం దాదాపు 700 బస్సులు సిటీలోకి వెళ్లాల్సిన అవసరం ఉండదని, ఇక్కడి నుంచే మొదలై, ఇక్కడే ట్రిప్పులు ముగించుకుంటాయని, దీనివల్ల సిటీలో ట్రాఫిక్ సమస్యకు కొంత విరుగుడు లభిస్తుందని, ఆ బస్సుల కోసం నగరంలోకి ఆటోలు, క్యాబ్‌లు, ద్విచక్రవాహనాల్లో వెళ్లేవారు కూడా తగ్గిపోయి ఆ రూపంలో కూడా ట్రాఫిక్‌పై భారం తగ్గుతుందని అధికారులు ఆ ప్రతిపాదనలో పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వం కూడా కొంత సానుకూలత కనబరిచింది. రెండేళ్లుగా ఈ భూమి కేటాయించాలంటూ ఒత్తిడి తెస్తున్నారు.

అటు జిల్లా బస్సులు, ఇటు సిటీ బస్సులు

ఆరాంఘర్ కూడలి ఇటు శంషాబాద్, అటు మెహదీపట్నం, మరోవైపు ఓల్డ్ సిటీ, ఇంకోవైపు చాంద్రాయణగుట్ట, సంతోష్‌నగర్..ఇలా కీలక ప్రాంతాలను జోడించేదిగా ఉంది. ఫలితంగా అన్ని దిశల్లో తిరిగే సిటీ బస్సులు నిలిచేందుకు అనువైన ప్రాంతం. ఇక్కడే నిత్యం 700 జిల్లా సర్వీసులు ఆగుతున్నాయి. బస్‌టెర్మినల్ నిర్మిస్తే ఇటు 700 జిల్లా, అంతర్ రాష్ట్ర బస్సులు, 1,500 సిటీ బస్సులు ఆ టెర్మినల్‌లోనే నిలిపేందుకు వీలుంటుంది. దూరంగా టెర్మినల్ నిర్మిస్తే అన్ని మార్గాల్లో తిరిగే సిటీ బస్సులు అక్కడకు రావటం సాధ్యం కాదు.

ఉస్మానియా ఆస్పత్రి తరలింపుతో..

ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవనం నిర్మించేందుకు ప్రభుత్వం గోషామహల్‌లోని పోలీసు మైదానంలో దాదాపు 25 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. దీంతో పోలీసుశాఖ అవసరాలకు అక్కడ స్థలం తక్కువవుతోంది. అందుకే మరోచోట ప్రత్యామ్నాయ భూమిని కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థలం కోసం అన్వేషించి, చివరకు ఆరాంఘర్‌లోని స్థలాన్ని కేటాయించాలన్న అభిప్రాయానికి వచ్చింది. పోలీసు మైదానం కోసం ఎక్కడైనా స్థలం ఇవ్వొచ్చు. అయితే, ఆర్టీసీ బస్టాండ్‌ను మాత్రం ఆరాంఘర్‌లో ప్రస్తుత కూడలి ప్రాంతంలోనే నిర్మించాలి. కొన్నేళ్లుగా ప్రయాణికులు అక్కడకే వచ్చి బస్సెక్కుతున్నారు. బస్సులు నిలిపేందుకు కూడా అది అనువైన ప్రాంతం. దీంతో ప్రతిపాదిత స్థలంలో బస్టాండ్ నిర్మిస్తేనే దాని లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరినట్టవుతుంది.

ఏపీఎల్‌కు గ్రీన్ రేషన్ కార్డులు

దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నవారికి జారీ
- తెల్ల రేషన్ కార్డు స్థానంలో 3 రంగుల స్మార్ట్‌కార్డు
- వచ్చే నెల నుంచి చిప్‌తో కూడిన కార్డుల పంపిణీ
- సన్న బియ్యం పంపిణీ మే నెల నుంచే..
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్) ఉన్నవారితోపాటు దారిద్ర్యరేఖకు ఎగువన (ఏపీఎల్) ఉన్నవారికి కూడా రేషన్‌కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఏపీఎల్ వారికి ఇచ్చే రేషన్‌కార్డులపై సబ్సిడీతో కూడిన ఎలాంటి సరుకుల సరఫరా ఉండదు. వారికి సన్నబియ్యాన్ని ఇవ్వాలని భావిస్తున్నా.. బియ్యం సేకరణ ధర, నిర్వహణ చార్జీలను కలిపి రేషన్ షాపుల్లో విక్రయించాలని యోచిస్తోంది. ఈ అంశాన్ని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీ లాబీల్లో తనను కలిసిన మీడియాకు చెప్పారు. ప్రస్తుతం ఉన్న తెల్లరేషన్ కార్డులను మూడు రంగుల్లో జారీచేయాలని, గులాబీ కార్డులను గ్రీన్‌కార్డులుగా మార్చాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఏపీఎల్‌కు ఇచ్చే కార్డులు ప్రస్తుతానికి గుర్తింపుకార్డులుగా మాత్రమే ఉపయోగపడతాయని అన్నారు. ఉచితంగా సన్నబియ్యం ఇచ్చే కార్డులపై ఎవరెవరి ఫొటోలు ఉండాలన్నది ప్రస్తుతానికి బయటపెట్టలేమని పేర్కొన్నారు.

స్మార్ట్ కార్డుల కోసం టెండర్లు

చిప్‌తో కూడిన స్మార్ట్ రేషన్‌కార్డుల కోసం టెండర్లు ఆహ్వానించినట్లు మంత్రి ఉత్తమ్ చెప్పారు. కార్డుల డిజైన్ కూడా పూర్తయిందని తెలిపారు. వచ్చేనెలలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు చెప్పారు. సన్న బియ్యం పంపిణీకి ఇంకా పూర్తిస్థాయిలో సమాయత్తం కాలేదని.. మే నుంచి బియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఖరీఫ్ సీజన్‌లో 155 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అయితే.. రబీ సీజన్‌లో 80 నుంచి 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేసినట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల దేశవ్యాప్తంగా సన్న బియ్యం ధరలు పడిపోయాయని మంత్రి వ్యాఖ్యానించారు. తెలంగాణలో సన్నబియ్యం కిలో రూ.60 – 65 వరకు ఉంది కదా? అని ఒక విలేకరి ప్రశ్నించగా.. అవి మరీ ఖరీదైన బియ్యం అయి ఉండవచ్చని పేర్కొన్నారు.


నాణ్యత లేకుంటే నేషనల్ వేస్ట్

కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం 80 కోట్ల మందికి ఉచితంగా ఇస్తున్న బియ్యం తినే స్థితిలో లేకపోతే.. అదంతా జాతీయ వ్యర్థంగా (నేషనల్ వేస్ట్) మారుతుందని సీఎం రేవంత్‌రెడ్డి, తాను ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషిని కలిసినప్పుడు చెప్పామని ఉత్తమ్ తెలిపారు. రేషన్ షాపుల్లో ప్రస్తుతం దొడ్డు బియ్యానికి ఇస్తున్న సబ్సిడీతోపాటు సన్నబియ్యానికి అదనంగా అయ్యే వ్యయాన్ని కూడా ఇవ్వాలని కేంద్రమంత్రిని కోరితే ఆయన సానుకూలంగా స్పందించి, ప్రతిపాదనలు పంపాలని కోరినట్లు వెల్లడించారు. దొడ్డు బియ్యానికి కిలో దాదాపు రూ.33 పైగా వ్యయం అవుతుంటే, సన్నబియ్యానికి కిలో రూ.47 వరకు అవ్వొచ్చని పేర్కొన్నారు.

అప్పుడే భగభగలు

రాష్ట్రంలో అధిక స్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు
మార్చి రెండో వారంలోనే 40 డిగ్రీల కంటే అధికంగా నమోదు
రానున్న మూడు రోజులు ఇదే తరహా వాతావరణం: ఐఎండీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయి. మార్చి రెండో వారంలో నమోదు కావాల్సిన సాధారణ ఉష్ణోగ్రతల కంటే అధికంగా నమోదవుతున్నాయి. ఈసారి వేసవిలో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీచేసింది. వాస్తవానికి మార్చి మొదటి వారం నుంచి వేసవి సీజన్‌గా పరిగణిస్తారు. ఈ క్రమంలో మార్చిలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయి. కానీ గత రెండ్రోజుల్లో వాతావరణంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4.4 డిగ్రీల సెల్సియస్ వరకు అధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఆదిలాబాద్‌లో సగటు ఉష్ణోగ్రతకన్నా 4.4 డిగ్రీలు అధికంగా, నిజామాబాద్‌లో 3.2, భద్రాచలం, హైదరాబాద్, ఖమ్మంలో 3 డిగ్రీలు అధికంగా నమోదైంది. మిగిలిన ప్రాంతాల్లో కూడా దాదాపు 2 డిగ్రీల సెల్సియస్ అధికంగా రికార్డు అయింది. వాతావరణంలో ఒక్కసారిగా చోటుచేసుకున్న మార్పులతో ఉష్ణోగ్రతలు వేగంగా పెరినట్లు ఐఎండీ తెలిపింది. రానున్న మూడు రోజులు ఇదేతరహాలో వాతావరణం ఉంటుందని వివరించింది.



వడదెబ్బతో కూలి మృతి

రాజాపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం సింగారం గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలి బొల్లారం నర్సమ్మ (55) వడదెబ్బతో మృతిచెందింది. నర్సమ్మ గురువారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చింది. దాహం వేయడంతో నీళ్లు తాగింది. ఆ వెంటనే ఆమె అస్వస్థతకు గురైంది. నర్సమ్మను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది.

ఆస్పత్రుల్లో జర్నలిస్టుల హెల్త్ కార్డులు చెల్లడం లేదు

- డిప్యూటీ సీఎం భట్టి దృష్టికి తీసుకెళ్లిన టీయూడబ్ల్యూజే

సాక్షి, హైదరాబాద్: ఆస్పత్రుల్లో హెల్త్‌కార్డులు చెల్లకపోవడంతో జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందే ఆర్థిక స్తోమత లేక ఇప్పటికే పలువురు జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ప్రభుత్వానికి తెలిపింది. గురువారం అసెంబ్లీ లాబీల్లో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి జర్నలిస్టుల సమస్యలపై వినతి పత్రం సమర్పించింది. సమస్యల పరిష్కారానికి భట్టి సానుకూలంగా స్పందించారు. యూనియన్ ప్రతినిధి బృందంతో త్వరలో సమావేశమై సమస్యలపై చర్చిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. డిప్యూటీ సీఎంను కలసిన బృందంలో టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కలుకూరి రాములు, హెల్త్ కమిటీ కన్వీనర్ ఎ.రాజేశ్, హెచ్‌యూజే అధ్యక్షుడు శిగా శంకర్‌గౌడ్, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు రజనీకాంత్ తదితరులు ఉన్నారు.

వర్షాకాలానికి ముందే ఉమ్మడి సర్వే చేయాలి

పోలవరం బ్యాక్‌వాటర్ ముంపు ప్రభావంపై పీపీఏకి తెలంగాణ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణ భూభాగంలో ఏర్పడనున్న మొత్తం ముంపు ప్రభావం, దానికి సంబంధించిన అన్ని అంశాలపై వర్షాలు ప్రారంభం కావడానికి ముందే రెండు రాష్ట్రాల ఆధ్వర్యంలో ఉమ్మడి సర్వే నిర్వహించాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)కి తెలంగాణ రాష్ట్రం విజ్ఞప్తి చేసింది. భద్రాచలం నగరం, ఆలయంతో పాటు 8 అవుట్‌ఫాల్ రెగ్యులేటర్ల వద్ద ముంపు స్థాయిలను గుర్తించాలని కోరింది. పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో కిన్నెరసాని, ముర్రెడువాగులకు ఏర్పడనున్న ముంపు ప్రభావంపై నిర్వహించిన సర్వే తరహాలోనే మిగిలిన 6 వాగులపై ఉండే ప్రభావంపై సర్వే జరపాలని సూచించింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ జి.అనిల్‌కుమార్ ఈ నెల 11న పీపీఏ సీఈఓకి లేఖ రాశారు. బ్యాక్‌వాటర్ ప్రభావాన్ని సరిగ్గా అంచనా వేసేందుకు మళ్లీ రివర్ క్రాస్ సెక్షన్లను గుర్తించాలని కోరారు. మణుగూరు భారజల ప్లాంట్, భద్రాచలం ఆలయంతో సహా ఇతర ముఖ్య ప్రాంతాలకు వరద రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మొత్తం ముంపు ప్రభావాన్ని గుర్తించాలని గత జనవరి 27న జరిగిన సమావేశంలో తాము కోరగా, ఏపీ అధికారులు సహకరించడం లేదన్నారు.

నీటికి ప్రత్యామ్నాయంగా ద్రవ స్ఫటికాలు

- ఎమల్షన్స్‌లో వినియోగానికి విప్లవాత్మక ఆవిష్కరణ
- అమెరికన్ నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో ప్రచురణ

సాక్షి, హైదరాబాద్



సురజిత్ ధారా


సైకత్‌దాస్

సౌందర్య సాధనాలు, ఆహారం, ఔషధాలు, ఇతర పరిశ్రమల్లో ఉపయోగించే ఎమల్షన్ (మిశ్రమం)పదార్థాలకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు మెరుగైన ప్రత్యామ్నాయాన్ని అభివృద్ధి చేశారు. ముఖ్యంగా ఎమల్షన్స్‌లో ఉపయోగించే నీటికి ప్రత్యామ్నాయంగాద్రవ స్ఫటికాలను ఆవిష్కరించారు. ఎమల్షన్స్ నీటి వినియోగం వల్ల కొన్ని ఇబ్బందులున్నాయి. ప్రస్తుత విధానంలో పునర్వినియోగానికి వీలుండదు. దీంతో నీటికి ప్రత్యామ్నాయంగా థెర్మోరెస్పాన్సివ్ ద్రవ స్ఫటికాలను రూపొందించారు. సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ సురజిత్ ధారా, సైకత్‌దాస్, స్లొవేనియాకు చెందిన సయేద్‌నెజాద్ సయేద్‌రెజా, సైమన్ ఓపర్‌ల బృందం వీటిని తయారు చేశారు. ఈ స్ఫటికాలు వేడికి స్పందిస్తాయి. వీటిని అవసరమైనప్పుడు వేడి చేయడం ద్వారా ఎమల్షన్ నుంచి వేరు చేయవచ్చు. మళ్లీ స్ఫటికాలుగానూ మార్చవచ్చు. ప్యాకేజింగ్ పరిశ్రమతోపాటు ఇతర పారిశ్రామిక అవసరాల్లో దీని వినియోగం వల్ల వస్తువుల నాణ్యత, మన్నిక మరింత పెరుగుతుందని వీరు తెలిపారు. వీరి పరిశోధన పత్రం అమెరికాకు చెందిన ప్రసిద్ధ 'నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్'జర్నల్‌లో ప్రచురితం అయ్యింది.

సందేహాలున్నప్పుడు.. శిక్షలు విధించలేం

హత్య కేసులో ట్రయల్ కోర్టు విధించిన యావజ్జీవ శిక్షను రద్దు చేసిన హైకోర్టు
- సాక్షి చెప్పినదానికి, మెడికల్ ఆధారాలకు సారూప్యత లేదని వెల్లడి.. నిందితుడు షంషీర్‌ను విడుదల చేయాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సాక్షులు, మెడికల్ ఆధారాల్లో వ్యత్యాసం ఉండి.. ప్రత్యక్ష సాక్షి చెబుతున్నది సందేహాస్పదంగా ఉన్నప్పుడు శిక్షలు విధించడం సాధ్యం కాదని హైకోర్టు తేల్చిచెప్పింది. ఫిర్యాదు చేసిన తర్వాత అది కోర్టుకు చేరడానికి పదహారున్నర గంటల సమయం పట్టిందని.. ఇంత సమయం ఎందుకు పట్టిందో దర్యాప్తు అధికారి వెల్లడించలేదని వ్యాఖ్యానించింది. ఆలస్యం పరిస్థితులను ప్రశ్నార్థకంగా మారుస్తుందని సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందని పేర్కొంది. ప్రత్యక్ష సాక్షి (పీడబ్ల్యూ 6) వాంగ్మూలం ప్రకారం.. కార్తీక్ చేతిపై షంషీర్ ఖాన్ దాడి చేశాడని.. తలపై దాడి చేసినట్లు పేర్కొనలేదని చెప్పింది. కానీ, పోస్టుమార్టం నివేదిక ప్రకారం.. పుర్రెపై బలమైన గాయం కారణంగా కార్తీక్ మరణించినట్లు ఉందని చెప్పింది. జిల్లా కోర్టు న్యాయమూర్తి ప్రధానంగా అతని వాంగ్మూలంపై ఆధారపడ్డారని అభిప్రాయపడింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని 2018లో ఆదిలాబా ద్ జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేస్తున్నామని తెలిపింది. నిందితుడు షంషీర్‌పై ఇతర కేసులు లేకుంటే వెంటనే విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ కె.సురేందర్, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం తీర్పు వెలువరించింది.

ఫిర్యాదులో పీడబ్ల్యూ 6 ప్రస్తావన లేదు..

పోలీసుల కథనం మేరకు.. 'ఓ అమ్మాయికి సంబంధించిన విషయంలో షంషీర్, కార్తీక్‌కు మధ్య వివాదం తలెత్తింది. దీంతో కాగజ్‌నగర్‌లోని లారీ చౌరస్తాలో కార్తీక్‌ను షంషీర్ కత్తితో దాడి చేసి చంపాడు. 2014, ఫిబ్రవరి 20న కార్తీక్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. రెండు రోజుల తర్వాత షంషీర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.' ఈ కేసు విచారణ చేపట్టిన ఆదిలాబాద్ జిల్లా కోర్టు.. షంషీర్‌కు యావజ్జీవ శిక్ష విధిస్తూ 2018లో తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ షంషీర్ హైకోర్టును ఆశ్రయించాడు. హైకోర్టులో షంషీర్ తరఫున సీనియర్ న్యాయవాది సి.దామోదర్‌రెడ్డి, పోలీసుల తరఫున ఏపీపీ అరుణ్‌కుమార్ వాదనలు వినిపించారు. 'కోర్టుకు పంపిన ఫిర్యాదులో పీడబ్ల్యూ 6 పేరు ప్రస్తావించలేదు. విచారణ సమయంలోనూ అతని పేరు లేదు. పీడబ్ల్యూ 6 చెప్పిన దానికి మెడికల్ ఆధారాలు విరుద్ధంగా ఉన్నాయి. మరణించిన వ్యక్తి తల, మెడపై దాడి జరిగిందని సాక్షి చెప్పలేదు. మెడికల్ ఆధారాల్లో తల, మెడ, ఎడమ చెవిపై గాయాలున్నాయి. ఎడమ మణికట్టు వద్ద కూడా గాయాలున్నాయి. పీడబ్ల్యూ 6 సాక్ష్యాలు సందేహాస్పదంగా ఉన్నాయి. అందువల్ల 2018లో ఇచ్చిన తీర్పును రద్దు చేస్తున్నాం' అని ధర్మాసనం తీర్పు ఇచ్చింది.

న్యాయం గెలిచింది

ఎనిమిదేళ్లుగా జైలు జీవితం గడిపి ఈ రోజే విడుదలయ్యాను. శిక్షా కాలంలో సెంట్రల్ జైలు, వరంగల్‌లో ఓపెన్ జైలు పెట్రోల్ బంకులో పని చేశాను. ఇన్నేళ్లకు మళ్లీ న్యాయం గెలిచిందని నమ్ముతున్నాను. నాకు మద్దతుగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు.

\- షంషీర్ ఖాన్

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం । 14 । మార్చి । 2025




కేసుల పేరుతో కాసులు స్వాహా
సికింద్రాబాద్‌కు చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి (65)ని టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు.. కేసుల పేరు చెప్పి కాసులు దండుకున్నారు. -10లో



నవతరం.. నైపుణ్యం..
మహిళల కళలకు, కష్టానికి ప్రోత్సాహమందిస్తే అద్భుతాలు సృష్టిస్తారు. దీనిని నిజం చేసింది విమెన్ ఎంట్రప్రెన్యూర్స్‌కు మద్దతునిచ్చే రాష్ట్ర ప్రభుత్వ సంస్థ వీ హబ్. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
38.0/22.0
నగరంలో శుక్రవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 38, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం పేర్కొంది.



నేడే హోలీ.. రంజాన్ రెండో శుక్రవారం

అత్యంత అప్రమత్తమైన నగర పోలీసు విభాగం

సాక్షి, సిటీబ్యూరో: రంజాన్ మాసంలో రెండో శుక్రవారం, హోలీ పండగ ఒకే రోజు రావడంతో నగర పోలీసు విభాగం అత్యంత అప్రమత్తమైంది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో నగర కొత్వాల్ సీవీ ఆనంద్ గురువారం రాత్రి అన్ని విభాగాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దాదాపు 35 ఏళ్ల తర్వాత ఇలా రెండు కీలక ఘట్టాలు ఒకే రోజు వచ్చాయని, నగరంలోని ప్రతి జోన్‌లో ఉన్న కీలక, సున్నిత ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా అసాంఘిక శక్తులపై పటిష్ట నిఘా ఉంచాలని సూచించారు. రంగుల పండగ హోలీ నగర వాసుల జీవితాల్లో సంతోషాలు నింపాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతి భద్రతల విభాగం అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ ఎస్.చైతన్య కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యక్తిగత కార్యదర్శిగా పూజిత



సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అదనపు వ్యక్తిగత కార్యదర్శిగా 2017 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్‌ఎస్) అధికారిణి డాక్టర్ పూజిత బాధ్యతలు స్వీకరించారు. ఆమె స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా వడమాలపేట మండలం కేబీఆర్ పురం. తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కాలేజీ నుంచి ఎంబీబీఎస్ పూర్తి చేసిన పూజిత.. ఏడాది పాటు రుయా ఆస్పత్రిలో హౌస్ సర్జన్‌గా సేవలు అందించారు. సివిల్స్‌లో 282 ర్యాంక్ సాధించి ఐఆర్‌ఎస్‌కు ఎంపికయ్యారు. పూజిత భర్త మోహన్‌కృష్ణ భారత వాయుసేనలో స్క్వాడ్రన్ లీడర్‌గా పని చేస్తున్నారు. పూజిత ప్రతిభా పాటవాలు తెలుసుకున్న బండి సంజయ్ మహిళా అభ్యున్నతి, మహిళల భద్రతా అంశాల్లో సేవలు వినియోగించుకోవడానికి ఎంపిక చేసుకున్నారు.



బేగంబజార్‌లో రంగు పడింది!

నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఒకరోజు ముందే రంగుల పండగ సంబరాలు అంబరాన్నంటాయి. శుక్రవారం అంతటా హోలీ ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో బేగంబజార్ తదితర ప్రాంతాల్లో గురువారమే రంగుల్లో మునిగితేలారు. ఒకరిపై ఒకరు కలర్స్ చల్లుకుని హోలీని ఆనందోత్సాహాల మధ్య జరుపుకొన్నారు.



కామ దహనం
గురువారం రాత్రి అత్తాపూర్ శ్రీలక్ష్మీ నగర్ కాలనీలో కామ దహనం చేస్తున్న నందన వనం అపార్ట్‌మెంట్ వాసులు

విస్తరణ సరే.. విధులెలా?

హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌కు సిబ్బంది కొరత

- ప్లానింగ్ విభాగంలో అనుమతులకు జాప్యం
- నిర్మాణరంగం కుదేల్ కావడంతో ఆదాయానికి గండి
- ట్రిపుల్ ఆర్ వరకు విస్తరించినా ప్రయోజనం శూన్యమే
- విస్తరణ విధులపై హెచ్‌ఎండీఏ మల్లగుల్లాలు

సాక్షి, సిటీబ్యూరో:

హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ)కు సిబ్బంది కొరత ప్రస్తుతం అతి పెద్ద సవాల్‌గా మారింది. కొంతకాలంగా వివిధ విభాగాల్లో తగిన సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు లేకపోవడంతో ఫైళ్ల పరిష్కారంలో జాప్యం నెలకొంది. ఎల్ఆర్‌ఎస్ వంటి పథకాన్ని ఏడాది క్రితమే ప్రారంభించినప్పటికీ అరకొర సిబ్బందితో ఒక అడుగు ముందుకు, నాలుగడుగులు వెనక్కు అన్నట్లుగా మారింది. లక్షలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా హెచ్‌ఎండీఏ పరిధిని రీజినల్ రింగ్‌రోడ్డు వరకు విస్తరించారు. దీంతో 30 శాతానికిపైగా అదనపు పని భారం పడనుంది. ఔటర్ నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు ప్రణాళికాబద్ధమైన నగర నిర్మాణాన్ని లక్ష్యంగా చేసుకొని పరిధిని విస్తరించినప్పటికీ హెచ్‌ఎండీఏను సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రస్తుతం ఉన్న అధికార యంత్రాంగంపై పని ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.

ఆదాయం భారీగా తగ్గే అవకాశం..

నిర్మాణరంగ అనుమతులతో పాటు రహదారులు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా రవాణా వ్యవస్థల విస్తరణ వంటి కీలకమైన విధులు కూడా హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ (హెచ్ఎమ్మార్)లో చేపట్టాల్సి ఉంటుంది. మరోవైపు తాజాగా హెచ్‌ఎండీఏ పరిధి విస్తరించినప్పటికీ బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లు, భారీ లే అవుట్లు వంటి నిర్మాణరంగ అభివృద్ధి అంతా ఔటర్ లోపలే ఎక్కువగా ఉంటుంది. ఔటర్ వెలుపల ఇప్పటికిప్పుడు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు ఉండే అవకాశం లేదు. దీంతో హెచ్‌ఎండీఏ ఆదాయం కూడా భారీగా తగ్గే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో హెచ్‌ఎండీఏ పరిధి విస్తరణ ఆ సంస్థకు ఒక విధంగా బాధ్యతలను పెంచినప్పటికీ విధి నిర్వహణ దృష్ట్యా, ఆదాయ సముపార్జనలో శాపంగానే మారనుందని నిర్మాణరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

పరిధి పెంపు అలంకారప్రాయమేనా?

రెండేళ్ల క్రితం వరకు హెచ్‌ఎండీఏ భారీగా ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. భూముల విక్రయాలతో పాటు హైరైజ్ భవనాలకు అనుమతులు, భూమార్పిడికి అనుమతులు వంటి వివిధ రకాల కార్యక్రమాల వల్ల ఏటా రూ.వేల కోట్ల ఆదాయం వచ్చింది. ఏడాదిన్నర కాలంగా రియల్ ఎస్టేట్‌లో స్తబ్దత నెలకొంది. నిర్మాణ రంగం కుదేలైంది. ఈ పరిస్థితుల్లో దాని పరిధిని పెంచినంత వేగంగా ఆదాయ మార్గాలు విస్తరించుకోవడం సాధ్యం కాదనే అభిప్రాయం వినిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో పరిధి పెంపు అనేది కేవలం అలంకారప్రాయంగానే మారనుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అరకొర సిబ్బందితో ఇబ్బంది..

హెచ్‌ఎండీఏలో కీలకమైన ప్రణాళికా విభాగంలో సిబ్బంది కొరత అతి పెద్ద సమస్యగా మారింది. సుమారు 200 మంది పని చేయాల్సిన ఈ విభాగంలో కనీసం 100 మంది కూడా లేరు. ఈ పరిస్థితుల్లో ఉన్న కొద్దిమందిపైనే పని భారం పెరగనుంది. దీంతో ఫైళ్ల పరిష్కారంలో తీవ్రమైన జాప్యం జరిగే అవకాశం ఉంది. కొద్ది రోజులుగా ఎల్ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనపైనే అధికారులు దృష్టి సారించారు. దీంతో మిగతా ఫైళ్లు పెండింగ్‌లో పడ్డాయి.



విస్తరించినా ఆదాయం అరకొరేనా?

ప్రస్తుతం హెచ్‌ఎండీఏ పరిధి 7,257 చదరపు కిలోమీటర్ల నుంచి 10,472.723 చదరపు కిలోమీటర్లకు విస్తరించనుంది. అలాగే.. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, యాదాద్రి జిల్లాలతో పాటు కొత్తగా నల్లగొండ, నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాలతో కలుపుకొని మొత్తం 11 జిల్లాల్లో 1,355 గ్రామాలు, 104 మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి వస్తాయి. రంగారెడ్డి జిల్లాల్లో కొత్తగా తలకొండపల్లి, ఆమన్‌గల్, మాడుగుల, కడ్తాల్, కేశంపేట్, సంగారెడ్డిలో చౌటకూరు,కొండాపూర్, సదాశివపేట, సిద్దిపేటలో గజ్వేల్, జగదేవ్‌పూర్, రాయపోల్ మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి కొత్తగా వచ్చాయి. అలాగే మెదక్‌లో మాసాయిపేట్, యాదాద్రిలో సంస్థాన్ నారాయణ్‌పూర్, వలిగొండ, రాజంపేట, యాదగిరిగుట్ట, తుర్కపల్లి మండలాలు, వికారాబాద్‌లో కొత్తగా 5 మండలాలు, నల్లగొండలో 4, మహబూబ్‌నగర్‌లో 3 చొప్పున కొత్తగా చేరాయి. నాగర్‌కర్నూల్‌లో వెల్దండ హెచ్‌ఎండీఏ పరిధిలోకి వచ్చింది. ఇలా అన్ని వైపులా పరిధి పెరిగినప్పటికీ ఇప్పటికిప్పుడు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలకు అవకాశం లేదు. పూర్తిస్థాయిలో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం జరిగితే తప్ప ట్రిపుల్ ఆర్ చుట్టూ నిర్మాణరంగం అభివృద్ధికి అవకాశం లేదు. ఇందుకోసం కనీసం మరో 5 ఏళ్లకు పైగా పట్టవచ్చు. మరోవైపు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ట్రిపుల్ ఆర్ వరకు కొత్తగా ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారు. దీంతో హెచ్‌ఎండీఏ పరిధిలోని 36 గ్రామాలు ఈ అథారిటీ పరిధిలోకి వెళ్లనున్నాయి. ఆ విధంగా కూడా హెచ్‌ఎండీఏ ఆదాయానికి గండి పడ్డట్లుగానే భావించవచ్చు.

ప్లానింగ్ విభాగంలో అన్ని పనులు సకాలంలో పూర్తి చేయాలంటే కనీసం 100 మంది సిబ్బందిని అదనంగా నియమించాల్సి ఉంటుంది. ఇక రీజినల్ రింగ్ రోడ్డు వరకు విస్తరించడం వల్ల ఇప్పుడు ఉన్న 6 జోన్‌లను 8 నుంచి 10కి పెంచి అందుకు తగిన విధంగా అధికార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ఈ లెక్కన ఒక్క ప్లానింగ్ విభాగంలోనే కనీసం 350 మంది ఇప్పటికిప్పుడు అవసరమని అంచనా.

గాంధీ ఆసుపత్రిలో నిలిచిపోయిన లిఫ్టు

- అరగంట పాటు నరకయాతన
- రోగులు, అటెండెంట్ల ఆక్రందనలు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో గురువారం లిఫ్టు ఆకస్మికంగా ఆగిపోవడంతో రోగులతో పాటు పేషెంట్ల సహాయకులు అరగంట పాటు నరకయాతన అనుభవించారు. గాంధీ ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనలో పాలన యంత్రాంగం విఫలమవుతోందనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల ఈ ఆసుపత్రిని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆకస్మిక తనిఖీ చేసిన తర్వాత కూడా పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాలేదనేందుకు ఈ ఘటన అద్దం పట్టింది. గురువారం మధ్యాహ్నం గాంధీ ఆసుపత్రి మెయిన్ బిల్డింగ్‌లోని పేషెంట్లు వినియోగించే 4వ నంబర్ లిఫ్టులో 15 మంది గ్రౌండ్ ఫ్లోర్ నుంచి 6వ అంతస్తుకు వెళుతున్నారు. 6వ అంతస్తు రాకముందే సాంకేతిక సమస్య కారణంగా లిఫ్టు ఆగిపోయింది. ఆ సమయంలో లిఫ్టులో 14 మంది అటెండెంట్లు, ఓ పేషెంట్ ఉన్నారు. ఉన్నట్లుండి లిఫ్టు ఆగిపోవడంతో వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. లోపల ఉన్న అలారంను పలుమార్లు నొక్కడంతో లిఫ్టు మధ్యలోనే ఆగిపోయిందని గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది మెయింటెనెన్స్ నిర్వాహకులకు సమాచారం అందించారు. లిఫ్టులోని తమ వారి పరిస్థితి ఎలా ఉందోనని వారి బంధువులు బయట తీవ్ర ఆందోళనకు గురయ్యారు. టెక్నీషియన్ పైకి వెళ్లి మరమ్మతులు చేపట్టడంతో దాదాపు అరగంట తర్వాత లిఫ్టు ఆరో ఫ్లోర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. లిఫ్టు ఆగిపోవడంతో ఆందోళనకు గురయ్యామన్నారు. ఎవరికి ఫోన్ చేయాలో అర్థం కాలేదన్నారు. ఆసుపత్రిలో కాలం చెల్లిన లిఫ్టులను మార్చాలని వారు కోరారు.


బయట నిరీక్షిస్తున్న రోగుల బంధువులు

కబ్జాకు గురైన కట్టు కాలువను పరిశీలించిన హైడ్రా కమిషనర్

సుభాష్‌నగర్: బోబాకాన్ కట్టు కాలువ కబ్జాపై హైకోర్టు ఆదేశాల మేరకు గురువారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ దానిని పరిశీలించారు. దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలోని బోబాకాన్ చెరువు 36 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. చెరువు దిగువ భాగాన తూము నుంచి వెళ్లే రెండు కట్టు కాలువలు సూరారంలోని లింగా చెరువు వరకు ఉన్నాయి. ప్రధాన రోడ్డును ఆనుకొని పైమార్క్, శ్రీరామ అయోధ్య ప్రాంతాల్లో వరద నీరు వెళ్లే 17 గుంటల కట్టు కాలువను కబ్జా చేసి, విల్లాలు, అపార్ట్‌మెంట్లు నిర్మించారు. 2023లో కురిసిన భారీ వర్షానికి దిగువ ప్రాంతానికి వెళ్లేందుకు మార్గం లేక శ్రీరామ అయోధ్య విల్లాలను వరద నీరు ముంచెత్తింది. దీంతో స్థానికంగా ఉన్న రామన్నగారి అఖిలేష్, నర్సింగ్‌రావు ఇల్లు ముంపునకు గురికాగా ఈ విషయమై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో అఖిలేష్, నర్సింగ్‌రావులు కట్టు కాలువ కబ్జాకు గురైందని 2023 నవంబరులో హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయమై ఆరు నెలల్లో కట్టు కాలువ సమస్యను పరిష్కారం చేసి నివేదిక ఇవ్వాలని హైకోర్టు హైడ్రాను ఆదేశించింది. ఈ మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ గురువారం రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో కలిసి కబ్జాకు గురైన కట్టు కాలువను పరిశీలించారు.

హఫీజ్‌పేట్‌లో రంగనాథ్ పర్యటన

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. హఫీజ్‌పేట్ మంజీరా రోడ్డులో ఉన్న కొత్తకుంట చెరువు అభివృద్ధి చేసిన తీరును ఆయన పరిశీలించారు. అనంతరం ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ సర్వే నంబర్ 45 హఫీజ్‌పేట్ గ్రామ సరిహద్దు స్థలాన్ని శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.


బోబాకాన్ కట్టు కాలువ మ్యాప్‌ను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

దొంగలు చెప్పులెత్తుకెళ్లారు

రాత్రి వేళల్లో ఇళ్ల ముందున్న పాదరక్షల అపహరణ

- మలక్‌పేట పీఎస్ పరిధిలో చోరీలు
- నాలుగు అపార్ట్‌మెంట్లలో ఆగంతకుల చేతివాటం..

పోలీసులకు బాధితుల ఫిర్యాదు

మలక్‌పేట: బంగారం, డబ్బులు, బైక్‌లు, ఇతర విలువైన వస్తువుల కోసం దొంగతనాలు, దోపిడీ జరగడం సాధారణంగా చూస్తుంటాం. కానీ.. అందుకు భిన్నంగా కొందరు ఆగంతకులు అపార్ట్‌మెంట్లలో చొరబడి దొరికిన కాడికి చెప్పులు దొంగతనం చేస్తున్నారు. చెప్పులే కదా ఎవరూ పట్టించుకోరు.. లేదా చెప్పులు అమ్ముకుంటే లాభం అనుకున్నారో ఏమో. ముగ్గురు, నలుగురు యువకులు కలిసి ముఠాగా ఏర్పడి చెప్పుల దొంగతనానికి పాల్పడుతున్నారు. వారు చెప్పులు, షూస్ తప్ప ఇతర వస్తువులు ముట్టుకోకపోవడం గమనార్హం. వివరాలు ఇలా ఉన్నాయి..

మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూసారంబాగ్ డివిజన్ ఈస్ట్ ప్రశాంత్‌నగర్‌లోని మైక్రో హెల్త్‌కేర్ అపార్ట్‌మెంట్‌లో గురువారం తెల్లవారుజామున చెప్పులు చోరీకి గురయ్యాయి. అపార్ట్‌మెంట్‌లోని ఆరు పోర్షన్లలో చెప్పులు, బూట్లు పొద్దున వరకే మాయమయ్యాయి. దీంతో అపార్ట్‌మెంట్‌వాసులు విస్మయానికి గురయ్యారు. సీసీ ఫుటేజీలు పరిశీలించగా.. ముగ్గురు యువకులు ఆటోలో వచ్చి చెప్పులను మూట కట్టుకుని ఆటోలో వేసుకుని అక్కడ నుంచి వెళ్లిపోయినట్లు రికార్డు అయింది.

పోలీసు అధికారి షూ.. చెప్పులు కూడా..

మైక్రో హెల్త్‌కేర్ లైన్ అపార్ట్‌మెంట్ వెనుక భాగంలోని అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ఓ పోలీసు అధికారి షూస్, చెప్పులు కూడా దొంగతనం చేశారు. నాలుగు అపార్ట్‌మెంట్లలోని చెప్పులు మూట కట్టి ఖాళీగా ఉన్న స్థలంలో పడేశారు. అనంతరం వాటిని తీసుకొచ్చి ఆటోలో వేసుకుని అక్కడినుంచి వెళ్లిపోయారు. చెప్పులు, షూస్ బ్రాండెడ్‌వే అని, చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అపార్ట్‌మెంట్ వాసి రవిప్రసాద్ చావ్లా చెప్పారు.

నెల రోజుల క్రితం ఇదే తరహాలో..

మైక్రో హెల్త్ కేర్ సంస్థ పక్కనున్న అపార్ట్‌మెంట్‌లో కూడా నెల రోజుల క్రితం చెప్పుల దొంగతనం జరిగింది. చోరీపై అపార్ట్‌మెంట్ నివాసి సయ్యద్ మహబూబ్ బాషా మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అపార్ట్‌మెంట్‌లోని 6 ఫ్లాట్లలో మొత్తం 30 జతల బూట్లు, 25 జతల చెప్పులు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ తెలిపారు.



అపార్ట్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న పాదరక్షల స్టాండ్, చెప్పుల మూటను ఆటోలోకి తీసుకెళ్తున్న ఆగంతకులు

ఓటీఎస్‌పై కోటి ఆశలు

ఆస్తిపన్ను వసూళ్లే ప్రధాన లక్ష్యంగా ముందుకు..

- ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యం రూ.2000 కోట్లు
- ఇప్పటి వరకు వచ్చింది రూ.1578 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యం సాధించేందుకు ప్రభుత్వం ప్రకటించిన వన్‌టైమ్ సెటిల్మెంట్ (ఓటీఎస్) స్కీమ్ ఉపకరించగలదని జీహెచ్‌ఎంసీ అధికారులు భావిస్తున్నారు. గ్రేటర్ నగరంలోనే రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఆస్తులు (భవనాలు) ఉండగా, వాటికి తగ్గట్లుగానే భారీ మొత్తంలో బకాయిలు కూడా పేరుకుపోయాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యం రూ.2 వేల కోట్లు. జీహెచ్‌ఎంసీ ఆదాయ వనరుల్లో ఆస్తిపన్నుదే ప్రధాన భూమిక. జీహెచ్‌ఎంసీలో చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. వాటికి ఎన్నో నిధులు అవసరం. ఆస్తిపన్నును వీలైనంత మేర ఎక్కువ వసూలు చేసేందుకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన మాదిరిగా ఓటీఎస్ సదుపాయం (బకాయిల వడ్డీపై 90 శాతం రాయితీ) కల్పించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడంతో ప్రభుత్వం అవకాశం కల్పించింది. దాని ద్వారా అదనంగా దాదాపు రూ.500 కోట్లు రాగలవని అధికారులు చెబుతున్నప్పటికీ, అంత మొత్తం రావడం కష్టమేనని గత అనుభవాలు చెబుతున్నాయి. ఎంత ఎక్కువొచ్చినా సరే.. దాని ద్వారానే టార్గెట్ చేరుకోగలమని అధికారులు భావిస్తున్నారు.

సంప్రదింపులు.. భవనాలకు తాళాలు..


ప్రభుత్వం ఇచ్చిన ఓటీఎస్ సదుపాయాన్ని వినియోగించుకోవాల్సిందిగా భారీ బకాయిలు పేరుకుపోయిన ప్రైవేటు వ్యక్తులతో పాటు ప్రభుత్వ సంస్థల అధిపతులనూ సంప్రదిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఆస్తిపన్ను వసూళ్ల కోసం సంప్రదింపుల నుంచి మొదలుపెట్టి ప్రైవేట్ భవనాలకు తాళాలు వేస్తూ సీజ్ చేస్తుండటం కూడా తెలిసిందే. ఆదివారాలు సెలవులు కూడా తీసుకోకుండా మిగిలిన సమయాన్ని వినియోగించుకోవాల్సిందిగా కమిషనర్ ఇప్పటికే సర్క్యులర్ జారీ చేశారు. గురువారం సాయంత్రం వరకు రూ.1578 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. ఆర్థిక సంవత్సరం ముగియనున్న దాదాపు రెండువారాల్లో రూ.2,000 కోట్ల కంటే వీలైనంత ఎక్కువ మేర వసూలు చేసేందుకు సంబంధిత అధికారులు కసరత్తు చేస్తున్నారు.

గతంలో ఓటీఎస్ ద్వారా ..

జీహెచ్‌ఎంసీలో భారీ బకాయిలు పేరుకుపోయిన ప్రభుత్వ భవనాలతో పాటు ప్రైవేట్ భవనాలు కూడా ఎక్కువే ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 2400 భవనాల నుంచి దాదాపు రూ.5,500 కోట్ల బకాయిలున్నాయి. దాదాపు ఆరు లక్షల ప్రైవేట్ భవనాల నుంచి రావాల్సిన బకాయిలు రూ.4,000 కోట్లున్నాయి.

ఓటీఎస్ ద్వారా గతంలో రూ.400 కోట్లు

- కోవిడ్ తరుణంలో 2000 సంవత్సరంలో తొలిసారిగా ఓటీఎస్‌ను ప్రకటించారు. ఆ సంవత్సరం కోవిడ్ వల్ల వ్యాపారాలు దెబ్బతినడం, ప్రజలకు ఉపాధి లేకపోవడం వంటి కారణాలతో ప్రభుత్వం ఈ సదుపాయం కల్పించింది. అప్పుడు ఓటీఎస్ ద్వారా రూ. 400 కోట్లు జీహెచ్‌ఎంసీ ఖజానాకు జమయ్యాయి. అప్పుడు రెండు దఫాలుగా ఆ అవకాశం కల్పించారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఆగస్ట్ 1 నుంచి నవంబర్ 15 వరకు, తిరిగి మార్చి నెల ఆ సదుపాయం కల్పించారు.
- 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఓటీఎస్ ఇవ్వలేదు. జీహెచ్‌ఎంసీ విజ్ఞప్తి మేరకు తిరిగి 2022–23లో జూలై 16నుంచి అక్టోబర్ 31 వరకు అవకాశమివ్వగా రూ. 170 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. తిరిగి 2023–24లో ఫిబ్రవరి 28 నుంచి మార్చి 31 వరకు అవకాశమివ్వగా రూ. 320 కోట్లు లభించాయి. తిరిగి మళ్లీ ఇప్పుడు ఆ అవకాశం కల్పించారు. జీహెచ్‌ఎంసీకి మార్చి నెలలో రోజుకు సగటున రూ.2 కోట్ల వరకు వసూలవుతోంది. ఈసారి ఒకే రోజు రూ.5 కోట్ల కంటే ఎక్కువ మొత్తం కూడా వచ్చింది. అయినప్పటికీ వసూలు లక్ష్యం ఇంకా వందల కోట్లలో ఉండటం గమనార్హం. ఇదే సందర్భంలో ఆర్థిక సంవత్సరం చివరి రోజున ఒకే రోజు రూ. 150 కోట్లు వచ్చిన చరిత్ర కూడా జీహెచ్‌ఎంసీకి ఉండటం గమనార్హం.



సాగర్‌లో అత్యవసర పంపింగ్‌కు సన్నాహాలు..!

- డెడ్‌స్టోరేజీకి మరో 11 అడుగుల్లో నీటి మట్టం
- ముందస్తు ఏర్పాట్ల కోసం టెండర్లు ఆహ్వానం
- చర్యలకు ఉపక్రమించిన జలమండలి

సాక్షి,సిటీబ్యూరో: మహానగరానికి తాగునీటిని సరఫరా చేసే నాగార్జున సాగర్ జలాశయంలో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరే అవకాశాలు ఉండటంతో అత్యవసర పంపింగ్ ఏర్పాట్ల కోసం జలమండలి ముందస్తు సన్నాహాలు చేపట్టింది. వేసవి ఆరంభంలోనే సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి 11 అడుగుల దూరంలో ఉండటంతో అత్యవసర పంపింగ్ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జలమండలి అత్యవసర పంపింగ్ కోసం గురువారం టెండర్లను ఆహ్వానించింది. మొత్తం మూడు ప్యాకేజీలో రూ.5.95 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టాలని నిర్ణయించింది. 10 రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి .. ప్రాజెక్టులో నీటి మట్టం ఆధారంగా వర్క్ ఆర్డర్ ఇవ్వాలని యోచిస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా, గురువారం నాటికి 521 అడుగులకు చేరింది. అయితే జలాశయం నీటి మట్టం 510 అడుగులకు పడిపోతే అక్కంపల్లి రిజర్వాయర్‌లోకి గ్రావిటీ ద్వారా రావాల్సిన నీటిని తరలించే పరిస్థితి ఉండదు. సాగర్‌లోని ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుంచి పుట్టంగండి పంప్ హౌస్, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారానే నీటిని సేకరిస్తున్నారు. నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి చేరుకుంటే కృష్ణాజలాల పంపింగ్ నిలిచిపోయి అత్యవసర పంపింగ్ తప్పదు.

రోజువారీగా 0.068 టీఎంసీలు డ్రా..

నగర తాగు నీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ నుంచి గ్రావిటీ ద్వారా ప్రస్తుతం రోజువారీగా 0.068 టీఎంసీల నీటిని తరలిస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 312.01 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 151.470 టీఎంసీలు అందుబాటులో ఉండగా 131.66 టీఎంసీ వరకు నీటి లభ్యత ఉంటుంది. డెడ్ స్టోరేజీ ఉన్నా..2.05 టీఎంసీలను నీటి వాడుకోవచ్చు. అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మొత్తం నీటిమట్టం 1.499 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.201 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది.

వరసగా రెండో సారి

గతేడాది కూడా నాగార్జున సాగర్‌లో అత్యవసర పంపింగ్ ద్వారా నీటిని తరలించారు. మొదట 2017లో సాగర్ జలాశయంలో నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి చేరడంతో అత్యవసర మోటర్లు ఏర్పాటు చేసి ఆ ఏడాది సెప్టెంబర్ వరకు నీటిని పంపింగ్ చేశారు. సరిగ్గా ఎనిమిదేళ్ల తర్వాత గతేడాది నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరడంతో అత్యవసర పంపింగ్ ఏర్పాటు చేసి నీటిని తరలించారు.

భారత సెయిలింగ్ జట్టులో రిజ్వాన్, లాహిరి, వినోద్..

సింగపూర్ యూత్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ టోర్నీకి ఎంపిక



సాక్షి, సిటీబ్యూరో: సింగపూర్ యూత్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే భారత జట్టుకు హైదరాబాద్‌కు చెందిన రిజ్వాన్ మొహమ్మద్ (పాట్టిగడ), లాహిరి కొమరవెల్లి (రసూల్‌పురా), వినోద్ దండు (నల్లగుట్ట) ఎంపికయ్యారు. ఈనెల 14 నుంచి సింగపూర్‌లోని నేషనల్ సెయిలింగ్ సెంటర్‌లో జరిగే ఈ టోర్నీలో 25 దేశాల నుంచి 200 మంది పాల్గొంటుండగా రిజ్వాన్, లాహిరి గోల్డ్ ఫ్లీట్ కోసం ఎంపికయ్యారు. వీరు అండర్-15 ఆప్టిమిస్ట్ క్లాస్ బోట్స్ విభాగంలో పోటీ పడతారు. ఈ టోర్నీలో భారత టీమ్ మేనేజర్‌గా హైదరాబాద్‌కు చెందిన ధరణి లావేటి వ్యవహరించనున్నారు. ఆమె గతంలో జూనియర్ 420 క్లాస్‌లో నేషనల్ చాంపియన్. హైదరాబాద్ కోచ్ సుహీమ్ షేక్ జాతీయ కోచ్‌గా ఈ టోర్నీలో భారత జట్టుకు మార్గనిర్దేశం చేయనున్నాడు. ప్రస్తుతం ఈ బృందం కొంపల్లిలోని సుచిత్ర అకాడమీలో అత్యుత్తమ ఫిట్‌నెస్ కోచ్‌ల నేతృత్వంలో శిక్షణ పొందుతోంది. కాగా, సింగపూర్ చాంపియన్‌షిప్‌లో భారత్ నుంచి మొత్తం 8 మంది సెయిలర్లు పోటీ పడనున్నారు. హైదరాబాద్ సెయిలర్లకు తోడు చెన్నైకి చెందిన నేషనల్ చాంపియన్ శ్రేయా కృష్ణ, భోపాల్‌కు చెందిన సమృద్ధి బాథమ్ కూడా ఈ జట్టులో ఉన్నారు. తమకు ఇది మూడో అంతర్జాతీయ టోర్నమెంట్ అని, యాచ్ క్లబ్‌లో నాణ్యమైన డైట్, యోగా సాధనతో ఫిట్‌నెస్ పెంచుకుని బలంగా తయారయ్యామని రిజ్వాన్, లహిరి తెలిపారు. ఈ టోర్నీలో దేశానికి మంచి పేరు తీసుకురావడమే తమ లక్ష్యమన్నారు. రాష్ట్రం నుంచి అంతర్జాతీయ టోర్నీకి సెయిలర్లు ఎంపికవ్వడం పట్ల తెలంగాణ సెయిలింగ్ సంఘం అధ్యక్షుడు, హైదరాబాద్ యాచ్ క్లబ్ డైరెక్టర్ సుహీమ్ షేక్ సంతోషం వ్యక్తం చేశాడు.

కేసుల పేరుతో కాసులు స్వాహా

- దూషణ నుంచి మనుషుల అక్రమ రవాణా వరకు వినియోగం
- రిఫండ్ చేస్తామని బాధితురాలి నుంచి రూ.23 లక్షలు స్వాహా
- ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్, సీజేఐ పేర్లతో నకిలీ లేఖలు
- సీసీఎస్‌లో కేసు నమోదు



సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్‌కు చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగిని (65) టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు కేసుల పేరు చెప్పి కాసులు దండుకున్నారు. దుర్భాషలాడిన ఆరోపణలపై కేసు నమోదయ్యిందంటూ మొదలెట్టిన కేటుగాళ్లు మనీలాండరింగ్, మనుషుల అక్రమ రవాణా వరకు తీసుకెళ్లారు. మధ్యలో రిజర్వ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా పేర్లతో నకిలీ లేఖలు సృష్టించి పంపారు. రిఫండ్ చేస్తామంటూ ఆమె నుంచి రూ.23 లక్షలు కాజేశారు. నాలుగు వాయిదాల్లో ఈ మొత్తం చెల్లించిన బాధితురాలు ఎట్టకేలకు తాను మోసోయినట్లు గుర్తించి గురువారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..బాధితురాలికి ఇటీవల టెలికాం డిపార్ట్‌మెంట్ అధికారి పేరుతో ఫోన్ వచ్చింది. ఆమె ఆధార్‌కార్డు వినియోగించి సిమ్‌కార్డు ద్వారా అనేక మందిని అసభ్య పదజాలంతో దూషిస్తూ కాల్స్ చేశారని ఈ మేరకు కేసు నమోదైందని చెప్పారు. కాల్‌ను బెంగళూరుకు చెందిన ఎస్సై అంటూ మరో వ్యక్తికి బదిలీ చేశాడు. కొన్ని ప్రత్యేక విభాగాలను మినహాయిస్తే దేశంలో ఏ పోలీస్ స్టేషన్‌లో అయినా ఎఫ్ఐఆర్‌ను దాని సీరియల్ నెంబర్/ఏ ఏడాది విధానంలో నమోదు చేస్తారు. అయితే బాధితురాలికి మాత్రం బీకే354ఏ/0125 నెంబర్‌తో ఎఫ్ఐఆర్ నమోదైందంటూ చెప్పిన నకిలీ ఎస్సై తక్షణం తమ వద్ద హాజరుకావాలని చెప్పాడు. దీంతో షాక్‌కు గురైన ఆమె తాను ఎలాంటి నేరాల్లోనూ పాలు పంచుకోలేదని, వయస్సు రీత్యా బెంగళూరు వరకు ప్రయాణం చేయలేనని వేడుకున్నారు. దీంతో సదరు సైబర్ నేరగాడు ఈ కేసు సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ అయ్యిందని, అక్కడ నుంచి ఓ ఉన్నతాధికారి సంప్రదిస్తారని చెప్పాడు. ఆపై బాధితురాలికి కాల్ చేసిన వ్యక్తి తాను ఐపీఎస్ అధికారినంటూ మాట్లాడాడు. తాము ఢిల్లీలో సదాసత్ ఖాన్ అనే నేరగాడిని పట్టుకున్నామని, అతడి విచారణలోనే బాధితురాలి పేరుతో ఉన్న ఆధార్‌కార్డు, దానికి లింకై ఉన్న బ్యాంకు ఖాతా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపాడు. ముంబైలో తెరిచిన ఆ బ్యాంకు ఖాతాను మనీ లాండరింగ్ కోసం వాడినట్లు చెప్పి భయపెట్టాడు. అదే ఖాతాను మనుషుల అక్రమ రవాణా ముఠాలు వినియోగించాయని చెప్పాడు. ఇన్ని కేసులు నమోదైన నేపథ్యంలో బాధితురాలి పేరును వాటి నుంచి తొలగించడానికి కొంత మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశాడు. ఆ చెల్లింపు అనివార్యం అంటూ రిజర్వ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ పేరుతో రూపొందించిన నకిలీ లేఖ పంపాడు. తన ఖాతాల్లో డిపాజిట్ చేసిన మొత్తాన్ని మూడు రోజుల్లో వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసి రిఫండ్ చేస్తామని నమ్మబలికాడు. దీంతో ఆమె కొంత మొత్తం బదిలీ చేశారు. ఆపై తన డబ్బు రిఫండ్ చేయమంటూ పదేపదే ఫోన్లు చేశారు. ఈసారి సైబర్ నేరగాళ్లు చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా పేరుతో సృష్టించిన మరో లేఖ పంపారు. అందులోనూ నగదు చెల్లించాలని, రిఫండ్ అవుతుందని ఉంది. నిజమని నమ్మిన బాధితురాలు మరికొంత మొత్తం చెల్లించారు. ఇలా నాలుగు దఫాల్లో మొత్తం రూ.23 లక్షలు బదిలీ చేశారు. కొన్ని రోజుల రిఫండ్ విషయం ఆరా తీస్తూ బాధితురాలు ఫోన్ చేయగా... నగదు రిఫండ్ వస్తుందని, ఇది జాతీయ భద్రతకు సంబంధించిన అంశం కావడంతో కుటుంబీకులతో సహా ఎవ్వరికీ చెప్పద్దని చెప్పాడు. ఎవరికి చెప్పినా జైలుకు వెళ్లాల్సి వస్తుందని భయపెట్టాడు. ఎట్టకేలకు తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించడంతో కేసు నమోదైంది.

షాప్ ఎదుట కుర్చీలు వేసుకోవద్దన్నందుకు..

వృద్ధుడిపై పాన్‌షాప్ నిర్వాహకుల దాడి, హత్య

సంతోష్‌నగర్: తన కిరాణా షాపు ముందు కుర్చీలు వేసుకోవద్దన్నందుకు ఓ వృద్ధుడిపై పాన్‌షాప్ నిర్వాహకులు దాడి చేసి హత్య చేసిన సంఘటన గురువారం కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శేఖర్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హఫీజ్‌బాబానగర్ సీ-బ్లాక్ ప్రాంతానికి చెందిన జాకీర్ ఖాన్ (62) స్థానికంగా కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. అతడి షాప్ పక్కనే ఫహీం, అజీమ్ అల్-అరబిక్ పాన్ షాప్ నిర్వహిస్తున్నారు. కొద్ది రోజులుగా కిరాణా దుకాణం ఎదుట కుర్చీలు వేసుకుని ఇబ్బందులకు గురి చేస్తుండటంతో జాకీర్ ఖాన్ పలుమార్లు వారిని మందలించాడు. బుధవారం రాత్రి కూడా ఫహీం, అజీమ్ జాకీర్ ఖాన్ కిరాణా దుకాణం ముందు కుర్చీలు వేసుకుని కూర్చోవడంతో తన గిరాకీ దెబ్బతింటుందని పక్కకు వేసుకోవాలని సూచించాడు. దీంతో ఆగ్రహానికి లోనైన ఫహీం, అజీమ్‌లు జాకీర్ ఖాన్‌పై దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న జాకీర్ ఖాన్ కుమారులు జుబేర్, జీషాన్ అక్కడికి వచ్చి వారిని నిలదీయగా వారిపై సైతం దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన జాకీర్ ఖాన్‌ను చికిత్స నిమిత్తం అపోలో ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు జుబేర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను కడతేర్చిన భర్త



పద్మ (ఫైల్)

రహమత్‌నగర్ : కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి భార్యను హత్య చేసిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రహమత్‌నగర్ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్‌కు చెందిన నరేందర్ స్థానికంగా మిల్క్ బూత్ నిర్వహిస్తున్నాడు. అతడికి భార్య పద్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి కూడా వారి మధ్య మరోసారి గొడవ జరగడంతో ఆగ్రహానికి లోనైన నరేందర్ పద్మ(50)ను గొంతు నులిమి హత్య చేశాడు. గురువారం ఉదయం బోరబండ పోలీసుల ఎదుట లొంగి పోయాడు. సంఘటనా స్థలాన్ని వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్, ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ పరిశీలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

జీహెచ్‌ఎంసీలో ఇంజినీర్ల బదిలీలు

సీఈగా సహదేవ్ రత్నాకర్

ఉన్నతాధికారికి తగ్గిన ఒక పోస్టు

సాక్షి,సిటీబ్యూరో: గత కొన్ని రోజులుగా వివిధ వర్గాలు, పత్రికల్లో వస్తున్న కథనాలతోనో ఏమో కానీ.. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగంలో కొన్ని బదిలీలు చేశారు. ఐదు విభాగాల్లో ఉన్నత పోస్టుల్లో ఉన్న అధికారికి ఇప్పటికే ఒక పోస్టు తగ్గగా, తాజాగా మరో పోస్టు తగ్గింది. ఇద్దరికి గతంలో చేసిన విభాగాలనే తిరిగి అప్పగించారు. బదిలీల్లోనూ మతలబులు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీహెచ్‌ఎంసీ మెయింటనెన్స్ విభాగం సీఈ(ఎఫ్ఏసీ)గా ఖైరతాబాద్ జోన్ ఎస్ఈ సహదేవ్ రత్నాకర్‌ను నియమించారు. ఇప్పటి వరకు మెయింటనెన్స్ విభాగం సీఈ(ఓహెచ్‌ఓపీ)గా ఉన్న ఎస్. భాస్కర్‌రెడ్డి సీఈ(ప్రాజెక్ట్స్, అడ్మినిస్ట్రేషన్)గా బదిలీ అయ్యారు. ఇప్పటికే ఈ బాధ్యతలు (ఎఫ్ఏసీ) ఆయనే నిర్వహిస్తున్నారు. ఎస్ఎన్‌డీపీ(ఎఫ్ఏసీ) సీఈగా ఉన్న ఎం. కోటేశ్వర రావుకు లేక్స్ సీఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో ఎల్‌బీనగర్ ఎస్ఈగా ఉన్న అశోక్‌రెడ్డిని తిరిగి అదేస్థానానికి బదిలీ చేశారు. ఈ విభాగంలోని ఓ ఉద్యోగి ఇటీవల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడటం ఇందుకు కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఎల్‌బీనగర్ ఎస్ఈగా ఉన్న..గతంలో క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎస్ఈగా పనిచేసిన ఎస్.ఎస్. నిత్యానందంను తిరిగి క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎస్ఈగా బదిలీ చేశారు. దాంతో పాటు హౌసింగ్ సీఈగానూ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనతోపాటు ఒక సీఈ చేసుకున్న వినతుల్ని కూడా పరిగణనలోకి తీసుకుని బదిలీలు చేసినట్లు సమాచారం. క్వాలిటీ కంట్రోల్‌లోనే ఒక విభాగానికి ఎస్ఈగా ఉన్న జాకీర్‌హుస్సేన్‌ను క్వాలిటీ కంట్రోల్‌లోనే మరో విభాగానికి బదిలీ చేశారు. హయత్‌నగర్ ఈఈగా ఉన్న డి.ఆశాలతను అంబర్‌పేట ఈఈగా బదిలీ చేయడంతో పాటు సికింద్రాబాద్ జోన్ ఎస్ఈ(ఎఫ్ఏసీ)గా బాధ్యతలు అప్పగించారు. మరికొందరు ఇంజినీర్లను కూడా బదిలీ చేశారు. బదిలీలు చేసే ఉన్నతాధికారే బదిలీలోనూ ఉండటం విశేషం.

పట్టుబడిన వాహనాలను వేలం వేయండి

సాక్షి, సిటీబ్యూరో: రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డివిజన్లలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వెంటనే వేలం వేయించాలని డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ ఆదేశించారు. గురువారం నాంపల్లి ఎక్సైజ్ భవన్‌లోని సమావేశ మందిరంలో రంగారెడ్డి డివిజన్ ఎక్సైజ్ అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శంషాబాద్, సరూర్‌నగర్, మేడ్చల్,, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ల పరిధిలో మద్యం అమ్మకాలకు ఆటంకం కలిగిస్తున్న డ్రగ్స్, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికట్టాలని సూచించారు. పలు కేసుల్లో పట్టుబడిన గంజాయి, డ్రగ్స్‌ను ప్రభుత్వ ఆమోదిత కేంద్రాల్లో కాల్చివేయాలన్నారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయించాలని పేర్కొన్నారు. సమావేశంలో రంగారెడ్డి అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, శంషాబాద్,సరూర్‌నగర్, వికారాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్లు కృష్ణ ప్రియ, ఉజ్వలరెడ్డి, విజయ భాస్కర్ గౌడ్‌లతోపాటు, ఏఈఎస్‌లు పాల్గొన్నారు.

డెయిరీఫామ్ ఎలివేటెడ్‌కు టెండర్లు

సాక్షి, సిటీబ్యూరో: ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫామ్ వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌కు ఆసక్తిగల నిర్మాణ సంస్థల నుంచి హెచ్‌ఎండీఏ టెండర్లను ఆహ్వానించింది. ఈ నెల 25 సాయంత్రం 5 గంటల వరకు ప్రీబిడ్డింగ్ దరఖాస్తులను సమర్పించవచ్చు. 26వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ప్రీబిడ్ సమావేశాన్ని నిర్వహిస్తారు. ఫైనల్ బిడ్డింగ్‌కు వచ్చే నెల 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు దరఖాస్తులను అందజేయవచ్చని హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి డెయిరీ ఫామ్ ఎలివేటెడ్ కారిడార్‌కు తాజాగా అనుమతి లభించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రాజెక్టు పనులను ప్రారంభించేందుకు హెచ్‌ఎండీఏ టెండర్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫామ్ వరకు 5.4 కిలోమీటర్ల కారిడార్ మార్గంలో బేగంపేట విమానాశ్రయం వద్ద సుమారు 600 మీటర్ల పొడవుతో సొరంగ మార్గాన్ని నిర్మించనున్నారు. విమానాల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని ఎలివేటెడ్‌కు ప్రత్యామ్నాయంగా సొరంగ మార్గం నిర్మించాల్సి ఉంటుందని హెచ్‌ఎండీఏ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు ఎయిర్‌పోర్ట్ అథారిటి నుంచి అనుమతి లభించడంతో త్వరలో టెండర్‌ల ప్రక్రియను చేపట్టి పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

తొలి రోజు 15 ఫిర్యాదులు

సాక్షి, సిటీబ్యూరో: నగర వ్యాప్తంగా ఉన్న గుర్తు తెలియని వాహనాలపై సమాచారం ఇవ్వాలంటూ సిటీ ట్రాఫిక్ చీఫ్ జోయల్ డెవిస్ ప్రకటించారు. దీనికి సంబంధించి తొలి రోజైన గురువారం పోలీసులకు 15 ఫిర్యాదులు అందాయి. వీటిపై స్పందించిన అధికారులు ఐదు వాహనాలు తొలగించగా.. మిగిలిన వాటిని తీసుకువెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇలాంటి వాహనాలపై 90102 03626, 87126 60600 నంబర్లకు వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వాలని జోయల్ డెవిస్ సూచించారు.

సినీ దర్శకుడిపై కర్రలతో దాడి..

బంజారాహిల్స్: ప్రమాదకరంగా బైక్‌లపై దూసుకెళ్తున్న యువకులను ఎందుకలా డ్రైవ్ చేస్తున్నారంటూ ప్రశ్నించిన సినీ డైరెక్టర్‌పై స్కూటరిస్టులు కర్రలతో దాడి చేసి గాయపరిచిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్‌నెంబర్-5లో నివసించే సినీ దర్శకుడు మీర్జాపురం అశోక్‌తేజ బుధవారం రాత్రి మాదాపూర్ నుంచి కృష్ణానగర్ వెళ్తుండగా జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-10 నుంచి రెండు బైక్‌లపై నలుగురు యువకులు మద్యం మత్తులో ర్యాష్ డ్రైవ్ చేస్తూ ఓవర్‌టేక్ చేస్తూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్నారు. దీనిని గుర్తించిన అశోక్ తేజ ఎందుకలా స్పీడ్‌గా వెళ్తున్నారని ప్రశ్నించాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న నలుగురు యువకులు అతడిని చుట్టుముట్టి కర్రలతో దాడి చేశారు. వారి బారినుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినా వదిలిపెట్టలేదు. దీనిని గుర్తించిన వాహనదారులు అక్కడికి చేరుకోవడంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. సదరు యువకులు పల్సర్, ఎఫ్‌జెడ్ బైక్‌లపై రాత్రిళ్లు ఆవారాగా తిరుగుతూ, దారిన పోయేవారిని వేధిస్తూ ప్రశ్నిస్తే కొడుతూ అందినకాడికి డబ్బులు లాక్కుంటున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని యువకుడి మృతి

మరొకరికి గాయాలు



తీవ్రంగా గాయపడిన నవీన్‌కుమార్..

దుండిగల్: ముందు వెళుతున్న బైక్‌ను వాటర్ ట్యాంకర్ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా, దుద్దెడ ప్రాంతానికి చెందిన నవీన్‌కుమార్(20), ప్రవీణ్‌కుమార్ గురువారం ఉదయం బైక్‌పై మల్లంపేట్ మంజువైన్స్ రోడ్డులో వస్తుండగా వెనక నుంచి వచ్చిన వాటర్ ట్యాంకర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నవీన్‌కుమార్ మృతి చెందాడు. ప్రవీణ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సిలిండర్‌తో మోది..

- తల్లిని దారుణంగా హత్య చేసిన తనయుడు
- ఆస్తి వివాదాలే కారణం



చంద్రకళ మృతదేహం



నిందితుడు ప్రకాష్

శంషాబాద్: ఆస్తి కోసం ఓ వ్యక్తి కన్న తల్లిని దారుణంగా హత్యచేసిన సంఘటన శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్ బాలరాజు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. రాళ్లగూడ రాఘవేంద్ర కాలనీకి చెందిన చంద్రకళ(60)కు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ప్రకాష్ (35) ఆవారాగా తిరిగేవాడు. గతంలో అతను రెండు పెళ్లిళ్లు చేసుకోగా ఇద్దరు భార్యలు అతడిని విడిచి వెళ్లిపోయారు. ప్రస్తుతం మూడో భార్యతో కలిసి ఉంటున్న అతడికి ఇద్దరు కుమార్తెలు. రాఘవేంద్రకాలనీలోని వంద గజాల ఇంటిలో తన వాటా తనకు ఇవ్వాలని ప్రకాష్ గత కొన్నాళ్లుగా తల్లిపై ఒత్తిడి చేస్తున్నాడు. ఆస్తి పత్రాలు తనకు ఇవ్వాలని వేధిస్తున్నా అతడి ప్రవర్తన సరిగా లేకపోవడంతో తల్లి నిరాకరిస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో పలుమార్లు తల్లితో గొడవ పడటంతో ఆర్‌జీఐఏ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

మద్యం మత్తులో ఘాతుకం...

బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన ప్రకాష్ ఆస్తి పత్రాల కోసం మరోమారు తల్లితో గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో ఆగ్రహానికి లోనైన అతను పక్కనే ఉన్న కర్రతో పాటు గ్యాస్ సిలిండర్‌తో తల్లిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రకాష్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిద్ర మాత్రలు వేసుకుని కారు డ్రైవింగ్

- పలువురికి గాయాలు
- ఛేజ్ చేసి పట్టుకున్న పోలీసులు



సోమశేఖర్‌కు పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసులు

సుభాష్ నగర్ : మొతాదుకు మించి నిద్ర మాత్రలు వేసుకున్న ఓ వ్యక్తి మితిమీరిన వేగంతో కారు నడుపుతూ మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో బీభత్సం సృష్టించాడు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. గుండ్ల పోచంపల్లికి చెందిన అంబు సోమశేఖర్ గురువారం రాత్రి అతివేగంగా కారు నడుపుతూ జగద్గిరిగుట్ట పోలీస్ అవుట్ పోస్ట్ రోడ్డులో ప్రయాణికులను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఓ మహిళతో పాటు చిన్నారి తీవ్రంగా గాయపడ్డారు. అంతటితో ఆపకుండా అతను షాపూర్‌నగర్ లోని డీసీపీ కార్యాలయం ఎదుట మరి కొందరిని ఢీకొట్టాడు. దీంతో స్థానికులు కారును వెంబడించి ఆపేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీనిని గుర్తించిన జీడిమెట్ల ట్రాఫిక్ ఎస్సై సందీప్ అతడిని వెంబడించి సూరారంలోని ట్రాఫిక్ సిగ్నల్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. కాగా సదరు వ్యక్తి మత్తులో ఉండి తను ఏం చేస్తున్నాడో తెలియని పరిస్థితిలో ఉండటంతో అతడిని సూరారం పోలీసులకు అప్పగించారు. వివరాలు సేకరించిన పోలీసులు అతడిని గుండ్ల పోచంపల్లికి చెందిన అంబు సోమశేఖర్ గుర్తించి అతడి భార్య డాక్టర్ సువర్ణకు సమాచారం అందించారు. తన భర్త వ్యాపార పని నిమిత్తం వివేకానంద నగర్‌కు వెళ్లాడని, అప్పుడప్పుడు మోతాదుకు మించి స్లీపింగ్ టాబ్లెట్లు తీసుకోవడంతో తను ఏమి చేస్తున్నాడో తెలియని స్థితిలో ఉంటాడని తెలిపింది. పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు.





రైలు ప్రమాదంపై మాక్‌డ్రిల్

బొల్లారం రైల్వేస్టేషన్‌లో గురువారం దక్షిణమధ్య రైల్వే ఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో కలిసి మాక్ డ్రిల్ నిర్వహించారు. రైలు ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి సహాయ చర్యలు చేపట్టాల్సిన వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది తమ విధి నిర్వహణను ప్రదర్శించారు. యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్‌తోపాటు 22 మంది అధికారులు ఈ మాక్‌డ్రిల్‌లో పాల్గొన్నారు. - సాక్షి, సిటీబ్యూరో



నిమ్స్‌కు 20 వీల్‌చైర్ల వితరణ

లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రిలో రోగులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ (ఏఎంఎస్) డాక్టర్ ఎన్. లక్ష్మి భాస్కర్ తెలిపారు. గురువారం ఆస్పత్రికి నల్గొండకు చెందిన రాఘవేంద్రారెడ్డి 20 వీల్ చైర్లను వితరణ చేశారు. వీటిని ఆయన తన తల్లితో కలిసి నిమ్స్ మెయిన్ బిల్డింగ్ విభాగం వద్ద ఏఎంఎస్ లక్ష్మి భాస్కర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ.. గతంలో తన తల్లి జయప్రదకు నిమ్స్‌లో మెరుగైన వైద్య సేవలను అందించారని..అదే స్ఫూర్తితో ఆస్పత్రిలో రోగుల సౌలభ్యం కోసం వీల్ చైర్లను అందచేస్తున్నట్టు తెలిపారు. అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ..రాఘవేంద్రారెడ్డి లాగానే ఎంతో మంది దాతలు ఆస్పత్రికి వివిధ రూపాల్లో చేయూతనందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం డాక్టర్ హేమంత్, మీడియా ఇన్‌చార్జి సత్యాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ఆధార్ నమోదు



అంగన్‌వాడీ చిన్నారుల ఆధార్ నమోదు చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఫిలింనగర్: షేక్‌పేట మండలం ఫిలింనగర్‌లోని 11 అంగన్‌వాడీల పిల్లలకు గురువారం గౌతమ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆధార్ నమోదు కార్యక్రమం చేపట్టారు. అంగన్‌వాడీల్లో చదువుతున్న 0–5 వయస్సు చిన్నారులకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో ఆధార్ నమోదు పూర్తి చేశారు. సుమారుగా 40 మంది పిల్లల నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేశారు. మరోసారి ఈ క్యాంప్ నిర్వహిస్తామని సంబంధిత అధికారులు వెల్లడించారు. ఆధార్ నమోదుకు విశేష స్పందన లభించింది. అయితే చాలా మంది తల్లులు తమ పిల్లలకు తీసుకువచ్చినా బర్త్ సర్టిఫికెట్ లేక కొంత మందికి తండ్రి ఇంటి పేరు లేక మరికొంత మందికి తండ్రి లేక ఇంకొంత మందికి ఆధార్ నమోదు చేపట్టలేకపోయారు. ఈ ధ్రువపత్రాలు లేనిదే ఆధార్ నమోదు స్వీకరించదు. దీంతో పూర్తి ధ్రువపత్రాలు తీసుకురావాలని అధికారులు తల్లులకు సూచించారు.

బెడ్ లాకర్‌లో దాచిన చెవి కమ్మలు మాయం

వెంగళరావునగర్: లాకర్‌లో దాచిన చెవి కమ్మలు మాయమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరుకు చెందిన లావణ్య మధురానగర్ హాస్టల్‌లో ఉంటూ విద్యనభ్యసిస్తుంది. ఈనెల 3న తన చెవి దిద్దులు తీసి బెడ్ లాకర్‌లో దాచి తాళం వేసింది. అనంతరం 11న వాటిని ధరించడానికి లాకర్ ఓపెన్ చేయగా కనిపించలేదు. అనేక ప్రాంతాల్లో వెదికినా ప్రయోజనం లేకపోవడంతో గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. చెవిదిద్దుల విలువ దాదాపు రూ.30 వేల వరకు ఉంటుందని తెలియజేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు

వెంగళరావునగర్: ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం..గత ఏడాది మార్చిలో శ్యాంలాల్ అనే వ్యక్తి మధురానగర్ పీఎస్ పరిధిలోని ఇంటి అద్దె కోసం వెతుకుతున్నాడు. ఈ క్రమంలో ఓ యువతి పరిచయం అయింది. ఇద్దరూ నెల తర్వాత మంచి స్నేహితులుగా మారారు. అనంతరం అనేకసార్లు శారీరకంగా కలుసుకున్నారు. ఇటీవల ఆమె శ్యాంలాల్ వద్ద తమ పెళ్లి ప్రస్తావన తీసుకురాగా తనకు ముందే పెళ్లయిందని, పిల్లలు కూడా ఉన్నట్టుగా శ్యాంలాల్ చెప్పాడు. అయినప్పటికీ ఆమెను కూడా పెళ్లి చేసుకుంటానని మాట ఇచ్చి తనను మోసం చేశాడని ఆమె మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ అధ్యాపకురాలికి గవర్నర్ అభినందన



మృదులను అభినందినస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

సనత్‌నగర్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్న బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నందవరం మృదులను గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అభినందించారు. రాజ్‌భవన్‌లో గురువారం గవర్నర్‌ను కలిసిన మృదుల ఆమె అందిస్తున్న సర్వీసు వివరాలను వివరించారు. అలాగే కళాశాలలో జరిగే విద్యాత్మక విషయాలను ఆయన ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. దాదాపు రెండు దశాబ్దాల అనంతరం ఉన్నత విద్యా విభాగంలో అత్యున్నత అవార్డును అందుకోవడం, అందులోనూ తెలంగాణ రాష్ట్రం నుంచి ఏకైక అధ్యాపకురాలు జాతీయ స్థాయి గుర్తింపునకు ఎన్నిక కావడం గర్వించదగ్గ విషయమని ఈ సందర్భంగా గవర్నర్ కొనియాడారు.

నీటి దుర్వినియోగంపై..

అధికారుల నజర్

నీరు వృథా చేస్తే రూ.1000 జరిమానా

- 10 రోజుల వ్యవధిలో మూడు కేసులు
- నల్లాలు వదిలే సమయంలో పర్యటించనున్న అధికారులు, సిబ్బంది



బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని ఘర్ ఫ్యామిటీ ట్రస్ట్ అపార్ట్‌మెంట్స్ ఆవరణలో తాగునీటితో కడుగుతున్న సిబ్బంది

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-76లోని రాజరాజేశ్వరి అనే మహిళ ఇంట్లో ఈ నెల 7న తాగునీటి నల్లాల నుంచి పైప్ తీసుకుని ఇంటి ముందు ఆవరణను శుభ్రం చేస్తున్నారు. పెద్ద ఎత్తున తాగునీరు వృథాగా పోతుండడంతో పాటు రోడ్డుపై పారుతుండడంతో స్థానికులు జలమండలి ఫిలింనగర్ సెక్షన్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు అక్కడకు చేరుకుని నల్లా నీళ్లతో పైపుల ద్వారా ఆవరణను కడుగుతున్నట్లు గుర్తించారు. సదరు మహిళలకు రూ.1000 జరిమానా విధించారు.

- జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-71లోని జర్నలిస్ట్‌కాలనీలో యారాత శోభ అనే మహిళ నల్లా నీటితో ఇంటి ఆవరణను శుభ్రం చేస్తుండడంతో పెద్ద ఎత్తున మంచినీళ్ల దుర్వినియోగం అవుతున్నాయని ఈ నెల 12న జలమండలి ఫిలింనగర్ సెక్షన్ అధికారికి ఫిర్యాదు అందగా అధికారులు అక్కడికి చేరుకున్నారు. తాగునీటిని వృథా చేయడమే కాకుండా ఆవరణ కడుగుతున్నట్లుగా గుర్తించారు. దీంతో శోభ అనే మహిళకు రూ.1000 జరిమానా విధించారు.
- బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని సితార గ్రాండ్ ఎదురుగా ఘర్ ఫ్యామిలీ ట్రస్ట్ అపార్ట్‌మెంట్స్‌లో తాగునీటితో ఆవరణను కడుగుతుండగా పెద్ద ఎత్తున నీరు వృథాగా పోతున్నాయంటూ స్థానికులు తట్టిఖానా వాటర్ సెక్షన్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. మేనేజర్ రాంబాబు సిబ్బందితో కలిసి అపార్ట్‌మెంట్ వద్దకు వెళ్లి చూడగా సిబ్బంది మంచినీటితో ఆవరణను శుభ్రం చేస్తూ కనిపించారు. అపార్ట్‌మెంట్ యజమానికి రూ.1000 జరిమానా విధించారు.
- తాగునీరు దుర్వినియోగం చేస్తే జలమండలి అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. వేసవికాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఒకవైపు అధికారులు ప్రణాళికబద్ధంగా నీటి సరఫరా చేస్తుండగా ఇంకోవైపు ఇంటి యజమానులు మాత్రం ఇష్టారాజ్యంగా తాగునీటిని రోడ్ల పైకి వదులుతున్నారు. స్థానికులు కొంతమంది 'ఎక్స్'లో పోస్ట్ చేస్తుండగా, మరికొంత మంది వాట్సాప్ ద్వారా, ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా జలమండలి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో అధికారులు అక్కడికి చేరుకుంటూ నీటిని దుర్వినియోగం చేస్తున్న దృశ్యాలను వీడియో తీస్తూ అక్కడికక్కడే జరిమానాలు విధిస్తున్నారు. మొదటిసారి జరిమానాలు విధించి హెచ్చరిస్తుండగా, రెండోసారి కూడా పట్టుబడితే నల్లా కనెక్షన్ కట్ చేయాలని నిర్ణయించారు. గత 10 రోజుల నుంచి జలమండలి అధికారులు, సిబ్బంది నల్లాలు వదిలే సమయంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. వారం రోజుల క్రితం ఓ యువకుడు తాగునీళ్లతో రోడ్డు పక్కన బైక్‌ను కడుగుతూ దొరికాడు. అధికారులు రూ.1000 జరిమానా విధించారు. చాలా మంది సోషల్ మీడియా వేదికగా ఇలాంటి ఫిర్యాదులు ఫొటోలతో సహా అప్‌లోడ్ చేస్తున్నారు. అధికారులు సైతం తక్షణమే స్పందించి ఘటనా స్థలానికి చేరుకుంటున్నారు. పది రోజుల వ్యవధిలోనే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ వాటర్ సెక్షన్ పరిధిలో నీరు దుర్వినియోగంపై ముగ్గురికి జరిమానాలు విధించారు. వేసవికాలం అయ్యేవరకు నల్లాలు వదిలే సమయంలో సిబ్బంది ఆయా ప్రాంతాల్లో పర్యటించి పైపుల ద్వారా నీటిని బయటకు వదులుతున్న వారిని, బైక్‌లు కడుగుతున్న వారిని, ఆవరణను శుభ్రం చేస్తున్న వారిని గుర్తించే పనిలో పడ్డారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

బంజారాహిల్స్: ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షల సందర్భంగా విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్‌పరిధిలో 35 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో ఏడు కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు రాజ్యమేలుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. మండుతున్న వేసవిలో నీళ్ల సౌకర్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇప్పటికే అధికారులు ఆదేశించారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు తప్పనిసరిగా ఉండాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఇప్పటికే అధికారులు సూచించారు. అయితే చాలా పాఠశాలల్లో మాత్రం సమస్యలు పేరుకుపోయినట్లు తెలుస్తున్నది. కనీసం పరీక్షా కేంద్రాలకు వెళ్లే గేటు వద్దనే పరిస్థితులు అధ్వానంగా ఉన్నట్లు తల్లిదండ్రులతో పాటు విద్యార్థులు ఆకోపిస్తున్నారు. పరీక్షలకు



మరో వారం సమయం ఉండగా ఇప్పటి నుంచే అన్ని పాఠశాలల వద్ద విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఇంకోవైపు ప్రైవేట్‌పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలపై మాల్ ప్రాక్టీస్ కాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కూడా డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

పరీక్షా కేంద్రాలివే..

సెంటర్ కోడ్	పరీక్షా కేంద్రం	విద్యార్థులు
22268	రిచ్‌మండ్స్ స్కూల్, కమలాపురి కాలనీ	226
22269	గతి ప్రభుత్వ పాఠశాల స్కూల్, బంజారాహిల్స్	260
22270	సెయింట్ ఆల్ఫోన్సస్, బంజారాహిల్స్	260
22271	శ్రీసాయిరాం స్కూల్, ఎన్బీటీ నగర్	250
22272	జీజీహెచ్ఎస్, ఎన్బీటీనగర్ బంజారాహిల్స్	250
22273	రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాల, సోమాజిగూడ	250
22274	ఎఫ్ఆర్ రోచ్ మెమోరియల్ స్కూల్, ఖైరతాబాద్	260
22275	షాదన్ స్కూల్, ఖైరతాబాద్	250
22276	నిర్మలా హైస్కూల్, ఖైరతాబాద్	208
22277	మహాత్మగాంధీ మోడల్ స్కూల్, యూసుఫ్‌గూడ	219
22278	యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల	220
22279	రేడియంట్ హైస్కూల్, ఎల్లారెడిగూడ	172
22280	శ్రీ చైతన్య హైస్కూల్, మధురానగర్	220
22281	శ్రీసాయిరాం స్కూల్, కష్ణానగర్	220
22282	శ్రీ సాయి సరస్వతి విద్యానికేతన్, యూసుఫ్‌గూడ	211
22283	గుడ్ సమరిటన్ హైస్కూల్, వీఆర్ నగర్	250
22284	సెయింట్ ఆల్ఫోన్సస్ హైస్కూల్, సిద్దార్థనగర్	240
22285	ప్రభుత్వ పాఠశాల,అమీర్‌పేట	263
22286	సెయింట్ ఆల్ఫోన్సస్ హైస్కూల్ కళ్యాణ్‌నగర్	240
22287	నారాయణ కాన్సెప్ట్ స్కూల్, జూబ్లీహిల్స్ రోడ్ నెం. 5	240
22288	శ్రీ చైతన్య టెక్నో స్కూల్, ఎల్లారెడ్డిగూడ	232
22289	గౌతం మోడల్ స్కూల్, అమీర్‌పేట్	230
22290	రహ్మత్‌నగర్ హైస్కూల్, యూసుఫ్‌గూడ	200
22291	సెయింట్ జోసెఫ్ హైస్కూల్, బోరబండ	200
22292	హైదరాబాద్ సెంట్రల్ హైస్కూల్, ఎర్రగడ్డ	220
22293	ది ఆస్టాయిడ్ రోమ్‌మేమ్ హైస్కూల్, కళ్యాణ్‌నగర్	230
22294	క్యాస్టిల్ టౌన్ హైస్కూల్, రాజీవ్‌నగర్	220
22295	ప్రభుత్వ పాఠశాలనాంపల్లి, బోరబండ	240
22296	శాంతి విద్యానికేతన్ హైస్కూల్, రహ్మత్‌నగర్	197
22297	కృష్ణవేణి టాలెంట్ స్కూల్, యూసుఫ్‌గూడ	193
22298	ప్రభుత్వ పాఠశాల, షేక్‌పేట	220
22299	డైమండ్ జూబ్లీ హైస్కూల్	199
22300	స్టాంఫర్డ్ గ్రామర్ స్కూల్, టోలిచౌకి	200
22301	ప్రభుత్వ పాఠశాల, ఫిలింనగర్	220
22302	ప్రామిసింగ్ హైస్కూల్, టోలిచౌకి	163

కాలనీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

వెంగళరావునగర్: మధురానగర్ కాలనీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ దేదీప్య, జీహెచ్ఎంసీ వీధి దీపాలశాఖ డీఈఈ కవిత అన్నారు. మధురానగర్‌కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గత నాలుగు రోజులుగా కాలనీకి చెందిన మహిళలతో మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, ఫాస్ట్ వాకింగ్ తదితర పోటీలను నిర్వహించారు. ఆయా పోటీలను అసోసియేషన్ కోశాధికారి సుగుణ పర్యవేక్షించారు. అనంతరం రామకృష్ణంరాజు కమ్యూనిటీహాల్‌లో జరిగిన ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ శానిటేషన్ మహిళా



వేడుకల్లో కార్పొరేటర్, జీహెచ్ఎంసీ డీఈఈ, కాలనీ మహిళా నేతల

వర్కర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రతాప్‌రెడ్డి, కోడె సాంబశివరావు, కోశాధికారి సుగుణ, సంయుక్త కార్యదర్శి హనుమంతరావు పాల్గొన్నారు.

బోరబండ సైట్-3 వీకర్ సెక్షన్‌లో చోరీ

రహమత్‌నగర్: బోరబండ పీఎస్ పరిధిలో మరో చోరీ జరిగింది. వారం రోజుల వ్యవధిలోనే రెండు దొంగతనాలు జరగడంతో బస్తీవాసులు ఆందోళన చెందుతున్నారు. బోరబండ సైట్-3 వీకర్స్ సెక్షన్‌లో వెంకట్ తన కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. బుధవారం మధ్యాన్నం ఓ శుభకార్యానికి వెళ్లి సాయంత్రం తిరిగి ఇంట్లోకి రాగా.. అల్మారా తెరిచి ఉంది. అనుమానం వచ్చిన వెంకట్ అల్మారాను తెరిచి చూడగా అందులో దాచిన 10 గ్రాములు బంగారం, రూ. 95 వేల నగదు కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

రక్తదాన శిబిరం



బంజారాహిల్స్: తలసేమియా సికిల్ సెల్ సొసైటీ (టీఎస్‌సీఎస్) ఆధ్వర్యంలో కేఫ్ నీలోఫర్‌లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. టీఎస్‌సీఎస్ సెక్రటరీ ఎంఏ అలీమ్‌బేగ్, కేఫ్ నీలోఫర్ మేనేజర్ శశాంక్ అనుముల, బోర్డు సభ్యుడు మహమ్మద్ అమీన్ తదితరులు పాల్గొన్నారు. ఇక్కడ సేకరించిన రక్త యూనిట్లను తలసేమియా రోగులకు అందించనున్నట్లు వారు తెలిపారు. తలసేమియా రోగులకు రక్త మార్పిడి కోసం దాతలు ముందుకురావాలని కోరారు.

మాదిగలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

వెంగళరావునగర్: సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి ఎం.రామకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం యూసుఫ్‌గూడలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు ఇక నుంచి ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టరాదని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నేతలు సుమోరాజు, సాయి, చిన్న, మహేందర్, పురుషోత్తం, భవానీరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలుడితో అసభ్య ప్రవర్తన.. నిందితుడి అరెస్టు

ఫిలింనగర్: ఆరుబయట ఆడుకుంటున్న ఓ బాలుడిని చాక్లెట్ ఇస్తానని నిర్మానుష ప్రాంతానికి తీసుకువెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బస్తీలో నాలుగేళ్ల బాలుడు ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన వ్యక్తి (40) మాయమాటలు చెప్పి చాక్లెట్ ఇస్తానని చెప్పి తీసుకువెళ్లాడు. నిర్మానుష ప్రాంతానికి తీసుకువెళ్లి బాలుడిపై లైంగిక దాడికి యత్నించాడు. దీంతో బాలుడు తప్పించుకుని కేకలు వేస్తూ అక్కడి నుంచి పరుగులుతీశాడు. బాధిత చిన్నారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని ఫిలింనగర్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ప్రపంచ కిడ్నీ దినోత్సవం



విరించి ఆస్పత్రిలో కిడ్నీ దాతలను సత్కరిస్తున్న వైద్యులు

బంజారాహిల్స్: ప్రతి ఒక్కరూ కిడ్నీల ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ఆస్పత్రి నెఫ్రాలజీ డాక్టర్ కే.ఎస్.నాయక్ అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని విరించి ఆస్పత్రిలో కిడ్నీ దాతలను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేటి తరం యువకులు కూడా కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతూ కిడ్నీ మార్పిడి వరకు పరిస్థితిని తెచ్చుకుంటున్నారని, ఇందుకు కొంత ఆహార అలవాట్లు కూడా కారణమవుతున్నాయన్నారు. కిడ్నీ మార్పిడి, డయాలసిస్‌లో ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు మరింత మెరుగైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని రోగి ఏ దశలో వచ్చినా కూడా వైద్యం అందించేందుకు వైద్యులు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నెఫ్రాలజీ విభాగం వైద్యులు నవీన్‌కుమార్ మట్టివాడ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డెక్కన్ ఆసుపత్రిలో..

పంజగుట్ట: ఆత్మవిశ్వాసం ఉంటే ఎలాంటి వ్యాధినైనా ఎదుర్కొవచ్చునని వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్ట హరిప్రసాద్ అన్నారు. సోమాజిగూడలోని డెక్కన్ ఆసుపత్రిలో ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మూత్రపిండ మార్పిడి కుటుంబాలకు జ్ఞాపికలు అందజేశారు. రోగులకు, వారి కుటుంబాలకు మూత్రపిండాల వ్యాధులపై క్విజ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కట్టా హరిప్రసాద్ మాట్లాడుతూ..వ్యాధి వచ్చింది అని ఎప్పుడూ కుంగిపోకూడదని, వ్యాధి నుంచి ఎలాగైనా బయటపడతా అన్న పట్టుదలతో ఉండాలని సూచించారు. ఆసుపత్రి నెఫ్రాలజీ విభాగం హెడ్ డాక్టర్ వి.రమేష్, నెఫ్రాలజీ వైద్యులు డాక్టర్ సయ్యద్ మహ్మద్ గుఫ్రాన్ పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెడితే..

మాల ఎమ్మెల్యేలు అడ్డుకోవాలి



అభివాదం చేస్తున్న మాల సంఘాలజేఏసీ చైర్మన్ చెన్నయ్య తదితరులు

పంజగుట్ట: శాసనసభలో ఎస్సీ వర్గీకరణపై చట్టం తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తే మాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అడ్డుకోవాలని, తప్పుల తడకగా ఉన్న షమీమ్ అక్తర్ ఇచ్చిన వర్గీకరణ నివేదికను ఎండగట్టాలని మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య డిమాండ్ చేశారు. 10 ఏళ్లుగా నియామకాలు లేక నిరుద్యోగ యువత అల్లాడిపోతుంటే ఇచ్చిన నోటిఫికేషన్ల పరీక్షా ఫలితాలు నిలిపివేయ్యాలం అంటూ మందకృష్ణ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటాలు ఆడుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జేఏసీ వర్కింగ్ చైర్మన్‌లు గోపోజు రమేష్, బూర్గుల వెంకటేశ్వర్లు, మన్నె శ్రీధర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. వర్గీకరణ ద్వారా మాలలకు అన్యాయం జరుగుతున్నా మాల ఎమ్మెల్యేలు ప్రశ్నించకపోతే జాతికి ద్రోహం చేసినవారవుతారని, ఒకవేళ అడ్డుకోకపోతే వారిని రాష్ట్రంలో తిరగనివ్వకుండా తాము అడ్డుకుంటామన్నారు. అసెంబ్లీలో ఈ నెల 18న వర్గీకరణ బిల్లు ప్రవేశపెడుతున్న నేపథ్యంలో బిల్లుకు వ్యతిరేకంగా మాలలు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎం.సరళ, జంగా శ్రీనివాస్, నాను, సత్యనారాయణ, తాలూకా రాజేష్, రమ పాల్గొన్నారు.

మహిళలు వ్యాపార రంగాల్లో అభివృద్ధి సాధించాలి



సమావేశంలో కేవీఐసీ, సెట్విన్ అధికారులు

వెంగళరావునగర్: నేటితరం మహిళలు వంటింటికే పరిమితం కాకుండా తమకు నచ్చిన వ్యాపారాల్లో రాణించాలని ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ డైరెక్టర్ ఎం.ఎన్.సుధాకర్ అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లో ఉన్న సెట్విన్ కార్యాలయంలో కేవీఐసీ, సెట్విన్ సంయుక్త ఆధ్వర్యంలో గత నెల 27 నుంచి ఈనెల 13వ తేదీ వరకు మహిళలకు టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ అందజేశారు. ఈ శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుధాకర్ మాట్లాడుతూ..రాష్ట్రంలోని 12 జిల్లాల నుంచి వచ్చిన మహిళలకు ఇక్కడ ఉచితంగా వసతి కల్పించి, శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ట్రైనింగ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీఐసీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ లంక మనోజ్, అసిస్టెంట్ డైరెక్టర్ శర్మ, సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాలరావు, శిక్షణ కో ఆర్డినేటర్ ఏ.పారిజాతం పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

బంజారాహిల్స్: నేటి ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని సాగర్ సొసైటీ బీజేపీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో ఆయన మాట్లాడారు. మహిళలను గౌరవించుకోవడం మన విధి అని, వారిని కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమారి, బంగారు శృతి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు డా.గౌతమ్‌రావు, రాష్ట్ర నేతలు మేచినేని శ్రీనివాసరావు, వీణారెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు సుభాషిణి, కొత్త నీరజ, కృష్ణవేణి, మాధవి, అనురాధ పాల్గొన్నారు.

అబ్బురపరిచిన వైజ్ఞానిక ప్రదర్శన

శ్రీనగర్‌కాలనీ: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలో ఎంతో దోహదం చేస్తాయని వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. గురువారం శ్రీనగర్ కాలనీలోని బ్లూ బెల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..విద్యార్థి దశ నుంచే ప్రయోగాత్మక విద్యపై మక్కువ పెంచుకోవడం వల్ల మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ రామచంద్రయ్య మాట్లాడుతూ..2వ తరగతి నుంచి 9వ తరగతి వరకు సుమారు 124 నమూనాలు విద్యార్థులు ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వినోద్‌కుమార్, డిప్యూటీ ఐవోఎస్ పరమేశ్వరమ్మ, ప్రిన్సిపాల్ ఆర్ చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకుంటున్న కళాసిల్క్ ఎగ్జిబిషన్



మోతీనగర్: వేసవి కాలంలో ఖాదీ, లెనిన్ వంటి వస్త్రాలు ధరిస్తే అనుకూలంగా ఉంటుందని కళాసిల్క్ నిర్వాహకులు వినోద్ జైన్ అన్నారు. కళాసిల్క్‌లో ఆంధ్రప్రదేశ్, ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి కళంకారి, ఉప్పాడ, అస్సాం సిల్క్, బీహార్ బగల్పుర వస్త్రాలు, జమ్మూ, కాశ్మీర్ ఎంబ్రాయిడరీ డ్రెస్‌మెటీరియల్స్, కర్ణాటక క్రేప్ ప్రింటెడ్ శారీలు, మధ్యప్రదేశ్, చందేరి, మహేశ్వరి, రాజస్థాన్ కోట బంధాని, బ్లాక్ ప్రింట్ డ్రెస్ మెటీరియల్స్, లక్నో డ్రెస్ మెటీరియల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ మేళాలో వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలు, కొండపల్లి బొమ్మలు, పెయింటింగ్స్ ఈ కళాసిల్క్‌లో ఉన్నాయన్నారు. ఈ మేళా ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

చేనేత కళాకారులకు సర్కారు చేయూత: సీతక్క



శ్రీనగర్‌కాలనీ: తెలంగాణ ప్రభుత్వం చేనేత కళాకారులకు చేయూతను అందిస్తూ వారి అభ్యున్నతికి తోడ్పడుతుందని మంత్రి సీతక్క తెలిపారు. ఆయా రాష్ట్రాల చేనేత ఉత్పత్తులను ఒక వేదిక మీదికి చేర్చి వినియోగదారులకు అందించడం అభినందనీయమని అన్నారు. శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన సిల్క్ ఎగ్జిబిషన్‌ను గురువారం ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి మంత్రి సందర్శించారు. చేనేతకారుల ఉత్పత్తులను తిలకించి అభినందించారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారుల ఉత్పత్తులను 70 స్టాళ్లలో ఏర్పాటు చేశామని సిల్క్ ఇండియా సీఈఓ వినయ్‌కుమార్ తెలిపారు. ఉగాదితో పాటు పలు శుభకార్యాలకు అనువుగా పోచంపల్లి, మదనపల్లి, గద్వాల, వెంకటగిరి, చెందేరి, ఇక్కత్, నారాయణ్‌పేట్, బెనారస్, కోల్‌కతాతో పాటు పలు నగరాలకు చెందిన విభిన్నమైన, అరుదైన చీరలను స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని వివరించారు. ఈ నెల 16 వరకూ ఈ ఎగ్జిబిషన్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు.

లాలాగూడ ఆసుపత్రిలో సీటీస్కాన్ సదుపాయం

సాక్షి, సిటీబ్యూరో: లాలాగూడలోని దక్షిణ మధ్య రైల్వే కేంద్రీయ ఆసుపత్రిలో రూ.5.42 కోట్లతో ఏర్పాటు చేసిన సీటీస్కాన్‌ను జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ గురువారం ప్రారంభించారు. ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మలా రాజారామ్, హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, లాలాగూడ సెంట్రల్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ. శివ నాగ ప్రసాద్, వివిధ విభాగాల ప్రధాన అధిపతులు, డాక్టర్లు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో తులసి, అలోవెరా, లెమన్ గ్రాస్, ఇన్సులిన్ వంటి 20 రకాల ఔషధ మొక్కలతో ఏర్పాటు చేసిన తోటను సందర్శించారు. అనంతరం రైల్వే ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ప్రారంభించారు.

భూముల వేలంపై

భగ్గుమన్న విద్యార్థులు



హెచ్‌సీయూలోని మష్రూమ్‌రాక్ వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన

హెచ్‌సీయూలో ఐక్యంగా కదిలిన సంఘాలు

పూర్వ విద్యార్థులైన మంత్రులు భట్టి, శ్రీధర్‌బాబు స్పందించాలని డిమాండ్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలంపై విద్యార్థి లోకం భగ్గుమంటోంది. విద్యార్థి సంఘాలన్నీ ఏకమయ్యాయి. గురువారం నినాదాలు, ప్లకార్డుల ప్రదర్శనలతో హెచ్‌సీయూ క్యాంపస్ హోరెత్తిపోయింది. టీజీఐఐసీ వేలం వేసే 400 ఎకరాల్లో హెచ్‌సీయూ భూములు కూడా ఉండటంతో విద్యార్థి సంఘాలన్నీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. హెచ్‌సీయూ విద్యార్థి సంఘం- 2024–25 ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ, డీఎస్‌యూ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఏ, ఏఎస్ఏ, బీఎస్ఎఫ్‌లు మష్రూం రాక్ వద్ద ఆందోళన చేపట్టాయి. హెచ్‌సీయూ పరిపాలనా భవనం ముందు ఏబీవీపీ, ప్రధాన గేటు వద్ద ఏఐఓబీసీఎస్ఏ, వైఐఎస్ఎస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ప్లకార్డులు, బ్యానర్లతో నిరసన తెలిపారు. తక్షణమే భూముల వేలం పాట నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ మద్దతు

హెచ్‌సీయూ భూములను కాపాడే పోరాటంలో విద్యార్థులే కాకుండా టీచింగ్, నాన్‌టీచింగ్, పూర్వ విద్యార్థులు, వర్కర్లు, ప్రొఫెసర్లు, పర్యావరణవేత్తలు కూడా కదిలివచ్చారు. ఆందోళనలో విద్యార్థి సంఘం-2024–25 అధ్యక్షుడు ఉమేష్ అంబేడ్కర్, ప్రధాన కార్యదర్శి నిహాద్, ఉపాధ్యక్షుడు ఆకాష్, డీఎస్‌యూ అధ్యక్షుడు తుంగ రమేష్, ఏఎస్ఏ అధ్యక్షురాలు వెన్నెల, బీఎస్ఎఫ్ అధ్యక్షుడు అంజి, పీడీఎస్‌యూ అధ్యక్షుడు నాగరాజు, ప్రొఫెసర్లు జి.విజయ్, సౌమ్య, సత్యప్రసాద్, భాంగ్యా భూక్యాతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్‌సీయూ భూముల వ్యవహారంలో ప్రభుత్వాలు జోక్యం చేసుకోవద్దని కోరారు. హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులైన మంత్రులు భట్టివిక్రమార్క, శ్రీధర్ బాబు వెంటనే స్పందించాలని ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ ఆరంభంలో 2,300 ఎకరాలు కేటాయించగా, ఇప్పుడు 1,800 ఎకరాలే మిగిలాయన్నారు. ఈ అంశంపై భారత రాష్ట్రపతికి, జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్‌కు లేఖలు రాశామని చెప్పారు.



ప్రధానగేటు వద్ద ఏఐఓబీసీఎస్ఏ, వైఐఎస్ఎస్‌ల నిరసన



పరిపాలనాభవనం ముందు ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

గుండెజబ్బులకు ఉచిత వైద్యం అభినందనీయం

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఫిలింనగర్: గుండె జబ్బులతో బాధ పడుతున్న చిన్నారుల కోసం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి వారికి వైద్యం అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం అపోలో జనరల్ ఆస్పత్రిలో అపోలో మెడికల్ కాలేజీ, రాష్ట్రీయ బాల్ ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ పుట్టుకతో ఎంతోమంది చిన్నారులు గుండె జబ్బులతో బాధపడుతున్నారని, మరిన్ని సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి ఆదుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అపర్ణారెడ్డి మాట్లాడుతూ గత రెండేళ్లలో 800 మందికిపైగా పిల్లలకు చికిత్స అందించామని తెలిపారు. కార్యక్రమంలో అపోలో మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ హాస్పిటల్ డీన్ డాక్టర్ కె.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హోలీ సంబరాలపై ఆంక్షలు తగవు: దీపక్‌రెడ్డి



సీవీ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న దీపక్‌రెడ్డి, గౌతంరావు తదితరులు

కాచిగూడ: ఆనందోత్సాహాల మధ్య హిందువులు అత్యంత వైభవోపేతంగా జరుపుకునే హోలీ పండుగపై పోలీసులు ఆంక్షలు విధించడం సరికాదని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి అన్నారు. ఆంక్షలు సడలించాలని కోరుతూ దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ ప్రతినిధి బృందం నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. అన్ని మతపరమైన పండుగలకు సమానంగా నియమాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. నిర్దిష్ట ప్రాంతాలలో హోలీ వేడుకలను ఆటంకం లేకుండా నిర్వహించడానికి అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు డాక్టర్ ఎస్.గౌతంరావు, కృష్ణాగౌడ్, ప్రేమ్‌కుమార్, గంగరాజు, పవన్ అంతా, లక్ష్మీ స్వరూప గౌడ్, రాహుల్ చంద్ర, కేశబోయిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక పార్టీ



అభివాదం చేస్తున్న బలరాం నాయక్, గిరిజన సంఘాల నాయకులు

పంజగుట్ట: బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక పార్టీ అని, పార్లమెంట్ వేదికగా రాజ్యాంగాన్ని తొలగించాలని కుట్ర చేస్తోందని మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ ఆరోపించారు. గిరిజన శక్తి ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'ప్రమాదంలో రాజ్యాంగం- సంక్షోభంలో ప్రజాస్వామ్యం' అనే అంశంపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలు రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉన్నాయని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజల మధ్య చిచ్చు పెట్టి ఐక్యతను దెబ్బతీసేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు కుట్ర చేస్తున్నాయని అన్నారు. బీజేపీ విధానాలను రాబోయే రోజుల్లో ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జాతీయ విద్యావిధానం తీసుకువచ్చి పేదలను విద్యకు దూరం చేయాలని చూస్తోందని, ప్రశ్నించినవారిని అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేస్తోందని పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వతంత్రత కలిగిన విశ్వవిద్యాలయాల్లో పెత్తనం సాగించేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. గిరిజన శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్ చౌహాన్, మాజీ ఎంపీ రవీందర్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, శ్రీరాం నాయక్, మందాల భాస్కర్, సలీం పాషా, సైకిబాబా తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఐఏఎస్ అధికారికి అరుదైన గౌరవం

భారత్–ఐరోపా సమావేశం 'ప్యానెల్ స్పీకర్'గా అవకాశం



డాక్టర్ లక్ష్మీకాంతం

సనత్‌నగర్: భారత్–ఐరోపా ఐకమత్య నాయకత్వ సమావేశం 'ప్యానెల్ స్పీకర్'గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ లక్ష్మీకాంతంకు అవకాశం లభించింది. ఈ మేరకు ఆయనకు ఆహ్వానం అందింది. ఈ సమావేశం బెల్జియం దేశం బ్రస్సెల్స్ నగరంలోని యూరోపియన్ యూనియన్ పార్లమెంట్ కమిటీ హాల్‌లో జూన్‌లో జరగనుంది. యూరోపియన్ యూనియన్ పార్లమెంట్ గుర్తించిన యూరోప్–ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరగనుంది. 2011లో ఏర్పాటైన ఈ సంస్థ భారత–యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో భాగంగా పనిచేస్తోంది. ఇప్పటివరకు యునైటెడ్ కింగ్‌డమ్ పార్లమెంట్ కమిటీ హాల్‌లో 28 సార్లు, యూరోపియన్ యూనియన్ పార్లమెంట్ కమిటీ హాల్‌లో ఐదుసార్లు సమావేశాలు జరిగాయి. ఈసారి జరిగే సమావేశంలో ప్రత్యేకంగా సెమీ కండక్టర్(చిప్) సహకారం, సంప్రదాయేతర ఇంధన వనరుల భాగస్వామ్యం, విద్య వంటి అంశాలపై చర్చ జరగనుంది. గత సమావేశాల్లో లక్ష్మీకాంతం చేసిన ప్రసంగానికి ముగ్ధులైన అక్కడి ప్రతినిధులు ఈసారి కూడా ఆయనను ఆహ్వానించారు. కాగా లక్ష్మీకాంతం గతంలో కృష్ణా జిల్లా కలెక్టర్‌గా, తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్త కార్యనిర్వాహణాధికారిగా పనిచేశారు.

పొన్నంకు గౌడ సంఘాల కృతజ్ఞతలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నీరాకేఫ్ భవనాన్ని గీత కార్పొరేషన్‌కు అప్పగించేందుకు కృషి చేసిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గౌడ సంఘాలు కృతజ్ఞతలు తెలిపాయి. ఈ సందర్భంగా రాష్ట్ర గౌడ జన హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎలికట్టె విజయ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను సత్కరించాయి. రూ.20 కోట్లతో నీరాకేఫ్ భవనాన్ని నిర్మించినా టూరిజం శాఖకు తప్ప గౌడ కులస్తులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని విజయ్‌కుమార్ గౌడ్ అన్నారు. నీరాకేఫ్‌ను హోటల్‌గా మార్చేందుకు టూరిజం శాఖ ప్రయత్నించగా గౌడ సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమించాయని, మంత్రి పొన్నం స్పందించి దానిని గీత కార్పొరేషన్‌కు అప్పగించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు బొమ్మా మహేశ్‌కుమార్ గౌడ్ కూడా గౌడల సమస్యలను సీఎం దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు పెట్టాలని కోరారు. మంత్రిని సత్కరించిన వారిలో గౌడ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బండి సాయన్న గౌడ్, బిజినెస్ నెట్‌వర్క్ అధ్యక్షుడు చీకటి ప్రభాకర్ గౌడ్, చెక్కిళ్ల మధుసూదన్ గౌడ్, ముద్దగోని రాంమోహన్‌గౌడ్, గుర్రం దేవేందర్ గౌడ్, వీరయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న ఎలికట్టె విజయ్ కుమార్ గౌడ్

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎమ్మెల్యే కాలనీ కల్చరల్ సెంటర్ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సద్గుణ ఆర్ట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు దుస్తుల ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- మాసబ్ ట్యాంక్ జేఎన్ఏఎఫ్ఏయూ కాలేజీ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ది మెగా పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని వాకిన్ డ్రైవ్‌లో రెయిన్ థీమ్‌తో జేఎస్ క్రియేషన్స్ నిర్వహిస్తున్న రంగోలిక్ 2025 ఈవెంట్ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది.
- గచ్చిబౌలిలోని సంధ్య పార్కింగ్ గ్రౌండ్ వేదికగా టోస్ట్ టానిక్ ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు హోలీ కార్నివాల్ 2.0 జరుగుతుంది.
- గచ్చిబౌలిలోని అడ్వెంచర్ పార్క్‌లో హోలీ కలర్ ల్యాండ్ ఓపెన్ ఎయిర్ ఫెస్టివల్ ఉదయం నుంచి జరుగుతుంది.
- బేగంపేట్‌లోని హాకీ స్టేడియం వేదికగా రంగ్ బసంత్–2025 హోలీ సంబరాలు ఉదయం నుంచి జరుగుతాయి.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- జల్‌పల్లి పిట్టల గూడెంలో పార్థివాదలకు చెందిన ఇంటిల్లిపాది జరుపుకునే నక్కల పిట్టల్లోళ్ల హోలీ వేడుకలు ఉదయం నుంచి జరుగుతాయి.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ప్రతిఏటా పెరుగుతున్న 15 శాతం విద్యుత్ వినియోగం

టీజీ ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ

బోడుప్పల్: ప్రతి ఏడాది హైదరాబాద్‌లో 15 శాతం విద్యుత్ వినియోగం పెరుగుతోందని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ అన్నారు. ఏప్రిల్, మే నెలల్లో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండి వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తే వారు సమ్మర్‌గా కాకుండా వింటర్‌లాగా సంబురాలు చేసుకుంటారన్నారు. బోడుప్పల్ 33/11 కేవీ సాయినగర్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం ఆయన ప్రారంభించారు. హబ్సిగూడ సర్కిల్ పరిధిలో రూ.147 కోట్ల వ్యయంతో బోడుప్పల్ వాసవీనగర్, బీఎల్‌నగర్, మేడిపల్లి, ఉప్పల్ శిల్పారామంలో సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. వేసవి కాలంలో ఏసీలు వాడకం ఎక్కువగా ఉంటుందని, దానిని దృష్టిలో పెట్టుకుని అడ్వాన్స్‌డ్ ప్లానింగ్‌తో కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తి అయితే రానున్న రెండేళ్లపాటు ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు. కాలనీల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు కంచెలు ఏర్పాటు చేయాలని, అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వేయాలని స్థానికులు ఆయనను కోరారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీరు కామేశ్వర్, డైరెక్టర్ సాయిబాబు, ఎస్ఈ బ్రహ్మం, విద్యుత్ అధికారులు, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.



సాయినగర్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభిస్తున్న ముషారఫ్ అలీ

మేడ్చల్ జోన్ విద్యుత్ వ్యవస్థ మరింత పటిష్టం!

సాక్షి, సిటీబ్యూరో: 'మేడ్చల్ జోన్ పరిధిలోని మేడ్చల్, హబ్సిగూడ డివిజన్లలో ఏటా పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా వ్యవస్థను మెరుగు పరుస్తున్నాం' అని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆయన హబ్సిగూడ, మేడ్చల్, సంగారెడ్డి డివిజన్ల పరిధిలో చేపట్టిన సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులను సమీక్షించారు. డిమాండ్ మేరకు ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడంతో గత ఏడాది మేడ్చల్ సహా బౌరంపేట్, అమీన్‌పూర్, బాచుపల్లి, ప్రగతినగర్, జీడిమెట్ల, కేపీహెచ్‌బీ, మియాపూర్, పటాన్‌చెరు, మయూరినగర్‌లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా సాంకేతిక సర్వే చేసి భారీగా పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న సబ్ స్టేషన్లలో అదనంగా 62 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను 1081 పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లను, 243 (11 కేవీ) ఫీడర్లను, 37 (33 కేవీ) ఫీడర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా జోన్ పరిధిలో 15 నూతన 33/11 కేవీ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

'గాంధీ' జూడా అధ్యక్షుడిగా అజయ్‌కుమార్ గౌడ్



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ అజయ్‌కుమార్ గౌడ్ ఎన్నికయ్యారు. గురువారం గాంధీ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. దూలపల్లి ప్రాంతానికి చెందిన డాక్టర్ అజయ్‌కుమార్ గౌడ్ గాంధీ ఆసుపత్రిలో పీజీ సెకండియర్ చదువుతున్నారు. ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ గిరిప్రసాద్, డాక్టర్ మహాలక్ష్మి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ సందీప్, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ రాంచేతన్ ఎన్నికయ్యారు. వీరు ఏడాది పాటు అసోసియేషన్‌కు నాయకత్వం వహిస్తారు. డాక్టర్ అజయ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ జూనియర్ డాక్టర్ల హక్కుల పరిరక్షణ కోసం నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతామన్నారు. జూనియర్ డాక్టర్స్ తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్తశుద్ధితో పని చేస్తామని హామీనిచ్చారు.

నూనె గింజల మేళా.. ఆకట్టుకునే ఇలా!



నూనె గింజల కిసాన్ మేళాను ప్రారంభిస్తున్న అధికారులు

ఏజీ వర్సిటీ: రకరకాల నూనె గింజలు.. వాటితో తీసిన నూనెలు.. ఆకట్టుకున్నాయి. రైతులు వాటిని ఆసక్తిగా పరిశీలించారు. రాజేంద్రనగర్‌లోని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన నూనెగింజల కిసాన్‌మేళాకు రైతులు తరలివచ్చారు. నూనె గింజల సాగులో నూతన పద్ధతుల గురించి అధికారులు అవగాహన కల్పించారు. సాగు యంత్రాలు, నూతన వంగడాలు, వేరుశనగ, పొద్దు తిరుగుడు, కుసుమ, నువ్వులు, ఆవిసెలు, కొత్త రకం వంగడాలు, హైబ్రిడ్ విత్తనాలు ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. ఈ విత్తనాల ద్వారా తీసిన నూనె, ఇతర పదార్థాలను ప్రదర్శించారు. పురుగు మందు పిచికారీలో డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించారు.



నూతన వ్యవసాయ యంత్రాలు



నూనెగింజల పంటల విత్తనాలు

దిగుబడి కొరవడి.. నూనెల దిగుమతి

కిసాన్ మేళాలో వక్తలు

ఏజీవర్సిటీ: దేశంలో నూనె గింజల దిగుబడి ఆశించిన స్థాయిలో లేక విదేశాల నుంచి నూనెలను దిగుమతి చేసుకుంటున్నామని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాయలం వైస్ చాన్స్‌లర్ రాజారెడ్డి, భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ డైరెక్టర్ ఆర్.కె.మాథూర్ తెలిపారు. గురువారం రాజేంద్రనగర్‌లో నిర్వహించిన నూనె గింజల రైతు సదస్సు, నూనె గింజల కిసాన్ మేళాలో వారు మాట్లాడారు. ప్రతి ఏడాది 290 లక్షల టన్నుల నూనె అవసరం కాగా మనదేశంలో కేవలం 127 లక్షల టన్నులు ఉత్పత్తి అవుతోందని పేర్కొన్నారు. ఆ లోటును పూరించేందుకే కేంద్ర ప్రభుత్వం నూనె గింజల ఉత్పత్తిపై దృష్టి సారించిందన్నారు. రైతులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వేరుశన, కుసుమ, ఆముదం, సోయ, చిక్కుడు, నువ్వులు, పొద్దుతిరుగుడు పంటలను నూతన పద్ధతుల్లో పండించాలని సూచించారు. రైతులు వరికి బదులుగా వాణిజ్య పంటలైన నూను గింజలు, ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని, తద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ సరోజాదేవి, పీజేటీఏయూ విత్తన సంచాలకులు డాక్టర్ నాగేష్, ఏకాద్రి, శాస్త్రవేత్తలు, సురేష్, సతీష్, శారద తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో టెస్టు.. కిడ్నీకి బెస్టు

ఏఐఎన్‌యూ ప్రత్యేక శిబిరం ప్రారంభించిన డాక్టర్ నరేంద్ర కుమార్

సాక్షి, సిటీబ్యూరో: సరైన సమయంలో కిడ్నీ టెస్టులు చేయించకపోవడం వల్ల దీర్ఘకాలిక సమస్యలకు చేరువ అవుతున్నారని రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎ.నరేంద్ర కుమార్ అన్నారు. ప్రపంచ కిడ్నీ డే సందర్భంగా గురువారం ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిడ్నీ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ ఆరోగ్యం అందరూ దృష్టి పెట్టాలని సూచించారు. కిడ్నీ ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సేవలు చేపడుతోందన్నారు. ఏఐఎన్‌యూ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సి.మల్లికార్జున మాట్లాడుతూ నగరంతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ కిడ్నీ శిబిరాల్లో సుమారు 10 వేల మందికిపైగా ఉచిత సేవలు పొందుతారని తెలిపారు. బీపీ, మూత్రంలో ప్రొటీన్, సిరం క్రియాటిన్ పరీక్షలతోనే కిడ్నీ ఆరోగ్యం గురించి తెలిసిపోతుందన్నారు. కిడ్నీ సమస్యలను సకాలంలో గుర్తించకపోవడం వల్లే డయాలసిస్, కిడ్నీ మార్పిడి చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.పూర్ణచంద్రారెడ్డి అన్నారు. కార్యక్రమంలో సీఈఓ సందీప్ గూడూరు తదితరులు పాల్గొన్నారు.

పాలనాదక్షుడు బూర్గుల

కాచిగూడ: హైదరాబాద్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు గొప్ప పాలనాదక్షుడని పలువురు వక్తలు కొనియాడారు. బూర్గుల జయంతి సందర్భంగా గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద గల ఆయన విగ్రహానికి రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, బూసాని వెంకటేశ్వర్‌రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ నీతి నిజాయితీకి మారుపేరుగా నిలిచిన బూర్గుల ఆదర్శప్రాయుడని అన్నారు. సీఎంగా ఆయన విద్య, వ్యవసాయ రంగాల్లో కీలక మార్పులు తీసుకువచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బూర్గుల కుటుంబసభ్యులు లక్ష్మీనారాయణరావు, సాయిరామకృష్ణ, సంధ్య, ఇల్లిందుల శారదాదేవి, ఎల్లప్రగడ సత్యప్రియ, ఉమ్మెత్తుల చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.



బూర్గుల విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, శుక్రవారం, 14 మార్చి 2025





నవతరం..
నైపుణ్యం..

ప్రతిభ చూపుతున్న విమెన్ ఎంట్రప్రెన్యూర్

- ప్రాజెక్ట్ ఇన్‌క్లూజన్‌తో వృద్ధి సాధిస్తున్న వ్యాపారాలు
- వీ హబ్ వేదికగా వివిధ జిల్లాల గ్రాడ్యుయేట్స్
- హస్తకళలతో స్ఫూర్తి నింపిన మహిళలు

స్వతహాగా మహిళల హస్తాలు సృజనాత్మకత, కళాత్మకతను నింపుకుని ఉంటాయనేది నానుడి. ఇలాంటి మహిళలకు, వారి కళకు, కష్టానికి, ఆసక్తికి ప్రోత్సాహమందిస్తే అద్భుతాలు సృష్టిస్తారు. దీనిని నిజం చేసింది విమెన్ ఎంట్రప్రెన్యూర్‌కు మద్దతునిచ్చే రాష్ట్ర ప్రభుత్వ సంస్థ వీ హబ్. తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన టియర్-2, టియర్-3 ప్రాంతాలకు చెందిన మహిళలను వ్యాపారులుగా అభివృద్ధి చేసి, ఆదర్శ ఎమ్ఎస్ఎమ్ఈలుగా మార్చాలనే లక్ష్యంతో వీ హబ్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఇన్ క్ల్యూజన్ ప్రోగ్రామ్ ప్రారంభించింది. ఇందులో భాగంగా మహిళా వ్యాపారాలకు మార్కెట్ అనుసంధానం, బిజినెస్ రిజిస్ట్రేషన్స్, మెంటార్షిప్, ఆర్థిక స్వావలంబన మార్గాలను అందించడం దీని ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 31 మంది మహిళలను నగరంలోని వీ హబ్ వేదికగా అభినందించి, వారి ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ 31 మంది మహిళల కృషి, పట్టుదల భవిష్యత్తు తరం వనితలకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

- సాక్షి, సిటీబ్యూరో

మహిళలకున్న ఆలోచనలను స్థిరమైన వ్యాపారాలుగా మార్చుతోంది వీ హబ్. దీని కోసం 'ప్రాజెక్ట్ ఇన్‌క్ల్యూజన్'ను ప్రారంభించింది. ఈ వేదికగా సదరు మహిళల వ్యాపారాభివృద్ధికి తోడ్పాటునందించే ఇతర సహకారాలను అందిస్తోంది. ఇందులో భాగంగా వారసత్వంగా కొనసాగిస్తున్న హస్తకళలు మొదలు అధునాతన జీవన శైలిని ప్రతిబింబించే గృహాలంకరణ ఉత్పత్తుల వరకూ అనువైన వేదికను రూపొందించారు. ఇందులో సహకారం పొందిన వారు సొంత బ్రాండ్ రూపొందించుకుని చేనేత వస్త్ర ఉత్పత్తులు, మోడ్రన్ ప్యాకింగ్‌తో చాక్లెట్ల తయారీ, హోమ్ ఫుడ్స్, కన్‌స్ట్రక్షన్ బిజినెస్, గానుగ నూనె తయారీ వంటి విభిన్న రంగాల్లో తమను తాము నిరూపించుకున్నారు. ఈ సందర్భంగా వీ హబ్ సీఈఓ సీతా పల్లబొల్లా మాట్లాడుతూ.. మహిళా వ్యాపారులకు వారి సామర్థ్యాన్ని చాటిచెప్పే ప్రణాళికను అనుసంధానించి కేవలం వ్యాపారాలను ప్రోత్సహిస్తూ, ఆర్థిక స్వయం ప్రతిపత్తికి తోడ్పడుతున్నాం అన్నారు. సెప్టెంబర్ 2024లో ప్రారంభమైన ప్రాజెక్ట్ ఇన్ క్ల్యూజన్ కోసం 117 దరఖాస్తులు అందగా, ఇందులో 35 మంది మహిళలను ఎంపిక చేశాం. వీరిలో 31 మంది విజయవంతంగా కోర్సును పూర్తి చేశారని అన్నారు. ఈ గ్రాడ్యుయేషన్ తర్వాత వీరికి నిరంతర మెంటార్‌షిప్ మార్గదర్శకత్వాన్ని అందిస్తూనే.. అర్హులైన వ్యాపారాలను అందించే వీ హబ్ ర్యాంప్ ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రామ్‌లో చేర్చుతామని పేర్కొన్నారు.

కళాత్మక జీవితం
మంచి అనుభూతి..



జేఎస్ఎమ్ బ్రాండ్ పేరుతో జెల్ క్యాండిల్స్ తయారు చేస్తున్నాను. మార్కెట్‌లో లభించే ఒక ప్రత్యేకమైన జెల్‌ను కరిగించి వివిధ డిజైన్లలోని గాజు పాత్రల్లో నింపుతాను. వీటికి అదనపు ఆకర్షణగా జెల్‌లో పూలను, చిన్న మొక్కల కొమ్మలను అలంకరిస్తాను. క్యాండిల్ వెలిగించినప్పుడు మంచి సువాసన రావడానికి సుగంధ పరిమళాలను వినియోగిస్తాను. ఈ కళను ఒక కోర్సుగా నేర్చుకున్నాను. షాలిబండలో ఒక ప్రదర్శనలో నా స్టాల్ చూసిన వీ హబ్ బృందం ప్రాజెక్ట్ ఇన్‌క్ల్యూజన్‌లో నన్ను భాగం చేశారు. వీటిని ఆన్‌లైన్ వేదికగానూ అమ్ముతున్నాను. నచ్చిన కళతో జీవితం ఎంతో సంతృప్తినిస్తోంది.

- ఇమ్రానా నోషీన్, జేఎస్ఎమ్ జెల్ క్యాండిల్స్

కుల వృత్తితో
అద్భుతాలు..



వారసత్వంగా వచ్చిన కుల వృత్తితో వెండి ఉత్పత్తులను తయారు చేస్తున్నాం. దీనిని సిల్వర్ ఫిలిగ్రీ అంటారు. మా పూర్వీకులు ప్రతిష్టాత్మక పెంబర్తి మెటల్ షీట్స్ తయారు చేసేవారు. వాటికి తోడుగా వినూత్నంగా ఈ వెండి సౌందర్య అలంకార ప్రతిమలను తయారు చేస్తున్నాను. కరీంనగర్ మెప్మా ద్వారా వీ హబ్‌కు చురుకున్నాను. ఈ వేదిక ద్వారా మార్కెటింగ్ ఎలా పెంచుకోవచ్చు, కస్టమర్లను ఎలా చేరుకోవచ్చు వంటి అంశాల్లో అవగాహన పెరిగింది. మా వద్ద రూ. వెయ్యి నుంచి లక్ష విలువ చేసే అందమైన, అరుదైన వస్తువులు లభిస్తాయి.

- సరళ, కరీంనగర్.



మూలాల్లోంచి
కళాకృతులు..

వారాహి హస్తకళ పేరుతో.. ఆదివాసీ ప్రాంతాల్లో లభించే ఎండిన సొరకాయలతో అందమైన ఇంటీరియర్ ఉత్పత్తులు తయారు చేస్తున్నాను. వీటిని గిరిజనులు సహజమైన మంచినీళ్ల బాటిల్‌గా వినియోగించేవారు. ఈ సొర బుర్రలపై వేడి చేసిన ఇనుప చువ్వలతో అందమైన డిజైన్లను రూపొందిస్తాను. దీని మధ్యలో లైట్ వెలుగుతుంది. గత మూలాలను ఈ తరానికి అందంగా మార్చి ఇస్తున్నాను. మంచి ఆదరణ లభిస్తోంది. వీ హబ్ నా ప్రయత్నాన్ని, కళను గుర్తించింది. సామాజికంగా వివిధ రంగాల ప్రజలతో అనుసంధానం చేస్తుంది. ఇందులో భాగంగానే బీఐసీసీఐ ఆధ్వర్యంలోని గ్రీన్ ఉద్యమకర్త అవార్డును పొందాను. గ్రామీణ కళాకృతులను విదేశాల్లోని వారికి చేరడం సంతోషాన్నిచ్చింది.

- సింధూ, ములుగు.

రూరల్ టెక్
ప్రాజెక్టు చేయాలనుంది..



మహిళలకు తోడ్పాటునందించే ప్రాజెక్ట్ ఇన్ క్ల్యూజన్‌లో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉంది. మా సంస్థ సీఎస్ఆర్ నిధులతో ఈ ప్రాజెక్టుకు సహకారం అందిస్తున్నాం. ఇక్కడి మహిళ కళ, కృషి సంతృప్తితో పాటు స్ఫూర్తిని నింపింది. ఈ ఫలితాలు అందించిన ఆనందంలో రూరల్ టెక్ అనే మరొక ప్రాజెక్టు చేపట్టాలనే కోరిక మొదలైంది. ఇది కార్యరూపం దాల్చడానికి వీ హబ్‌తో కలిసి పనిచేస్తాం.

- సుజీవ్ నాయర్, రీ సస్టెయినబులిటీ గ్లోబల్ చీఫ్ హెచ్ ఆర్ ఆఫీసర్

డీహైడ్రేట్ పళ్లతో
డ్రైఫ్రూట్ చాక్లెట్లు..

చాకో మిస్టా బ్రాండింగ్‌తో హోమ్‌మేడ్ చాక్లెట్స్ తయారు చేస్తున్నాను. స్ట్రాబెర్రీ, మామిడి, పైనాపిల్ వంటి పళ్లను డీహైడ్రేట్ చేసి, వీటికి డ్రై ఫ్రూట్స్ కలిపి చాక్లెట్స్ తయారు చేస్తాను. నేను హార్టికల్చర్ నుంచి వచ్చాను.. ఈ ప్రయాణంలోనే చాక్లెట్ తయారీ పైన ఆసక్తి పెరిగింది. వీ హబ్ ప్యాకేజింగ్, డాక్యుమెంటేషన్, లైసెన్స్ రిజిస్ట్రేషన్ వంటి అంశాల్లో సహకారం అందించింది. చాక్లెట్లలో ప్రిజర్వేటివ్స్, రంగులు వాడను. స్వచ్ఛమైన కోకో బటర్, పౌడర్, మిల్క్ పౌడర్ వంటివి వినియోగిస్తాను. దీనిని భవిష్యత్తులో పెద్ద బ్రాండ్‌గా మార్చి ఎగుమతి చేయాలనుంది.

- కావ్య శ్రీ, చాకో మిస్టా వ్యవస్థాపకురాలు



వీవింగ్ ది ఫ్యూచర్ విజయవంతం

సాక్షి, సిటీబ్యూరో: నేత కార్మికులు, చేనేత రంగ సంస్థలకు ఎదురౌతున్న సవాళ్లను చర్చించడానికి గోకూప్ లైవ్లీహుడ్స్ ఫౌండేషన్, యాక్సెస్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ కలిసి బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్‌లో నిర్వహించిన 'వీవింగ్ ది ఫ్యూచర్ కార్యక్రమం విజయవంతం అయ్యిందని నాస్ ఫార్మ్, వీపీ సువెందు రాత్, గోకూప్ వ్యవస్థాపకుడు శివా దేవిరెడ్డి తెలిపారు. తెలంగాణ చేనేత రంగాన్ని నిర్మించడంలో హైదరాబాద్‌కు లోతైన అనుబంధం ఉన్నందున హ్యాండ్‌లూమ్ కాలోక్వియమ్‌కు ఆతిథ్య నగరంగా హైదరాబాద్‌ను ఎంపిక చేశామని, తాము ఆశించినట్టే పెద్ద సంఖ్యలో ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమ నిపుణులు, డిజైనర్లు, కళాకారులు, ప్రతినిధులు హాజరయ్యారని, చేనేత రంగానికి సంబంధించి మార్కెట్‌లో ఎదురయ్యే సమస్యల పరిష్కారాల గురించి చర్చించామన్నారు.



క్రీస్తును స్మరిస్తూ..
ఉపవాసం

- ఈస్టర్ పండుగకు సన్నాహకంగా లెంట్ డేస్
- 40 రోజుల పాటు ఉపవాసాలు, ప్రార్థనలు

శక్తి కొలదీ..



లెంట్ డేస్ ఉండే క్రైస్తవుల్లో ఎక్కువగా క్యాథలిక్ చర్చిలలో కనిపిస్తారు. మిగతా వాటిల్లో కూడా కొంత మంది ఉపవాసాలు ఉంటారు. ప్రతి ఒక్కరూ ఉపవాసం ఉండాలని నిబంధన లేకపోయినా వారి శారీరక సామర్థ్యం, అనువైన అవకాశాలను బట్టి ఆచరిస్తారు. కొంత మంది ఉదయం నుంచి రాత్రి వరకూ, మరికొందరు మధ్యాహ్నం వరకు, రోజుకు ఒక పూట మాత్రమే ఉపవాసం ఉంటారు. దీనిలో బూడిద బుధవారం, పామ్ సండే, ది లాస్ట్ సప్పర్, శుభ శుక్రవారం, పవిత్ర శనివారం, ఈస్టర్ లాంటి వాటిని పవిత్ర దినాలుగా భావిస్తారు.

ప్రత్యేక ప్రార్థనలు..



లెంట్ డేస్ మొదలైనప్పటి నుంచి క్రైస్తవులు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ప్రత్యేక ప్రార్థనల్లో గడుపుతారు. కొందరు చర్చిలకు వెళితే.. మరి కొందరు ఇళ్ల వద్దే ప్రార్థనలు కొనసాగిస్తారు. బూడిద బుధవారంతో మొదలై.. ఈస్టర్ పండుగ వరకూ ఉపవాసాలు చేస్తారు. ఆదివారాలు ఉపవాసం పాటించరు కనుక 40 రోజులు ఉంటాయి. ప్రారంభం రోజు చర్చికి వెళ్లి మట్టిలో నుంచి వచ్చాము, మట్టిలో కలిసి పోతాము అని బూడిద నుదుటన ధరించి ప్రార్థనల్లో పాల్గొంటారు.

పామ్ సండే..

ఈస్టర్‌కు ముందు వచ్చే ఆదివారాన్ని పామ్ సండే (మట్టల ఆదివారం)గా పాటిస్తారు. క్రీస్తు యేరూషలేములో ప్రవేశించిన సందర్భంగా ప్రజలు హోసన్నా అంటూ స్వాగతం పలకడాన్ని గుర్తు చేసుకుంటారు. దీనిని క్యాథలిక్స్‌తో పాటు చాలా చర్చిలలో ఆచరించడం ఆనవాయితీ.

ది లాస్ట్ సప్పర్..



గుడ్ ఫ్రైడే ముందు వచ్చే గురువారాన్ని ది లాస్ట్ సప్పర్‌గా పాటిస్తారు. క్రీస్తు మరణించడానికి ముందు రోజు 12 మంది శిష్యులతో కలిసి చివరి భోజనం చేస్తారు. దీన్నే లాస్ట్ సప్పర్‌గా ఆచరిస్తారు. అదే రోజు క్రీస్తు తన 12 మంది శిష్యుల కాళ్లను కడుగుతారు. ప్రతి ఒక్కరూ వినయం, విధేయతతో జీవించాలని బోధిస్తారు. చర్చిల్లో ఫాదర్లు ఇతరుల పాదాలు కడుగుతారు.

గుడ్ ఫ్రైడే..



క్రీస్తు సిలువలో మరణించిన రోజు గుడ్‌ఫ్రైడే. సర్వ మానవాళి పాప పరిహారం కోసం మానవుడిగా జన్మించి వారి కోసం సిలువలో రక్తం చిందించిన త్యాగ దినముగా భావిస్తారు. ఆ రోజంతా ప్రత్యేక ప్రార్థనలతో గడిపి ఉపవాసాలు ముగిస్తారు. మరికొందరు గుడ్‌ఫ్రైడే తర్వాత రోజు పవిత్ర శనివారంగా భావించి ఆ రోజు ఉపవాసాలు ముగిస్తారు.

పరివర్తన కోసమే..

మనిషిలో పరివర్తన కోసమే లెంట్ డేస్ ఆచరిస్తారు. క్రీస్తు జీవించి ఉన్న రోజుల నుంచి తిరిగి వచ్చే వరకూ ఎలా ఉండాలో చూపించారు. ఉపవాసాలు, ప్రార్థనలు, దాతృత్వం దేవుడితో ఆధ్యాత్మిక సాన్నిహిత్యాన్ని మరింత దగ్గర చేస్తాయి.

- రెవరెండ్ ఫాదర్ ఎం ఆరోగ్యం

కలర్‌ఫుల్ 'స్కై బ్లాస్ట్'

60 అంతస్తుల ఎస్ఏఎస్ క్రౌన్‌పై హోలీ ఫెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: హోలీ పండుగ నేపథ్యంలో నగరంలో అత్యంత ఎత్తైన భవనం పైనుంచి 'స్కై బ్లాస్ట్' పేరుతో భారీ స్థాయిలో రంగులు వెదజల్లి వావ్ హోలీ అనిపించారు. అత్యంత ఎత్తైన భవనం పై హోలీ జరుపుకోవడం అంటే విభిన్నమైన అనుభూతి. ఇందులో భాగంగా దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఎత్తైన టవర్.. కోకాపేటలోని 60 అంతస్తుల ఎస్ఏఎస్ క్రౌన్ పై చేసిన 'స్కై బ్లాస్ట్' 360 డిగ్రీల స్కైవ్యూతో రంగుల తుఫాన్ సృష్టించింది. కేవలం నేల మీదే కాదు, ఆకాశంలోనూ హోలీ జరుపుకోవచ్చు అని నిరూపించిన స్కై బ్లాస్ట్ హోలీలో టాప్ ఫ్లోర్, స్కై డెక్ నగరవాసులను అలరించింది. ఈ వినూత్న ప్రయోగంలో సిటీ వ్యూతో పాటు, లగ్జరీ ఫెస్టివల్, ప్రైవేట్ పార్టీ హంగులను ప్రపంచానికి చూపించింది భాగ్యనగరం.



డ్రోన్స్, ఏఐలతో వ్యవసాయానికి మేలు



సాక్షి, సిటీబ్యూరో : అత్యాధునిక టెక్నాలజీని వినియోగించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చవచ్చని వక్తలు స్పష్టం చేశారు. నగరంలోని హెచ్ఐసీసీ వేదికగా నిర్వహించిన వ్యవసాయ సదస్సు ముగిసింది. ఈ సదస్సులో పంటల దిగుబడిని పెంచడానికి, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, వ్యవసాయ ఉత్పత్తుల సంస్థ పిక్సెలిన్ సైన్సెస్ తయారు చేసిన పాలిహలైట్ కాంప్లెక్స్, బెలెనస్, వెర్వాక్టర్‌లను విడుదల చేశారు. అలాగే అత్యాధునిక డ్రోన్ల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రదర్శించారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) సైతం వ్యవసాయానికి మరింత మేలు కలిగిస్తుందని సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల యుగంధర్, బసంత్ నాదెళ్ల, ప్రదీప్ యల్లంకి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి రంగులను ప్రతిబింబించే విధంగా
హానికర రసాయనాలకు దూరంగా
పండ్లు, కూరగాయలు, ఆకులతో తయారీ

హోలీ 'సహజ సిద్ధం'



హోలీ పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను సూచిస్తున్నారు. ముఖ్యంగా కళ్లలో రంగులు పడకుండా కళ్లద్దాలు, లేదా స్విమ్మింగ్ గ్లాసెస్ ధరించాలి.

- కళ్ల చుట్టూ కొబ్బరి నూనె లేదా వ్యాజిలైన్ రుద్దుకోవాలి. ఇవి రంగులు కళ్లలోకి చేరకుండా రక్షిస్తాయి.
- ఒకవేళ కళ్లలో రంగుల ద్రావకం పడితే కళ్లు రుద్దకూడదు. అలా చేస్తే కార్నియా దెబ్బతినే ప్రమాదం ఉంది.
- ముఖ్యగా చేతులు, మెడ ఇతర చర్మానికి రంగులు అంటుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఇంట్లోనే ప్రకృతి సిద్ధమైన రంగులను తయారు చేసుకోవాలి. దీని కోసం ఎరుపు, గులాబీ రంగుల కోసం మందార పూలను ఎండబెట్టి పొడిగా చేసి వాడుకోవచ్చు.
- అదే విధంగా బీట్‌రూట్ ముక్కలుగా కట్ చేసి నీళ్ళలో మరిగించితే ఎరుపు రంగు తయారవుతుంది.
- పసుపు పొడి, బంతిపూల రెక్కలు కలిపి మరిగించితే పసుపు రంగు తయారవుతుంది.
- ఆకుపచ్చరంగు కోసం పాలకూర ఆకులు మరిగించి వాడుకోవచ్చు.
- గోధుమ రంగు కోసం తమలపాకు (పాన్)లలో నోటికి ఎరుపుదనం కోసం వాడే కాసు (కత్త) నీటిలో మరిగిస్తే గోధుమ రంగు వస్తుంది.
- ఇండిగో ఆకులను మరిగిస్తే నీలి రంగు వస్తుంది.. ఈ విధంగా ప్రకృతి సిద్ధంగా లభించే రంగులను హోలీలో వాడితే ఎటువంటి హానీ కలగదని వైద్యులు సూచిస్తున్నారు.



హోలీకి రంగులు వేసుకోవడం సహజం. అయితే పూర్వం సహజ సిద్ధంగా దొరికే పండ్లు, కూరగాయలు, ఆకులతో తయారు చేసిన రంగులనే హోలీకి వాడేవారు. ప్రస్తుతం రసాయనిక, సింథటిక్ రంగులను వాడుతున్నారు. వీటివల్ల చర్మవ్యాధులు, దద్దుర్లు ఏర్పడతాయని, దీంతో పాటు జుట్టు పాడవ్వడం, కళ్లు దెబ్బతినడం వంటి దుష్పరిణామాలు కలిగే అవకావం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మరీ ముఖ్యంగా చిన్నారులు హోలీ ఆడేటప్పుడు తల్లిదండ్రులు వారి వెంటే ఉండాలని సూచిస్తున్నారు.

- రామంతాపూర్

పారదర్శకంగా సమగ్ర కుటుంబ సర్వే

మండలిలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేసిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజలంతా స్వచ్ఛందంగా సమాచారం ఇవ్వడంతోనే పారదర్శకంగా ఈ సర్వేను నిర్వహించామన్నారు. తొలుత సర్వేలో పాల్గొనని వారికి కూడా మరోమారు అవకాశం కల్పించినట్లు తెలిపారు. సర్వేకు సంబంధించి ప్రభుత్వం ఏ సమాచారాన్ని కూడా దాచడం లేదని చెప్పారు. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగంపై గురువారం శాసన మండలిలో ధన్యవాద తీర్మానంపై చర్చలో భాగంగా సభ్యులు నవీన్‌కుమార్, తాతా మధుసూదన్, శేరిసుభాష్‌రెడ్డి తదితరులు లేవనెత్తిన అంశాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ బదులిస్తూ పైవిధంగా స్పందించారు.

హరీశ్‌రావు.. నోరు అదుపులో పెట్టుకో!

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: పదేళ్లపాటు పందికొక్కుల్లా రాష్ట్రాన్ని దోచుకుతిన్న బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. గురువారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. 'హరీశ్‌రావు.. నోరు అదుపులో పెట్టుకో. మీరు ఇష్టానుసారంగా మాట్లాడితే ఇక్కడ ఎవరూ చూస్తూ ఊరుకోరు'అని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి రోజుకు 18 గంటలు పని చేస్తున్నారని తెలిపారు. సీఎం పదవి కంటే పెద్ద స్టేచర్ ఇంకేమైనా ఉంటుందా? అని ప్రశ్నించారు.

చేసిన మంచి చెప్పుకోలేక..

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం, ఇచ్చిన హామీల అమలుకు పెద్ద ఎత్తున కృషి చేస్తూనే, వాటిని ప్రజలకు విడమరిచి చెప్పడంలో విఫలమవుతోందని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేస్తున్న పనులను గవర్నర్ తన ప్రసంగంలో స్పష్టంగా వివరించారన్నారు. దేశానికి తెలంగాణ ఆదాయాన్ని సమకూరుస్తున్నా.. రాష్ట్రానికి నిధుల కేటాయింపులో అన్యాయం జరుగుతోందన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు.

డా.వైఎస్ రాజశేఖరరెడ్డి మహానేత: అక్బరుద్దీన్



సాక్షి, హైదరాబాద్: దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖరరెడ్డి మహానేత అని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ కొనియాడారు. నిరుపేదలకు ఉచితంగా కార్పొరేట్ ఆస్పత్రుల సేవలు అందించిన మహానాయకుడు అని గుర్తుచేసుకున్నారు. వైఎస్సార్ తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పథకంతో పెద్ద సంఖ్యలో పేదలు ప్రయోజనం పొందారన్నారు. ఈ పథకానికి రూపకల్పన చేస్తున్న క్రమంలో తనను కూడా పిలిపించి ఎలాంటి చర్యలు తీసుకుంటే పేదలకు ప్రయోజనకరంగా ఉంటుందనే దానిపై చర్చలు జరిపారన్నారు. ఆనాటి రోజుల్లో కార్పొరేట్ ఆస్పత్రుల్లో పేదలకు ఉచిత వైద్యం అనేది అసలు ఊహలకు సాధ్యం కానిదని చెప్పారు. గురువారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై అక్బరుద్దీన్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ప్రస్తావన తెచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద వైద్యసేవల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడం అభినందనీయమన్నారు. అయితే గత కొంత కాలంగా ప్రైవేట్ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకుపోయినందున, వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఖాజాగూడ ప్రాజెక్టు వెనుక కేటీఆర్ హస్తం: అనిరుధ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఖాజాగూడ చెరువు సమీపంలో రూ.వేల కోట్ల వ్యయంతో వంశీరాం బిల్డర్స్ చేపట్టిన పెద్ద ప్రాజెక్టు వెనుక బీఆర్ఎస్ నేత కేటీఆర్ హస్తం ఉందని జడ్చర్ల ఎమ్మెల్యే జె.అనిరుధ్‌రెడ్డి మీడియా పాయింట్ వద్ద ఆరోపించారు. ఈ ప్రాజెక్టు గురించి తాను హైడ్రాకు ఫిర్యాదు చేశానని, ఫిర్యాదు తీసుకున్నా, అధికారులు తనకు ఎక్‌నాలెడ్జ్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. మ్యాన్‌హట్టన్ ప్రాజెక్టు బీఆర్ఎస్ హయాంలోనే జరిగిన అతిపెద్ద కుంభకోణమని, దీనిపై హైడ్రాకు ఫిర్యాదు చేసినా రిసిప్ట్ ఇవ్వడం లేదని చెప్పారు.

మరిన్ని అసెంబ్లీ వార్తలు
సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో

వాళ్లకు దళితులంటే చులకన

- జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫైర్
- బీఆర్ఎస్ సభ్యులకు దళిత బిడ్డ స్పీకర్‌గా కన్పించకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్య
- నైతిక విలువల కమిటీకి నివేదించాలని సూచన



జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు, ఆదిశ్రీనివాస్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: శాసనసభలో స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ సభ్యుడు జగదీశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు దళితులను కించపరిచేలా ఉన్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సభ్యులకు దళిత బిడ్డ స్పీకర్‌గా కన్పించకపోవడం దురదృష్టకరమన్నారు. ఆ పార్టీకీ, ఆ పార్టీ నాయకుడు కేసీఆర్‌కూ దళితులు అంటే చులకనే అన్నారు. గురువారం శాసనసభ వాయిదా పడి తిరిగి ప్రారంభమైన తర్వాత ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో శాసనసభ దేవాలయం వంటిదని, సభను, సభాపతిని అందరూ గౌరవించాలని భట్టి అన్నారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించిన పలు సందర్భాల్లో కఠిన చర్యలు తీసుకున్న ఉదంతాలున్నాయని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ సభ్యులు కోమటి రెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్ ఏం మాట్లాడకపోయినా చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఇప్పుడు కూడా దీన్ని పాటించాలన్నారు. జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలు యావత్ తెలంగాణ సమాజాన్ని గాయపర్చేలా ఉన్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు. శాసనసభ పక్ష సమావేశం పెట్టిన కేసీఆర్ తన సభ్యులకు నేర్పింది ఇదేనా అంటూ ప్రశ్నించారు. సభాపతికి ఉన్న విశేష అధికారాలను భట్టి తెలిపారు. జగదీశ్‌రెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేయాలని సభ కోరుతోందని, కానీ ప్రజాస్వామ్యంపై తమకు విశ్వాసం ఉందని, బడ్జెట్ సమావేశాలు జరిగే వరకూ ఆయనను సభలోకి రాకుండా సస్పెండ్ చేయాలని కోరారు. ఈ వ్యవహారాన్ని సభ నైతిక విలువల కమిటీకి నివేదించాలని, కమిటీ చేసే తీర్మానం ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.


స్పీకర్‌ను ప్రశ్నించే అధికారం లేదు: శ్రీధర్‌బాబు

'సభలో స్పీకర్ సుప్రీం. ఆయన నిర్ణయాధికారాన్ని సభలో లేదా బయట కానీ ప్రశ్నించే అధికారం సభ్యులెవరికీ లేదు. సభా గౌరవాన్ని సభ్యులంతా పెంచాలే తప్ప స్పీకర్ స్థానాన్ని అవమానించేలా, రాజ్యాంగ పదవిలో ఉన్న దళితుడిని కించపరిచేలా మాట్లాడడం సరికాదు. సభ ఔన్నత్యాన్ని పెంచడానికి జగదీశ్‌రెడ్డిని ఈ సెషన్ ముగిసే వరకు సస్పెండ్ చేయాలి..'అని మంత్రి శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు.

వ్యాఖ్యలు జుగుప్సాకరం : సీతక్క

'జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరంగా, స్పీకర్ స్థానానికే అవమానంగా ఉన్నాయని మంత్రి సీతక్క అన్నారు. కొన్ని కుటుంబాలు, వర్గాలకే గౌరవం దక్కాలనే అహంకార ధోరణి బీఆర్ఎస్ పార్టీదని వ్యాఖ్యానించారు. గవర్నర్‌ని కూడా కాంగ్రెస్ కార్యకర్తలని వ్యాఖ్యానించారని అభ్యంతరం తెలిపారు. జగదీశ్‌రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అహంకార ధోరణి సమర్థనీయం కాదు: ఉత్తమ్



ప్రజాస్వామ్యంలో అత్యున్నత స్థానమైన సభాపతిపై అహంకారంతో వ్యవహరించడం దురదృష్టకరమని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఏక వచనంతో మాట్లాడిన జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేసి, ఎథిక్స్ కమిటీకి ఈ వ్యవహారాన్ని నివేదించాలని సూచించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం..కాంగ్రెస్ సభ్యులైన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌ల సభ్యత్వాన్ని రద్దు చేసిన విషయం గుర్తు చేశారు. దళిత స్పీకర్‌పై చులకనగా మాట్లాడడాన్ని అవమానంగా తెలంగాణ సమాజం భావిస్తోందని కాంగ్రెస్ సభ్యుడు వేముల వీరేశం అన్నారు. అలా మాట్లాడిన సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలు సమాజానికే సిగ్గుచేటని మరో సభ్యుడు రాంచంద్రనాయక్ అభిప్రాయపడ్డారు. దళిత స్పీకర్‌ను అవమానించిన జగదీశ్‌రెడ్డి సభ్యత్వం రద్దు చేయాలని కాంగ్రెస్ సభ్యుడు మందుల సామ్యేల్ డిమాండ్ చేశారు.

ఏం చేద్దాం... ఎలా చేద్దాం?

- జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై అధికార పక్షం చర్చోపచర్చలు... అక్కడి నుంచే సీఎంతో ఫోన్‌లో మాట్లాడిన శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌నుద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సభలో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఏం చేయాలన్న దానిపై అధికార పక్షం చర్చోపచర్చలు జరిపింది. గురువారం ఉదయం 11.45 గంటల సమయంలో సభ వాయిదా పడిన అనంతరం జగదీశ్‌రెడ్డి వ్యవహారంలో ఎలా ముందుకెళ్లాలన్న దానిపై కాంగ్రెస్ సీనియర్ మంత్రులు సమాలోచనలు జరిపారు. స్పీకర్ చాంబర్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు భేటీ అయ్యారు. సభ నియమావళికి సంబంధించిన అంశాలను పరిశీలించారు. జగదీశ్‌రెడ్డి మాట్లాడిన వీడియోలు, ఆయన ఆన్ రికార్డ్ మాట్లాడిన మాటలను అసెంబ్లీ కార్యదర్శి నుంచి తెప్పించుకుని స్పీకర్ వాటిని కూడా తిలకించారు.

సీఎంతో మంతనాలు: జగదీశ్‌రెడ్డి ఎపిసోడ్ గురించి మంత్రి శ్రీధర్‌బాబు ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఆ తర్వాత మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోనూ ఆయన మాట్లాడారు. అన్ని అంశాలను పరిశీలించిన తర్వాత మరోమారు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో భేటీ అయ్యారు. సభ నియమావళి, స్పీకర్‌కు గల విచక్షణాధికారాల గురించి వివరించారు. మొత్తంమీద పలుమార్లు చర్చించిన అనంతరం సభ వాయిదా పడిన మూడున్నర గంటల తర్వాత జగదీశ్‌రెడ్డి వ్యవహారంలో ఏం చేయాలన్న దానిపై అధికార పక్షం నిర్ణయం తీసుకుంది. అయితే, సభను 15 నిమిషాలపాటు వాయిదా వేసిన తర్వాత చాలాసేపటి వరకు మళ్లీ సభ నిర్వహించకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సుధీర్‌రెడ్డిలు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. సభను వెంటనే సమావేశపర్చాలని కోరారు. జగదీశ్‌రెడ్డి మాట్లాడిన వీడియోలు తమకు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

కామెంట్స్.. కలకలం

▶ మొదటి పేజీ తరువాయి

అద్లూరి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. స్పీకర్‌ను ఏకవచనంతో సంబోధించారని తప్పుబట్టారు. మొత్తం దళిత జాతికి క్షమాపణ చెప్పాలన్నారు. బీఆర్ఎస్‌కి దళితుల పట్ల చిన్న చూపు అని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ సభ్యుడు సంపత్‌కుమార్ పేపర్లు పైకి విసిరేస్తే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం శాశ్వతంగా సభ్యత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. గందరగోళం నెలకొనడంతో స్పీకర్ సభను వాయిదా వేశారు. సుదీర్ఘ విరామం తర్వాత సభ ప్రారంభం కాగా డిప్యూటీ సీఎం, పలువురు మంత్రులతో పాటు అధికార పక్ష సభ్యులు మాట్లాడారు. జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని కొందరు, బహిష్కరించాలని కొందరు డిమాండ్ చేశారు. తమకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ సభ్యులు కోరినా స్పీకర్ వారికి అవకాశం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సస్పెన్షన్ తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. అనంతరం ఈ సెషన్ ముగిసేవరకూ జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్టు సభాపతి ప్రకటించారు. ఆ తర్వాత కూడా అధికార విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. సస్పెన్షన్‌పై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లారు. అయినా అవకాశం ఇవ్వకపోవడంతో మూకుమ్మడిగా సభ నుంచి నిష్క్రమించారు.

అసలేమైంది..?

ఉదయం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జగదీశ్‌రెడ్డి మాట్లాడుతుండగా (ఈ సమయంలో 4 బర్రెల కథ చెప్పారు)..అధికార పక్షం (మధ్యలో) మాట్లాడకుండా ఉండాలంటే చర్చను పక్కదారి పట్టించవద్దని స్పీకర్ అన్నారు. దీంతో 'నేను గవర్నర్ ప్రసంగంపై చర్చ నుంచి అక్షరం పక్కకు పోయినట్టు తేల్చండి. ఈ సభలో ఉండమంటే ఉంటా..పొమ్మంటే పోతా..' అంటూ జగదీశ్‌రెడ్డి ఆవేశంతో తన చేతిలో ఉన్న నోట్స్‌ను కుర్చీకేసి విసిరికొట్టారు. దీంతో స్పీకర్‌ని బెదిరిస్తూ చేసిన వ్యాఖ్యలను జగదీశ్‌రెడ్డి వెనక్కి తీసుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. 'అసహనానికి గురికాకుండా సహనంతో మాట్లాడండి. సభా సంప్రదాయాలను కాపాడండి. మీరు సీనియర్ శాసనసభ్యులు. మంత్రిగా పదేళ్లు పని చేశారు. మీరీ విధంగా మాట్లాడడం, సభా సంప్రదాయాలను తప్పుదోవ పట్టించడం మంచిది కాదు..' అని జగదీశ్‌రెడ్డిని ఉద్దేశించి స్పీకర్ అన్నారు. 'ఏ సభా సంప్రదాయానికి విరుద్ధంగా మాట్లాడానో మీరు చెబితే ఆ తర్వాత నేను మాట్లాడుతా..' జగదీశ్‌రెడ్డి అన్నారు. దీంతో 'నన్ను ప్రశ్నించడమే సభా సంప్రదాయాలకు విరుద్ధం' అని స్పీకర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే జగదీశ్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో సభలో వాతావరణం వేడెక్కింది.

జగదీశ్‌రెడ్డి అన్నదాంట్లో తప్పేం ఉంది?: హరీశ్‌రావు

బీఆర్ఎస్ సభ్యుడు, మాజీమంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ..'సభ్యులందరికీ సమాన హక్కులుంటాయని, సభ అంటే ఒక కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి సంబంధించింది కాదని, ప్రతిపక్ష సభ్యులకు కూడా సమాన హక్కులుంటాయని జగదీశ్‌రెడ్డి అన్నారు. ఇందులో తప్పేం ఉంది..' అని ప్రశ్నించారు.

మీరు చేయలేనిది మేం చేశాం: శ్రీధర్‌బాబు

2014–15లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేయలేకపోయిందో తాము సంవత్సర కాలంలో చేసి చూపెట్టామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. 'వాళ్లు వ్యంగ్యంగా నవ్వుతున్నారు. వారి విషయంలో ప్రజలు వ్యంగ్యంగా నవ్వారు కాబట్టే మేము ఇక్కడ (అధికారంలో) ఉన్నాం..' అని వ్యాఖ్యానించారు. పచ్చకామెర్ల వ్యాధి ఉన్న వారికి దేశమంతా పచ్చగా కనిపించినట్టు ఎన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినా జగదీశ్‌రెడ్డికి కనిపించడం లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు.

దళితుడిని సీఎం చేశారా?: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

దళితుడిని సీఎం చేయకపోతే నా మెడ మీద తల ఉండదని 10 వేల సార్లు అన్న కేసీఆర్ ఎందుకు చేయలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిలదీశారు. దళితులకు 3 ఎకరాల భూమి ఇస్తా అని ఇచ్చావా? అని కేసీఆర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. దళితుడు (భట్టి విక్రమార్క) ప్రతిపక్ష నాయకుడిగా ఉంటే సంతలో పశువుల్లాగా ఎమ్మెల్యేలను కొని ప్రతిపక్ష హోదా లేకుండా చేసి దళిత వ్యతిరేకి అని నిరూపించుకున్నవు అని అన్నారు. బీసీ కులగణన చేస్తే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పాల్గొనలేదని, వారికి ప్రజలపై ప్రేమలేదన్నారు.

మమ్మల్ని రమ్మంటారా? వద్దా?: తలసాని

సభ సంప్రదాయాలను అధికారపక్షం పాటించకపోతే ఎలా? అని బీఆర్ఎస్ సభ్యుడు తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రశ్నించారు. జగదీశ్‌రెడ్డి మాట్లాడుతుంటే అడ్డుకోవడం సరికాదన్నారు. సభకు తమను రమ్మంటారా? వద్దంటారా? చెప్పాలని స్పీకర్‌ను ప్రశ్నించారు. అయితే జగదీశ్‌రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని, ఆయన్ను సస్పెండ్ చేయాలని మంత్రులు, అధికారపక్ష సభ్యులందరూ ట్రెజరీ బెంచీల వద్ద నిలబడి నినాదాలతో హోరెత్తించడంతో సభ దద్దరిల్లింది. తీవ్ర గందరగోళ పరిస్థితుల మధ్య సభను 15 నిమిషాలు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. అనంతరం సాయంత్రం 3.35కు సమావేశమైన తర్వాత జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై మాట్లాడేందుకు కాంగ్రెస్ సభ్యులను అనుమతించారు.

జగదీశ్‌రెడ్డి చెప్పిన 4 బర్రెల కథ

'ఓ తండా వద్ద తవ్విన బావివద్దకు వెళ్లి ప్రజలకు గవర్నర్ ప్రసంగం చదివి వినిపించిన. అది విన్న వెంకటరాములు, రాజయ్యలు వారి ఊళ్లో ఉండే వెంకటయ్య కథతో పోల్చారు..మా అమ్మగారి ఇంటికి పాలుపోసి తీరుతా..అని నేను అంటే నా భర్త కొట్టిండని వెంకటయ్య భార్య సర్పంచ్‌కి ఫిర్యాదు చేసింది. మీకు బర్రెలే లేవు..పాలు ఎక్కడివి అని సర్పంచ్ అడిగితే నాకు నాలుగు బర్లున్నాయి అని వెంకటయ్య అన్నడు. పోయిన బర్రె దొరికితే, సచ్చింది బతికితే, మా అత్తగారు ఒకటి ఇస్తే, నేను ఒకటి కొంటే.. నాలుగైతయి అన్నడు. గవర్నర్ ప్రసంగం కూడా ఇలానే ఉందని ఆ గ్రామస్తులు అన్నరు..' అని జగదీశ్‌రెడ్డి చెప్పారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, ఆటో కార్మికులకు రూ.12 వేలు, అక్కచెల్లెళ్లకు రూ.2500, రైతులకు బోనస్, తులం బంగారం, స్కూటీలు, 2లక్షల ఉద్యోగాలు ఇచ్చారా? అని నిలదీయడంతో వివాదం ప్రారంభమైంది. 'గవర్నర్ ప్రసంగాన్ని ఏఐ, చాట్ జీపీటీతో తయారు చేసినట్టు ఉంది. మనసు కవి ఆత్రేయ బతికి ఉంటే ..ప్రభుత్వాలు ఇంత మనస్సు లేకుండా పనిచేస్తాయా? అని చూసి ఆత్మహత్య చేసుకునేవారు. గవర్నర్‌తో 36 నిమిషాల్లోనే 360 అవాస్తవాలు మాట్లాడించారు.' అని అంతకుముందు విమర్శించారు.

బడ్జెట్ సమావేశాలు బహిష్కరిద్దామా?!

- నేడు కేసీఆర్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశం
- రాష్ట్ర వ్యాప్త నిరసనలకు కేటీఆర్ పిలుపు

సాక్షి, హైదరాబాద్: శాసనసభ బడ్జెట్ సమావేశాలు ముగిసేంతవరకు తమ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా పరిగణిస్తోంది. జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై అధికార పక్షం ఉద్దేశపూర్వకంగానే వివాదం సృష్టించిందని ఆ పార్టీ భావిస్తోంది. రెండురోజుల క్రితం జరిగిన సీఎల్పీ భేటీలో సీఎం ఆదేశాల మేరకు బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌కు కుట్ర పన్నిందని ఆరోపిస్తోంది. కేవలం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపైనే కాకుండా బీసీ, ఎస్సీ రిజర్వేషన్లు, బడ్జెట్‌పై జరిగే చర్చల్లోనూ బీఆర్ఎస్ గొంతు నొక్కేందుకే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ అస్త్రాన్ని ప్రయోగించిందని బీఆర్ఎస్ శాసనసభా పక్షం నేతలు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇకపై బడ్జెట్ సమావేశాలకు హాజరు కావాలా వద్దా అనే విషయంపై మల్లగుల్లాలు పడుతోంది. ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేయడంపై దృష్టి సారించింది. అవసరమైతే స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలనే అభిప్రాయంపైనా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చర్చించారు. హోలీ పండుగ సందర్భంగా అసెంబ్లీకి శుక్రవారం విరామం ప్రకటించిన నేపథ్యంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో భేటీ కానున్నారు. అసెంబ్లీలో జరిగిన పరిణామాలను ఆయనకు వివరించనున్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకు నడుచుకోవాలని నిర్ణయించారు. మరోవైపు జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేసినందుకు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కేటీ రామారావు పిలుపునిచ్చారు.

లాబీలో ఉత్కంఠ.. కేసీఆర్‌కు ఫోన్

జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో ఉదయం 11.45 గంటలకు సభ వాయిదా పడిన తర్వాత.. అధికారపక్షం ఎలాంటి చర్యలకు ఉపక్రమించవచ్చన్న దానిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉత్కంఠతో గడిపారు. మధ్యలో కేటీఆర్, హరీశ్‌లు పార్టీ అధినేత కేసీఆర్‌కు ఫోన్‌చేసి పరిస్థితిని వివరించారు. సభ నుంచి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేస్తారేమో అన్న అనుమానాన్నీ వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సుధీర్‌రెడ్డితో కలిసి స్పీకర్ చాంబర్‌కు వెళ్లి జగదీశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన రికార్డులు ఇవ్వాల్సిందిగా కోరారు. సభను సుదీర్ఘంగా ఎందుకు వాయిదా వేశారని స్పీకర్‌ను అడిగినా స్పందించ లేదని హరీశ్‌రావు చెప్పారు.

చీఫ్ మార్షల్‌తో వాగ్వాదం

సస్పెన్షన్ నేపథ్యంలో సభ నుంచి బయటకు వచ్చిన జగదీశ్‌రెడ్డి లాబీల్లోని ప్రతిపక్ష నేత కేసీఆర్ చాంబర్‌కు చేరుకున్నారు. అక్కడకు చేరుకున్న అసెంబ్లీ చీఫ్ మార్షల్ కరుణాకర్ అసెంబ్లీ నుంచి బయటకు వెళ్లాల్సిందిగా ఆయన్ను కోరారు. దీంతో అసెంబ్లీ పరిసరాల్లోకి రావద్దని స్పీకర్ తనను ఆదేశించలేదని జగదీశ్‌రెడ్డి వాదించారు. సభ నుంచి బయటకు వచ్చిన కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర ఎమ్మెల్యేలు కూడా చీఫ్ మార్షల్‌తో కొంతసేపు వాదనకు దిగారు.

కాంగ్రెస్ డిఫెన్స్‌లో పడింది: హరీశ్‌రావు

జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను అవమానించలేదని, 'సభ మీ ఒక్కరిది కాదు.. అందరిదీ..'అని అన్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. అసెంబ్లీ లాబీల్లో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. 'జగదీశ్‌రెడ్డి అన్‌పార్లమెంటరీ పదాలు ఉపయోగించలేదు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నిరసన ఎందుకు చేశారో, సభ ఎందుకు వాయిదా పడిందో తెలియదు. కాంగ్రెస్ డిఫెన్స్‌లో పడి సభ్యుల సస్పెన్షన్‌కు సిద్ధమవుతోంది. 15 నిమిషాల పాటు సభ వాయిదా అంటూ గంటల తరబడి నడపకపోవడం సభా సాంప్రదాయాలకు మంచిది కాదు. జగదీశ్‌రెడ్డి తప్పు మాట్లాడి ఉంటే విచారం వ్యక్తం చేస్తాం. అన్ని పక్షాల నేతల సమక్షంలో జగదీశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వినిపించాలని కోరినా స్పీకర్ స్పందించలేదు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు అవకాశం ఇవ్వకుండా కాంగ్రెస్ అడ్డుపడుతోంది..'అని చెప్పారు.

స్పీకర్ గౌరవాన్ని కాంగ్రెస్ తగ్గించింది

అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, సబిత, సునీతా లక్ష్మారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మధుసూదనాచారి తదితరులు

కవాడిగూడ (హైదరాబాద్): బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అనని మాటలను అన్నట్టుగా చూపించి ప్రభుత్వం ఆయనను అసెంబ్లీ నుంచి అక్రమంగా సస్పెండ్ చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులు ఉంటే కాంట్రాక్టులు, కమీషన్లు, ఢిల్లీకి మూటల విషయాలు చర్చకు వస్తాయనే భయంతోనే తమ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. గురువారం జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ట్యాంక్‌బండ్‌పై అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కేటీఆర్, హరీశ్‌రావు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గవర్నర్ ప్రసంగంలో నిజాలు లేవంటూ జగదీశ్‌రెడ్డి మాట్లాడుతున్న సమయంలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బాధ్యతారహితంగా వ్యవహరించి ఆయన ప్రసంగానికి అంతరాయం కలిగించారన్నారు. జగదీశ్‌రెడ్డి స్పీకర్‌పై ఎలాంటి తప్పుడు పదాలు ఉపయోగించలేదని, స్పీకర్‌ను ఎక్కడా అగౌరవ పర్చలేదని చెప్పారు. ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నియంతృత్వ పోకడలతో అసెంబ్లీని వాయిదా వేశారని విమర్శించారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తోంది

ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ పార్టీ ఖూనీ చేస్తోందని, ప్రజాస్వామ్యంలో ఇది చీకటి రోజని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే సస్పెండ్ చేస్తారా అని ప్రశ్నించారు. అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌ను కాంగ్రెస్ ప్రతిపాదించినప్పుడు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడాలేని విధంగా 125 అడుగుల ఎత్తు అంబేడ్కర్ విగ్రహాన్ని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి రాష్ట్ర సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. సస్పెండ్ చేసిన సభ్యుడిని వివరణ అడగకుండా సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. సీఎం డైరెక్షన్‌లో మంత్రి శ్రీధర్‌బాబు యాక్షన్ నడుస్తోందని ఎద్దేవాచేశారు. ఈ నిరసనలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, బండారి లక్ష్మారెడ్డి, కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, సురభి వాణీదేవి, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

పాలన చేతకాకపోతే రాజీనామా చేసి ప్రజాతీర్పు కోరండి

ప్రభుత్వానికి ఏలేటి సవాల్



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో రాష్ట్రాన్ని నడపడం చేతకాదని అధికారపార్టీ ఒప్పుకుని రాజీనామా చేసి మళ్లీ ప్రజాతీర్పు కోరాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. రాష్ట్ర ఆర్థికస్థితి ఎలా ఉందో తెలియకుండానే అసెంబ్లీ ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చారా అని ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ, రైతుకూలీలకు ఇందిరమ్మ ఆత్మీయభరోసా, మహిళలకు నెలకు రూ.రెండున్నరవేలు, కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, యువతకు భృతి, కొత్త పింఛన్లు.. ఇలా ఏ ఒక్క ప్రధాన హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. కేవలం హైడ్రా కూల్చివేతలు, బలహీనవర్గాల భూములను తిరిగి తీసుకోవడం వంటి వాటికే కాంగ్రెస్ ప్రభుత్వం పరిమితమయిందని చెప్పారు. గురువారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ...గవర్నర్ ప్రసంగం అంటే ఓ విజన్ డాక్యుమెంట్‌గా ఉండాలని.. కానీ ప్రభుత్వం చేపట్టబోయే కార్యక్రమాల గురించి ఇందులో ప్రస్తావించలేదన్నారు. ఈ ప్రసంగం మాటలకే పరిమితమైందేతప్ప ఎక్కడా సుపరిపాలన కనిపించలేదన్నారు. గత ప్రభుత్వం ఏడున్నర లక్షల కోట్ల అప్పు చేస్తే, ఈ సర్కార్ 15 నెలల్లోనే రూ.1.42 లక్షల కోట్లు అప్పుచేసిందని విమర్శించారు.

ఐదుగురు ఎమ్మెల్సీలు ఏకగ్రీవం

ధ్రువపత్రాలు అందజేసిన రిటర్నింగ్ అధికారి

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటా కింద ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నామినేషన్ వేసిన అయిదుగురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు వారికి గురువారం రిటర్నింగ్ అధికారి ధ్రువపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే కోటాలో ఈ నెల 29న ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానుండగా.. వాటిని భర్తీ చేసేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఐదు స్థానాలకు ఐదుగురు అభ్యర్థులు మాత్రమే బరిలో మిగలడంతో.. వారందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో కాంగ్రెస్ నుంచి విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం, బీఆర్ఎస్ నుంచి దాసోజు శ్రవణ్ ఉన్నారు. వీరికి రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు సమక్షంలో ధ్రువపత్రాలు అందజేశారు. ఎన్నికైన ఎమ్మెల్సీలు ఈ నెల 29 తర్వాత.. ప్రమాణ స్వీకారం చేస్తారు.

సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పెద్దపీట

- విలువలపై బీఆర్ఎస్ మాట్లాడటం హాస్యాస్పదం
- దళితులను అవమానించడం ఆ పార్టీకి అలవాటు
- విజయశాంతి గురించి మాట్లాడే అర్హత వారికి లేదు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



విలేకరుల సమావేశంలో మహేశ్‌గౌడ్, విజయశాంతి, అద్దంకి, శంకర్‌నాయక్

సాక్షి, హైదరాబాద్: సామాజిక న్యాయానికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ అని, అందుకే ఎమ్మెల్సీల ఎంపికలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశామని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. శాసనమండలికి ఏకగ్రీవంగా ఎన్నికైన ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, విజయశాంతి, కె.శంకర్‌నాయక్‌లతో కలసి గురువారం సాయంత్రం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఓవైపు సామాజిక న్యాయం కోసం కృషి చేస్తుంటే, ప్రతిపక్ష బీఆర్ఎస్ మాత్రం బడుగు, బలహీన వర్గాలను కించపరిచేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. దళిత వర్గానికి చెందిన నాయకుడిని అత్యున్నతమైన అసెంబ్లీ స్పీకర్ స్థానంలో కూర్చోబెడితే ఆయనను అవమానపరిచేలా బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి వ్యవహరించడం సరైంది కాదన్నారు. దళితులను అవమానపరచడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం, రాజకీయ విలువల గురించి బీఆర్ఎస్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన కారణంగానే అనివార్య పరిస్థితుల్లో భయపడి బీసీ వర్గానికి చెందిన దాసోజు శ్రవణ్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసిందన్నారు. కాగా, విజయశాంతిని విమర్శించే అర్హత ప్రతిపక్ష పార్టీలకు లేదని మహేశ్‌గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో విజయశాంతి పాత్ర కీలకమని, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా ఆమె విస్తృత ప్రచారం చేశారని గుర్తు చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క మహిళా మంత్రి కూడా లేని విషయాన్ని మహేశ్‌గౌడ్ గుర్తు చేశారు.

మంత్రి ఉత్తమ్ క్షమాపణ చెప్పాలి

కక్ష సాధింపులో భాగంగానే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్: హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ అంశంలో నిండు శాసనసభను తప్పుదోవ పట్టించిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు 'ఎక్స్'వేదికగా డిమాండ్ చేశారు. 'మంత్రి ఉత్తమ్ పార్లమెంట్ ఎథిక్స్ కమిటీ మెంబర్‌గా ఉన్న సమయంలోనే మహువా మొయిత్రా లోక్‌సభ సభ్యత్వం రద్దు జరిగింది. గతంలో రద్దును అన్యాయం, రాజ్యాంగ విరుద్ధమని ఆయన అసమ్మతి నోటు ఇచ్చిన విషయాన్ని దాచి పెట్టారు. మహువా మొయిత్రాను వ్యక్తిగత ద్వేషం, ప్రతీకార చర్యల్లో భాగంగానే బహిష్కరించారని కూడా ఉత్తమ్ తన నోట్‌లో పేర్కొన్నారు. గవర్నర్‌పై దాడి చేసిన విషయంలో గతంలో ఎమ్మెల్యేలు సంపత్ కుమార్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని బహిష్కరించిన సందర్భంలోనూ అది తప్పుడు చర్య అని, ఈ విషయంలో రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామని పీసీసీ చీఫ్ హోదాలో నాడు ఉత్తమ్ ప్రకటించారు. ఇప్పుడు ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరడం ఉత్తమ్ కక్ష సాధింపు చర్యలను ప్రతిబింబిస్తోంది. ఆయన తీరు ప్రతిపక్షంలో ఒకలా, అధికారంలోకి వచ్చిన తర్వాత మరొకలా ఉంది'అని మండిపడ్డారు.



అమ్మ శ్రమలో ఎన్ని రంగులో!

ఉదయాన్నే అమ్మ వేసే ముగ్గు రంగు తెలుపు. చల్లే కళ్లాపి ఆకుపచ్చ.
గడపకు రాయాల్సింది పసుపు. నాన్నకు పెట్టాలి గోధుమ రంగు టీ.
బాబు షూస్ పాలిష్ చేయాలి కదా నల్లగా. పాపాయికి కట్టాలి ఎర్ర రిబ్బన్.
బట్టల సబ్బు రంగు నీలం. వంట గది నిండా మెటాలిక్ కలర్ పాత్రలే.
కాటుక, తిలకం కంటే ముందు అమ్మకు అంటేది శ్రమ తాలూకు రంగులే.
లోకానికి ఒకటే హోలీ. అమ్మకు నిత్యం హోలీ.
నేడు అమ్మకే చెప్పాలి రంగు రంగుల కృతజ్ఞత.

ప్రతి ఒక్కరి జీవితంలో రంగు రంగుల కలలు ఉంటాయి. అయితే స్త్రీలు ఆ రంగుల కలలను అందుకోవడంలో కొన్ని అడ్డంకులు ఉంటాయి. పరిమితులు ఎదురవుతాయి. వారు ఈ రంగులకు మాత్రమే అర్హులు అనే కనిపించని నియమాలు ఉంటాయి. పరిస్థితి చాలా మారినా స్త్రీ ఏదో ఒకదశలో రాజీ పడాలి. అయితే భారతీయ స్త్రీ ఆ రాజీని ఇష్టంగానే స్వీకరిస్తుంది. ముఖ్యంగా వివాహం అయ్యాక, తల్లిగా మారాక తాను కన్న రంగుల కలలన్నీ తన సంతానానికి ఇచ్చేస్తుంది. భర్త, పిల్లల సంతోషంలో తన సంతోషం వెతుక్కుంటుంది. వారి కేరింగ్ కోసం రోజూ అంతులేని శ్రమ చేస్తుంది. ఆ పనుల్లోనే ఆమెకు రంగుల ప్రపంచం తెలియకుండానే ఎదురవుతుంటుంది. అమ్మకు రంగులు తోడవుతాయి. అవి ఆమెను అంతో ఇంతో ఉత్సాహ పరచడానికి ప్రయత్నిస్తాయి. కావాలంటే గమనించండి.

అమ్మ శ్రమలో తెలుపు రంగు అడుగడుగునా ఉంది. ఆమె నిద్ర లేవడమే పాలు పోయించుకోవాలి. ముగ్గు వేయాలి. పిల్లలకు స్కూలుకు సిద్ధం చేసి తెల్లటి పౌడర్ రాయాలి. వెన్న కంటే తెల్లనైన ఇడ్లీల కోసం రాత్రే పిండి గ్రైండర్‌లో వేసుకోవాలి. తెల్ల యూనిఫామ్ ఉతికి సిద్ధం చేయాలి. తెల్లటి ఉప్పు, పంచదార తాకకుండా ఆమెకు జీవితం గడవదు. మునివేళ్లకు ఆ తెల్లరంగు పదార్థాలు తాకుతూనే ఉంటాయి. ఎండలో వడియాలూ? టెంకాయ తెచ్చి పగులగొట్టి కొబ్బరి తీయడం ఆమెకు గాక ఇంటిలో ఎవరికీ రాదు. రాత్రిళ్లు అత్తామామలకు పుల్కాల కోసం ఆశీర్వాద్ ఆటాతో చేతులు తెల్లగా చేసుకోవాలి. ఆమే అన్నపూర్ణ. తెల్లటి అన్నం ఆమె చేతి పుణ్యం. ఆ వెంటనే ఆమెకు ఆకుపచ్చ ఎక్కువగా కనపడుతుంటుంది. కూరగాయలన్నీ ఆ రంగువే. ఇంట్లో మొక్కలకు ఆమే నీరు పోయాలి. ఆకుపచ్చ డిష్ వాషర్‌ను అరగదీసి గిన్నెలు కడిగి కడిగి చేతులు అరగదీసుకోవాలి. హెల్త్ కాన్షియస్‌నెస్ ఉన్న భర్త రోజూ ఆకుకూరలు ఉండాల్సిందే అంటాడుగాని పొన్నగంటి కూరో, కొయ్య తోటకూరో ఆకులు తుంచి కవర్‌లో వేయమంటే వేయడు. చేస్తే తప్ప ఆ పని ఎంత పనో తెలియదు.

ఎరుపు రంగు అమ్మ పనిలో భాగం. ఇంటికి ఆమె ఎర్రటి జాజుపూతను అలుకుతూ ఉంటే వాకిలి నిండా మోదుగుపూలు రాలినట్లు అనిపిస్తుంది. అమ్మ ఉదయాన్నే స్నానం చేసి, దేవుడి పటాల ముందు నిలిచి అరుణ కిరణం లాంటి ఎర్రటి కుంకుమను వేలికొసతో అందుకొని, నుదుటి మీద దిద్దుకొని, దీపం వెలిగించాకే దేవుడు ఆవులిస్తూ నిద్రలేచేది. అమ్మ మునివేళ్ల మహిమకు సూర్యుడు కూడా ఆమె పాపిట్లో సిందూరమై ఒదిగిపోతాడు. ఎర్రటి ఆవకాయలు, పచ్చళ్లు చేతులను మంట పుట్టించినా అమ్మ చిర్నవ్వు నవ్వుతూనే ఉంటుంది. ఆమె చేయి కోసిన టొమాటోలు ఎన్ని వేలో కదా.

పసుపు
ఇంటికీ, అమ్మకూ శుభకరం.
పిల్లలకు చిన్న దెబ్బ తగిలినా పసుపు డబ్బా తీసుకుని అమ్మ పరిగెడుతుంది. తీరిక ఉన్నప్పుడు గడపలకు రాస్తుంది. తను తాగినా తాగకపోయినా పిల్లలకు పాలలో కలిపి ఇస్తుంది. ఇక బ్లూ కలర్ అమ్మకే అంకితం. గ్యాస్ స్టవ్ మీద నీలం రంగు మంట ఆమెను ఎప్పటికీ వదలదు. ఇక జీవితాంతం బట్టల సబ్బు, సర్ఫ్‌ను వాడుతూ బట్టలు శుభ్రం చేయడమో చేయించడమో చేస్తూనే ఉండాలి. కనీసం హార్పిక్ వేసి టాయిలెట్లు కడగరు ఇంటి సభ్యులు. అదీ అమ్మ వాకిరే. నీలి మందు వేసి తెల్లవి తళతళలాడించడం, ఇస్త్రీ చేయించడం ఆమెకు తప్పదు. బట్టల హోమ్‌వర్క్‌లు చేయిస్తే బాల్‌పాయింట్ పెన్నుల నీలి గుర్తులు ఆమె చేతుల మీద కనిపిస్తాయి. ఇక నలుపు ఆమెకు ఏం తక్కువ. బూజు నుంచి అంట్ల మసి వరకు ఆమెకు ఎదురుపడుతూనే ఉంటుంది.

అయితే అమ్మకు తనకంటూ కొన్ని రంగులు ఇష్టం. గోరింట పండితే వచ్చే ఎరుపు ఇష్టం.. మల్లెల తెలుపు ఇష్టం... తన ఒంటిపై మెరిసే నగల బంగారు వర్ణం ఇష్టం, మట్టి గాజుల రంగులు ఇష్టం, పట్టీల వెండి వర్ణం ఇష్టం, గోర్ల రంగులు ఇష్టం, కురుల నల్ల రంగు ఇష్టం, తాంబూలపు ఎరుపు ఇష్టం, కొద్దిగా మొహమాట పడినా లిప్‌స్టిక్ రంగులూ ఇష్టమే.

ఇవాళ హోలీ. కనీసం ఇవాళ అయినా అమ్మకు విశ్రాంతినిచ్చి ఆమెకు ఇష్టమైన రంగుల్లో ఇష్టమైన బహుమతులు ఇచ్చి థ్యాంక్స్ చెప్పండి.

భువిపై విరిసే ఇంద్రధనుస్సు

ఇంద్ర ధనుస్సు నేలకు దిగి వచ్చిందా... అనిపించే రోజు హోలీ. సప్తవర్ణాలలో ఒక్కొక్కరికి ఒక్కో ప్రత్యేకమైన ఇష్టం ఉంటుంది. ఆ ఇష్టాన్ని తమ డ్రెస్సుల ద్వారా చూపుతుంటారు. సినిమా తెరపైన రంగు రంగుల దుస్తుల్లో కనిపించే తారలు తమకు ప్రత్యేకించి ఇష్టమైన రంగు గురించి ఈ హోలీ సందర్భంగా మనతో పంచుకుంటున్నారు.



గ్రీన్ అండ్ పర్పుల్

నాకు చాలా ఇష్టమైనది ఎల్లో. దీనిలోనే మరింత బ్రైట్‌గా ఉండే డ్రెస్సులను ఎంచుకుంటాను. దీంతో పాటు పర్పుల్, బ్లూ, గ్రీన్ కలర్స్ ఇష్టపడతాను. ఈ రంగులలోనే పీచ్ కలర్ డ్రెస్సులు ధరించినప్పుడు ఉల్లాసంగా అనిపిస్తుంది. అవి నన్ను ప్రత్యేకంగా చూపుతాయి అనే భావన ఉంటుంది

- రెజీనా కసండ్రా



మల్టీ కలర్స్

నా జీవితంలో ఇంద్రధనుస్సు రంగులన్నీ ఉండాలనుకుంటాను. ఎందుకంటే, మనలోని భావోద్వేగాలను తెలియజేప్పేవే రంగులు. సప్తవర్ణాలన్నీ నాకు ఇష్టమైనవే. అందుకే నా డ్రెస్సులలో మల్టీ కలర్స్ ఉండేలా ప్లాన్ చేసుకుంటాను. ఒక ప్లెయిన్ కలర్ శారీ లేదా డ్రెస్ వేసుకుంటే దాని మీదకు మల్టీకలర్ బ్లౌజ్, దుపట్టా ఉండేలా చూసుకుంటాను.

- సంయుక్త మీనన్



బ్లూ అండ్ పింక్

నాకు నచ్చిన రంగు పింక్. పెరుగుతున్న కొద్దీ అన్ని రంగులు నచ్చుతుంటాయి. కానీ, ఎక్కువ భాగం అయితే పింక్, బ్లూ కలర్స్ నా డ్రెస్సింగ్‌లోనూ చోటు చేసుకుంటుంటాయి.

- శివాత్మిక రాజశేఖర్



అన్ని రంగులను స్వాగతించే తెలుపు

నాకు తెలుపు రంగు చాలా ఇష్టం. శాంతి, కొత్త ప్రారంభాలు, అంతులేని అవకాశాలకు చిహ్నం తెలుపు. రంగులతో నింపుకోవడానికి వేచి ఉండే ఖాళీ కాన్వాస్ లాంటిది తెలుపు. ఇది అన్నింటినీ స్వాగతించే రంగు. అందుకే ఈ రంగు నాకు స్ఫూర్తిమంతమైనది కూడా. ప్రేమ, దయ, ఆనందాన్ని వ్యాప్తి చేసే ఈ వేడుక సందర్భంగా తెల్లని మన హృదయాలపైన అందమైన రంగులను చిలకరించుకుందాం.

- వైష్ణవి చైతన్య

హోలీ పండగ అంటే రంగులే కాదు జానపద సరాగాలు కూడా. 'హోలీ హోలీల రంగ హోలీ చెమ్మకేళీల హోలీ' 'కాముడొచ్చిండు వలలో... కందులెయ్యండీ వలలో'... ఎన్నెన్ని జానపదాలో! హోలీ అంటే వర్ణ వర్ణ సంబరమే కాదు... పురాణాల దగ్గరకు తీసుకువెళ్లే ద్వారం. హోలీ అంటే... బృందావనంలో రాధ ముఖానికి కృష్ణుడు రంగు పూసి, ఆకాశంలో ఇంద్రధనస్సును పూయించిన రోజు. ఆకాశమంత ప్రేమను వర్ణరాగాలతో చెప్పిన రోజు. హోలీ అంటే... మంచికి ఉన్న మహత్తర శక్తి ఏమిటో చెప్పిన రోజు. కొండంత హోలిక పిడికెడు బూడిదగా మారి... చెడుపై మంచి విజయాన్ని మళ్లీ మళ్లీ గుర్తు తెచ్చే రోజు. వసంత కాల అందాలతో అల్లరిగా పల్లవించి అద్భుతమైన రోజు....



రంగుల సంబరం

కలర్స్ ఎంపిక ఎందుకంటే!

ప్రతి ఒక్కరికి కొన్ని రంగులు అంటే ప్రత్యేకమైన ఇష్టం ఉంటుంది. అయితే, దుస్తుల విషయంలో మాత్రం కొన్ని రంగులు మాత్రమే వారి శరీరానికి నప్పే విధంగా ఉంటాయి. ఏ రంగు డ్రెస్ ఎవరికి నప్పుతుందంటే...



నవ్యశ్రీ మండవ, ఫ్యాషన్ డిజైనర్, హైదరాబాద్

సాధారణంగా చీరలు ఎంపిక చేసుకుంటున్నప్పుడు వాటిని మన మీద వేసుకొని, కలర్ బాగుంటుందా లేదా అని ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకొని తీసుకుంటుంటాం.

● కొంత మంది చర్మం ఫెయిర్‌గా ఉంటుంది. కానీ, డార్క్ కలర్స్ సెట్ అవవు. అలాంటప్పుడు లైట్ షేడ్స్ లేదా మల్టీ కలర్స్‌ని ఎంపిక చేసుకోవచ్చు. వీరు సేమ్ స్కిన్ టోన్ కలర్ డ్రెస్సులు ఈవెనింగ్ పార్టీలకు ధరిస్తే మరింత ఆకర్షణీయంగా కనిపిస్తారు ● డార్క్ స్కిన్ ఉన్నవారికి లేత రంగులు బాగుంటాయి అనుకుంటారు. కానీ, వీరికి డార్క్ కలర్స్ బాగుంటాటాయి ● తమకు నప్పే కలర్ డ్రెస్ ఎంపికకు డిజైనర్ సలహాలు తీసుకుంటారు. అలాంటి వారికి కలర్ కాన్సెప్ట్ గురించి వివరిస్తాం. వారి శరీర రంగు, సందర్భం, పార్టీ .. ఇవన్నీ పరిగణనలోకి తీసుకొని డిజైన్ చేస్తాం.

రీ యూజ్... ● రంగులు చల్లుకున్నాక వేసుకున్న డ్రెస్ మల్టీకలర్‌తో నిండిపోతుంది. ఆ డ్రెస్ పైన ఏ కలర్ భాగం ఎక్కువుందో చూసుకొని, ఆ రంగుతో డైయింగ్ చేయించి, తిరిగి వాడుకోవచ్చు.

వర్చువల్ హోలి



హోలి అంటే యువతరం పండగ. ఆనందం ఆకాశాన్ని అంటే పండగ. దీన్ని దృష్టిలో పెట్టుకొని వర్చువల్ హోలిని ముందుకు తెచ్చాయి శాంసంగ్,స్నాప్‌చాట్. సాంకేతికతకు, సంప్రదాయాన్ని జోడిస్తూ హోలి వేడుకలకు కొత్త రంగు జోడించాయి శాంసంగ్, స్నాప్‌చాట్ సంస్థలు. ఏఐ ఆధారిత ఏఆర్ లెన్స్‌తో హోలీ వేడుకలకు డిజిటల్ రంగును జోడించాయి. ఇంటరాక్టివ్ ఫేస్–పెయింటింగ్ ఎఫెక్ట్ ద్వారా హోలీ రంగులు వర్చువల్‌గా అనుభవంలోకి వస్తాయి. ఫైనల్ స్క్రీన్ డిస్‌ప్లేలో 'హోలి మెసేజ్' కనువిందు చేస్తుంది. '77 శాతం మంది హోలి వేడుకలను సృజనాత్మకంగా, కొత్తగా జరుపుకోవడానికి ఇష్టపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే వారు ఏఆర్ లెన్స్‌లను ఇష్టపడుతున్నారు' అంటుంది స్నాప్ ఇంక్ ఇండియా అడ్వర్‌టైజింగ్ హెడ్ నేహా జోలి. 'ప్రతి సంవత్సరం మా ఫ్రెండ్స్‌తో కలిసి హోలి బాగా ఆడేవాడిని. వారు వివిధ శాల్లో ఉండడం వల్ల ఆ సంతోషాన్ని మిస్ అవుతున్నాను' అని ఇక ముందు బాధపడనక్కర్లేదు. ఫ్రెండ్స్ ఆ మూల ఒకరు ఈ మూల ఒకరు ఉన్నా సరే, వర్చువల్ హోలి పుణ్యమా అని పండగ సంతోషాన్ని సొంతం చేసుకోవచ్చు. వర్చువల్ హోలి పార్టీలు ఇప్పుడు ట్రెండ్‌గా మారాయి!

నలభై రోజుల హోలీ!

● ఉత్తరాఖండ్‌లో హోలీని 'కుమావోనీ' హోలీగా జరుపుకుంటారు. ఇది బసంత్ పంచమితో ప్రారంభమయ్యే నెలరోజుల ఉత్సవం. దీన్ని బైతక్ హోలీ, నిర్వాన్ హోలీ అని కూడా పిలుస్తారు ● శివుడు కొలువు తీరిన వారణాసిలో శ్మశానంలో దొరికే బూడిదతో హోలీ వేడుకలు జరుపుకుంటారు. ఈ హోలీని 'మసన్ హోలీ' అని పిలుస్తారు ● రాజస్థాన్‌లోని జోథ్‌పూర్‌లో చారిత్రాత్మకమైన 'ఘన్‌శ్యామ్ జీ మందిర్' ప్రాంతంలో హోలీ ఉత్సవాన్ని 40 రోజుల పాటు జరుపుకుంటారు. ఈ హోలీ ఉత్సవాలను చూడడానికి స్థానికులే కాదు విదేశీయులు కూడా వస్తారు. ఈ ఆలయాన్ని 1718లో నిర్మించారు ● పండగకి రెండు రోజుల ముందే ఉత్తర్‌ప్రదేశ్‌లోని బృందావన్‌లో వితంతువులు హోలీ వేడుకలు మొదలుపెడతారు ● ఉత్తర్‌ప్రదేశ్‌లో 'లాఠ్మార్ హోలీ' వేడుకలు జరుగుతాయి. పురుషులను కర్రలతో తరుముతూ, వారిని రెచ్చగొట్టేలా మహిళలు పాటలు పాడతారు ● హోలీని మన దేశంలోనే కాదు నేపాల్, శ్రీలంకలాంటి దేశాల్లోనూ జరుపుకుంటారు. నేపాల్‌లో 'ఫోటే ఉత్సవ్' అని, శ్రీలంకలో 'పులంగి' అనీ పిలుస్తారు.

హోలీ... అరవై వేల కోట్ల వ్యాపారం!

గత ఏడాదితో పోల్చితే 20 శాతం వృద్ధితో ఈ సంవత్సరం హోలీ పండగకు సంబంధించి రూ.60,000 కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా. మూలికరంగులు, పండగ వస్తువులు, స్వీట్లు, వాటర్ గన్స్, బెలూన్స్, వైట్ టీ–షర్ట్‌లు, కుర్తా–పైజామాలు, హ్యాపీ హోలి స్లోగన్‌లతో ఉన్న టీ–షర్ట్‌లు... మొదలైన వాటికి పెరిగిన డిమాండ్ దేశవ్యాప్తంగా హోలీ పండగ వాణిజ్యాన్ని పెంచింది. ఈ డిమాండ్ రిటైలర్‌లు, చిన్న వ్యాపారులకు గణనీయంగా ప్రయోజనం చేకూరుస్తుందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్(సిఎఐటి) తెలియజేసింది.

'రంగుల' రాట్నం

● పురాతన కాలంలో గ్రీస్‌లో 'నీలం' రంగుకు నేరుగా సరిపోయే పదం లేదు. దగ్గరి వర్ణనలు మాత్రమే ఉండేవి ● ఆఫ్రికా ఎడారి తెగ ప్రజలు 'ఎరుపు' వర్ణాన్ని ఆరు పేర్లతో పిలుస్తారు ● పురాతన కాలంలో ఈజిప్షియన్‌లు, మాయన్‌లు వేడుకలలో తమ ముఖానికి ఎరుపు రంగు పూసుకోవడం తప్పనిసరిగా ఉండేది. రోమన్ సైన్యాధిపతులు తమ విజయాలను సెలబ్రేట్ చేసుకోవడానికి శరీరానికి ఎరుపురంగు వేసుకునేవారు ● కలర్ అసోసియేషన్‌ల ద్వారా వ్యక్తిత్వ లోపాలను నిర్ధారించేవాడు... డాక్టర్ మాక్స్ లుషర్. ● వన్స్ అపాన్ ఏ టైమ్ రోమన్‌ల కాలంలో క్యారెట్‌లు ఊదా, తెలుపు రంగులలో ఉండేవి. మధ్య యుగాలలో నలుపు, ఆకుపచ్చ రంగులలో కూడా ఉండేవి

● కలర్ మ్యాజిక్ వర్డ్స్: సెలాడాన్–లేత ఆకుపచ్చ రంగు, ల్యూటీయన్–డీప్ ఆరెంజ్, కెర్మెస్–ప్రకాశవంతమైన ఎరుపు, సినోపర్–ముదురు ఎరుపు–గోధుమ రంగు, స్మాల్ట్–డీప్ బ్లూ.

71 సంవత్సరాల సినీ హోలీ పాట!

తెలుగు సినిమా పాటల్లో హోలీ సంబరం కనిపిస్తుంది. మచ్చుకు కొన్ని పాటలు... ● మణిరత్నం–కమల్ హాసన్ 'నాయకుడు' సినిమాలోని హోలీ పాట 'సందె పొద్దు మేఘం పూలజల్లు కురిసెను నేడు' ప్రతి హోలీ సందర్భంగా ఎక్కడో ఒకచోట వినిపిస్తూనే ఉంటుంది ● జూనియర్ ఎన్టీఆర్ సినిమా 'రాఖీ'లో 'రంగ్ బర్‌సే' హోలీ పాట బాగా పాపులర్ ● నాగార్జున 'మాస్' సినిమాలోని 'రంగు తీసి కొట్టు' హోలీ పండగ రోజున చెవిన పడాల్సిందే ● వెంకటేష్ 'జెమిని'లో 'దిల్ దివానా... మై హసీనా' హోలీ నేపథ్యంలో వినిపిస్తుంది ● 71 సంవత్సరాల హోలీ సాంగ్... ప్రణయ విలాసములే. శివాజీ గణేషన్ సినిమా 'మనోహర' సినిమాలోనిది ఈ పాట.

పురాణాల్లో హోలీ

కృతయుగంలో రఘునాథుడనే సూర్యవంశపు రాజు ఉండేవాడు. పసిపిల్లలను 'హోలిక' అనే రాక్షసి హింసిస్తోందని ప్రజలు రాజుకు విన్నవించుకున్నారు. అదే సభలో ఉన్న నారద మహాముని 'ప్రతి సంవత్సరం ఫాల్గుణ పౌర్ణమినాడు హోలికను పూజించిన పసిపిల్లలకు బాధలు ఉండవు' అని చెప్పాడు. ఆనాటి నుంచి ఈ హోలీ ఉత్సవం జరుగుతోందని ప్రతీతి.

కాముని పున్నం

శివుని భార్య సతీదేవి దక్ష ప్రజాప్రతి యజ్ఞంలో దేహాన్ని విసర్జింపగా శివుడు విరాగియై హిమవత్ పర్వతంపై తపస్సు చేయసాగాడు. రాక్షసుల బాధలు పడలేని దేవతలు తపస్సులో ఉన్న శివుడి దీక్షను విరమింపజేసేందుకు ప్రయత్నించారు. పార్వతిగా పుట్టిన సతీదేవిపై శివుడికి ప్రేమ కలిగించవలసిందిగా దేవతలు మన్మథుణ్ణి కోరారు. మన్మథుడు తన భార్య రతీదేవి మిత్రుడు వసంతుడితో కలిసి హిమవంతం చేరాడు. పార్వతీదేవి సపర్యలు చేస్తున్న సమయంలో శివుడిపై మన్మథుడు పుష్పబాణాలు ప్రయోగించాడు. తన దివ్యదృష్టితో కాముని చర్యలు గ్రహించిన శివుడు కోపంతో ముక్కంటితో దహించాడు. కాముడి రూపంలో ఉన్న మన్మథుడిని దహించి వేయడాన్ని 'కాముని దహనం' 'కాముని పున్నం'గా ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున ప్రజలు పండుగ చేసుకుంటారు.

చెడు అంతానికి సంకేతం

వద్దని చెప్పినా శ్రీమహావిష్ణువునే స్మరిస్తున్న ప్రహ్లాదుడిని చంపాలని తన సోదరి హోలికను ఆదేశిస్తాడు హిరణ్యకశిపుడు. ప్రహ్లాదుడిని ఒడిలో కూర్చోబెట్టుకొని హోలిక మంటల్లో దూకుతుంది. విష్ణునామ స్మరణలో ఉన్న ప్రహ్లాదుడికి చీమ కుట్టినట్లు కూడా కాదు. హోలిక మాత్రం కాలి బూడిద అవుతుంది, ఆ బూడిదే చెడు అంతానికి సంకేతం.

– యంబ నర్సింహులు, సాక్షి, ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

● యంగ్ టాలెంట్



గెలుపు కెరటం

జల ప్రపంచంలో అలలే పాఠాలు. అలలే అరుదైన గురువులు. అలా ఎంతో మంది గురువుల దగ్గర ఎన్నో గెలుపు పాఠాలు నేర్చుకున్న నాగాయలంకకు చెందిన నాగిడి గాయత్రి వాటర్ స్పోర్ట్ 'కయాకింగ్'లో సత్తా చాటుతుంది. జాతీయ స్థాయిలో రాణిస్తోంది.

చేపల వేటలో తనకు తానే సాటి

నాగాయలంక కృష్ణానదిలో తండ్రి నాగబాబు సాగించే చేపల వేటలో గాయత్రి సాయపడుతూ ఉంటుంది. రాత్రి వేళల్లో సైతం తండ్రితో పాటు బోట్‌పై సాగర సంగమ ప్రాంతంలోకి వెళ్ళి చేపల వేటలో గాయత్రి తన నైపుణ్యం ప్రదర్శిస్తుంటుంది. వేటలో తలపండిన మత్స్యకారులు చేయలేని పనులను ఆమె సునాయాసంగా చక్కబెడుతుంది. మగవారితో దీటుగా పడవ నడుపుతూ అవసరమైన చోట లంగరు వేసేస్తుంటుంది. గాలం తాడు వేటలో గాలానికి రొయ్యను ఒడుపుగా గుచ్చడంలో ఆమెది అందె వేసిన చెయ్యి. నాగాయలంక రేవులో గాలానికి రొయ్య గుచ్చడంలో నలు గుర్రైదుగురికే నైపుణ్యం ఉంటే వారిలో ఒకరు గాయత్రి కావడం విశేషం.

టార్గెట్ ఒలింపిక్స్

మా కుటుంబానికి చేపల వేటే జీవనాధారం. నాన్న ఎంతో కష్టపడి నాకు శిక్షణ ఇప్పించాడు. ఏపీ వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అడ్వయిజర్ తిప్పిరెడ్డి శివారెడ్డి ప్రోత్సాహం మర్చిపోలేనిది. మొదట్లో కోచ్‌లు శ్రీనివాస్, నాగబాబు, చినబాబు ఇచ్చిన శిక్షణ మెలకువలే నన్ను ఈ స్థాయికి తెచ్చాయి. ఎప్పటికైనా ఒలింపిక్స్ వాటర్ స్పోర్ట్స్‌లో పాల్గొని బంగారు పతకం సాధించాలన్నదే నా లక్ష్యం.

– నాగిడి గాయత్రి



సాగర సంగమ తీరం నాగాయలంకలో 'వాటర్ స్పోర్ట్స్ అకాడమీ' నెల కొల్పడంతో గ్రామీణప్రాంతాలకు అంతగా పరిచయం లేని కయాకింగ్–కెనోయింగ్ జలక్రీడలు దివిసీమ వాసులకు చేరువయ్యాయి.

కృష్ణా జిల్లా తీరప్రాంత నాగాయలంక గ్రామానికి చెందిన నాగిడి గాయత్రి 'వాటర్ స్పోర్ట్స్ అకాడమీ'లో శిక్షణ పొంది కయాకింగ్–కెనోయింగ్ జలక్రీడల్లో మెలకువలను ఒడిసి పట్టుకుంది. జల క్రీడలలో జాతీయ స్థాయిలో సత్తా చాటుతోంది.

మొదట నాటు పడవతోనే శిక్షణ పొందిన గాయత్రి 2022లో గుజరాత్‌లో జరిగిన 36వ జాతీయ స్థాయి కయాకింగ్ పోటీలలో 4వ స్థానంలో నిలిచి పతకాల బోణీ కొట్టింది.

గత సంవత్సరం మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన 5వ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' కయాకింగ్ విభాగంలో జాతీయ స్థాయిలో రజత పతకం గెలుచుకుంది. గోవాలో జరిగిన నేషనల్ వాటర్ స్పోర్ట్స్ పోటీల్లో మరోసారి రజత పతకం గెలుచుకుంది.

గత నెల ఉత్తరాఖండ్‌లో జరిగిన 38వ కెనోయ్ స్లాలమ్–2025 నేషనల్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ స్థాయిలో బంగారు పతకం అందించి తన సత్తా చాటింది.

కయాకింగ్–కెనోయింగ్‌లోనే కాదు...కరాటే, థైక్వాండోలోనూ గాయత్రి ప్రతిభ చూపుతూ ఎన్నో పతకాలు సాధించింది. 2017లో ఢిల్లీలో జరిగిన 33వ నేషనల్ థైక్వాండో పోటీల్లో కాంస్య పతకం, 2021లో రాష్ట్ర స్థాయి రోయింగ్ పోటీల్లో బంగారు పతకం గెలుచుకుంది. ఇటీవల నాగాయలంక పర్యటించిన కృష్ణాజిల్లా కలెక్టర్ డికె బాలాజీ వాటర్ స్పోర్ట్స్‌లో గాయత్రి చూపుతున్న ప్రతిభను ప్రశంసించారు. ఆమెకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

'ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే నా లక్ష్యం' అంటున్న ఇరవై సంవత్సరాల గాయత్రి కల నెరవేరాలనే ఆశిద్దాం.

– సింహాద్రి కృష్ణప్రసాద్, సాక్షి, నాగాయలంక

● టెక్... టాక్



మెటా గ్లాసెస్

తమ నెక్స్ట్–జెనరేషన్ గ్లాసెస్ అరియ జెన్ 2 గురించి ప్రకటించింది సోషల్ మీడియా దిగ్గజం మెటా. 'అరియ జెన్2 గ్లాసెస్‌కు సంబంధించి మా ప్రయాణంలో తదుపరి దశ గురించి ప్రకటించడానికి సంతోషిస్తున్నాం. మెషిన్ పర్సెప్షన్, కంటెక్స్చువల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్‌తో సహా పరిశోధన రంగాలలో కొత్త అవకాశాలకు ద్వారాలు తెరుస్తుంది' అని మెటా తన బ్లాగ్ పోస్ట్‌లో పేర్కొంది.



లెనోవా... సోలార్ పవర్డ్ ల్యాప్‌టాప్

మొబైల్ వరల్డ్ కాంగ్రెస్(ఎండబ్ల్యూసీ–2025)లో పర్సనల్ కంప్యూటింగ్‌లో కొత్త బెంచ్ మార్క్‌లను నెలకొల్పే వినూత్న పీసీ, ఏఐ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని లెనోవో ఆవిష్కరించింది.

యోగా సోలార్ పీసీ కాన్సెప్ట్, సోలార్–పవర్డ్ ల్యాప్‌టాప్, భిన్నమైన సందర్భాల కోసం ప్రత్యేకంగా కనిపించే ల్యాప్‌టాప్ స్క్రీన్‌లు ఇందులో ఉన్నాయి.

యోగా ప్రో 9ఐ ఆరా ఎడిషన్ అనేది క్రియేటర్‌ల కోసం నిర్మించిన 16 అంగుళాల పవర్ హౌజ్. ఇందులో ఇంటెల్ కోర్ అల్ట్రా ప్రాసెసర్,ఆర్‌టీఎక్స్ 5070 జీపీయు ఉన్నాయి. విజువల్ క్లారిటీని అందిస్తుంది. యూజర్‌ల అవసరాలకు అనుగుణంగా ఏఐ ఆధారిత ఫీచర్‌లు ఉంటాయి.

● అవును... ఇది నిజమే!

✓ 1917లో అర్జెంటీనాలో ఫుల్ లెంగ్త్ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్ తీశారు. 58,000 డ్రాయింగ్స్‌తో కూడిన 'ఎల్ అపోస్టోల్' అనే ఈ రాజకీయ వ్యంగ్య చిత్రం రన్ టైమ్...70 నిమిషాలు.

✓ 2002లో స్లోవేనియాలో 5,350 సంవత్సరాల కలప చక్రాన్ని కనుగొన్నారు. ఈ చక్రాన్ని మ్యూజియంలో భద్రపరిచారు.

✓ 0.05, 0.07 ఔన్సుల బరువు ఉండే బంబుల్బీ గబ్బిలం ప్రపంచంలోనే అతి చిన్న క్షీరదం. ఇవి థాయ్‌లాండ్‌లోని సున్నపు రాయి గుహల్లో కనిపిస్తాయి.



✓ భూగ్రహం ఉపరితలంలో ఎక్కువ భాగం(71 శాతం) నీటితో నిండి ఉంది. అయితే ఈ నీటిలో 0.007 శాతం మాత్రమే ఉపయోగించుకోగలుతున్నాం. ఎందుకంటే ఈ నీటిలో 2.5 శాతం మాత్రమే మంచి నీరు. అందులో ఒక శాతం మాత్రమే అందుబాటులో ఉంది.

ఆట మొదలైంది...

● గేమింగ్

యాక్షన్–అడ్వెంచర్ గేమ్ 'స్ప్లిట్ ఫిక్షన్' విడుదల అయింది. స్ప్లిట్ స్క్రీన్ కో ఆపరేటివ్ మల్టీప్లేయర్‌గా ఈ గేమ్‌ను రూపొందించారు. ఫలితంగా వేరే ప్లేయర్స్‌తో లోకల్, ఆన్‌లైన్ ప్లేలో ఆడవచ్చు. మియో, జోయి అనే రచయితలు ప్రధాన పాత్రలుగా ఉండే గేమ్ ఇది. మియో సైన్స్ ఫిక్షన్, జో ఫాంటసీ రచయితలు. ఈ ఇద్దరు ఎన్నో సవాళ్లను కలిసి కట్టుగా ఎదుర్కోవలసి ఉంటుంది. ఇద్దరూ ఒక దశలో డ్రాగన్‌లను కమాండ్ చేస్తూ, మరొక దశలో లేజర్ కత్తిని ఉపయోగిస్తారు. ప్రతి దశలో రెండు పాత్రల శక్తిసామర్థ్యాలు భిన్నంగా ఉంటాయి. ఇద్దరూ ఒకరికొకరు సహకరించుకోవడం తప్పనిసరి. ప్రతి దశలో సైడ్ స్టోరీలు ఉంటాయి.



ఇంజిన్: అన్‌రియల్ ఇంజిన్ 5

మోడ్స్: మల్టీప్లేయర్


జానర్స్: యాక్షన్–అడ్వెంచర్

ప్లాట్‌ఫామ్స్: మైక్రోసాఫ్ట్ విండోస్, ప్లేస్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

సాక్షి సినిమా

పిల్లి కూడా పులి అవును

విజయ్ ఆంటోని నటించిన తాజా చిత్రం 'భద్రకాళి'. అరుణ్ ప్రభు దర్శకత్వంలో మీరా విజయ్ ఆంటోని సమర్పణలో విజయ్ ఆంటోని నిర్మించారు. గురువారం ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. 'పిల్లి కూడా ఒక రోజు పులి అవును' అనే డైలాగ్‌తో ఈ టీజర్ ప్రారంభమైంది. ''ఈ సినిమాలో విజయ్ ఆంటోని కిట్టు పాత్ర చేశారు. ఇంతకీ కిట్టు ఎవరు? ఫ్యామిలీమేనా? గ్యాంగ్‌స్టరా? ఉన్నతాధికారినా? ఈ విషయాలపై స్పష్టత రావాలంటే సినిమా చూడాలి. రూ. 190 కోట్ల కుంభకోణం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. విజయ్ స్టైలిష్ యాక్షన్ హీరోగా కనిపిస్తారు. ఈ చిత్రానికి ఆయనే సంగీతం అందించారు. 'భద్రకాళి'ని త్వరలో రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని యూనిట్ పేర్కొంది.



● విజయ్

కాన్స్ కాలింగ్

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొనాలంటూ ఆలియా భట్‌కు కాల్ వచ్చింది. ఈ ఏడాది మే 13 నుంచి మే 24 వరకు ఫ్రాన్స్‌లో 78వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనుంది. ఈ చిత్రోత్సవాలకు ఆలియా భట్ హాజరు కానున్నారు. ఈ బ్యూటీ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కి వెళ్లడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇక తాను కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొననున్న విషయాన్ని ఆలియా భట్ ధృవీకరించారు. ఈ నెల 15న ఆమె బర్త్ డే సందర్భంగా ముంబైలో గురువారం జరిగిన ప్రీ బర్త్ డే సెలబ్రేషన్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆలియా భట్ మాట్లాడుతూ– ''నేను తొలిసారిగా కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొనబోతున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. నా కాస్ట్యూమ్స్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేయమని నా సిబ్బందికి చెప్పాను'' అన్నారు.



● ఆలియా

'కోర్ట్' సినిమా నచ్చకపోతే, తాను హీరోగా నటించిన 'హిట్ 3' సినిమా చూడొద్దని నానిగారు వేదికపై మాట్లాడినప్పుడు మేం షాక్ అయ్యాం. కానీ నాని అలా అన్నారంటే.. 'కోర్ట్' సినిమాపై నమ్మకం ఉంది కాబట్టే అంత కాన్ఫిడెంట్‌గా చెప్పగలిగారు. పైగా రెండు (కోర్ట్, హిట్ 3) సినిమాలకూ నానీయే ఓ నిర్మాత... సో ప్రాబ్లమ్ లేదు" అని అన్నారు దీప్తి గంటా. ప్రియదర్శి ప్రధాన పాత్రలో, రోషన్, శ్రీదేవి, శివాజీ ఇతర ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కోర్ట్: స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. రామ్ జగదీశ్ దర్శకత్వంలో వాల్ పోస్టర్ సినిమా పతాకంపై నాని సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ చిత్రానికి నాని సోదరి దీప్తి గంటా సహనిర్మాత. కాగా ఈ సినిమా విడుదలకు రెండు రోజులు ముందుగానే ప్రీమియర్స్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశంలో ఈ ప్రశాంతి తిపిర్నేని, దీప్తి గంటా చెప్పిన విశేషాలు.



● దీప్తి గంటా, ప్రశాంతి తిపిర్నేని

అక్కా తమ్ముళ్లు సెట్స్‌లో ఉండకూడదు - దీప్తి గంటా

''నాని, ప్రశాంతిగారు స్క్రిప్ట్ విని ఈ సినిమాను ఓకే చేశారు. ఈ కథ నాకూ నచ్చింది. దర్శకుడు జగదీశ్ రాసిన 'కోర్ట్' కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. ఈ సినిమాకు నేను ఆన్‌సెట్ ప్రొడ్యూసర్‌గా జాయిన్ అయ్యాను. సెట్స్‌కు రోజూ వెళ్లేదాన్ని. జగదీశ్ చాలా పరిశోధన చేసి, ఈ సినిమా చేశారు. అందుకే నేచురల్‌గా వచ్చింది. పోక్సో చట్టం గురించి ఆయన చాలా వివరంగా స్క్రీన్‌పై ప్రజెంట్ చేశారు. ఇక మంగపతి క్యారెక్టర్‌లో శివాజీగారు అద్భుతంగా నటించారు. ఇంకా ప్రియదర్శి, రోషన్, శ్రీదేవి... ఇలా ప్రతి పాత్రకు సినిమాలో ప్రాముఖ్యత ఉంది. 'మీట్ క్యూట్' తర్వాత నేను యూఎస్‌కి వెళ్లిపోయాను. ఈ సినిమా కోసం మళ్లీ వచ్చాను. కొన్ని కథలు ఉన్నాయి. భవిష్యత్‌లో మళ్లీ దర్శకత్వం వహిస్తాను'' అన్నారు దీప్తి. నాని 'వాల్‌పోస్టర్ సినిమా' బ్యానర్‌లోనే మీ డైరెక్షన్ మూవీ ఉండొచ్చా? అన్న ప్రశ్నకు– ''నేను సినిమా చేస్తే నానితో చేయను. అక్కాతమ్ముళ్లు సెట్స్‌లో ఉండకూడదు'' అని నవ్వుతూ సమాధానం ఇచ్చారు దీప్తి.

నానిగారు పెద్దగా లెక్కలు వేయరు - ప్రశాంతి తిపిర్నేని

''కోర్ట్' సినిమా ప్రీమియర్స్‌కు ఆడియన్స్ నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. మేం అనుకున్నదానికంటే ఎక్కువ రెస్పాన్స్ వస్తుండటం హ్యాపీగా ఉంది. ఈ తరహా జానర్‌లోని మూవీని ఆడియన్స్ ఆదరించి, సక్సెస్ చేయడం కూడా మంచి పరిణామం. ప్రస్తుతానికి ఈ సక్సెస్‌ని ఎంజాయ్ చేస్తున్నాం. నాని, నేను ఇద్దరం కథలు వింటాం. మా నమ్మకం అంతా నానిగారి జడ్జిమెంట్ మీదే ఆధారపడి ఉంటుంది. నానిగారు పెద్దగా లెక్కలేమీ వేయరు. జానర్ ఏదైనా కథలో నిజాయితీ ఉండి, డైరెక్టర్‌లో క్లారిటీ ఉంటే చాలు ముందుకు వెళ్తాం. ఒక కథ థియేటర్స్‌లో చూడాలనిపించేలా ఉంటే చాలు... సినిమా చేసేందుకు నానిగారు ఒప్పుకుంటారు. నానిగారి సినిమాలు థియేటర్స్‌కు ముందే ఓటీటీ డీల్స్‌ను పూర్తి చేసుకుంటున్నాయంటే అది కథలపై తనకు ఉన్న జడ్జిమెంటే కారణం. ఇక 'కోర్ట్'లో పోక్సో చట్టం ఎలా దుర్వినియోగం కావొచ్చనే పాయింట్‌ను దర్శకుడు జగదీశ్ అద్భుతంగా చూపించారు'' అని ప్రశాంతి చెప్పారు.



గౌరీస్ప్రాట్‌తో రిలేషన్‌షిప్‌లో ఉన్నాను: ఆమిర్ ఖాన్

బాలీవుడ్ ప్రముఖ నటుడు, దర్శక–నిర్మాత ఆమిర్‌ఖాన్ తన 60వ బర్త్ డే సందర్భంగా వెల్లడించిన కొన్ని విషయాలు ముంబై సినీ పరిశ్రమలో చర్చనీయాంశమయ్యాయి. నేడు (మార్చి 14) ఆమిర్‌ఖాన్ బర్త్ డే. ఈ సందర్భంగా గురువారం ముంబైలో తన ప్రీ బర్త్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారాయన. గౌరీ స్ప్రాట్ అనే మహిళతో తాను రిలేషన్‌షిప్‌లో ఉన్నట్లు అధికారికంగా వెల్లడించారాయన. రెండు దశాబ్దాలుగా గౌరి తనకు తెలుసునని, గత ఏడాదిగా మరింత దగ్గర అయ్యామని పేర్కొన్నారు. అంతేకాదు.. ప్రీ బర్త్‌డే ఈవెంట్‌లో గౌరిని సల్మాన్‌ఖాన్ – షారుక్‌ఖాన్‌లకు పరిచయం చేశారు ఆమిర్. అలాగే గౌరీతో తన రిలేషన్‌షిప్ కుటుంబ సభ్యులకు కూడా తెలుసునని, తమ రిలేషన్‌షిప్ గురించి, వాళ్లు కూడా హ్యాపీగానే ఉన్నారని తెలిపారు. అలాగే గౌరి ఫోటోలు తీయవద్దని అక్కడి కెమెరామేన్‌లకు విజ్ఞప్తి చేశారాయన. కాగా ఆమె ప్రస్తుతం ఆమిర్ నిర్మాణ సంస్థ అయిన ఆమిర్‌ఖాన్ ప్రొడక్షన్స్ సంస్థలో వర్క్ చేస్తున్నారు. ఆమెకు ఇదివరకే పెళ్లి అయిందని, ఆరు సంవత్సరాల బాబు కూడా ఉన్నాడనే వార్తలు బాలీవుడ్‌లో వినిపిస్తున్నాయి. ఇక 1986లో రీనా దత్తాను వివాహం చేసుకున్నారు ఆమిర్‌ఖాన్. 2002లో ఆమెకు విడాకులు ఇచ్చారు. ఆ తర్వాత కిరణ్ రావును పెళ్లాడారాయన. కిరణ్ రావుతో పదహారు సంవత్సరాల దాంపత్య జీవితం అనంతరం 2021లో ఆమెకు కూడా విడాకులు ఇచ్చారు. ఇప్పుడు గౌరీకి దగ్గరయ్యారు ఆమిర్. 60 సంవత్సరాల వయసులో ఆయన కొత్త రిలేషన్‌షిప్‌ని ప్రకటించడం పట్ల బాలీవుడ్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక సినిమాల విషయానికొస్తే... తాను యాక్ట్ చేసిన 'సితారే జమీన్ పర్' మూవీ జూన్‌లో రిలీజ్‌కు రెడీ అవుతోందని తెలిపారు ఆమిర్. అలాగే 'మహాభారతం' ఆధారంగా తాను చేయాలనుకుంటున్న మూవీ పనులు కూడా ప్రారంభం అయినట్లు పేర్కొన్నారు.

పెళ్లైన ప్రసాద్‌గా చేయమనీ...

సప్తగిరి హీరోగా అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'. ప్రియాంకా శర్మ హీరోయిన్‌గా నటించారు. చాగంటి సినిమాటిక్ వరల్డ్ సమర్పణలో కేవై బాబు, భానుప్రకాశ్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. నిర్మాత 'దిల్' రాజు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తోంది. ''నాన్నా... 34... 36.., నీకు ఏజ్‌తో పాటుగా వర్క్ ఎక్స్‌పీరియన్స్ కూడా పెరుగుతోంది కదా... దాన్నే చూపించి, ఎక్కువ కట్నం డిమాండ్ చేయవచ్చు నాన్నా..', 'ఈ పెళ్లి కాని ప్రసాద్‌ను కాస్త పెళ్లైన ప్రసాద్‌గా చేయమని... మిమ్మల్ని వేడుకుంటున్నాను స్వామి' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.



● సప్తగిరి

శత్రువుల్లా చూడక్కర్లేదు


''దిల్ రూబా' సినిమా కథలో ప్రేమ ఒకటే కాదు... స్నేహం, తండ్రీకొడుకులు, తండ్రీ కూతుళ్ల భావోద్వేగాలు కూడా ఉన్నాయి. మాజీ ప్రేయసి, ప్రేమికుడు... వీరిని శత్రువుల్లా చూడక్కర్లేదు. వారితోనూ స్నేహాన్ని కొనసాగించవచ్చనే ఫీల్‌గుడ్ అంశాలను ఈ సినిమాలో చూపించే ప్రయత్నం చేశాం'' అని కిరణ్ అబ్బవరం అన్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన చిత్రం 'దిల్ రూబా'. ఈ చిత్రంలో రుక్సార్ థిల్లాన్, ఖ్యాతీ డేవిసన్ హీరోయిన్లుగా నటించారు. విశ్వ కరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశంలో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ–''ఈ మూవీలో నటించిన తర్వాత నటుడిగా మరింత పరిణితి సాధించాననిపించింది. ఈ సినిమాలో ఇబ్బందికర డైలాగ్స్, సన్నివేశాలు లేవు. ఫ్యామిలీతో చూడొచ్చు'' అని అన్నారు. విశ్వ కరుణ్, ఖ్యాతి, డీవోపీ డేనియల్ విశ్వాస్ మాట్లాడారు.



● కిరణ్, ఖ్యాతి

ఫుట్‌బాల్ ఛాంపియన్

రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ స్పోర్ట్స్ డ్రామా 'ఛాంపియన్'. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ పతాకాలపై ప్రియాంకా దత్, జీకే మోహన్, పి. కిరణ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. గురువారం (మార్చి 13) రోషన్ బర్త్ డే. ఈ సందర్భంగా 'ఛాంపియన్' సినిమా గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ''స్ట్రాంగ్ విల్ పవర్ ఉన్న ఇంటెన్స్ ఫుట్‌బాల్ ఆటగాడిగా రోషన్ కనిపిస్తాడు. మైదానంలో అతని ప్రయాణం, బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడటం, జీవితంలో నిజమైన ఛాంపియన్‌గా ఎదగడం... వంటి అంశాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. యాక్షన్ సన్నివేశాలు అలరిస్తాయి. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్.



● రోషన్

సాక్షి బిజినెస్
శుక్రవారం
14-3-2025

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	201	73,829
నిఫ్టీ ▽	73	22,397

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	17,267	▽	380
డోజోన్స్	40,735	▽	161
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,543	△	2
డాక్స్	22,567	▽	109
షాంఘై	3,359	▽	13
నికాయ్	36,790	▽	29

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.ల్లో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	86,843	△	700
బంగారం (99.5 స్వచ్ఛత)	86,495	△	697
వెండి (కిలో)	98,322	△	222

ఫారెక్స్‌ రేట్లు రూ.ల్లో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	86.75	87.77
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	111.50	114.41
€	యూరో	ఒకటి	93.68	96.37
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	58.14	59.63
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.37	57.13
S$	సింగపూర్ డాలర్	ఒకటి	62.84	67.48
SAR	సౌదీ రియాల్	ఒకటి	22.30	23.86
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	22.80	24.58
¥	చైనా యువాన్	ఒకటి	11.13	12.95

హల్దీరామ్స్‌లో టెమాసెక్‌కు వాటా



10 శాతం కొనుగోలుకి ఒప్పందం

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ హల్దీరామ్స్ స్నాక్స్ ఫుడ్‌లో సింగపూర్ సావరిన్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం టెమాసెక్ 10 శాతం వాటా కొనుగోలు చేస్తోంది. కంపెనీ విలువను 10 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 85,000 కోట్లు)గా మదింపు చేసి వాటాను సొంతం చేసుకుంటున్నట్లు పరిశ్రమ వర్గాలు తెలియజేశాయి. ఈ వారం మొదట్లో ఇందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వెల్లడించాయి. అంటే 10 శాతం వాటాకు సుమారు బిలియన్ డాలర్లు(రూ. 8,500 కోట్లు) వెచ్చించనున్నట్లు అంచనా. దేశీయంగా ప్యాకెడ్ స్నాక్, స్వీట్స్ తయారీలో దిగ్గజంగా నిలుస్తున్న హల్దీరామ్స్ రెస్టారెంట్లను సైతం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. 2023-24లో రూ. 12,500 కోట్ల టర్నోవర్ సాధించింది. కంపెనీలో మరింత వాటా విక్రయం ద్వారా ప్రమోటర్లు అగర్వాల్ కుటుంబం మరో ఇన్వెస్టర్‌కు సైతం చోటు కల్పించనున్నట్లు తెలుస్తోంది. కొద్ది నెలలుగా పీఈ దిగ్గజాలు బ్లాక్‌స్టోన్, అల్ఫావేవ్ గ్లోబల్, బెయిన్ క్యాపిటల్ కన్సార్షియం తదితరాలతో వాటా విక్రయానికి హల్దీరామ్స్ చర్చలు నిర్వహించింది. కాగా.. వచ్చే ఆర్థిక సంవత్సరం(2025-26)లో పబ్లిక్ ఇష్యూ చేపట్టే అవకాశముంది. తొలుత మెజారిటీ వాటాను విక్రయించాలని భావించిన ప్రమోటర్లు తదుపరి మైనారిటీ వాటా విక్రయానికే ఆసక్తి చూపుతున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

మళ్లీ పసిడి పరుగు

- 10 గ్రాములకు రూ.89,450
- ఒకే రోజులో రూ.600 ర్యాలీ
- అంతర్జాతీయంగా కొత్త గరిష్టానికి...




న్యూఢిల్లీ: బంగారం ర్యాలీ మళ్లీ మొదలైంది. గురువారం ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.600 లాభపడడంతో.. మునుపటి గరిష్ఠ స్థాయి అయిన రూ.89,450కి మరోసారి చేరుకుంది. బుధవారం బులియన్ మార్కెట్లో రూ.88,850 వద్ద ముగియడం గమనార్హం. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం రూ.600 లాభపడి రూ.89,050కి చేరింది. ఫిబ్రవరి 20న 99.9 శాతం స్వచ్ఛత బంగారం రూ.89,450, 99.5 శాతం స్వచ్ఛత బంగారం రూ.89,050 స్థాయిలను నమోదు చేయగా.. మూడు వారాల వ్యవధిలో మళ్లీ గరిష్టాలను అందుకుంది. వెండి సైతం కిలోకి రూ.1,000 లాభపడింది. ఐదు నెలల గరిష్ఠ స్థాయి రూ.1,01,200ను తాకింది. ఎంసీఎక్స్ మార్కెట్లో ఏప్రిల్ నెల డెలివరీ గోల్డ్ కాంట్రాక్ట్ (10 గ్రాములు) రూ.210 పెరిగి రూ.86,896కు చేరింది. అంతర్జాతీయంగా చూస్తే, పసిడి సరికొత్త ఆల్‌టైమ్ గరిష్టాన్ని తాకింది. 50 డాలర్లు లాభపడి 2,998 డాలర్ల స్థాయి వద్ద ట్రేడవుతోంది.

వెల్త్‌టెక్ ప్లాట్‌ఫామ్‌లకు ఏఐ దన్ను

వ్యక్తిగత రుణంపై 20 శాతం పైగా భారీ వడ్డీ రేటుతో సతమతమవుతున్న ఓ ఐటీ ప్రొఫెషనల్‌కి కృత్రిమ మేధ (ఏఐ) రూపంలో సమస్యకు ఓ పరిష్కారం లభించింది. మ్యూచువల్ ఫండ్ పోర్ట్‌ఫోలియోను ఏఐ ఆధారిత వెల్త్‌టెక్ ప్లాట్‌ఫాంకు అనుసంధానించడం ద్వారా తన దగ్గరున్న ఫండ్స్‌పై అత్యంత చౌకగా 10.5 శాతానికే రుణాన్ని పొందే అవకాశం ఉన్నట్లు తెలుసుకున్నారు. ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడంతో పాటు ఏఐ టెక్నాలజీతో ఆదా చేసుకునే మార్గాలను కూడా అందిపుచ్చుకున్నారు. ఇక ఏళ్ల తరబడి మ్యూచువల్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేస్తున్న మరో ఇన్వెస్టరుకు.. సదరు ఫండ్ పనితీరు అంత గొప్పగా లేదనిపించింది. దీంతో ఓ వెల్త్‌టెక్ ప్లాట్‌ఫాం మానిటరింగ్ సాధనాలను ఉపయోగించుకుని మరింత మెరుగైన రాబడినిచ్చే ఫండ్‌కి మారగలిగారు. మంచి ప్రయోజనం పొందారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్



ఇలా సాధారణంగా సంస్థాగత ఇన్వెస్టర్లకే లభ్యమయ్యే పెట్టుబడుల పరిజ్ఞానాన్ని సామాన్య మదుపరులు కూడా అందుకోవడంలో వెల్త్‌టెక్ స్టార్టప్‌లు దన్నుగా నిలుస్తున్నాయి. అధునాతనమైన కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), జనరేటివ్ ఏఐ (జెన్‌ఏఐ) సాంకేతికతల వినియోగంతో ఈ అంకురాలు దూసుకెళ్తుండటంతో దేశీయంగా వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్లాట్‌ఫాంలు చిన్న స్థాయి నుంచి పెద్ద స్థాయి వరకు వివిధ రకాల మదుపరులకు సంపద నిర్వహణ విషయంలో మరింత వ్యక్తిగత స్థాయిలో సలహాలు ఇస్తున్నాయి. ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలోను, రిస్కులను అధిగమించడంలోను తోడ్పాటునిస్తున్నాయి. టెక్‌సై రీసెర్చ్ నివేదిక ప్రకారం దేశీయంగా వెల్త్ మేనేజ్‌మెంట్ సేవల మార్కెట్ 2023లో 429.1 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది 2025 నుంచి 2029 మధ్య కాలంలో వార్షిక ప్రాతిపదికన 4.56 శాతం చొప్పున వృద్ధి చెందనుంది. ఈ ఏడాదే ఏఐ అప్లికేషన్స్ తోడ్పాటుతో ఈ రంగం 1-2 బిలియన్ డాలర్ల మేర పెరగవచ్చనే అంచనాలు ఉన్నాయి. రిటైల్ ఇన్వెస్టర్లు, ద్వితీయ..తృతీయ శ్రేణి నగరాల్లో సంపన్నులు, టెక్నాలజీ వినియోగం విస్తృతంగా పెరుగుతుండటంలాంటి అంశాలు ఇందుకు దోహదపడనున్నాయి.

- సాధారణ ఇన్వెస్టర్ల నుంచి సంపన్నుల వరకు సేవలు
- లిస్టులో ఇన్వెస్టర్ ఏఐ, మైఫై, డిజర్వ్ తదితర సంస్థలు
- 2023లో 429 బిలియన్ డాలర్లుగా వెల్త్ మేనేజ్‌మెంట్ మార్కెట్

వందకు పైగా అంకురాలు..


అధ్యయన సంస్థ ట్రాక్షన్ ప్రకారం ప్రస్తుతం దాదాపు 122 అంకురాలు ఈ తరహా సేవలు అందిస్తున్నాయి. ఇన్వెస్టర్‌ఏఐ అనే సంస్థ నేరుగా బ్రోకరేజ్ ప్లాట్‌ఫాంలతో అనుసంధానమై సర్వీసులు అందిస్తోంది. చాట్ జీపీటీ తరహా టెక్నాలజీని ఉపయోగిస్తున్నట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు, సీఈవో బ్రూస్ కీత్ వెల్లడించారు. దీనితో ట్రేడింగ్‌లో 70% వరకు విజయం సాధించే అవకాశాలు ఉంటున్నాయన్నారు. మైఫై అనే మరో స్టార్టప్ సంస్థ, మార్కెట్ ధోరణులను విశ్లేషించి, తగిన పెట్టుబడి వ్యూహాలను సూచించేందుకు ఏఐ, జెన్‌ఏఐ సాంకేతికతలను ఉపయోగిస్తోంది. ఆటోమేటెడ్ అసిస్టెంట్లు, రియల్ టైమ్ విశ్లేషణలతో ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా ఉండే కచ్చితమైన ఫలితాలనిచ్చే సలహాలను అందిస్తోంది.

పెట్టుబడుల జోరు..

వెల్త్‌టెక్ స్టార్టప్‌లకున్న సామర్థ్యాలను గుర్తించి, వాటిల్లో పెట్టుబడులు పెట్టేందుకు వెంచర్ క్యాపిటలిస్టులు ముందుకొస్తున్నారు. డిజర్వ్ అనే సంస్థలో 2024 జులైలో ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ సారథ్యంలో ఇన్వెస్టర్లు 32 మిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టారు. ఇది పోర్ట్‌ఫోలియోను సమర్ధవంతంగా తీర్చిదిద్దేందుకు లక్షల కొద్దీ డేటా పాయింట్లను విశ్లేషించి, తగు సలహాలిస్తుంది. ఇక గురుగ్రామ్‌కి చెందిన సెంట్రిసిటీ అనే మరో స్టార్టప్ .. 20 మిలియన్ డాలర్లు సమీకరించింది. ఇది అత్యంత సంపన్నులు, స్వతంత్ర ఫైనాన్షియల్ ప్రొడక్ట్ డిస్ట్రిబ్యూటర్లకు ఆర్థిక సలహాలు అందిస్తోంది.

సాధారణ బీమాలోకి పతంజలి

- మ్యాగ్మా ఇన్సూరెన్స్ కొనుగోలుకి సై
- ఒప్పందం విలువ రూ. 4,500 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ, హెర్బల్ ప్రొడక్టుల దిగ్గజం పతంజలి ఆయుర్వేద్ సాధారణ బీమా రంగంలోకి ప్రవేశిస్తోంది. ఇందుకు వీలుగా మ్యాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌ను కొనుగోలు చేయనుంది. మ్యాగ్మా కొనుగోలుకి అదార్ పూనావాలా సంస్థ సనోటీ ప్రాపర్టీస్‌తో షేరు కొనుగోలు ఒప్పందం(ఎస్‌పీఏ) కుదుర్చుకుంది. రైజింగ్ సన్ హోల్డింగ్స్‌తో ఏర్పాటైన భాగస్వామ్య కంపెనీ(జేవీ) మ్యాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌లో సనోటీకి మెజారిటీ వాటా ఉంది. వెరసి మ్యాగ్మా కొనుగోలుకి ధరమ్‌పాల్ సత్యపాల్(డీఎస్) గ్రూప్‌తో కలసి పతంజలి రూ. 4,500 కోట్లు వెచ్చించనుంది. సెలికా డెవలపర్స్, జాగ్వార్ అడ్వయిజరీ సర్వీసెస్‌తో కలసి డీల్‌కు సనోటీ బోర్డు ఆమోదముద్ర వేసింది. సాధారణ బీమా రంగంలో 70 ప్రొడక్టులతో కార్యకలాపాలు విస్తరించిన మ్యాగ్మా 2023-24లో రూ. 3,295 కోట్ల స్థూల ప్రీమియం(జీడబ్ల్యూపీ)ను అందుకుంది. ఈ ఏడాది(2024-25) రూ. 3,700 కోట్ల జీడబ్ల్యూపీ సాధించగలమని భావిస్తోంది.

ఆటో, రియల్టీ షేర్లలో అమ్మకాలు

సెన్సెక్స్ 201 పాయింట్లు డౌన్



ముంబై: ఆటో, రియల్టీ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్ సూచీలు గురువారం కూడా నష్టపోయాయి. సెన్సెక్స్ 201 పాయింట్లు పతనమై 73,829 వద్ద స్థిరపడింది. ఈ సూచీకిది వరుసగా అయిదో రోజూ నష్టాల ముగింపు. నిఫ్టీ 73 పాయింట్లు క్షీణించి 22,397 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 371 పాయింట్లు పెరిగి 74,401 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 87 పాయింట్లు బలపడి 22,558 గరిష్టాన్ని తాకింది.

- హోలీ సందర్భంగా శుక్రవారం బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలకు సెలవు అయితే బులియన్, ఫారెక్స్, కమోడిటీ మార్కెట్లు మాత్రం సాయంత్రం సెషన్‌లో పనిచేస్తాయి.
- డాలర్ మారకంలో రూపాయి విలువ 17 పైసలు బలపడి 87.05 వద్ద స్థిరపడింది. క్రూడాయిల్ ధరలు దిగిరావడం, మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాలు నమోదు కావడం, అమెరికా డాలర్ ఇండెక్స్ బలహీనత వంటి అంశాలు దేశీయ కరెన్సీ బలోపేతానికి కారణమయ్యాయి. ఒక దశలో 28 పైసలు పెరిగి 86.94 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఓలా ఎస్1 స్కూటర్లపై డిస్కౌంట్లు | ఐపీఓకు ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ రెడీ

సాక్షి స్పోర్ట్స్



పోరాడి ఓడిన యూకీ జోడీ

కాలిఫోర్నియా: ఇండియన్ వెల్స్ మాస్టర్స్-1000 టెన్నిస్ టోర్నీలో భారత డబుల్స్ స్టార్ యూకీ బాంబ్రీ పోరాటం ముగిసింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో యూకీ బాంబ్రీ (భారత్)-ఆంద్రీ గొరాన్సన్ (స్వీడన్) ద్వయం 6-7 (5/7), 6-3, 8-10తో 'సూపర్ టైబ్రేక్'లో ఫెర్నాండో రాంబోలి (బ్రెజిల్)-జాన్ ప్యాట్రిక్ స్మిత్ (ఆస్ట్రేలియా) జంట చేతిలో పోరాడి ఓడిపోయింది. 1 గంట 48 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ-గొరాన్సన్ ఏడు ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు. యూకీ-గొరాన్సన్‌లకు 65 వేల డాలర్ల (రూ. 56 లక్షల 67 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 180 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. కెరీర్‌లో తొలిసారి మాస్టర్స్ సిరీస్ టోర్నీలో ఆడిన యూకీ తాజా ప్రదర్శనతో రెండు స్థానాలు మెరుగుపర్చుకొని 37వ ర్యాంక్‌కు చేరుకుంటాడు.

ముంబై మెరిసె...

డబ్ల్యూపీఎల్ ఫైనల్లో ముంబై ఇండియన్స్

- ఎలిమినేటర్ మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌పై విజయం
- రేపు జరిగే టైటిల్ పోరులో ఢిల్లీ క్యాపిటల్స్‌తో 'ఢీ'
- హేలీ మాథ్యూస్ ఆల్‌రౌండ్ షో
- అదరగొట్టిన సివర్ బ్రంట్, హర్మన్‌ప్రీత్


హేలీ మాథ్యూస్
సివర్ బ్రంట్

సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన ముంబై ఇండియన్స్ జట్టు మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ మూడో సీజన్‌లో టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. ఏకపక్షంగా జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 47 పరుగుల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై ఘనవిజయం సాధించింది. బ్యాట్‌తో హేలీ మాథ్యూస్, నాట్ సివర్ బ్రంట్, హర్మన్‌ప్రీత్ కౌర్ చెలరేగడంతో ముంబై భారీ స్కోరు చేసింది. అనంతరం బంతితోనూ ముంబై బౌలర్లు హడలెత్తించారు. దాంతో లక్ష్య ఛేదనలో గుజరాత్ జెయింట్స్ డీలా పడింది. ముంబై ఇండియన్స్ జట్టుతో ఆడిన ఏడోసారీ గుజరాత్ జట్టు పరాజయాన్నే మూటగట్టుకుంది.

ముంబై: మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ జట్టు మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో రెండోసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబై ఇండియన్స్ 47 పరుగుల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచి తుదిపోరుకు చేరింది. శనివారం జరిగే టైటిల్ పోరులో గత ఏడాది రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్‌తో ముంబై ఆడుతుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టానికి 213 పరుగులు చేసింది. హేలీ మాథ్యూస్ (50 బంతుల్లో 77; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), నాట్ సివర్ బ్రంట్ (41 బంతుల్లో 77; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకాలతో విజృంభించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (12 బంతుల్లో 36; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరిపించింది. గుజరాత్ జెయింట్స్ బౌలర్లలో గిబ్సన్ 2 వికెట్లు పడగొట్టింది. అనంతరం లక్ష్యఛేదనలో గుజరాత్ జెయింట్స్ జట్టు 19.2 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. గిబ్సన్ (24 బంతుల్లో 34; 5 ఫోర్లు, 1 సిక్స్), లిచ్‌ఫీల్డ్ (20 బంతుల్లో 31; 4 ఫోర్లు, 1 సిక్స్), భారతి (20 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్) పోరాడినా ఫలితం లేకపోయింది. ముంబై బౌలర్లలో హేలీ 3, అమేలియా కెర్ 2 వికెట్లు పడగొట్టింది. హేలీ మాథ్యూస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

బాదుడే బాదుడు..

మొదట బ్యాటింగ్‌కు దిగిన ముంబైకి శుభారంభం దక్కలేదు. గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టమైన బంతులు వేయడంతో పవర్‌ప్లే ముగిసేసరికి యస్తిక భాటియా (15; 3 ఫోర్లు) వికెట్ కోల్పోయిన ముంబై 37 పరుగులే చేసింది. గిబ్సన్ వేసిన ఏడో ఓవర్‌లో సివర్ బ్రంట్ రెండు ఫోర్లతో జోరు పెంచగా... ప్రియా ఓవర్‌లో హేలీ 'హ్యాట్రిక్' ఫోర్లతో విరుచుకుపడింది. గుజరాత్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్న ఈ జోడీ వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదడంతో 11 ఓవర్లు ముగిసేసరికి ముంబై జట్టు 100/1తో నిలిచింది. ఈ క్రమంలో హేలీ 36 బంతుల్లో, సివర్ 29 బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేసుకున్నారు. ఆ తర్వాత ఈ జంట మరింత ధాటిగా ఆడటంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. గిబ్సన్ వేసిన 15వ ఓవర్‌లో సివర్ రెండు భారీ సిక్సర్లు బాదగా... ప్రియ ఓవర్లో హేలీ వరుసగా 6, 6, 4 కొట్టింది. రెండో వికెట్‌కు 71 బంతుల్లో 133 పరుగులు జోడించిన అనంతరం హేలీ అవుట్ కాగా... హర్మన్ వచ్చీరావడంతోనే భారీ షాట్లతో విరుచుకుపడింది. తనూజ వేసిన 18వ ఓవర్లో 2 సిక్స్‌లు, 2 ఫోర్లు కొట్టిన హర్మన్... చివరి ఓవర్‌లో మరో 2 సిక్స్‌లు బాదింది. దీంతో ముంబై భారీ స్కోరు చేసింది. చివరి 5 ఓవర్లలో ముంబై జట్టు 73 పరుగులు రాబట్టింది.


స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: యస్తిక భాటియా (సి) భారతి (బి) గిబ్సన్ 15; హేలీ మాథ్యూస్ (సి) మూనీ (బి) కాశ్వీ గౌతమ్ 77; సివర్ బ్రంట్ (సి) లిచ్‌ఫీల్డ్ (బి) గిబ్సన్ 77; హర్మన్‌ప్రీత్ కౌర్ (రనౌట్) 36; సజన (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం** (20 ఓవర్లలో 4 వికెట్లకు) 213. **వికెట్ల పతనం:** 1-26, 2-159, 3-198, 4-213. **బౌలింగ్:** కాశ్వీ గౌతమ్ 4-0-30-1; ఆష్లీ గార్డ్‌నర్ 2-0-15-0; తనూజ కన్వర్ 4-0-49-0; గిబ్సన్ 4-0-40-2; ప్రియా మిశ్రా 3-0-40-0; మేఘనా సింగ్ 3-0-35-0.

గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్: బెత్ మూనీ (సి) హేలీ మాథ్యూస్ (బి) షబ్నిమ్ 6; గిబ్సన్ (రనౌట్) 34; హర్లీన్ డియోల్ (రనౌట్) 8; ఆష్లీ గార్డ్‌నర్ (బి) హేలీ మాథ్యూస్ 8; లిచ్‌ఫీల్డ్ (స్టంప్డ్) యస్తిక (బి) కెర్ 31; భారతి (బి) హేలీ 30; కాశ్వీ గౌతమ్ (రనౌట్) 4; సిమ్రన్ (సి) హర్మన్‌ప్రీత్ (బి) కెర్ 17; తనూజ (సి) అమన్‌జ్యోత్ (బి) సివర్ 16; మేఘన (సి) సివర్ (బి) హేలీ 5; ప్రియ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం** (19.2 ఓవర్లలో ఆలౌట్) 166. **వికెట్ల పతనం:** 1-6, 2-34, 3-43, 4-81, 5-107, 6-112, 7-142, 8-157, 9-165, 10-166. **బౌలింగ్:** షబ్నిమ్ 4-0-35-1; సివర్ 4-0-31-1; సైకా 1-0-8-0; హేలీ 3.2-0-31-3, అమన్‌జ్యోత్ 3-0-32-0; అమేలియా కెర్ 4-0-28-2.

ఛేజింగ్‌లో జెయింట్స్ రనౌట్..

భారీ లక్ష్యఛేదనలో గుజరాత్ ప్రభావం చూపలేకపోయింది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ బెత్ మూనీ (6) పెవిలియన్ చేరగా... కెప్టెన్ ఆష్లీ గార్డ్‌నర్ (8), హర్లీన్ డియోల్ (8) ఎక్కువ సేపు నిలవలేకపోయారు. దీంతో గుజరాత్ 43 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో గిబ్సన్, లిచ్‌ఫీల్డ్ కాస్త పోరాడినా... ముంబై బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లు పడగొడుతూ ఒత్తిడి పెంచారు. క్రమశిక్షణతో కూడిన బౌలింగ్‌కు చక్కటి ఫీల్డింగ్ తోడవడంతో ముంబై జట్టు స్పష్టమైన ఆధిక్యం కనబర్చింది. భారతి, సిమ్రన్ (8 బంతుల్లో 17; 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులు ఓటమి అంతరాన్ని తగ్గించేందుకే పరిమితమయ్యాయి. పేలవ ఫీల్డింగ్‌తో ముంబై బ్యాటర్లు ఇచ్చిన 4 క్యాచ్‌లు వదిలేసిన గుజరాత్ జట్టు... వికెట్ల మధ్య చురుకుగా పరిగెత్తలేక రనౌట్ రూపంలో 3 వికెట్లు కోల్పోయి మూల్యం చెల్లించుకుంది.


లక్ష్య సేన్

లక్ష్య సేన్ సంచలనం

- ప్రపంచ రెండో ర్యాంకర్, డిఫెండింగ్ చాంపియన్ జొనాథన్ క్రిస్టీపై విజయం
- పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో భారత నంబర్‌వన్

బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత నంబర్ వన్, ప్రపంచ 15వ ర్యాంకర్ లక్ష్య సేన్ సంచలనం సృష్టించాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్ 21-13, 21-10తో ఇండోనేసియా స్టార్, ప్రపంచ రెండో ర్యాంకర్, డిఫెండింగ్ చాంపియన్ జొనాథన్ క్రిస్టీని బోల్తా కొట్టించాడు. లక్ష్య సేన్ ధాటికి తట్టుకోలేక జొనాథన్ క్రిస్టీ 36 నిమిషాల్లో చేతులెత్తేశాడు. ఈ గెలుపుతో గత ఏడాది ఇదే టోర్నీలో సెమీఫైనల్లో క్రిస్టీ చేతిలో ఎదురైన ఓటమికి లక్ష్య సేన్ బదులు తీర్చుకున్నాడు. గతంలో క్రిస్టీ చేతిలో నాలుగుసార్లు ఓడిపోయిన లక్ష్య సేన్ ఈసారి మాత్రం ఆరంభం నుంచే పూర్తి ఆధిపత్యం చలాయించాడు. లక్ష్య ఆటకు జవాబివ్వలేక క్రిస్టీ అనవసర తప్పిదాలు చేశాడు. దాంతో తొలి గేమ్‌లో ఒక్కసారి కూడా ఇద్దరి స్కోర్లు సమం కాలేదు. రెండో గేమ్‌లోనూ లక్ష్య తన దూకుడు కొనసాగించాడు. స్కోరు 11-6 వద్ద లక్ష్య సేన్ ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఆరు పాయింట్లు నెగ్గి 17-6తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అదే జోరులో రెండో గేమ్‌తోపాటు మ్యాచ్‌ను దక్కించుకున్నాడు. నేడు క్వార్టర్ ఫైనల్లో 6వ ర్యాంకర్ లీషి ఫెంగ్ (చైనా)తో లక్ష్య సేన్ ఆడతాడు.

వైదొలిగిన సాత్విక్-చిరాగ్ జోడీ

పురుషుల డబుల్స్‌లో ఏడో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగింది. హావో నాన్ జియె-హాన్ జెంగ్ వె (చైనా)తో గురువారం జరిగిన మ్యాచ్‌లో సాత్విక్-చిరాగ్ తొలి గేమ్‌ను 16-21తో కోల్పోయారు. రెండో గేమ్‌లో స్కోరు 2-2 వద్ద ఉన్నపుడు చిరాగ్ వెన్ను నొప్పితో ఆటను కొనసాగించలేకపోయాడు. దాంతో సాత్విక్-చిరాగ్ ద్వయం మ్యాచ్ మధ్యలోనే వైదొలిగింది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మాళవిక బన్సోద్ (భారత్) 16-21, 13-21తో ప్రపంచ మూడో ర్యాంకర్ అకానె యామగుచి (జపాన్) చేతిలో ఓడిపోయింది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో గద్దె రుత్విక శివాని-రోహన్ కపూర్ (భారత్) ద్వయం 10-21, 12-21తో జె ఫెంగ్ యాన్-జిన్ వె యా (చైనా) జంట చేతిలో ఓడిపోయింది.


జొనాథన్ క్రిస్టీ

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



పూజారి ఇంట ఇఫ్తార్ విందు

ఇల్లెందు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు స్టేషన్ బస్తీలోని గణేశ్ ఆలయ పూజారి హరగోపాల్ శర్మ గురువారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ప్రస్తుతం రంజాన్ ఉపవాస దీక్షలు కొనసాగుతుండగా.. రోజా పాటించే వారిని సాయంత్రం ఆహ్వానించిన శర్మ.. వారి కోసం ప్రత్యేకంగా తయారు చేయించిన పలు రకాల వంటకాలను వడ్డించారు. ఈ సందర్భంగా అక్కడి ముస్లింలు శర్మను అభినందించారు.



కీడు సోకిందని ఊరు ఖాళీ

జమ్మికుంట (హుజూరాబాద్): ఊరుకు కీడు సోకిందని, అందుకే తరచూ గ్రామంలో ఎవరో ఒకరు చనిపోతున్నారని గ్రామస్తులంతా ఊరు విడిచి బయటకు వెళ్లిన ఘటన కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం విలాసాగర్‌లో గురువారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. విలాసాగర్‌లో కొన్ని నెలలుగా ఒకరు మృతి చెందిన వెంటనే వారి దశదిన కర్మలు పూర్తి కాకుండానే మరొకరు చనిపోతున్నారు. ఇలా గ్రామంలో వరుసగా 11 మంది మృతిచెందడంతో ఆయా కులాల పెద్దలందరూ వేదపండితులను ఆశ్రయించారు. గ్రామానికి కీడు సోకిందని తెలుసుకొని ఊరంతా గురువారం వేకువజామున 5 గంటలకు ముందే ఇళ్లకు తాళాలు వేసి సమీపంలోని మానేరు పరీవాహక ప్రాంతం బ్రిడ్జి వద్దకు తరలివెళ్లారు. అక్కడే వంటలు చేసుకొని సాయంత్రం వరకు గడిపి చీకటిపడ్డాక ఇంటిబాట పట్టారు. దీంతో గ్రామంలో నిశ్శబ్ధ వాతావరణం నెలకొంది. గతంలో కూడా ఇలాగే బయటకు వెళ్లామని, ఫలితం కనబడిందని గ్రామస్తులు తెలిపారు.

చిన్నారి చికిత్సకు చిట్టి చేతుల సాయం

పాకెట్ మనీ విరాళమిచ్చిన విద్యార్థులు



యాలాల: చిన్నారి శస్త్ర చికిత్సకు చిట్టిచేతులు ముందుకొచ్చాయి. దాచుకున్న డబ్బును అందజేసి పెద్ద మనసు చాటుకున్నాయి. వికారాబాద్ జిల్లా యాలాల మండలం సంగెంకుర్దుకు చెందిన శివకుమార్, భానుప్రియ దంపతుల తొమ్మిది నెలల కుమారుడు అరుదైన కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం రూ.22 లక్షలు ఖర్చవు తుందని వైద్యులు పేర్కొనడంతో.. ఆ పేద తల్లిదండ్రులు ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తాము దాచుకున్న పాకెట్ మనీ చిన్నారి తల్లిదండ్రులకు అందజేయాలనుకున్నారు. చిన్నారుల పెద్దమనసుకు చలించిపోయిన ఉపాధ్యాయులు విద్యార్థులు అందజేసిన రూ.400కు తమవంతుగా కొంత నగదు కలిపి బాధిత చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు.



ప్రజావాణిలో దివ్యాంగులు, వయో వృద్ధుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పండుటాకుల గోడు విని..

సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండలో వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ ప్రారంభం

రాష్ట్రంలోనే తొలిసారిగా..

రాష్ట్రంలోనే మొట్టమొదటిసారి నల్లగొండ జిల్లాలో వృద్ధులు, దివ్యాంగుల కోసం కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక గ్రీవెన్స్‌ను గురువారం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా పలువురు వృద్ధులు, వికలాంగులు కలెక్టరేట్‌కు తరలివచ్చి కలెక్టర్‌కు తమ బాధలను వివరించి ఆదుకోవాలని వేడుకున్నారు. వారందరికీ కలెక్టర్ భరోసా ఇచ్చారు. ప్రత్యేక గ్రీవెన్స్‌కు వచ్చే వారి సమస్యలు ఎట్టిపరిస్థితుల్లో పరిష్కారం కావాలని అధికారులను ఆదేశించారు. ఇకపై ప్రతి గురువారం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. 'ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి 80 ఏళ్లు దాటిన వృద్ధులు, నడవలేని స్థితిలో ఉండే దివ్యాంగులు వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. వారు అలా గంటల తరబడి వేచిఉండటం బాధగా అనిపించింది. అందుకే వారి సమస్యలపై ప్రత్యేకంగా ప్రతి గురువారం గ్రీవెన్స్ నిర్వహించాలని నిర్ణయించాను' అని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.

– సాక్షి ప్రతినిధి, నల్లగొండ



ఈయన పేరు దేవరకొండ అంజయ్య, చిట్యాల మండలం ఏపూర్ గ్రామం. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. ఒక్కో బిడ్డకు ఒక ఎకరం చొప్పున రాసిచ్చారు. తన జీవనం కోసం ఒక ఎకరం తన పేరునే ఉంచుకున్నారు. అయితే ఒక మనవడు మభ్యపెట్టి అంజయ్య పేరున ఉన్న ఎకరం భూమిని కూడా రాయించుకున్నాడు. దీంతో ఆయనకు ఆధారం లేకుండా పోయింది. అధికారులను ఆశ్రయించినా న్యాయం జరగకపోవడంతో ప్రత్యేక గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు తన గోడు చెప్పుకున్నారు. దీంతో మనవడు చేయించుకున్న భూమి పట్టాను రద్దుచేసి, తిరిగి అంజయ్య పేరున పట్టా జారీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



వంట మనిషి ఇంట్లోనే బడి

కేసముద్రం: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెట్టే వంట మనిషి ఇల్లే ప్రభుత్వ పాఠశాలగా మారింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం పరిధిలోని బ్రహ్మంగారి తండాలో 2001లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. సొంత భవనం లేక నాటి నుంచి తండాలోని పలువురి ఇళ్లను అద్దెకు తీసుకుంటూ ఉపాధ్యాయులు బడి నడిపిస్తూ వచ్చారు. మొదట్లో స్కూల్‌లో 60 మంది విద్యార్థులు ఉండగా.. అద్దె ఇళ్లలో కనీస సౌకర్యాలు లేక సంఖ్య తగ్గుతూ 18 మందికి చేరింది. ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తి స్తున్నారు. గత ఏడాది బడి నడిపించడానికి తండాలో అద్దెకు ఇల్లు దొరకలేదు. దీంతో పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని మానవతా దృక్పథంతో మధ్యాహ్నం భోజనం వండిపెట్టే వంటమనిషి వినోద తన ఇంట్లో పాఠశాల నడిపించడానికి అంగీకరించింది. ఇంటి ఆవరణలోని రేకుల షెడ్డుకు చుట్టూరా పరదా కట్టి పిల్లలకు విద్యా బోధన చేస్తున్నారు. ఎండతీవ్రతకు రేకుల షెడ్డు కింద కూర్చున్న పిల్లలు అల్లాడిపోతున్నారు. టాయిలెట్లు కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతు న్నారు. ఇదిలా ఉండగా 'మన ఊరు– మన బడి' కింద పాఠశాలకు భవనం మంజూరైనా పిల్లర్ల వరకే నిర్మాణం జరిగింది.

కూలీకి రూ.22 లక్షల జీఎస్టీ నోటీసు!

- విజయవాడ వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం నుంచి..
- విజయలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ పేరుతో గ్రానైట్ వ్యాపారం చేసినట్లు వెల్లడి
- తనకు ఏమీ తెలియదన్న బాధితుడు



చంద్రుగొండ: ఓ సాధారణ వ్యవసాయ కూలీకి రూ.22 లక్షలు జీఎస్టీ చెల్లించాలంటూ నోటీసు జారీ అయింది. ఇటీవల పోస్టు ద్వారా అందిన నోటీసుతో నిరక్షరాస్యుడైన ఆ కూలీ బిత్తరపోయాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండకు చెందిన జానపాటి వెంకటేశ్వర్లు (వెంకటేష్) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు ఈ నెల 4వ తేదీన జీఎస్టీ నోటీసు అందింది. తనకు చదువు రాకపోవటంతో తెలిసివారికి ఆ లేఖను చూపగా, విజయవాడ బెంజ్ సెంటర్‌లోని కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయం నుంచి అందిన నోటీసుగా చెప్పారు. విజయలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ పేరుతో రూ.కోటి విలువైన గ్రానైట్ వ్యాపారం చేశారని, 2022 ఏడాదిలో చేసిన ఈ వ్యాపారానికి జరిమానాతో కలిపి జీఎస్టీ రూ.22,86,014 బకాయి పడ్డట్లు అందులో ఉంది. దీంతో ఆందోళన చెందిన వెంకటేశ్వర్లు.. విజయలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ ఎవరిదో కనుక్కునేందుకు ఈ నెల 12న విజయవాడ వెళ్లాడు. అయితే ఆ అడ్రస్‌లో కార్యాలయమే లేదని తేలడంతో వెనుదిరిగాడు. 2022 ఏడాదిలో ఆయనకు పాన్‌కార్డు కూడా లేదు. ఆరు నెలల క్రితమే చంద్రుగొండలోని మీ సేవ కేంద్రానికి పాన్‌కార్డు కోసం దరఖాస్తు చేయటానికి వెళ్తే.. ఆ పేరు, ఆధార్ నంబర్‌తో అప్పటికే పాన్‌కార్డు జారీ అయిందని చెప్పారు. అయితే, వెంకటేశ్వర్లు ఆధార్‌కార్డు అక్రమార్కుల చేతికి ఎలా వెళ్లింది? ఆయన పేరుతో వ్యాపార లైసెన్స్ తీసుకున్నది ఎవరేది తేలాల్సి ఉంది. ఈ విషయమై బాధితుడు మాట్లాడుతూ రెక్కాడితే కాని డొక్కాడని తనకు ఈ సమస్య నుంచి ఎలా బయటపడాలో అర్థం కావడం లేదని, అధికారులు సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరాడు.

కొడుకు కులాంతర వివాహం చేసుకున్నాడని..


తండ్రి అంత్యక్రియలకు కులస్తుల దూరం

లింగాలఘణపురం: కొడుకు కులాంతర వివాహం చేసుకున్నాడని, ఆయన తండ్రి అంత్యక్రియలకు కుల స్తులు దూరంగా ఉన్న సంఘటన జనగామ జిల్లా లింగాలఘణపురంలో గురువారం జరిగింది. విష యం తెలుసుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్ వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. దయ్యాల భిక్షపతి (60) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి కొడుకు అనిల్ ఆరు నెలలక్రితం నెల్లుట్లకు చెందిన శ్రావణిని ప్రేమ వివాహం చేసుకొని జన గామలో ఉంటున్నాడు. కొంతమంది పాలి వారు, కుల పెద్దలు కొడుకు తలకొరివి పెట్టవద్దని, మృతుడి భార్య పెడితేనే వస్తామని చెప్పడంతో అందుకు ఆమె అంగీకరించలేదు. విషయం తెలుసు కున్న ఎస్సై వారి వద్దకు వెళ్లి కౌన్సెలింగ్ ఇవ్వగా కొంతమంది మాత్రం అంత్యక్రియలకు హాజరయ్యారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

అందని దారం.. వస్త్రోత్పత్తి ఆగం

- ఆర్‌వీఎం ఆర్డర్లు 1.05 కోట్ల మీటర్లు
- ఇప్పటికి పూర్తయింది 20 లక్షల మీటర్లు..
- డిసెంబరులో ఆర్డర్లు..
- మార్చి నాటికీ అందని నూలు
- గడువులోగా వస్త్రోత్పత్తి గగనమే
- స్కూల్ యూనిఫామ్స్ బట్టకు కష్టకాలం
- ఇంకా బీములెక్కని మహిళా శక్తి చీరలు


సిరిసిల్లలో సాంచాలపై వస్త్రోత్పత్తి

సిరిసిల్ల వస్త్రపరిశ్రమ స్వరూపం

పవర్‌లూమ్స్: 20,302	మ్యాక్స్ సంఘాలు: 129
వస్త్రోత్పత్తి ఆర్డర్లు పొందిన మ్యాక్స్‌లు: 113	సంఘాల్లోని ఆసాముల సంఖ్య: 1,597
ఆర్‌వీఎం, సంక్షేమ శాఖల వస్త్రోత్పత్తి ఆర్డర్లు: 1.05 కోట్ల మీటర్లు	ఒక్కో మీటరు బట్ట ఖరీదు సగటున: రూ. 50
వస్త్రోత్పత్తి ఆర్డర్ల విలువ: రూ. 50.50 కోట్లు	

ఇప్పటికి సిద్ధమైన వస్త్రాలు: 10 లక్షల మీటర్లు (మరో పది లక్షలు మగ్గాలపై ఉంది)

సిరిసిల్ల: సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులు, చేనేత, జౌళిశాఖ అధికారుల మధ్య సమన్వయం లోపం.. వస్త్రోత్పత్తికి శాపంగా మారింది. ప్రభుత్వం ఇచ్చే వస్త్రోత్పత్తి ఆర్డర్లకు నూలు (దారం) సరఫరా చేస్తామని ముందుగా అధికారులు ప్రకటించి వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేశారు. కానీ, సిరిసిల్లలో వస్త్రోత్పత్తికి అవసరమైన నూలును సకాలంలో అందించడంలో విఫలమయ్యారు. ఫలితంగా ఈనెల 15 నాటికి అందించాల్సిన ఆర్‌వీఎం(రాజీవ్ విద్యా మిషన్), ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలకు సంబంధించిన స్కూల్ యూనిఫామ్స్ వస్త్రాల ఉత్పత్తిలో జాప్యం జరుగుతోంది. సిరిసిల్లలోని పాతికవేల మరమగ్గాల (పవర్‌లూమ్స్)పై షూటింగ్, షర్టింగ్, ఓసీ వస్త్రాలు ఉత్పత్తి చేయాల్సి ఉండగా.. దానికి అవసరమైన నూలు అందించలేదు. దీంతో గడువులోగా వస్త్రాల తయారీ కష్టంగా మారింది.

ప్రభుత్వ లక్ష్యానికి గండి

స్కూళ్లు తెరిచే నాటికి (జూన్ మొదటి వారంలో) అన్ని ప్రభుత్వ స్కూళ్లు, గురుకులాల్లోని పిల్లలకు రెండు జతల యూనిఫామ్స్ అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు డిసెంబర్‌లో సిరిసిల్ల నేతన్నలకు కోటి ఐదు లక్షల మీటర్ల వస్త్రాల ఆర్డర్లు ఇచ్చారు. ఈ బట్ట ఉత్పత్తికి అవసరమైన నూలును డిపో ద్వారా అందించేందుకు టెండర్లు పిలిచారు. ఈ మొత్తం ప్రాసెస్ పూర్తయి.. సిరిసిల్లలోని నేతన్నలకు వేములవాడలోని నూలు డిపో ద్వారా నూలు సరఫరా అయ్యే సరికి ఫిబ్రవరి అయింది. వచ్చిన నూలుకు ఆసాములు పది శాతం మేరకు డీడీలు చెల్లించి, నూలు తీసుకుని వచ్చి భీములుగా పోసి సాంచాలపైకి ఎక్కించారు. ప్రస్తుతం పది లక్షల మీటర్ల వస్త్రాలు సిద్ధంగా ఉండగా.. భీములపై మరో పది లక్షల మీటర్ల వస్త్రం రెడీ అవుతోంది. మొత్తంగా 20 లక్షల మీటర్లు మరో వారంలోగా సిద్ధమైనా.. ఈ నెలాఖరులోగా 50 శాతం వస్త్రోత్పత్తి లక్ష్యం అసాధ్యమే. ఈ లెక్కన వస్త్రాల సేకరణ పూర్తయి, యూనిఫామ్స్ కుట్టి, బడి తెరిచే నాటికి రెండు జతల డ్రెస్సులు అందించాలనే లక్ష్యం సాధించడం కష్టంగానే ఉంది.


ఉత్పత్తి అయిన స్కూల్ యూనిఫామ్స్ వస్త్రాల టాకాలు

సమస్య ఏంటంటే..!

ప్రభుత్వం టెస్కో ద్వారా సిరిసిల్లలోని మ్యూచువల్ ఎయిడెడ్ సొసైటీ (మ్యాక్స్)లకు వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇవ్వడం, ఇక్కడ మాస్టర్ వీవర్స్ (యజమానులు) నూలును కొనుగోలు చేసి ఆసాముల (పవర్‌లూమ్స్ యజమానులు)కు ఇవ్వడం, వారు సాంచాలు నడుపుతూ, కార్మికులతో పని చేయిస్తూ.. బట్ట నేసి ఇవ్వడం జరుగుతుంది. కానీ, ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసిన నూలు డిపో ద్వారా నాణ్యమైన నూలు సరఫరా చేస్తామని ప్రకటించిన అధికారులు సకాలంలో అందించలేదు. ఇప్పుడు ప్రైవేటుగా కొనుగోలు చేసి స్కూల్ యూనిఫామ్స్ బట్టనూ నేయాలని యజమానులను జౌళిశాఖ అధికారులు కోరుతున్నారు. ఆలస్యంగా నూలు ఆర్డర్లు ఇవ్వడంతో వస్త్రోత్పత్తికి విఘాతం కలుగుతోంది. ఇటీవల చేనేత, జౌళిశాఖ కమిషనర్ శైలజా రామయ్యర్ సిరిసిల్ల కలెక్టరేట్‌లో వస్త్రోత్పత్తిదారులతో సమావేశం నిర్వహించి ఈనెల 15లోగా 50 శాతం బట్ట ఇవ్వాలని కోరారు. కానీ ఆ మేరకు సిరిసిల్లలో వస్త్రాల నిల్వలు లేవు.


బీములు పోస్తున్న వార్పర్

మహిళా శక్తి చీరల ఊసేది?

సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు 8న ఇందిరా మహిళా శక్తి పేరిట స్వశక్తి సంఘాల్లోని మహిళలకు ఏటా రెండు చీరలు ఇస్తామని సీఎం ప్రకటించారు. మొదటి విడతగా 2.12 కోట్ల మీటర్ల చీరల బట్ట ఉత్పత్తి ఆర్డర్లు ఇచ్చారు. దీని విలువ రూ.71.75 కోట్లు ఉంటుంది. కానీ, దానికి సంబంధించిన నూలును ఇప్పటి వరకు సరఫరా చేయలేదు. రెండో విడతగా మరో 2.12 కోట్ల మీటర్ల వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇచ్చేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నా.. మొదటి విడతకే మోక్షం లేక వస్త్రోత్పత్తిదారులు రెండో విడత ఆర్డర్లు తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు నూలు డిపోలో వార్పు (భీముల నిలువు పోగుల), వెఫ్ట్ (అడ్డం కోముల పోగుల) నూలు అందుబాటులో ఉండటం లేదు. వార్పు, వెఫ్ట్ రెండు ఉంటేనే బట్టను మగ్గంపై నేసే అవకాశం ఉంది. ఒకటి ఉండి ఒకటి లేక వస్త్రోత్పత్తికి ప్రతిబంధకంగా మారింది. స్కూల్ యూనిఫామ్స్ వస్త్రాల తయారీ సాగుతుండగా, ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తి మరింత ఆలస్యం కానుంది.


సిరిసిల్లలో బీములు నింపుతున్న నూలు పోగులు

ఆలస్యమైనా లక్ష్యం సాధిస్తాం



“కొంత ఆలస్యమైనా వస్త్రోత్పత్తిలో లక్ష్యం సాధిస్తాం. ఈ మేరకు సిరిసిల్లలోని వస్త్రోత్పత్తిదారులను ప్రోత్సహిస్తున్నాం. కొత్తగా నూలు డిపో ఏర్పాటు చేసి నూలు సరఫరా చేస్తున్నాం. ప్రైవేటుగా కూడా నూలు కొనుగోలు చేసుకోవచ్చని చెప్పాం. డిపో ద్వారా అందరికీ నూలు ఇవ్వడం సాధ్యం కాదు. ప్రభుత్వ వస్త్రోత్పత్తి లక్ష్యాన్ని సాధించేలా చర్యలు తీసుకుంటాం.”

– వులిశె అశోక్‌రావు, టెస్కో జీఎం, హైదరాబాద్


అసెంబ్లీ మీడియా పాయింట్

ప్రతిపక్షం గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారు
ఎమ్మెల్యేలు తలసాని, వేముల



ప్రభుత్వం ప్రతిపక్షం గొంతునొక్కే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. సభలో ప్రతిసారి జగదీశ్‌రెడ్డిని ఇబ్బందిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ నేతలు అనడం కరెక్ట్ కాదన్నారు. స్పీకర్ అంటే మాకు గౌరవం ఉందన్నారు. ఏమీ లేకున్నా ఏదో జరిగినట్టు నాలుగు గంటలు సభ వాయిదా వేశారని, జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై అఖిలపక్షాన్ని పిలిచి రికార్డులను పరిశీలించాలని కోరామన్నారు.

తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాల్సిందే
బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



తెలంగాణ సాధకుడు కేసీఆర్‌ను మార్చురీకి పంపిస్తానని అహంకారపూరిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాల్సిందేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. గంగుల కమలాకర్, కేపీ వివేకానంద, సుధీర్‌రెడ్డి, అనిల్‌జాదవ్‌లు మాట్లాడారు. వైఎస్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, కేసీఆర్ లాంటి సీఎంలను చూశామని, కానీ ఇంతటి అసమర్థ సీఎంను చూడలేదన్నారు. రేవంత్‌రెడ్డి ఇలాంటి భాష మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

పంటలకు నీళ్లు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం
పాడి కౌశిక్‌రెడ్డి



పంటలు ఎండిపోతుంటే..కనీసం నీళ్లు ఇవ్వలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, నీళ్లు వదలకపోతే రైతులను తీసుకొని తాను రోడ్డెక్కుతానని హెచ్చరించారు. ప్రజలు పెడుతున్న శాపనార్థాలకు కుక్కచావు చచ్చేది రేవంత్‌రెడ్డేనని వ్యాఖ్యానించారు

కాంగ్రెస్ పాలనలో ప్రశ్నించడమే రాజద్రోహమా: సబితారెడ్డి, కోవా లక్ష్మి



కాంగ్రెస్ పాలనలో ప్రశ్నించడమే రాజద్రోహమా? జర్నలిస్టులపై అక్రమ కేసులు పెడుతున్నారని ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, కోవా లక్ష్మిలు మండిపడ్డారు. గతంలో రేవంత్ సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్ట్‌పై దాడి చేశారని, ఇప్పుడు మరో ఇద్దరు జర్నలిస్టులను అరెస్ట్ చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

నాకు మంత్రి పదవి ఇస్తే పార్టీకి, ప్రజలకు మంచిది : కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. అయితే ఎప్పటికప్పుడు విస్తరణ వాయిదా పడుతోందని చెప్పారు. తనకు మంత్రిపదవి ఇస్తే అటు పార్టీకి, ఇటు ప్రజలకు మంచిదన్నారు. తాను ఏ పార్టీలో ఉన్నా, పార్టీ ఇచ్చిన అసైన్‌మెంట్‌ను కచ్చితంగా నెరవేరుస్తానని, భువనగిరి ఎంపీ ఎన్నికల్లో 25 రోజులు నిద్రపోకుండా పనిచేసి పార్టీకి విజయం సాధించి పెట్టానని చెప్పారు.

రాష్ట్రం దివాలా తీయడానికి కారణం మామాఅల్లుళ్లే : విప్ బీర్ల ఐలయ్య



ఈ రోజు రాష్ట్రం దివాలా తీయడానికి కారణం కేసీఆర్, హరీశ్‌రావు అంటూ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ధ్వజమెత్తారు. సిగ్గులేకుండా సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యం, గవర్నర్, సీఎం అంటే మీకు విలువ లేదని, ముఖ్యమంత్రి కుర్చీని అగౌరవపరిచిన హరీశ్‌రావు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మీరు పందికొక్కుల్లా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

సభలో జరిగిన సంఘటన అత్యంత బాధాకరం : యశస్విని రెడ్డి



అసెంబ్లీలో జరిగిన ఘటన అత్యంత బాధాకరమని, నిండు సభలో కాలేజీ స్టూడెంట్స్‌లా బీఆర్ఎస్ నేతలు ప్రవర్తిస్తున్నారని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నేతలకు అబద్ధాల్లో పీహెచ్‌డీ ఇవ్వాలని ఎద్దేవా చేశారు. దళిత స్పీకర్‌ను అవమానించిన జగదీశ్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు.

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ పిరికిపంద చర్య

- బీఆర్ఎస్ నేత ప్రవీణ్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ పిరికిపంద చర్యగా బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అభివర్ణించారు. జగదీశ్‌రెడ్డి సభా గౌరవాన్ని కించపరచలేదని ఆయన గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి లాగా బూతులు మాట్లాడలేదని, ఎక్కడా చట్టవిరుద్ధమైన పనులు చేయలేదని పేర్కొన్నారు. కేవలం ఏకవచనంతో మాట్లాడారన్న సాకుతో సస్పెండ్ చేయడం వెనుక సీఎం భయం, ఆందోళన కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు.

దళిత స్పీకర్ కాబట్టే అవమానం: సీతక్క

దళితుడైన అసెంబ్లీ స్పీకర్ అంటే బీఆర్ఎస్ నేతలకు గౌరవం లేదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మండిపడ్డారు. ఆమె గురువారం అసెంబ్లీ లాబీల్లో విలేకరులతో మాట్లాడారు. దళిత స్పీకర్ కాబట్టే ఏకవచనంతో పిలుస్తున్నారని ఆరోపించారు. శాసనమండలిలో బీఆర్ఎస్ సభ్యుల అనుచిత ప్రవర్తనపై మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు.

టెలిమెట్రీ ఏర్పాటుకు నిధులు

సాక్షి, హైదరాబాద్: ఏపీ, తెలంగాణలోని కృష్ణా ప్రాజెక్టులపై రెండో విడత టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటుకు రూ.4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ గురువారం కృష్ణా బోర్డుకు లేఖ రాశారు.

గద్వాలకు కృష్ణా నీళ్లివ్వండి

- మంత్రి ఉత్తమ్‌కు ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి వినతి

సాక్షి, హైదరాబాద్: తన నియోజకవర్గం పరిధిలోని 30 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేందుకు శ్రీశైలం ప్రాజెక్టు నుంచి రేలపాడు మీదుగా కృష్ణా నీటిని ఎత్తిపోయాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కోరారు. గురువారం అసెంబ్లీ లాబీలో ఉన్న మంత్రి చాంబర్‌లో ఉత్తమ్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. జూరాల రిజర్వాయర్‌లో నీరు ఉండడం లేదని, అందుకే శ్రీశైలం నుంచి ఎత్తిపోసే ప్రాజెక్టుకు నిధులివ్వాలని కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి.. గట్టు ప్రాంతం నుంచి నీళ్లిస్తే ఎలా ఉంటుందని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. అక్కడి నుంచి నీళ్లు తేవడం ఎక్కువ ఖర్చుతో కూడుకున్నదని ఎమ్మెల్యే వివరించారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కూడా ఉత్తమ్‌ను కలిసి బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి నీళ్లిచ్చి తన నియోజకవర్గంలోని పంట భూములు ఎండిపోకుండా కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ రెండు అంశాలపై సంబంధిత ఈఎన్‌సీలతో మాట్లాడతానని మంత్రి హామీ ఇచ్చారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కూడా ఉత్తమ్‌ను కలిశారు.

స్పీకర్ అందరికీ సమాన అవకాశం ఇవ్వాలి : పాయల్ శంకర్



స్పీకర్ అందరు సభ్యులకు సమాన అవకాశం ఇవ్వాలని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యులు ఒకరికొకరు సహకరించుకుంటూ సభ సమయం వృథా చేస్తున్నారని ధ్వజమెత్తారు. దీంతో వాస్తవాలు చర్చకు రాకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

– సాక్షి, హైదరాబాద్

మానవ అక్రమ రవాణా కేసులో కొనసాగుతున్న ఈడీ దర్యాప్తు

- రూ.1.90 లక్షల విలువైన నగదు, ఆస్తి జప్తు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగర శివారులో బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తులు నిర్వహిస్తున్న మానవ అక్రమ రవాణా, వ్యభిచార రాకెట్‌లకు సంబంధించి రెండు కేసులలో ఈడీ అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. తగిన ఆధారాలు లభించడంతో నిందితులకు చెందిన రూ. 1.90 లక్షల విలువైన నగదు, ఆస్తి మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈడీ తాత్కాలికంగా జప్తు చేసింది. ఈ మేరకు హైదరాబాద్ జోనల్ కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. అందులో పేర్కొన్న ప్రకారం..బంగ్లాదేశ్ నుంచి యువతులను అక్రమంగా దేశంలోకి తీసుకురావడంతోపాటు హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు ఛత్రినాక, పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రెండు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల ఆధారంగా మానవ అక్రమ రవాణా కోణంలో ఎన్ఐఏ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ ముఠాలు ఇక్కడ సేకరించిన డబ్బును పలు మార్గాల్లో బంగ్లాదేశ్‌కు తరలిస్తున్నట్టు దర్యాప్తు అధికారులు గుర్తించారు. దీంతో మనీలాండరింగ్ కోణంలో ఈడీ రంగంలోకి దిగింది. తగిన ఆధారాలు లభించడంతో పేటీఎం వాలెట్‌లు, బ్యాంక్ ఖాతాలలో బ్యాలెన్స్, అక్రమ రవాణాలో పాల్గొన్న ప్రముఖ ఏజెంట్లలో ఒకరైన రుహుల్ అమీన్ ధాలి అనే నిందితుడి స్థిరాస్తి కలిపి రూ.1.90 లక్షల విలువైనవి జప్తు చేసినట్టు ఈడీ అధికారులు తెలిపారు.

బాహుబలి లాంటి రాష్ట్రాన్ని బలి చేశారు: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: బాహుబలి లాంటి రాష్ట్రాన్ని బలి చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నంగనాచి మాటలు చెబుతున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు 'ఎక్స్' వేదికగా విమర్శించారు. 'ఢిల్లీకి పంపడానికి మూటలు ఉన్నాయి కానీ హామీలు, గ్యారంటీల అమలు, ఉద్యోగుల జీతాలు, పెన్షన్లకు డబ్బులు లేవు. అసమర్థుడి పాలనలో ఆర్థికరంగం అల్లకల్లోలంగా మారింది. సర్కారు నడపలేని సన్నాసికి ఎందుకు ఇంత అహంకారం, రాష్ట్రానికి లేనిది ఆదాయం కాదు.. సీఎం మెదడులో విషయం. స్టేచర్ లేకున్నా పేమెంట్ కోటాలో పదవి దక్కడంతో కళ్లు నెత్తికెక్కాయి. పదేళ్లు కష్టపడి చక్కదిద్దిన ఆర్థికరంగాన్ని చిందరవందర చేసి పాపం మూటగట్టుకున్నాడు. ఉద్యోగులు సహకరించడం లేదని సీఎం అనడం వారిని దారుణంగా అవమానించి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. పరిపాలన చేతకాక ఉద్యోగులు పనిచేయడం లేదని నిందలు వేస్తే సహించేది లేదు' అని కేటీఆర్ హెచ్చరించారు.

పట్టాలైనా.. పక్కా రోడ్లయినా..

రోడ్ కం రైల్ వాహనం పరుగులు

ఖమ్మం రాపర్తినగర్/చింతకాని: పట్టాలు ఉన్నంత వరకు రైలు చక్రాలకు ఉండే యాక్సిల్‌తో.. పట్టాలు ముగియగానే సాధారణ టైర్లతో రోడ్డుపైనా పరుగులు తీయగల వాహనాన్ని రైల్వే అధికారులు వినియోగిస్తున్నారు. పట్టాలపై పగుళ్లను గుర్తించేందుకు యూఎఫ్ఎస్‌డీ యంత్రాన్ని అమర్చిన కారులో అధికారులు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నుంచి ఖమ్మం జిల్లా పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ వరకు గురువారం పరిశీలించారు. ఈ కారు రామకృష్ణాపురం రైల్వే గేట్ (107) వద్ద ఆగింది. అందులో ఉన్న ఎస్ఎస్ఈటీవే కృష్ణకుమార్ కిందకు దిగడంతో.. స్థానికులు ఆయనతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గతంలో పట్టాలపై పగుళ్లను గుర్తించేందుకు సిబ్బంది కాలినడకన వెళ్లేవారని తెలిపారు. ప్రస్తుతం ప్రత్యేక యంత్రం అమర్చిన ఈ కారుకు రైలు చక్రాలకు ఉండే యాక్సిల్ ఉండటంతో పట్టాలపై వెళ్తుందని ఎస్ఎస్ఈటీవే కృష్ణకుమార్ వివరించారు. పట్టాలపై వెళ్లేటప్పుడు యాక్సిల్ కిందకు వచ్చి వాహనం కాస్త పైకి లేస్తుందని చెప్పారు. మళ్లీ కిందకు దింపితే రోడ్డుపై సాధారణ టైర్లతో వెళ్లొచ్చని వివరించారు.


పట్టాలపై వెళ్తున్న వాహనం

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను సత్వరం పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు గురువారం యూనియన్ నేతలు నల్ల భారతి, రమాతార, వేదవతి రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, కమిషనర్ కాంతివెస్లీలను వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ విరమణ చేసిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు తక్షణమే ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని కోరారు. అంగన్‌వాడీలకు వేసవి సందర్భంగా ఒంటిపూట బడులు నిర్వహించాలని, పూర్తిస్థాయి వేసవిలో సెలవులు ఇవ్వాలని విన్నవించారు.

భారతీయ వ్యవసాయానికి ఐదు యూకే అగ్రి-టెక్ సంస్థల ఎంపిక

- యూకే-ఇండియా అగ్రి-టెక్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌లో భాగంగా..

సాక్షి, హైదరాబాద్: గత జనవరిలో ప్రారంభమైన యూకే-ఇండియా అగ్రి-టెక్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌లో భాగంగా.. భారతీయ వ్యవసాయ రంగానికి సహకారం అందించేందుకు ఐదు యూకే అగ్రి-టెక్ సంస్థలను ఎంపిక చేశారు. ఈ సంస్థల ప్రతినిధులు మార్చి 17 నుంచి 21 వరకు దేశంలోని ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా, యూకే అగ్రి-టెక్ సంస్థలు భారత వ్యవసాయ క్షేత్రాలను ప్రత్యక్షంగా పరిశీలించి, ఇరు దేశాల రైతులు, వ్యవసాయ రంగ సంస్థలకు మేలుచేసే భాగస్వామ్య అవకాశాలను అన్వేషించనున్నారు. అధునాతన వ్యవసాయ పరిజ్ఞానాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో రూపొందించిన ఈ కార్యక్రమాన్ని యూకే అగ్రి-టెక్ సెంటర్, యూకే ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్లైమేట్-రెసిలియంట్ క్రాప్స్ (వాతావరణ అనుకూల పంటల) కోసం అందిస్తున్న అధునాతన పరిజ్ఞానాలను.. ఈ ఐదు సంస్థలు ప్రామాణికంగా తీసుకోనున్నాయి.

ఎంపికైన ఐదు యూకే అగ్రి-టెక్ సంస్థలివే..

మ్యుటస్ టెక్, లినీర్ వర్క్స్, గ్రీన్ క్రాప్ టెక్, అగ్రిసౌండ్ పాలీ, లెటస్ గ్రో అనే ఐదు సంస్థలను ఈ యాక్సిలరేటర్ ప్రోగ్రాంకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కృత్రిమ మేధస్సు, శాటిలైట్ ఆధారిత హైపర్‌స్పెక్ట్రల్ సెన్సర్ల వినియోగంతో వాతావరణ ఒత్తిళ్లను గుర్తించడం, బయో అకౌస్టిక్ సెన్సర్లను అభివృద్ధి చేసి పూల పరాగసంపర్కాన్ని ట్రాక్ చేయడం వంటి అంశాలపై ఈ సంస్థలు ప్రయోగాలు చేయనున్నాయి.

దక్షిణాది,ఉత్తరాది విభజనకు కాంగ్రెస్ కుట్ర: కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ దేశాన్ని దక్షిణాది, ఉత్తరాదిలా విభజించే కుట్రకు పాల్పడుతోందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. దేశ సమైక్యతకు, సమగ్రతకు భంగం కలిగించేలా కాంగ్రెస్, ఆ పార్టీ ముఖ్యమంత్రులు వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరమన్నారు. దక్షిణాదిలో ఎంపీ సీట్ల తగ్గింపుపై కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొనడాన్ని తప్పుబట్టారు. సీఎం స్టాలిన్ ఏర్పాటు చేసిన సమావేశాన్ని రేవంత్‌రెడ్డి సమర్థించడం... దక్షిణాది రాష్ట్రాల హక్కులు కాపాడాలంటూ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ పట్ల ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని, ఆగ్రహాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నమే ఇదని లక్ష్మణ్ విమర్శించారు.

చిలకమ్మా.. చిరు కంకిని తినకమ్మా..



పచ్చని పైరుపై చిలుకల గుంపు వాలితే చూసేందుకు కనువిందుగా ఉంటుంది. కానీ గుంపులుగా వాలిన చిలుకలు పంటను తినేస్తుంటే పాపం రైతుకు నష్టమే మిగులుతుంది. ఎన్టీఆర్ జిల్లాలోని నున్న-నూజివీడు మార్గంలో రోడ్డుపక్కన ఉన్న జొన్న పొలంపై ఓ చిలకల గుంపు దాడిచేసి కంకుల్ని తినేస్తుండగా సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

చుక్క నీటికోసం ఎన్ని తిప్పలో..



సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. మడుగులు, కొలనుల్లో నీరు ఇంకిపోవడంతో అడవి జంతువులు జనావాసాల్లోకి వస్తున్నాయి. దాహంతో అలమటిస్తున్న ఓ వానరం గురువారం నెల్లూరు పెద్ద బజార్ ప్రాంతంలో ఓ ఇంటి ముందు ఉన్న తొట్టెలో నీళ్లు తాగుతున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

తన నీడలో సేద తీర్చుకొమ్మంది

'మండుటెండలోన మర్రి ఎదురొచ్చింది.. తన నీడలో సేద తీర్చుకొమ్మంది' అని చిన్నప్పుడు పుస్తకాల్లో చదువుకున్నాం. వేసవిలో మర్రి చెట్టు నీడన కూర్చున్నంత హాయి ఇంకెక్కడా రాదు. ఎండలు మండిపోతుండటంతో వైఎస్సార్ జిల్లా చంతకొమ్మదిన్నె గ్రామంలో జనం రచ్చబండ దగ్గర మర్రిచెట్టు నీడన సేద దీరుతున్న దృశ్యాన్ని సాక్షి క్లిక్ మనిపించింది



- సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

క్లుప్తంగా...

'విశాఖ ఉక్కు' పరిరక్షణ నిరసనలకు సీపీఐ మద్దతు

సాక్షి, అమరావతి: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఈ నెల 14న నిర్వహిస్తోన్న నిరసనలకు మద్దతు ఇస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం తెలిపారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేట్ పరం చేయరాదని, దానికి క్యాపిటివ్ మైన్స్ కేటాయించి ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, రాష్ట్రంలో వైద్య విద్యార్థులతో సమానంగా పశువైద్య విద్యార్థులకు గౌరవ వేతనాన్ని పెంచాలని సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను రామకృష్ణ మీడియాకు విడుదల చేశారు.

కాటికాపరులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కాటికాపరులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి..వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి సంక్షేమ పథకాలు అందించాలని కులవివక్ష వ్యతిరేక పోరాటం సంఘం (కేవీపీఎస్), కాటి కాపరుల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డీబీవీ స్వామి, కార్యదర్శి ఎంఎం నాయక్‌లకు గురువారం కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, కాటికాపరుల సంఘం ప్రతినిధులు వినతిపత్రాలు అందించారు.

కార్మిక శాఖ కార్యదర్శిగా శేషగిరికి అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: కార్మిక శాఖ కమిషనర్ ఎం వీ శేషగిరికి కార్మిక, కర్మాగారాలు, బాయిలర్స్ శాఖ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

పింఛన్ల పంపిణీకి కొత్త ఫింగర్ ప్రింట్ స్కానర్లు

సాక్షి,అమరావతి: పింఛన్ల పంపిణీ సమయంలో లబ్ధిదారుల వేలి ముద్రలు తీసుకునేందుకు ఉపయోగించే కొత్త ఫింగర్ ప్రింట్ స్కానర్‌లను గ్రామ వార్డు సచివాలయాల శాఖ శుక్రవారం జిల్లాలకు సరఫరా చేసింది. ఆధార్ అనుసంధాన సాఫ్ట్‌వేర్ సాంకేతికతను ఆధార్ జారీ సంస్థ యూఐడీఏఐ ఆధునీకరించడంతో ఇప్పటిదాకా వినియోగిస్తున్న ఫింగర్ ప్రింట్ స్కానర్‌లు మార్చి 31 తర్వాత వినియోగానికి పనికిరావు. ఈ నేపథ్యంలో కొత్తగా కొనుగోలు చేసిన 1,34,450 పరికరాలను సోమవారం కల్లా సచివాలయాల వారీగా సంబంధిత సిబ్బందికి చేరవేసేందుకు సచివాలయాల శాఖ ఏర్పాట్లు చేసింది.

సూక్ష్మ సేద్యంలో ఆటోమేషన్ ద్వారా మెరుగైన ఫలితాలు

సాక్షి, అమరావతి: సూక్ష్మ సేద్యంలో ఆటోమేషన్ ద్వారా రైతులకు మేలైన ఫలితాలు వస్తాయని రాష్ట్ర ఉద్యాన శాఖ సంచాలకులు డాక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. సూక్ష్మ సేద్యం వార్షిక బడ్జెట్లో 5% తప్పనిసరిగా ఆటోమేషన్ విధానం అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 'సూక్ష్మసేద్యం ఆటోమేషన్ కార్యాచరణ'పై గుంటూరు ఉద్యాన శాఖ డైరెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి కొరత, వ్యవసాయ కూలీల కొరత వంటి సవాళ్లను ఆటోమేషన్ ద్వారా చెక్ పెట్టవచ్చన్నారు.

సీఎంతో గ్రూపు ఫొటో

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబుతో మంగళవారం శాసనసభ తేనీటి విరామ సమయంలో ఎమ్మెల్యేల గ్రూపు ఫొటో ఉందని.. సభ్యులు అందరూ సభకు హాజరవ్వాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సూచించారు.

ప్రభుత్వ సలహాదారుగా డాక్టర్ నోరి దత్తాత్రేయుడు

సాక్షి, అమరావతి: ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుగా (నివారణ, అఫర్డబుల్ క్యాన్సర్ కేర్) కేబినెట్ హోదాలో నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి రెండేళ్లపాటు ఈ పదవిలో ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆ గంటే.. కీలకమంట



గోల్డెన్ అవర్‌లో కంప్లైంట్‌తో మేలు

- సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకు ఆ సమయమే ప్రధానం



శ్రీకాకుళం క్రైమ్ : గోల్డెన్ అవర్.. ఇప్పటివరకు రోడ్డు ప్రమాదాలు సంభవించేటప్పుడు మాత్రమే ఈ పదం వినుంటారు. ప్రమాదాలు సంభవించిన గంటలోపే క్షతగాత్రులను ఆస్పత్రికి చేర్చడం దీని ఉద్దేశం. ఇదే తరహాలో సైబర్ మోసాలకు గురయ్యే బాధితులు సైతం నేరం జరిగిన గంటలోగా ఫిర్యా దు చేయగలిగితే.. మన ఖాతాలో పోగొట్టుకున్న సొమ్మును తిరిగి రాబట్టుకునే వీలుంటుంది. బాధితులు చేయాల్సిందల్లా గోల్డెన్ అవర్‌లో సైబర్‌సెల్‌కు ఫిర్యాదు చేయడమే. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ఇచ్చిన నివేదిక ప్రకారం జిల్లాలో ఇప్పటివరకు ఐదువేల లోపు సైబర్ నేరాలకు సంబంధించి ఫిర్యాదులు వెళ్లాయి. తాము మోసానికి గురవుతున్న నిమిషాల్లోనే ఎన్‌సీఆర్బీకి, 1930 సైబర్ సెల్ నంబర్‌కు డయల్ చేసి ఫిర్యాదు ఇవ్వడం వలన సుమారు రూ. 4.09 కోట్ల వరకు సేవ్ అయినట్లు ఈ నివేదికలు చెబుతున్నాయి. జిల్లాలో తొలిసారిగా ఐదు సైబర్ కేసులకు సంబంధించి రూ. 10.13 లక్షలు బాధితులకు అందించినట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఇటీవల వెల్లడించారు.

ఫిర్యాదు చేయాలిలా..

- మనం మోసపోయిన క్షణానే 1930 నంబర్‌కు కాల్ చేయాలి.
- లేదంటే హెచ్‌టీటీపీఎస్://సీవైబీఇఆర్‌సీఆర్ఐఎంఇ.జిఒవి.ఐఎన్ అనే పోర్టల్‌ను క్లిక్ చేయాలి. హోమ్‌పేజీలోకి వెళ్లి ఫైల్ ఎ కంప్లైంట్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే అక్కడ కొన్ని నియమాలు షరతులు చూపిస్తుంది. వాటిని చదివి యాక్సెప్ట్ చేసి రిపోర్ట్ అదర్ సైబర్ క్రైమ్ బటన్‌పై క్లిక్ చేయాలి.
- తర్వాత సిటిజన్ లాగిన్ ఆప్షన్ సెలెక్ట్ చేసి పేరు, ఫోన్ నంబర్, ఈ-మెయిల్ వివరాలు ఎంటర్ చేస్తే రిజిస్టర్ మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది.
- ఓటీపీ ఎంటర్ చేసి క్యాప్చా కోడ్‌ను బాక్స్‌లో ఫిల్ చేసి సబ్మిట్ బటన్ నొక్కాలి. తర్వాత పేజీలోకి తీసుకెళ్తుంది. అసలు ప్రక్రియ మొదలయ్యేది ఇక్కడే.
- ఈ పేజీలో ఒక ఫారం కనిపిస్తుంది.. దానిలో మనకు జరిగిన సైబర్ మోసం గురించి రాయాలి. కాకపోతే నాలుగు సెక్షన్లుగా విభజించి ఉంటుంది. సాధారణ సమాచారం (విక్టిమ్ ఇన్ఫర్మేషన్), సైబర్ నేరానికి సంబంధించి సమాచారం (సైబర్ క్రైమ్ ఇన్ఫర్మేషన్), ప్రివ్యూ అనే సెక్షన్లు ఉంటాయి.
- ప్రతి సెక్షన్‌లో అడిగిన వివరాలను సమర్పిస్తూ.. ప్రక్రియను పూర్తిచేయాలి. మూడు సెక్షన్లు పూర్తయ్యాక ప్రివ్యూను వెరిఫై చేయాలి. అన్ని వివ రాలు సరిగా ఉన్నాయమని భావిస్తే సబ్మిట్ బటన్ క్లిక్ చేయాలి.
- తర్వాత ఘటన ఎలా జరిగిందనేది వివరాలు నమోదుచేయాలి. నేరానికి సంబంధించిన స్క్రీన్ షాట్లు (అకౌంట్ ట్రాన్సాక్షన్ తదితర) ఫైల్స్ వంటి ఆధారాలు, సాక్ష్యాలు అందులో పొందుపర్చాలి. వివరాలు సేవ్ చేసి నేరగాళ్ల గురించి ఏదైనా సమాచారం తెలిస్తే ఫిల్ చేయాలి.
- అంతా వెరిఫై చేసుకున్నాక సబ్మిట్ బటన్ క్లిక్ చేస్తే కన్‌ఫర్మేషన్ మెసేజ్ వస్తుంది. కంప్లైంట్ ఐడీతో పాటు ఇతర వివరాలతో కూడిన ఈ-మెయిల్ వస్తుంది. తర్వాత అధికారులు దర్యాప్తు ప్రారంభిస్తారు.
- ఫిర్యాదు చేయడం ఆలస్యమైతే దుండగుడు డబ్బును వేర్వేరు ఖాతాల్లో మళ్లించేస్తాడు. లేదంటే క్రిప్టో కరెన్సీగా మార్చుకునే ప్రమాదముంది.

క్షణాల్లో ఫిర్యాదు చేయండి..

సైబర్ మోసానికి గురయ్యేవారు వెంటనే గుర్తించాలి. క్షణాల్లో ఫిర్యాదు చేస్తే మన డబ్బులు వెనక్కి వచ్చే అవకాశాలెక్కువ. లేదంటే ఎక్కడ ఉంటారో.. వారి ఖాతాలు ఏ రాష్ట్రానికి చెందినవి.. ఇవన్నీ కనుక్కోవడం పెద్ద ప్రాసెస్. 1930కు గానీ, ఎన్‌సీఆర్‌బీకి గానీ ఫిర్యాదు చే సి బ్యాంకు వాళ్లను, దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలి.

– కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ



సైబర్ మోసానికి గురైతే 1930 నంబర్‌కు కాల్ చేయాలి.

ప్రభుత్వానికి కాపులపై వివక్ష తగదు

- పవన్ పక్కన ఉంటే కాపులంతా తమతోనే ఉంటారని చంద్రబాబు ధీమా
- రిజర్వేషన్లు లేవు.. జిల్లాలకు కాపుల పేర్లు లేవు
- కాపు కార్పొరేషన్‌కు నిధులివ్వలేదు
- సీఎం చంద్రబాబుకు కాపు ఐక్యవేదిక బహిరంగ లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం కాపులపై వివక్షను, సవతి తల్లి ప్రేమను చూపడం తగదని కాపు ఐక్యవేదిక పేర్కొంది. ఈ విషయమై సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను కాపు ఐక్యవేదిక చైర్మన్ రావి శ్రీనివాస్, కన్వీనర్ బోడపాటి పెదబాబు, కో-కన్వీనర్ కాకిలేటి హరనాథ్ గురువారం మీడియాకు విడుదల చేశారు. ఎన్నికల ముందు కాపుల్లో భావోద్వేగాన్ని రెచ్చగొట్టి అధికారంలోకి రావడం, ఆ తర్వాత కాపుల ప్రయోజనాలను పూర్తిగా గాలికి వదిలేయడం సర్వసాధారణమైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అత్యంత అమాయకులు, భావోద్వేగం కలిగినవారు కాపులు మాత్రమేనని, వారిని అడ్డుపెట్టుకుని పాలకపక్షాలు అధికారంలోకి వస్తున్నాయని పేర్కొన్నారు. పవన్‌కళ్యాణ్ సాయంతో 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కాపులకు బీసీ (ఎఫ్) ద్వారా 5శాతం రిజర్వేషన్లు ఇస్తామని ఒకసారి, ఈడబ్ల్యూఎస్ 10 శాతంలో కాపులకు 5 శాతం సబ్‌కోటా ఇస్తానని మరోసారి చెప్పి చాలా పకడ్బందీగా మోసం చేశారన్నారు. 2024 ఎన్నికల్లో తిరిగి పవన్‌కళ్యాణ్‌ను అడ్డుపెట్టుకుని కాపుల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టి 95 శాతం కాపుల ఓట్లను పొంది మళ్లీ అదే వివక్షను టీడీపీ కొనసాగిస్తోందన్నారు. పవన్‌కళ్యాణ్ తమ వెంట ఉన్నంత వరకు కాపులు వారితోనే ఉంటారన్న ధీమాతో వ్యవహరిస్తున్న చంద్రబాబు కాపులపై తీవ్రమైన నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ చర్యలను గమనిస్తే కాపులను వర్గశత్రువుగా భావిస్తోందా అనే అనుమానం బలపడుతోందన్నారు.

కాపు వీరుల పేర్లేవి

భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం, వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని, మహర్షి వాల్మీకి జయంతిని, స్వాతంత్ర్య సమరయోధులు వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నట్టు కాపు ఐక్యవేదిక స్పష్టం చేసింది. మరి కాపు కులంలోని స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయులు, ప్రముఖులను ఎందుకు విస్మరిస్తున్నారని చంద్రబాబును ప్రశ్నించింది. కాపు, తెలగ, బలిజ, ఒంటరి ప్రయోజనాలను, ఆత్మాభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించింది. పల్నాడు జిల్లాకు స్వాతంత్ర్య సమరయోధుడు కన్నెగంటి హనుమంతు పేరు పెట్టాలని, మచిలీపట్నం కేంద్రంగా ఉన్న కృష్ణా జిల్లాకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని, శ్రీకృష్ణదేవరాయలు జయంతిని అధికారికంగా జరపాలని గత ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన టీడీపీ నేతలు ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించింది. కాపు కార్పొరేషన్‌కు ఏడాదికి రూ.3 వేల కోట్లు కేటాయిస్తామన్న టీడీపీ ఎన్నికల హామీ ఎందుకు అమలు చేయలేదని నిలదీసింది.

పత్తి సాగు పడిపోవడం ఆందోళనకరం!

వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో పత్తి సాగు 20.52 లక్షల ఎకరాల నుంచి 10 లక్షల ఎకరాలకు పరిమితమైపోవడం ఆందోళన కలిగిస్తోందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో 25 నుంచి 27 లక్షల టన్నుల మధ్య ఉండే దిగుబడి నేడు కేవలం 8.76 లక్షల టన్నులకు పరిమితమైపోయిందన్నారు.ఈ అంశంపై గురువారం ఇక్కడి జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల సంఘ భవనంలో జరిగిన రాష్ట్ర స్థాయి వర్క్‌షాపులో ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా గులాబీ రంగు పురుగుతో పాటు కోతకొచ్చే వేళ విరుచుకుపడే వైపరీత్యాల ప్రభావం వల్ల దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయన్నారు. ఫలితంగా పత్తి రైతులు మొక్కజొన్న, ఆముదం తదితర ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఈ పరిస్థితిని అధిగమించడానికి సాగులో అత్యుత్తమ యాజమాన్య పద్ధతులు పాటించడం ఒక్కటే మార్గమన్నారు.

ఆంధ్ర వర్సిటీలో అవకతవకలపై విచారణ

శాసనసభ ప్రశ్నోత్తరాల్లో మంత్రి లోకేశ్

సాక్షి, అమరావతి : 2019-24 మధ్య ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పలు అవకతవకలు జరిగాయంటూ ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు అందాయని మంత్రి లోకేశ్ తెలిపారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల్లో ఆయన మాట్లాడుతూ.. అప్పటి వీసీ పీవీజీడీ ప్రసాద్ రెడ్డి, ఇతరులపై ఆరోపణలు ఉన్నాయన్నారు. 'వాటిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని పలువురు సభ్యులు అడిగారు. కాబట్టి 60 రోజుల్లో విజిలెన్స్ విచారణ పూర్తి చేసి, నివేదిక ఇవ్వాలని సభ తరుపున ఆదేశాలు జారీ చేస్తాం. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ ఆరోపణలపై ఇప్పటికే ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ కమిటీ నియమించారు' అని చెప్పారు.

ఐటీడీఏల విభజన జరగలేదు : మంత్రి సంధ్యారాణి

రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ, ఐటీడీఏల విభజన జరగలేదని.. గిరిజన ప్రాంత ప్రజలు ఇంతకు ముందులాగే ఐటీడీఏను ఉపయోగించుకోవచ్చని మంత్రి గుమ్మడి సంధ్యారాణి చెప్పారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలోని మెళియపుట్టి మండలంలో కొత్త ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం వద్ద ప్రతిపాదన ఉందని, అయితే అక్కడ ఇప్పటికే ఐటీడీఏ డీడీ కార్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పరిశీలనలో వైకుంఠపురం బ్యారేజీ : మంత్రి నిమ్మల

ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక ప్రకాశం బ్యారేజీకి ఎగువన వైకుంఠపురం బ్యారేజీ నిర్మాణ ఆవశ్యకతను గుర్తించామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆ బ్యారేజీ నిర్మాణం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. అది పూర్తయితే గుంటూరు-హైదరాబాద్‌కు మధ్య 40 కి.మీ దూరం తగ్గుతుందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గుండ్రేవుల ప్రాజెక్టు కోసం రూ.4,530 కోట్లతో సవరించిన డీపీఆర్ తయారు చేశామని తెలిపారు.

ఈ శ్రమ్ పోర్టల్‌లో 83.69 లక్షల మంది : మంత్రి సుభాష్

అసంఘటిత కార్మికులను ఆదుకునేందుకు కేంద్రం రూపొందించిన ఈ శ్రమ్ పోర్టల్‌లో మన రాష్ట్రానికి చెందిన 83,69,051 మంది కార్మికులు పేర్లు నమోదు చేసుకున్నారని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. 1.50 కోట్ల మందిని చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ కింద అందని వైద్యం

సాక్షి, అమరావతి: ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ లబ్ధిదారులకు రాష్ట్రంలో నగదు రహిత వైద్య సేవలు లభించడంలేదని పీడీఎఫ్ ఎమ్మెల్సీలు శాసన మండలిలో గురువారం ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం బకాయిలు పెట్టడంతో నగదు రహిత వైద్య సేవలకు ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రులు తిరస్కరిస్తున్నాయన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈహెచ్ఎస్, ఆరోగ్యశ్రీ సేవలు సక్రమంగా అందుతున్నాయని మంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తమ ప్రీమియంను చెల్లించుకునే ఉద్యోగులు, పెన్షనర్లకు ఈహెచ్ఎస్ పథకం అక్కరకు రావడంలేదని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.4,600 కోట్లు బకాయి పెట్టిందన్నారు. దీంతో ఇటీవల మూడునెలల పాటు యాజమాన్యాలు సమ్మె చేశాయన్నారు. బిల్లులు బకాయి పెట్టడంతో ఈఎంఐలు, ఉద్యోగుల వేతనాల చెల్లింపులకు ఆస్పత్రుల యజమానులు ఇబ్బందిపడుతున్నారన్నారు.



1.60 లక్షల మంది పింఛన్‌దారులు చనిపోయారా?

పింఛన్ల గురించి ప్రశ్నోత్తరాల్లో చర్చించాం. 2024 జూన్ నాటికి 65 లక్షల పైచిలుకు పింఛన్లు ఇచ్చారని, ఇప్పుడు 63 లక్షలకుపైగా ఇస్తున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ లెక్కన దాదాపు 1.60 లక్షల మందికి తొలగించారు. కానీ ప్రభుత్వం మాత్రం కేవలం 14 వేల మందికే తొలగించామని బొంకుతోంది. ఇదేంటని అడిగితే మిగిలిన వాళ్లు చనిపోయారని చెబుతోంది. 9 నెలల కాలంలో లక్ష 60 వేల మంది చనిపోయారా.. అంటే స్పష్టమైన సమాధానం లేదు. వైసీపీ కార్యకర్తలను టార్గెట్ చేసి పింఛన్లు తొలగించారు. – **రమేష్ యాదవ్, ఎమ్మెల్సీ**

ఆడబిడ్డ నిధిపై దాటవేత ధోరణి

ఆడబిడ్డ నిధి ఇంకా పరిశీలనలోనే ఉందని మంత్రి చెప్పారు. ఇది ముమ్మాటికీ దాట వేత ధోరణి. ఎప్పటి నుండి అమలు చేస్తారంటే సమాధానం లేదు. ఎన్నివేల కోట్లు అవసరమో పరిశీలన చేశారా? సబ్ కమిటీ వేశారా? అంటే సమయం కావాలని చెప్పడం మహిళలను వంచించడమే. ఆడబిడ్డ నిధికి ఏటా రూ.32,400 కోట్లు అవసరం. కానీ బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. చేయూత పేరు ఎత్తే అర్హత కూటమి నేతలకు లేదు. ఈ ప్రభుత్వం సున్నా వడ్డీ రుణాలు కూడా ఎగ్గొటింది. – **వరుదు కల్యాణి, ఎమ్మెల్సీ**

అకారణంగా పింఛన్లు తొలగింపు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం లక్ష 60 వేల పింఛన్లను అకారణంగా తొలగించింది. కుల వృత్తిపై ఆధారపడిన వారికి పింఛన్లు కూడా తొలగించారు. డప్పు కళాకారులు, చేతి వృత్తుల వారికి సర్టిఫికెట్స్ కావాలని 13 రకాల నియమ నిబంధనలు పెట్టి పింఛన్లు తొలగిస్తున్నారు. అర్హులందరికీ పింఛన్లు ఇస్తామని ఇప్పటి వరకు కొత్తగా ఒక్కరికి కూడా పింఛన్ ఇవ్వలేదు. తొలగించిన పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. – **బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ**

ఆరోగ్యశ్రీ బకాయిలు విడుదల చేయాలి

ఆరోగ్యశ్రీకి రూ.వెయ్యి కోట్లు బకాయిలు ఉన్నాయని మంత్రి చెప్పారు. నిజానికి మొత్తం బకాయిలు రూ.4 వేల కోట్లు పైనే ఉన్నాయి. ఏప్రిల్ నుండి ఆస్పత్రులు మళ్లీ సమ్మెకు వెళ్తున్నాయి. 80 శాతంగా ఉన్న చిన్న ఆస్పత్రులపై పెద్ద మొత్తంలో ఫైన్లు వేసి ఇబ్బందులు పెడుతున్నారు. మంత్రి చెబుతున్న పరిస్థితికి, వాస్తవ పరిస్థితికి మధ్య చాలా తేడా ఉంది. ఆరోగ్యశ్రీ బకాయిలు వెంటనే విడుదల చేయాలి. – **సిపాయి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ**

విద్యుత్ రంగాన్ని మెరుగు పరుస్తున్న కూటమి

వివిధ విద్యుత్ సంస్థలతో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను 2014-2019 మధ్య నాటి ప్రభుత్వం రద్దు చేసింది. దాంతో పలు విద్యుత్ తయారీ సంస్థలు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ రంగాన్ని మెరుగు పరిచేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. పీఎం సూర్య ఘర్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 40 శాతం సబ్సిడీని అందిస్తోంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం 10 వేల సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. – **డా.పార్థసారథి, ఎమ్మెల్యే**

టీడీపీ ఎమ్మెల్సీని విచారణ కమిటీలో నియమించండి

- 'మండలి'లో టీడీపీ ఎమ్మెల్సీపై బొత్స చురక
- అప్పట్లో నిర్మాణ సంస్థలకు రూ.2వేల కోట్లు అడ్వాన్సులు ఇచ్చేశారని టీడీపీ ఆరోపణ
- అలా ఏమీ చెల్లించలేదన్న మంత్రి సారథి



సాక్షి, అమరావతి : గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో నిధుల దుర్వినియోగం జరిగిందంటూ గురువారం మండలిలో టీడీపీ ఎమ్మెల్సీలు ప్రశ్నలు వేశారు. వీటికి గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి బదులిస్తూ.. విజిలెన్స్ దర్యాప్తు చేయిస్తున్నామన్నారు. అయినా కూడా టీడీపీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు గత ప్రభుత్వంపై ఆరోపణలు చేయసాగారు. దీంతో.. ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పందిస్తూ.. విచారణ కమిటీలో టీడీపీ ఎమ్మెల్సీ రామారావును నియమించాలని చురకంటించారు. ప్రభుత్వం మీది, అధికారులు మీ వాళ్లే మీరేంచేసినా చెల్లుతుందని ఎద్దేవా చేశారు. ఒకపక్క విచారణ జరుగుతుండగా మాజీ సభ్యులపై సభలో ఆరోపణలు చేయడం మంచి సంప్రదాయం కాదన్నారు. అంతకుముందు రామారావు మాట్లాడుతూ.. ఆప్షన్-3 కింద ఇళ్లు నిర్మించే సంస్థలకు గత ప్రభుత్వంలో రూ.రెండు వేల కోట్లు అడ్వాన్స్ కింద ఇచ్చేశారని ఆరోపించారు. అయితే అడ్వాన్స్‌లు చెల్లించలేదని మంత్రి సారథి స్పష్టంచేశారు.

కలెక్టర్‌కు చెబితే కనీస స్పందనలేదు..

భీమవరంలో కొందరు కాంట్రాక్టర్లు ఇళ్లు నిర్మిస్తామని లబ్ధిదారుల నుంచి డబ్బు వసూళ్లుచేసినట్లు తన దృష్టికి వచ్చిందని మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. ఈ అంశంపై ఆర్నెల్ల క్రితం జిల్లా కలెక్టర్‌కు తాను ఫిర్యాదుచేస్తే నేటికీ కనీస స్పందనలేదన్నారు. చైర్మన్ హోదాలో ఉన్న తన ఫిర్యాదునే పట్టించుకోకపోతే ఎలా అని అసహనం వ్యక్తంచేశారు. రెండుసార్లు కలెక్టర్‌కు లేఖ రాయడంతో పాటు, నాలుగుసార్లు ఫోన్లు చేశానన్నారు. ఫిర్యాదుపై తీసుకున్న చర్యలను తిరిగి తెలియజేసే బాధ్యత కలెక్టర్‌కు లేదా అని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కాలనీల్లో ఇదే పరిస్థితి నెలకొందని మంత్రి కొలుసు అనగా.. 'నేను రాష్ట్రవ్యాప్తంగా ఇవే పరిస్థితులున్నాయని చెప్పలేదు.. కేవలం భీమవరం ఘటన గురించే మాట్లాడాను.. నా మాటలు రాష్ట్రానికి ఆపాదించొద్దు' అని మంత్రికి చైర్మన్ చురకలు వేశారు.

టీడీపీ ఎమ్మెల్సీ ప్రశ్నకు బదులివ్వని మంత్రి

జవాబుకు బదులు ఎస్ఐపీబీ చరిత్రను వివరించిన టీజీ భరత్

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రూ.3.10 లక్షల కోట్లతో 31 కంపెనీల ఏర్పాటుకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపినట్లు ప్రభుత్వం చెబుతోందని, వీటిలో ఎన్ని పరిశ్రమలు ప్రారంభించారో చెప్పాలని టీడీపీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు గురువారం 'మండలి'లో ప్రశ్నించారు. దీనికి పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సమాధానం చెప్పకుండా.. 2015లో ఎస్ఐపీబీని ప్రారంభించారని, కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక దానికి ఆక్సిజన్ లభించిందంటూ చరిత్ర చెప్పారు. అలాగే, తమ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటికి రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయన్నారు. డీపీఆర్ ప్రకారం ప్రాజెక్టులు పూర్తిచేయని 200 ఒప్పందాలు రద్దుచేశామని వెల్లడించారు. 20 ఎకరాలపైన భూములు కేటాయించి, ప్రాజెక్టులు పూర్తిచేయని ఒప్పందాలను త్వరలో రద్దుచేయడానికి కసరత్తు చేస్తున్నామంటూ అసలు ప్రశ్నకు సమాధానం చెప్పకుండా దాటవేశారు. ఇక పెట్టుబడులకు ముందుకొచ్చే యువ పారిశ్రామికవేత్తలతో ఏపీఐఐసీ అధికారులు వ్యవహరిస్తున్న తీరు అవమానకరంగా ఉందని మరో టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆరోపించారు.


ముచ్చటగా మూడు

తెలుగు చిత్ర పరిశ్రమలో కొందరు హీరోలు ఫుల్ జోష్‌లో ఉన్నారు. వరుస సినిమాలతో దూసుకెళుతున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు... మూడు సినిమాలను లైన్‌లో పెట్టేశారు. చిరంజీవి, ప్రభాస్, పవన్ కల్యాణ్, ఎన్టీఆర్, నాని, నితిన్, సిద్ధు జొన్నలగడ్డ, శర్వానంద్ వంటి హీరోల చేతిలో ముచ్చటగా మూడు ప్రాజెక్టులున్నాయి. మరికొందరు నాలుగు సినిమాలు చేస్తున్నారు... ఆ వివరాలేంటో ఓ లుక్కేద్దాం..



చిరంజీవి... భలే జోరు

తెలుగులో స్టార్ హీరోల్లో ఒకరైన చిరంజీవి భలే జోరుమీదున్నారు. ఈ సీనియర్ హీరో వరుసగా ప్రతిభావంతులైన యువ దర్శకులతో సినిమాలు చేస్తున్నారు. చిరంజీవి వంటి స్టార్‌తో అందివచ్చిన అవకాశాన్ని నిరూపించుకుని, ఎలాగైనా హిట్ కొట్టాలనే తపనతో దర్శకులు సైతం ఉన్నారు. చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర'. 'బింబిసార'తో బ్లాక్‌బస్టర్ అందుకున్న వశిష్ఠ మల్లిడి ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తుండగా, కునాల్ కపూర్ ఓ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. విక్రమ్ రెడ్డి సమర్పణలో యూవీ క్రియేషన్స్‌పై వంశీకృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి నిర్మిస్తున్నారు. ఫ్యాంటసీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రం ఈ వేసవిలో విడుదలకు సిద్ధం అవుతోంది. చిరంజీవి, సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి కాంబినేషన్ చాలా రోజుల తర్వాత 'విశ్వంభర'తో రిపీట్ అవుతోంది. ఇదిలా ఉంటే.. 'విశ్వంభర' తర్వాత కూడా చిరంజీవి యంగ్ డైరెక్టర్స్‌తో పని చేయనున్నారు. కెరీర్ ఆరంభం నుంచి వరుస విజయాలు అందుకుంటున్న అనిల్ రావిపూడితో ఓ సినిమా చేయనున్నట్లు చిరంజీవి ఓ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రకటించిన సంగతి తెలిసిందే. అలాగే తొలి చిత్రం 'దసరా'తో (నాని హీరో) సూపర్ హిట్ అందుకున్న శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో ఓ సినిమా చేసేందుకు చిరంజీవి పచ్చజెండా ఊపారు. శ్రీకాంత్ ఓదెల ప్రస్తుతం నానితో 'ది ప్యారడైజ్' మూవీ రూపొందిస్తున్నారు. మరి చిరంజీవి ముందుగా అనిల్ మూవీని సెట్స్‌కి తీసుకెళతారా? శ్రీకాంత్ ఓదెల మూవీ చేస్తారా? అనేది వేచి చూడాలి. ఇక 'వాల్తేరు వీరయ్య' మూవీ దర్శకుడు బాబీ కూడా చిరంజీవి కోసం ఓ కథ సిద్ధం చేస్తున్నారని ఫిల్మ్‌నగర్ టాక్.



పవన్ కల్యాణ్... తీన్‌మార్

'బ్రో' (2023) సినిమా తర్వాత పవన్ కల్యాణ్ వెండితెర‌పై కనిపించలేదు. ఓ వైపు రాజకీయాల్లో బిజీగా ఉంటూనే మరోవైపు సినిమాలు చేస్తున్నారాయన. ప్రస్తుతం ఆయన చేతిలో కూడా మూడు చిత్రాలున్నాయి. వాటిలో 'హరి హర వీరమల్లు: పార్ట్ -1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' ఒకటి. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్‌పై ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఈ నెల 28న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అయితే ఆ తర్వాత ఎలాంటి అప్‌డేట్ రాకపోవడంతో ఈ మూవీ విడుదల వాయిదా పడనుందని టాక్. ఈ మూవీ రెండు భాగాలుగా విడుదల కానుంది. కాగా 'రన్ రాజా రన్, సాహో' చిత్రాల ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో 'ఓజీ' అనే ఓ మూవీ చేస్తున్నారు పవన్. అలాగే 'గబ్బర్ సింగ్' తర్వాత హీరో పవన్ కల్యాణ్, డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. 'ఓజీ', 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాల విడుదలపై స్పష్టత రావాల్సి ఉంది.



ప్రభాస్... ఫుల్ స్వింగ్

'బాహుబలి' సినిమాలతో పాన్ ఇండియా స్టార్ అయిపోయారు హీరో ప్రభాస్. ఆ చిత్రాల తర్వాత వరుస పాన్ ఇండియా సినిమాలు చేస్తూ ఫుల్ స్వింగ్‌లో దూసుకెళుతున్నారాయన. గత ఏడాది 'కల్కి 2898 ఏడీ' సినిమాతో మరో హిట్‌ని తన ఖాతాలో వేసుకున్న ప్రభాస్ ప్రస్తుతం నాలుగు సినిమాలతో ('కన్నప్ప' చిత్రంలో అతిథి పాత్ర) బిజీ బిజీగా ఉన్నారు. మారుతి దర్శకత్వంలో 'రాజా సాబ్' సినిమా చేస్తున్నారాయన. ఈ సినిమాలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. రొమాంటిక్ హారర్ కామెడీ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ మూవీని ఏప్రిల్ 10న తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అదే విధంగా ప్రభాస్ నటిస్తున్న మరో చిత్రం 'ఫౌజీ' (ప్రచారంలో ఉన్న టైటిల్). 'సీతారామం' మూవీ ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వీ నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. అలాగే మంచు విష్ణు హీరోగా రూపొందిన 'కన్నప్ప' సినిమాలో ప్రభాస్ రుద్రుడిగా అతిథి పాత్ర చేశారు. ఇక ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వచ్చిన 'సలార్: పార్ట్ 1–సీజ్‌ఫైర్'కి కొనసాగింపుగా 'సలార్: పార్ట్ 2–శౌర్యాంగ పర్వం' రూపొందనున్న సంగతి తెలిసిందే. హోంబలే ఫిల్మ్స్‌పై విజయ్ కిరగందూర్ నిర్మించనున్న ఈ పాన్ ఇండియన్ మూవీ 2026లో విడుదల కానుంది. ఇదిలా ఉంటే 'సలార్: పార్ట్ 2–శౌర్యాంగ పర్వం'తో పాటు మరో రెండు సినిమాలు ప్రభాస్ తమ బ్యానర్‌లో చేయనున్నట్లు హోంబలే ఫిల్మ్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. 2027, 2028లో వరుసగా ఈ సినిమాలు విడుదలవుతాయి.

ఎన్టీఆర్... యమా స్పీడు

'ఆర్ఆర్ఆర్', 'దేవర' వంటి వరుస విజయాల తర్వాత హీరో ఎన్టీఆర్ యమా స్పీడుమీదున్నారు. ప్రస్తుతం ఆయన హీరోగా 'కేజీఎఫ్, సలార్' చిత్రాల ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ ఓ సినిమా తెరకెక్కిస్తున్నారు. 'ఎన్టీఆర్ నీల్' అనే వర్కింగ్ టైటిల్‌తో పాన్ ఇండియా మూవీగా రూపొందుతోంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జరుగుతోంది. ఇప్పటివరకు చూడనటువంటి మాస్ లుక్‌లో ఎన్టీఆర్‌ని ప్రెజెంట్ చేయనున్నారు ప్రశాంత్ నీల్. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 2026 జనవరి 9న సంక్రాంతి కానుకగా ఈ సినిమా విడుదల కానుంది. ఇదిలా ఉంటే.. ఎన్టీఆర్ బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్న సినిమా 'వార్ 2'. హృతిక్ రోషన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాకి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. స్పై థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ మూవీలో నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో ఎన్టీఆర్ కనిపించనున్నారని టాక్. యశ్ రాజ్ ఫిలింస్ సంస్థ నిర్మిస్తున్న ఈ మూవీ ఈ ఏడాది ఆగస్టు 14న విడుదల కానుంది. కాగా ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వం వహించిన 'దేవర: పార్ట్ 1' (2024) హిట్‌గా నిలిచింది. ఈ మూవీకి సీక్వెల్‌గా 'దేవర 2' రూపొందనున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు కొరటాల శివ. ఈ ఏడాదే ఈ మూవీ సెట్స్‌పైకి వెళుతుందని ఫిల్మ్‌నగర్ టాక్.



నాని... ఫుల్ జోష్

హీరో నాని ఫుల్ జోష్‌లో ఉన్నారు. ఓ వైపు హీరోగా రెండు మూడు చిత్రాల్లో నటిస్తూనే మరోవైపు నిర్మాతగానూ వ్యవహరిస్తున్నారాయన. నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో శ్రీనిధీ శెట్టి కథానాయిక. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి నాని వాల్ పోస్టర్ సినిమా సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు. ఈ సినిమా మే 1న విడుదల కానుంది. ఈ మూవీలో అర్జున్ సర్కార్‌గా పవర్‌ఫుల్ పోలీస్‌గా కనిపించనున్నారు నాని. 'హిట్' సిరీస్‌లో మూడవ భాగంగా ఈ చిత్రం రానుంది. ఇదిలా ఉంటే... 'దసరా' (2023) వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ మూవీలో ఫుల్ రా రస్టిక్ పాత్ర చేస్తున్నారు నాని. తెలుగు, తమిళ, హిందీ, ఇంగ్లిష్, స్పానిష్, కన్నడ, మలయాళ, బెంగాలీ భాషల్లో 2026 మార్చి 26న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ రెండు సినిమాల తర్వాత 'రన్ రాజా రన్, సాహో' చిత్రాల ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు నాని. భారీ యాక్షన్ నేపథ్యంలో ఈ మూవీ ఉంటుందని సమాచారం. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య ఈ మూవీ నిర్మించనున్నారు.





నితిన్... జోరుగా

'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' మూవీతో 2023లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన నితిన్ 2024ని మిస్ అయ్యారు. కానీ ప్రస్తుతం ఆయన మూడు సినిమాలతో జోరుగా ఉన్నారు. 'భీష్మ' (2020) వంటి హిట్ మూవీ తర్వాత హీరో నితిన్, డైరెక్టర్ వెంకీ కుడుముల కాంబినేషన్‌లో రూపొందిన ద్వితీయ చిత్రం 'రాబిన్‌హుడ్'. ఇందులో శ్రీలీల హీరోయిన్. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదల కానుంది. అదే విధంగా 'వకీల్ సాబ్' మూవీ ఫేమ్ శ్రీరామ్ వేణు దర్శకత్వంలో 'తమ్ముడు' సినిమా చేస్తున్నారు నితిన్. ఇందులో సప్తమి గౌడ కథానాయికగా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. అక్కా తమ్ముళ్ల అనుబంధం నేపథ్యంలో రూపొందుతోన్న ఈ మూవీలో నితిన్‌కి అక్కగా లయ నటిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటోన్న ఈ సినిమా మే 9న విడుదల కానుందని ఫిల్మ్‌నగర్ టాక్. అలానే తొలి మూవీ 'బలగం'తో బంపర్ హిట్ సాధించిన వేణు యెల్దండి దర్శకత్వంలో 'ఎల్లమ్మ' అనే సినిమా చేయనున్నారు నితిన్. ఏప్రిల్ లేదా మేలో ఈ మూవీ చిత్రీకరణ ప్రారంభం కానుందట.

శర్వానంద్... బిజీ బిజీ



హీరో శర్వానంద్ బిజీ బిజీగా ఉన్నారు. 'మనమే' (2024) చిత్రంతో ప్రేక్షకులను నవ్వించిన ఆయన ప్రస్తుతం మూడు ప్రాజెక్టులతో దూసుకెళుతున్నారు. అభిలాష్ కంకర దర్శకత్వంలో శర్వానంద్ నటిస్తున్న చిత్రం 'శర్వా 36' (వర్కింగ్ టైటిల్). విక్రమ్ సమర్పణలో యూవీ క్రియేషన్స్‌పై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. స్పోర్ట్స్ బేస్డ్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ మూవీలో శర్వానంద్ బైక్ రేసర్‌గా కనిపించనున్నారు. అదే విధంగా శర్వానంద్ నటిస్తున్న 37వ చిత్రం 'నారి నారి నడుమ మురారి'. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో సాక్షీ వైద్య, సంయుక్త కథానాయికలు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ బ్యానర్స్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఇదిలా ఉంటే శర్వానంద్ నటిస్తున్న 38వ చిత్రం 'శర్వా 38' (వర్కింగ్ టైటిల్). ఈ చిత్రానికి సంపత్ నంది దర్శకుడు. లక్ష్మీ రాధామోహన్ సమర్పణలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. 1960లో ఉత్తర తెలంగాణ, తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే పీరియాడికల్ యాక్షన్ డ్రామా ఇది. ఈ మూవీలో 60ల నాటి పాత్రను పోషించడానికి మేకోవర్ అవుతున్నారు శర్వానంద్. ఈ మూవీ తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

సిద్ధు జొన్నలగడ్డ... హుషారుగా...



'డీజే టిల్లు' (2022), 'టిల్లు స్క్వేర్'(2024) వంటి వరుస హిట్స్‌తో జోరుగా హుషారుగా దూసుకెళుతున్నారు సిద్ధు జొన్నలగడ్డ. ఆయన హీరోగా నటిస్తోన్న తాజా చిత్రం 'జాక్ – కొంచెం క్రాక్'. 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో 'బేబి' మూవీ ఫేమ్ వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 10న విడుదల కానుంది. కాగా సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న మరో చిత్రం 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమా ద్వారా డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాలతో పాటు 'టిల్లు క్యూబ్' కూడా చేయనున్నారు సిద్ధు. 'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్' చిత్రాలకు కొనసాగింపుగా 'టిల్లు క్యూబ్' తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఈ మూవీకి 'మ్యాడ్' మూవీ ఫేమ్ కళ్యాణ్ దర్శకత్వం వహిస్తారని ఇప్పటికే ప్రకటించారు ఆ చిత్రనిర్మాత నాగవంశీ.

పైన పేర్కొన్న కథానాయకులే కాదు... మరికొందరు కూడా మూడు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఇంకొందరు హీరోల చేతిలో రెండు సినిమాలు ఉండగా మూడో సినిమాపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

– దేరంగుల జగన్ మోహన్



● విక్రమ్, దుషారా విజయన్

ఏడు జన్మల తోడుగా...

"కలల్లో కానరాకున్నా... నీ కోసం నేను వేచున్నా... నిన్నే నా ఏడు జన్మల తోడుగా కోరుకుంటున్నా" అంటూ మొదలవుతుంది 'వీర ధీర శూరన్ పార్టు 2' సినిమాలోని లవ్ సాంగ్. విక్రమ్ హీరోగా ఎస్.యు అరుణ్‌కుమార్ దర్శకత్వంలో ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీని రియా శిబుల నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'కలల్లో..' అనే పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. రాజేశ్ గోపిశెట్టి సాహిత్యం అందించిన ఈ పాటను శరత్ సంతోష్, రేష్మ శ్యామ్ పాడారు. దుషారా విజయన్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో ఎస్‌జే సూర్య, సూరజ్ వెంజరాముడు ఇతర పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..



● షాహిద్ కపూర్, కరీనా కపూర్

ఎన్నెల్లు తిరిగొచ్చె మా కళ్లకు! చాలా కాలంగా ప్రేమికులుగా వార్తల్లో ఉన్న కరీనాకపూర్, షాహిద్ కపూర్‌లు 'బ్రేకప్' అంటూ అభిమానులను నిరాశ పరిచారు. బ్రేకప్‌కు కారణాలు ఏమిటో తెలియదుగానీ వీరి అప్పటి లవ్‌స్టోరీ ఇప్పటికీ హాట్ టాపిక్కే! వారు మళ్లీ నవ్వుతూ మాట్లాడుకుంటుంటే చూడాలనేది ఎంతోమంది కల. వారి కల ఎట్టకేలకు నిజం అయింది. జైపూర్‌లో జరిగిన ఐఫా 2025 ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాజీ జంట కరీనా కపూర్, షాహీద్ కపూర్‌లు ఒకరినొకరు హగ్ చేసుకున్న దృశ్యం అభిమానులను ఉద్రూతలూగించింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. విడిపోయిన చాలా సంవత్సరాల తర్వాత ఇద్దరూ ఆత్మీయంగా మాట్లాడుకుంటున్న దృశ్యం అభిమానులకు కన్నుల పండగ అయింది.

చరిత్రలో...

వినోదం నుంచి విషాదం వరకు



● 'అనోరా' మూవీ పోస్టర్

'అనోరా' ఆస్కార్ అవార్డులు గెల్చుకున్న నేపథ్యంలో హాలీవుడ్ సినిమాలలో సెక్స్ వర్కర్‌ల పాత్రలపై ఆసక్తి మొదలైంది.

- 1929లో 'స్ట్రీట్ ఏంజెల్'లో స్ట్రీట్ ఏంజెల్‌గా నటించిన జానెట్ గేనర్ 'ఉత్తమ నటి' అవార్డ్ గెల్చుకుంది.
- ఆస్కార్ అవార్డ్ చరిత్రలో 'బెస్ట్ యాక్ట్రెస్', 'బెస్ట్ సపోర్టింగ్ యాక్ట్రెస్' అవార్డులు సెక్స్ వర్కర్‌లుగా నటించిన 16 మందికి దక్కాయి.
- సెక్స్ వర్కర్‌ల జీవితాలలో విషాదాలను, సామాజిక వాస్తవికతను తెరపై చూపిన సినిమాలు ఎన్నో ఉన్నాయి.

ఉదా: లుకాస్ మూడిసన్–లిలియ ఫర్ ఎవర్ (2002)

లుకాస్ మూడిసన్ రచన, దర్శకత్వం వహించిన ఈ సినిమా వాస్తవిక సంఘటనల ఆధారంగా నిర్మించారు. మానవ అక్రమ రవాణా, లైంగిక బానిసత్వం సమస్యను తెరమీద చూపిన సినిమా ఇది.

- ఒకానొక కాలంలో కమర్షియల్ అంశాలను దృష్టిలో పెట్టుకొని హాలీవుడ్ సినిమాల్లో సెక్స్ వర్కర్‌ల పాత్రలకు రూపకల్పన చేసేవారు. 'సెక్స్ వర్కర్' పాత్ర తప్పనిసరి అన్నట్లుగా ఉండేది. అయితే కాలక్రమంలో వారి జీవితంలో విషాదాన్ని, జీవన సంక్షోభాన్ని చూపించే ధోరణి పెరిగింది.

బిజినెస్ రీల్

ఇండస్ఇండ్‌లో 5% దాటిన హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్ వాటాలు



న్యూఢిల్లీ: ఇండస్ఇండ్ బ్యాంక్‌లో హెచ్‌డీఎఫ్‌సీ మ్యుచువల్ ఫండ్ వాటా మరో 0.20 శాతం పెరిగింది. వివిధ స్కీమ్‌ల ద్వారా తాజాగా 15.92 లక్షల షేర్లను కొనుగోలు చేయడంతో మార్చి 11న మార్కెట్ వేళలు ముగిసే సమయానికి బ్యాంకులో ఫండ్ వాటా 5.02 శాతానికి చేరింది. షేర్ల కొనుగోలుకు ముందు బ్యాంక్‌లో ఫండ్ హోల్డింగ్ 4.82 శాతంగా ఉండేది. ట్రెజరీ లావాదేవీల్లో దాదాపు రూ. 2,100 కోట్ల వ్యత్యాసం బైటపడిందంటూ బ్యాంకు వెల్లడించడంతో, షేరు కుప్పకూలిన సంగతి తెలిసిందే.

వాతావరణ రిస్కుల నివారణకు సమిష్టి కృషి

ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి



న్యూఢిల్లీ: వాతావరణ మార్పులపరమైన రిస్కులను నివారించేందుకు నియంత్రణ సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలు, పరిశ్రమలు అన్నీ కలిసి సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. వాతావరణ మార్పుల వల్ల ఆర్థికాంశాలతో ముడిపడి ఉన్న రుణాలు, మార్కెట్లు మొదలైన వాటన్నింటిపైనా ప్రభావం పడుతుందని చెప్పారు. రిజర్వ్ బ్యాంక్ నిర్వహించిన సెమినార్‌లో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు తెలిపారు. పర్యావరణహిత ప్రాజెక్టులకు నిధుల లభ్యతను మెరుగుపర్చేలా తగిన వ్యవస్థను రూపొందించేందుకు ఆర్‌బీఐ కట్టుబడి ఉందని మల్హోత్రా పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, సంబంధిత అంశాలపై అవగాహన కల్పించేందుకు ఆర్‌బీఐ ప్రత్యేకంగా 'గ్రీనథాన్' నిర్వహించనున్నట్లు మల్హోత్రా తెలిపారు.

స్పైస్‌జెట్‌లో 1% వాటా అమ్మకం

1.15 కోట్ల షేర్లు విక్రయించిన ప్రమోటర్



న్యూఢిల్లీ: బడ్జెట్ ధరల విమానయాన సంస్థ స్పైస్‌జెట్‌లో ప్రమోటర్ అజయ్ సింగ్ 0.9 శాతం వాటా విక్రయించారు. ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా షేరుకి రూ. 45.34 సగటు ధరలో 1.15 కోట్ల షేర్లు అమ్మివేశారు. వెరసి రూ. 52.3 కోట్లు అందుకున్నారు. ఈ లావాదేవీ తదుపరి స్పైస్‌జెట్‌లో అజయ్ సింగ్ వాటా 22 శాతానికి పరిమితమైంది. మొత్తం ప్రమోటర్ గ్రూప్ వాటా 29.13 శాతం నుంచి 28.23 శాతానికి తగ్గింది. వాటా కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-3-2025

విశాఖ	400-00
చిత్తూరు	443-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	390-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	385-00
వరంగల్	387-00
రిటైల్ ధర	4.45

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	280.1	1.18
SBIN	728	0.68
CIPLA	1,460.05	0.4
ICICIBANK	1,248.65	0.38
POWERGRID	268.05	0.36

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	620	-2.66
HEROMOTOCO	3,528.65	-2.26
TATAMOTORS	654.7	-2.04
HDFCLIFE	620.65	-1.8
INDUSINDBK	672.65	-1.76

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,388
ఎన్ఎస్ఈ	72,310
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,27,645
ఎఫ్ఐఐ	- 793
డీఐఐ	+ 1,724

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	66.56 (రాత్రి 11.30కు)	$ 67.68 (క్రితం ముగింపు)
బ్రెంట్	69.80 (రాత్రి 11.30కు)	$ 70.95 (క్రితం ముగింపు)

ఐపీఓకు ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ రెడీ

- సెబీ తాజాగా గ్రీన్ సిగ్నల్
- 15 శాతం వాటా అమ్మకం
- రూ. 15,000 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: హోమ్ అప్లయెన్సెస్ దిగ్గజం ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోదముద్ర వేసింది. తద్వారా దక్షిణ కొరియా దిగ్గజం ఎల్‌జీ దేశీ అనుబంధ సంస్థ రూ. 15,000 కోట్లు సమీకరించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. వెరసి దేశీయంగా లిస్టయిన రెండో దక్షిణ కొరియా కంపెనీగా నిలవనుంది. గతేడాది అక్టోబర్‌లో హ్యుందాయ్ మోటార్స్ ఇండియా పబ్లిక్ ఇష్యూ చేపట్టి స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయిన విషయం విదితమే. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా 2024 డిసెంబర్‌లో సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా మాతృ సంస్థ 15 శాతం వాటాకు సమానమైన 10.18 కోట్ల షేర్లను విక్రయించనుంది. గత నెలలో ఐపీవోపై కంపెనీ రోడ్‌షోలను సైతం ప్రారంభించింది. హోమ్ అప్లయెన్సెస్, కన్జూమర్ ఎలక్ట్రానిక్స్‌లో దేశీయంగా ఎల్‌జీ టాప్ ర్యాంక్ సంస్థలలో ఒకటిగా నిలుస్తోంది. కంపెనీ ప్రొడక్టులలో వాషింగ్ మెషీన్లు, లెడ్ టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, మైక్రోవేవ్‌లు, వాటర్ ఫిల్టర్లు తదితరాలున్న సంగతి తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా, మహారాష్ట్రలోని పుణేలో తయారీ యూనిట్లను కలిగి ఉంది. 2023–24లో రూ. 64,088 కోట్ల ఆదాయం అందుకుంది.

ఓలా ఎస్1 స్కూటర్లపై డిస్కౌంట్లు

రూ. 26,750 వరకు ప్రయోజనం



న్యూఢిల్లీ: హోలీ పండుగ సందర్భంగా ఫ్లాష్ సేల్ నిర్వహిస్తున్నట్లు ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ తెలిపింది. మార్చి 13న ప్రారంభమైన ఈ సేల్ 17 వరకు ఉంటుంది. ఇందులో భాగంగా ఎస్1 శ్రేణి ఈ–స్కూటర్లపై రూ. 26,750 వరకు డిస్కౌంట్లు అందిస్తున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో వివరించింది. దీని ప్రకారం, ఎస్1 ఎయిర్‌పై రూ. 26,750 వరకు, ఎస్1 ఎక్స్‌ప్లస్ (జెన్2)పై రూ. 22,000 వరకు కస్టమర్లు డిస్కౌంట్లు పొందవచ్చు. దీనితో ఈ మోడల్స్ ధరలు వరుసగా రూ. 89,999, రూ. 82,999 నుంచి ప్రారంభమవుతాయి. ఇక ఎస్1 రేంజిలోని మిగతా అన్ని స్కూటర్లపై రూ. 25,000 వరకు డిస్కౌంట్లు ఉంటాయని కంపెనీ వివరించింది. ఎస్1 జెన్2, జెన్3 స్కూటర్ల ధరలు రూ. 69,999 నుంచి రూ. 1,79,999 వరకు (పండుగ డిస్కౌంట్ల తర్వాత) ఉంటాయి. ఇతరత్రా రూ. 10,500 వరకు విలువ చేసే ప్రయోజనాలను అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది.

మూడేళ్లలో మూడో అతిపెద్ద ఎకానమీ..

- 2028 నాటికి 5.7 ట్రిలియన్ డాలర్లు
- జర్మనీని అధిగమించి ముందుకు
- మోర్గాన్ స్టాన్లీ అంచనా

న్యూఢిల్లీ: భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా 2028 నాటికి అవతరిస్తుందని మోర్గాన్ స్టాన్లీ అంచనా వ్యక్తం చేసింది. ప్రపంచంలోనే అత్యంత డిమాండ్ ఉన్న వినియోగ మార్కెట్‌గా భారత్ మారుతోందంటూ.. స్థూల ఆర్థిక స్థిరత్వానికితోడు, మెరుగైన మౌలిక వసతులతో ప్రపంచ ఉత్పాదకతలో భారత్ తన వాటా పెంచుకోనున్నట్టు తెలిపింది. 2023 నాటికి 3.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్.. 2026 నాటికి 4.7 ట్రిలియన్ డాలర్లకు విస్తరించడం ద్వారా యూఎస్, చైనా, జర్మనీ తర్వాత నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని అంచనా వేసింది. 2028లో 5.7 ట్రిలియన్ డాలర్లతో జర్మనీని అధిగమించి భారత్ మూడో స్థానానికి చేరుతుందని పేర్కొంది. 1990లో ప్రపంచంలో 12వ స్థానంలో భారత్ ఉన్నట్టు తన నివేదికలో గుర్తు చేసింది. ఆ తర్వాత 2000 నాటికి 13వ స్థానానికి దిగిపోయిందని..తిరిగి 2020లో 9వ ర్యాంక్‌నకు, 2023లో 5వ స్థానానికి మెరుగుపడినట్టు వివరించింది. ప్రపంచ జీడీపీలో 3.5 శాతంగా ఉన్న భారత్ వాటా 2029 నాటికి 4.5 శాతానికి చేరుతుందని తెలిపింది.

2035 నాటికి 10.3 ట్రిలియన్ డాలర్లు..

భారత ఆర్థిక ప్రగతి విషయమై మోర్గాన్ స్టాన్లీ మూడు రకాల అంచనాలు వేసింది. ''బేర్ కేసులో (ప్రతికూల పరిస్థితుల్లో) భారత ఆర్థిక వ్యవస్థ 2025 నాటికి ఉన్న 3.65 ట్రిలియన్ డాలర్ల స్థాయి నుంచి 2035 నాటికి 6.6 ట్రిలియన్ డాలర్లకు విస్తరించొచ్చు. బేస్ కేసులో (తటస్థ పరిస్థితుల్లో) 8.8 ట్రిలియన్ డాలర్లకు.. బుల్ కేసులో (సానుకూల పరిస్థితుల్లో) 10.3 ట్రిలియన్ డాలర్లకు వృద్ధి చెందుతుంది''అని తెలిపింది. 2025లో తలసరి ఆదాయం 2,514 డాలర్లుగా ఉంటే బేర్ కేసులో 4,247 డాలర్లకు, బేస్ కేసులో 5,683 డాలర్లకు, బుల్ కేసులో 6,706 డాలర్లకు వృద్ధి చెందుతుందని అంచనా వేసింది. ''అంతర్జాతీయ ఉత్పాదకతలో భారత్ వచ్చే దశాబ్ద కాలంలో తన వాటాను పెంచుకుంటుంది. జనాభాలో వృద్ధి, స్థిరమైన ప్రజాస్వామ్యం, విధానపరమైన మద్దతుతో స్థూల ఆర్థిక స్థిరత్వం, మెరుగైన మౌలిక వసతులు, పెరుగుతున్న వ్యాపార వర్గం, సామాజిక పరిస్థితుల్లో మెరుగుదల అనుకూలించనున్నాయి''అని మోర్గాన్ స్టాన్లీ నివేదిక తెలిపింది.

అతి పెద్ద వినియోగ మార్కెట్

ప్రపంచంలో టాప్ వినియోగ మార్కెట్‌గా భారత్ అవతరించనుందని మోర్గాన్ స్టాన్లీ అంచనా. ఇంధన పరివర్తనం దిశగా భారత్ అతిపెద్ద మార్పును చూడనుందని.. జీడీపీలో రుణ నిష్పత్తి పెరుగుతోందని, అదే సమయంలో జీడీపీలో తయారీ రంగం వాటా సైతం వృద్ధి చెందుతోందని పేర్కొంది.



ఆర్థిక వ్యవస్థ కోలుకుంటోంది..

ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ కోలుకుంటోందని మోర్గాన్ స్టాన్లీ తెలిపింది. ''ఇటీవలి వారాల్లో అధిక ఫ్రీక్వెన్సీ సంకేతాలు మిశ్రమంగా ఉన్నాయి. కానీ, కొన్ని నెలల క్రితంతో పోల్చి చూస్తే మెరుగ్గా ఉన్నాయి. ద్రవ్య, పరపతి విధాన మద్దతుకుతోడు, సేవల ఎగుమతులు పుంజుకోవడంతో 2024 ద్వితీయార్ధంలో మందగమనం నుంచి వృద్ధి కోలుకుంటుందని భావిస్తున్నాం''అని పేర్కొంది. 2024–25లో జీడీపీ 6.3 శాతం మేర, 2025–26లో 6.5 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. రానున్న రోజుల్లో వినియోగం అన్ని విభాగాల్లోనూ కోలుకోవచ్చంటూ.. ఆదాయ పన్ను తగ్గింపు పట్టణ డిమాండ్‌కు ప్రేరణనిస్తుందని, గ్రామీణ వినియోగానికి మద్దతుగా నిలుస్తుందని పేర్కొంది. 2024–25లో ద్రవ్యోల్బణం 4.9 శాతంగా, 2025–26లో 4.3 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. సేవల ఎగుమతుల్లో ఉన్న వృద్ధి వస్తు ఎగుమతుల్లో ఉన్న బలహీనతను కొంత వరకు భర్తీ చేస్తుందని తెలిపింది. అంతర్జాతీయంగా మందగమనం లేదా సమీప కాలంలో మాంద్యం వంటి పరిస్థితులు తలెత్తితే అవి తమ అంచనాలకు సవాలు కాగలవని.. అలాంటి పరిస్థితుల్లో 2025లో భారత ఈక్విటీలు గరిష్ఠ స్థాయిలకు దూరంగా ఉండొచ్చని పేర్కొంది.

ఎయిరిండియా అనుబంధ సంస్థలపై దృష్టి

- వాటాల అమ్మకానికి ప్రభుత్వ ప్రణాళికలు
- మే నుంచి విదేశాలలో రోడ్‌షోలు



న్యూఢిల్లీ: ఈ కేలండర్ ఏడాది(2025) ఏడాది ముగిసేలోగా ఎయిరిండియా మాజీ అనుబంధ సంస్థలలో వాటాను విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు వీలుగా మే నెలలో రోడ్‌షోలు చేపట్టాలని యోచిస్తోంది. భారత్‌సహా సింగపూర్, యూరప్‌లో వీటిని నిర్వహించాలని చూస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఆగస్ట్‌లోగా ఆయా కంపెనీలపట్ల ఆసక్తి కలిగిన సంస్థలు బిడ్స్(ఈవోఐ) దాఖలు చేసేందుకు వీలు కల్పించనున్నట్లు తెలియజేశాయి.

జాబితాలో ఎయిరిండియా ఇంజినీరింగ్ సర్వీసెస్(ఏఐఈఎస్ఎల్), ఎయిరిండియా ఎయిర్‌ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్(ఏఐఏటీఎస్ఎల్), ఎయిరిండియా ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్(ఏఐఏఎస్ఎల్), హోటల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(హెచ్‌సీఐ), ఎయిర్‌లైన్ అలైడ్ సర్వీసెస్(ఏఏఎస్) ఉన్నాయి. వెరసి డిసెంబర్‌లోగా వాటాల విక్రయాన్ని పూర్తి చేసే సన్నాహాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇవన్నీ 2021వరకూ ప్రభుత్వ అజమాయిషీలోని ఎయిరిండియాకు అనుబంధ సంస్థలుగా వ్యవహరించాయి. కాగా.. 2022 జనవరిలో ఎయిరిండియా అధికారికంగా టాటా గ్రూప్ గూటికి చేరిన సంగతి తెలిసిందే.

ఐటీ పరిశ్రమ వృద్ధి 4-6 శాతం



- 2025–26పై ఇక్రా అంచనాలు
- ఉపాధి కల్పన అంతంతే

న్యూఢిల్లీ: దేశీ ఐటీ కంపెనీలు వచ్చే ఆర్థిక సంవత్సరం(2025–26) స్వల్ప వృద్ధికే పరిమితంకానున్నట్లు రేటింగ్ ఏజెన్సీ ఇక్రా పేర్కొంది. వెరసి ఐటీ పరిశ్రమ ఆదాయం డాలర్ల రూపేణా 4–6 శాతం బలపడనున్నట్లు తాజాగా అంచనా వేసింది. వృద్ధి పుంజుకునేటంతవరకూ ఉద్యోగ కల్పన సైతం మందగించవచ్చని తెలియజేసింది. సమీప కాలంలో ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 12–13 శాతంగా నమోదుకావచ్చని అభిప్రాయపడింది. దేశీ ఐటీ పరిశ్రమ ఆదాయంలో 60 శాతం ఆక్రమిస్తున్న దిగ్గజాలను పరిగణనలోకి తీసుకుని ఇక్రా తాజా అంచనాలకు తెరతీసింది. వచ్చే ఏడాది చివర్లో వృద్ధి ఊపందుకునేటంతవరకూ ఉపాధి కల్పన అంతంతమాత్రంగానే నమోదుకావచ్చని పేర్కొంది. కాగా ఈ ఆర్థిక సంవత్సరం తొలి 9 నెలల్లో డాలర్ల రూపేణా దేశీ ఐటీ పరిశ్రమ ఆదాయం 3.6 శాతం వృద్ధిని అందుకున్నట్లు ఇక్రా వెల్లడించింది. గత మూడు క్వార్టర్లుగా నెమ్మదిగా ప్రారంభమైన రికవరీ ఇందుకు సహకరించినట్లు తెలియజేసింది. 2023–24లో నమోదైన తక్కువ వృద్ధి(లోబేస్) సైతం ఇందుకు కారణమని తెలియజేసింది. అంతే కాకుండా కొన్ని మార్కెట్లలో బీఎఫ్ఎస్ఐ, రిటైల్ రంగాలలో కస్టమర్ల విచక్షణాధారిత వ్యయాలు స్వల్పంగా పెరగడం మద్దతిచ్చినట్లు పేర్కొంది. జనరేటివ్ ఏఐపై పెట్టుబడులు కొత్త ఆర్డర్లకు దారి చూపినట్లు వివరించింది. తాజా నివేదికకు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, విప్రో, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, కోఫోర్జ్, సైయెంట్, ఎల్‌టీఐమైండ్‌ట్రీ, ఎల్‌అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్, బిర్లాసాఫ్ట్, మాస్టెక్, ఎంఫసిస్, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, పెర్సిస్టెంట్ సిస్టమ్స్, జెన్సార్ టెక్నాలజీస్‌ను పరిగణనలోకి తీసుకుంది.

టెలికం పీఎస్‌యూల నిధుల సమీకరణ

- 2019 నుంచి 2025 జనవరివరకూ ఆస్తుల మానిటైజేషన్
- బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ చేతికి రూ. 12,985 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెలికం సంస్థలు బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ 2019 నుంచి ఆస్తుల మానిటైజేషన్ ద్వారా దాదాపు రూ. 12,985 కోట్లు సమకూర్చుకున్నాయి. ఆస్తుల జాబితాలో భూములు, భవంతులు, టవర్లు, ఫైబర్ తదితరాలున్నట్లు కమ్యూనికేషన్ల సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పార్లమెంట్‌లో వెల్లడించారు. లోక్‌సభకు మంత్రి నివేదించిన వివరాల ప్రకారం 2025 జనవరివరకూ భూములు, భవంతుల ద్వారా బీఎస్ఎన్ఎల్ రూ. 2,388 కోట్లు సమీకరించగా.. ఎంటీఎన్ఎల్ రూ. 2,135 కోట్లు అందుకుంది. సమీప భవిష్యత్‌లోసొంత అవసరాలకు వినియోగించని, యాజమాన్య బదిలీ హక్కులు కలిగినభూములు, భవంతులను మాత్రమే మానిటైజ్ చేసినట్లు రాతపూర్వక సమాధానంలో చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఇక టవర్లు, ఫైబర్ ఆస్తుల ద్వారా బీఎస్ఎన్ఎల్ రూ. 8,204 కోట్లు, ఎంటీఎన్ఎల్ రూ. 258 కోట్లు సమకూర్చుకున్నట్లు తెలియజేశారు.



వాహనాల హోల్‌సేల్ విక్రయాలు 2% అప్

ఫిబ్రవరి గణాంకాలు వెల్లడించిన సియామ్



న్యూఢిల్లీ: దేశీయంగా డీలర్లకు ఫ్యాక్టరీల నుంచి వాహనాల సరఫరా ఫిబ్రవరిలో సుమారు 2 శాతం పెరిగి 3,77,689 యూనిట్లుగా నమోదైనట్లు ఆటోమొబైల్ సంస్థల సమాఖ్య సియామ్ తెలిపింది. గతేడాది ఫిబ్రవరిలో ఈ సంఖ్య 3,70,786 యూనిట్లుగా ఉంది. ప్యాసింజర్ వాహనాల సెగ్మెంట్ ప్రతికూల పరిస్థితుల్లోనూ దీటుగా ఎదురు నిల్చిందని సియామ్ డైరెక్టర్ జనరల్ రాజేశ్ మీనన్ తెలిపారు. హోలీ, ఉగాది పండుగల సందర్భంగా డిమాండ్ మరింత మెరుగై, 2024–25 ఆర్థిక సంవత్సరాన్ని సానుకూలంగా ముగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు, మొత్తం ద్విచక్ర వాహనాల సరఫరా వార్షికంగా చూస్తే 15,20,761 యూనిట్ల నుంచి సుమారు 9 శాతం క్షీణించి 13,84,605 యూనిట్లకు పరిమితమైంది. స్కూటర్ల అమ్మకాలు 5,15,340 నుంచి 5,12,783 యూనిట్లకు తగ్గాయి. మోటార్ సైకిళ్ల సరఫరా 13 శాతం క్షీణించి 8,38,250 యూనిట్లకు పరిమితమయ్యాయి. ఎలక్ట్రిక్ రిక్షాల సరఫరా 51 శాతం తగ్గి 741 యూనిట్లకు నెమ్మదించాయి.

భారత్‌లో పెట్టుబడులు రెట్టింపు

- బ్లాక్‌స్టోన్ తాజాగా వెల్లడి
- ఇన్‌ఫ్రా, క్రెడిట్ బిజినెస్‌లపై దృష్టి
- టారిఫ్ సవాళ్లు దేశం ఎదుర్కోగలదు

ముంబై: పీఈ దిగ్గజం బ్లాక్‌స్టోన్ దేశీయంగా పెట్టుబడులను రెట్టింపునకు పెంచనున్నట్లు తెలియజేసింది. మౌలిక రంగం, క్రెడిట్ బిజినెస్‌లలో తాజాగా పెట్టుబడులు చేపట్టనున్నట్లు పేర్కొంది. దేశీయంగా బ్లాక్‌స్టోన్ 50 బిలియన్ డాలర్లకుపైగా పెట్టుబడులు కలిగి ఉంది. ఈ బాటలో పెట్టుబడులను 100 బిలియన్ డాలర్లకు చేర్చనున్నట్లు బ్లాక్‌స్టోన్ తెలియజేసింది. కాగా.. యూఎస్ టారిఫ్‌లను ఇండియా సమర్థవంతంగా ఎదుర్కోగలదని సంస్థ చైర్మన్ స్టీఫెన్ ఏ ష్వార్జ్‌మ్యాన్ అభిప్రాయపడ్డారు. రెండు దశాబ్దాల పెట్టుబడి ప్రయాణంలో ప్రపంచవ్యాప్తంగా భారత్‌లోనే అధిక రిటర్నులు అందుకున్నట్లు వెల్లడించారు. దేశీయంగా పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రహదారి ఆస్తులలో ఇన్వెస్ట్ చేసే ప్రణాళికల్లో ఉన్నట్లు తెలియజేశారు. ష్వార్జ్‌మ్యాన్ గతంలో ప్రస్తుత యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్‌నకు సలహాదారుడిగా వ్యవహరించారు. ఇటీవల భారత ప్రధాని నరేంద్ర మోడీ, ట్రంప్ మధ్య అర్థవంతమైన సమావేశం జరిగిందని, వాణిజ్య ఒప్పందంపై ఇరు నేతలు అంగీకారానికి వచ్చారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇప్పటికే భారత్ అధిక టారిఫ్‌ల అంశంపై కొన్ని సవరణలు చేపట్టినట్లు పేర్కొన్నారు. దేశీయంగా స్థూలఆర్థిక పరిస్థితులు పటిష్టంగా ఉన్నాయని, 6 శాతానికంటే తక్కువ వృద్ధి నమోదయ్యే అవకాశంలేదని అభిప్రాయపడ్డారు.



బ్యాంకింగ్‌కు జెనరేటివ్ ఏఐ బూస్ట్!



- ఫైనాన్షియల్ సేవల రంగంలో సత్ఫలితాలు
- గణనీయంగా తగ్గిపోనున్న వ్యయాలు
- మెరుగుపడనున్న ఉత్పాదకత
- ఈవై ఇండియా నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: ఆర్థిక సేవల రంగంలో, ముఖ్యంగా బ్యాంకింగ్‌లో ఉత్పాదకతను జెనరేటివ్ ఏఐ (కృత్రిమ మేథ) గణనీయంగా పెంచనుంది. ఫైనాన్షియల్ సర్వీసెస్ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేయనుందని, కస్టమర్‌తో అనుసంధానత, కార్యకాలాపాల సామర్థ్యాన్ని మెరుగుపరచనున్నట్టు 'ఈవై' ఇండియా నివేదిక తెలిపింది. 2030 నాటికి ఫైనాన్షియల్, సర్వీసెస్ రంగంలో ఉత్పాదకతను 34–38 శాతం మేర, బ్యాంకింగ్‌లో ఉత్పాదకతను 46 శాతం మేర జెనరేటివ్ ఏఐ అధికం చేస్తుందని అంచనా వేసింది. ఈ మేరకు ఒక నివేదికను విడుదల చేసింది. ఫైనాన్షియల్ సర్వీసెస్, రిటైల్, హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్, టెక్నాలజీ, ఆటోమోటివ్, ఇండస్ట్రియల్స్, ఎనర్జీ తదితర రంగాల్లోని 125కు పైగా ఉన్నత స్థాయి ఉద్యోగుల (సీఈవో, సీఎఫ్‌వో, సీవోవో తదితర) అభిప్రాయాలను ఈవై తన సర్వే కోసం సేకరించింది. ''జెనరేటివ్ ఏఐపై పెట్టుబడులు పెరుగుతున్నాయి. 42 శాతం కంపెనీలు ఏఐ కోసం ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయిస్తున్నాయి. వాయిస్ బాట్స్, ఈమెయిల్ ఆటోమేషన్, బిజినెస్ ఇంటెలిజెన్స్, వర్క్‌ఫ్లో ఆటోమేషన్‌లో జెనరేటివ్ ఏఐని వేగంగా అమలు చేస్తున్నాయి''అని ఈవై నివేదిక వివరించింది.

కస్టమర్ సేవల్లో జెనరేటివ్ ఏఐ

కంపెనీలు కస్టమర్ సేవల్లో జెనరేటివ్ ఏఐని అత్యధికంగా వినియోగిస్తున్నాయి. 68 శాతం సంస్థలు కస్టమర్ సేవల్లో జెనరేటివ్ ఏఐకి ప్రాధాన్యం ఇస్తున్నాయి. కార్యకలాపాల్లో 47 శాతం, అండర్‌రైటింగ్ కార్యలాపాల్లో 32 శాతం, అమ్మకాల్లో 26 శాతం, ఐటీలో 21 శాతం చొప్పున జెనరేటివ్ ఏఐ వినియోగానికి సంస్థలు ఇప్పటికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ కృత్రిమ మేథ అమలుతో కస్టమర్ల సంతృప్త స్థాయిలు మెరుగుపడినట్టు 63 శాతం కంపెనీలు తెలిపాయి. వ్యయాలను తగ్గించుకున్నామని 58 శాతం కంపెనీలు వెల్లడించాయి. కోర్ బ్యాంకింగ్ వ్యవస్థలు, సీఆర్ఎం, రుణాల మంజూరు, కార్డ్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌లు ఇతర విభాగాల్లో జెనరేటివ్ ఏఐని సంస్థలు అమలు చేస్తున్నాయి. దీంతో వ్యయాలు గణనీయంగా తగ్గుతున్నట్టు ఈవై ఇండియా ఫైనాన్షియల్ సర్వీసెస్ పార్ట్‌నర్ ప్రతీక్ షా తెలిపారు. ఒక యూనిట్‌కు సాధారణ వ్యయాల్లో 90 శాతం మేర తగ్గుతున్నట్టు చెప్పారు.

సాక్షి ప్లస్
శుక్రవారం : 14-3-2025

భారత్‌తో టెస్టు సిరీస్‌కు మార్క్ వుడ్ దూరం!

మోకాలికి శస్త్రచికిత్స తర్వాత 4 నెలలు విశ్రాంతి తీసుకోనున్న ఇంగ్లండ్ బౌలర్



లండన్: ఇంగ్లండ్ స్టార్ పేసర్ మార్క్ వుడ్... భారత్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు దూరం కానున్నాడు. ఎడమ మోకాలికి శస్త్రచికిత్స చేయించుకున్న వుడ్ నాలుగు నెలలు ఆటకు దూరం కానున్నాడు. దీంతో టీమిండియాతో సిరీస్‌కు అతడు అందుబాటులో ఉండే అవకాశాలు లేవు. 35 ఏళ్ల వుడ్ చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా అఫ్గానిస్తాన్‌తో మ్యాచ్ సందర్భంగా గాయపడ్డాడు. ఐపీఎల్ ముగిశాక ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం టీమిండియా వెళ్లనుంది. ఈ రెండు జట్ల మధ్య తొలి టెస్టు జూన్ 20న హెడింగ్లేలో ప్రారంభం కానుంది. చివరి టెస్టు వరకు అతడు పూర్తిగా కోలుకుంటే జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది. అయితే భారత్‌తో సిరీస్ అనంతరం ఆస్ట్రేలియాతో యాషెస్ సిరీస్ వరకు వుడ్ పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తాడని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు భావిస్తోంది. 'అన్నీ ఫార్మాట్లలో ఆడుతున్న సమయంలో ఇలా గాయం కారణంగా సుదీర్ఘ కాలం జట్టుకు దూరం కానుండటం బాధగా ఉంది. తిరిగి కోలుకొని మైదానంలో అడుగు పెట్టేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నా' అని వుడ్ అన్నాడు. 2015లో ఇంగ్లండ్ తరఫున అంతర్జాతీయ అరంగేట్రం చేసిన వుడ్.. గాయాలతో సహవాసం చేస్తున్నాడు. తరచూ గాయాల పాలవుతున్న వుడ్‌కు ఇది 8వ శస్త్రచికిత్స కావడం గమనార్హం. ఇప్పటికే సీనియర్ బౌలర్లు అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్ రిటైర్మెంట్ తీసుకోగా... వుడ్ కూడా దూరం కావడంతో భారత్‌తో సిరీస్‌లో ఇంగ్లండ్ యువ పేసర్లపై ఎక్కువ ఆధారపడనుంది. ఇటీవలి కాలంలో బ్రైడన్ కార్స్, జోఫ్రా ఆర్చర్ ఆ జట్టు తరఫున మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్నారు.

టాపార్డర్‌లో ఆడటమే ఇష్టం

భారత క్రికెటర్ కేఎల్ రాహుల్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: టాపార్డర్‌లో బ్యాటింగ్ చేయడమే సౌకర్యవంతంగా ఉంటుందని భారత సీనియర్ క్రికెటర్ కేఎల్ రాహుల్ అన్నాడు. టీమిండియా తరఫున ఇటీవలి కాలంలో మిడిలార్డర్‌లో బరిలోకి దిగుతున్న రాహుల్... చాంపియన్స్ ట్రోఫీలో వికెట్ కీపింగ్‌తో పాటు ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి ఆకట్టుకున్నాడు. వన్డేల్లో నయా ఫినిషర్‌గా సేవలందిస్తున్న రాహుల్... చాంపియన్స్ ట్రోఫీలో 174 పరుగులు చేసి టీమిండియా మూడోసారి టైటిల్ కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. భారత జట్టు తరఫున ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగే రాహుల్... చాంపియన్స్ ట్రోఫీలో అక్షర్ పటేల్ తర్వాత ఆరో ప్లేస్‌లో క్రీజులోకి అడుగుపెట్టి తన క్లాసిక్ గేమ్‌తో ఆకట్టుకున్నాడు. కాగా, మరో వారం రోజుల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రారంభం కానున్న నేపథ్యంలో రాహుల్ కీలక వ్యాఖ్యలు చేశాడు. 'క్రికెట్ ఆడటం ప్రారంభించినప్పటి నుంచి టాపార్డర్‌లోనే ఆడుతున్నా. 11 ఏళ్ల వయసులో మంగళూరులో తొలి మ్యాచ్ నుంచి టీమిండియాకు ఎంపికయ్యే వరకు దాదాపు 'టాప్'లోనే బ్యాటింగ్ చేశా. అదే నాకు సౌకర్యవంతంగా ఉంటుంది. క్రికెట్ జట్టు క్రీడ. టీమ్ అవసరాలకు తగ్గట్లు ఆడాల్సి ఉంటుంది. జట్టు ఏం కోరుకుంటుందో అది అందివ్వడం ఆటగాడిగా నా బాధ్యత. కెరీర్ ఆరంభం నుంచే అదే కొనసాగిస్తున్నా' అని రాహుల్ అన్నాడు. పలు అంశాలపై రాహుల్ మనోగతం అతడి మాటల్లోనే...

- ఐపీఎల్‌లో భాగంగా గతంలో పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లకు సారథిగా వ్యవహరించాను. ఈసారి వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కొనుగోలు చేసింది. అయితే గతంలో కెప్టెన్‌గా చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో ఈసారి కేవలం ఆటగాడిగానే కొనసాగాలని అనుకుంటున్నాను.
- ఐపీఎల్ వేలం చాలా అంశాలతో ముడిపడి ఉంటుంది. గత మూడు సీజన్‌లలో సారథిగా జట్టును నడిపించా. అదే సమయంలో కోర్ టీమ్‌ను తయారు చేసుకోవడంపై కూడా దృష్టి పెట్టా. దీంతో ఎంతో ఒత్తిడి ఉండేది. వేలం అంటే ఆటగాడి కెరీర్‌కు సంబంధించింది. అదే సమయంలో ఫ్రాంచైజీలు వేరే విధంగా ఆలోచిస్తాయి. ఆటగాడి భవితవ్యం వేలంతో ముడిపడి ఉంటుంది కాబట్టి ఒత్తిడి తప్పదు.
- ఐపీఎల్ వేలం సమయంలో నేను కూడా ఒత్తిడికి గురయ్యాను. అయితే ఈసారి కేవలం ఆటగాడిగానే ఆడాలనుకుంటున్నాను. కెరీర్‌లో ఇదే సరైన నిర్ణయం అనుకుంటున్నా. చాలా ఉత్సుకతతో ఎదురుచూస్తున్నా.
- ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో భాగం కావడం ఆనందంగా ఉంది. ఫ్రాంచైజీ సహ యజమాని పార్థ్ జిందాల్‌తో మంచి స్నేహం ఉంది. ఆట గురించే కాకుండా అనేక విషయాలపై మేము సుదీర్ఘంగా చర్చించుకుంటాం. క్రికెట్‌పై అమితాసక్తితో పాటు చక్కటి అవగాహన ఉంది. మంచి జట్టు అందుబాటులో ఉంది. కొత్త ఫ్రాంచైజీతో కలిసి ప్రయాణించేందుకు ఆసక్తిగా చూస్తున్నా.
- కొత్త జట్టులో అడుగుపెట్టినప్పుడు ఎన్నో ఆలోచనలు చుట్టుముట్టడం సహజం. ప్రస్తుతం నా పరిస్థితి కూడా అలాగే ఉంది. అయితే అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, స్టార్క్ వంటి ఆటగాళ్లతో చక్కటి అనుబంధం ఉంది. వారితో కలిసి టీమ్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తా. జట్టులో అటు అనుభవజ్ఞులు, ఇటు యువ ఆటగాళ్లు మెండుగా ఉన్నారు. ఇలాంటి ప్రతిభావంతులతో కలిసి ఆడేందుకు ఉత్సుకతతో ఉన్నాను.
- సవాళ్లను ఎదుర్కొనే సత్తా ఉంటేనే సుదీర్ఘకాలం అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగవచ్చు. కెరీర్‌లో ఎన్నో ప్రతిబంధకాలు ఎదురయ్యాయి. వాటన్నింటిని అధిగమించి ఈ స్థాయికి చేరుకున్నా. వెనక్కి తిరిగి చూసుకుంటే వాటన్నింటికంటే ఈ ప్రయాణమే అద్భుతంగా అనిపిస్తోంది. ఇక భవిష్యత్తుపై దృష్టి పెట్టా. ఇప్పటి వరకు నేర్చుకున్న దానిని ప్రణాళికాబద్ధంగా అమలు పరచడంపై దృష్టి పెడతా. జట్టుకు వీలైనన్ని ఎక్కువ విజయాలు సాధించిపెట్టడమే నా లక్ష్యం.

ఆ సత్తా ఒక్క భారత్‌కే ఉంది

ఒకేరోజు మూడు ఫార్మాట్లలో మ్యాచ్‌లు ఆడగలదని స్టార్క్ కితాబు



సిడ్నీ: భారత్‌లో ప్రతిభావంతులైన క్రికెటర్లు చాలా మంది ఉన్నారని, రిజర్వ్ పూల్ సత్తా అసాధారణమని ఆస్ట్రేలియన్ పేస్ బౌలర్ మిచెల్ స్టార్క్ ప్రశంసించాడు. ఒకేరోజు టి20, వన్డే, టెస్టు మ్యాచ్‌లను ఆడే సత్తా భారత్‌కే ఉందని చెప్పాడు. 'మూడు వేర్వేరు ఫార్మాట్లలో మూడు జట్లను ఒకేరోజు మైదానంలో దింపగలిగే సామర్థ్యం ప్రపంచ క్రికెట్‌లో ఒక్క భారత దేశానికి మాత్రమే ఉంది. ఆసీస్‌తో టెస్టు, ఇంగ్లండ్‌తో వన్డే, దక్షిణాఫ్రికాతో టి20 ఆడగలదు. ఇదేదో ఆషామాషీగా కాదు! అంతర్జాతీయ క్రికెట్ పోటీకి ఏమాత్రం తగ్గకుండా మూడు టీమిండియా జట్లు ఆడగలవు. ఈ సామర్థ్యం, సత్తా మరే దేశానికి లేదు' అని ఓ యూట్యూబ్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్టార్క్ పేర్కొన్నాడు. ప్రపంచ లీగ్ క్రికెట్‌లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అగ్రగామిగా వెలుగొందడం వల్లే ఇంతటి అనుకూలతలు వచ్చాయా అన్న ప్రశ్నకు స్టార్క్ ఆసక్తికర సమాధానమిచ్చాడు. 'ఒక్క ఐపీఎల్ వల్లే ఈ సానుకూలతలని నేననుకోను. మేమంతా (క్రికెటర్లందరూ) కూడా ప్రపంచ వ్యాప్తంగా ఫ్రాంచైజీ లీగ్‌లు ఆడుతున్నాం. కానీ భారత క్రికెటర్లు మాత్రం ఒక్క ఐపీఎల్ మాత్రమే ఆడుతున్న సంగతి మరవొద్దు. ఇక్కడ చూడాల్సింది అనుకూలతలు కావు. రిజర్వ్ బెంచ్ సత్తా. భారత క్రికెట్‌లో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ ఆడే బలగం చెప్పుకోదగ్గ స్థాయిలో ఉంది. రోజు రోజుకీ పోటీ క్రికెటర్లు దీటుగా తయారవుతున్నారు. ఐపీఎల్ ఒక పెద్ద టోర్నీ. కొంత అడ్వాంటేజ్ ఉండొచ్చు. కానీ అంతకు మించిన ప్రతిభ కూడా ఉంది. అదే భారత క్రికెట్ బలగం అవుతోంది' అని చెప్పాడు. మిగతా క్రికెటర్లు ఏడాదికి ఐదారు లీగ్‌లు ఆడుతున్నారని, మరి వారి దేశాల్లోనూ, ఆయా దేశాల్లోనూ లీగ్‌లు జరుగుతున్నప్పటికీ ఒక్క ఐపీఎల్‌కు పరిమితమైన దేశంలోనే పెద్ద సంఖ్యలో క్రికెటర్లు వెలుగులోకి రావడం గొప్ప విశేషమని స్టార్క్ వివరించాడు.



లండన్ మారథాన్‌లో ప్రపంచ రికార్డు!

ఏప్రిల్ 27న ముహూర్తం

లండన్: ప్రతిష్టాత్మక లండన్ మారథాన్ పరుగు ప్రపంచ రికార్డు కొల్లగొట్టనుంది. రికార్డు స్థాయిలో అథ్లెట్లు లండన్ మారథాన్ రేసును పూర్తి చేస్తారనే అంచనాలు అమాంతం పెరిగాయి. వచ్చే నెల 27న లండన్ నగరంలో జరిగే ఈ మారథాన్ (42.195 కిలోమీటర్లు) పరుగులో పోటీపడేందుకు ఇప్పటికే 8 లక్షల 40 వేల మందికిపైగా ఔత్సాహికులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. గతేడాది ఈ ఈవెంట్‌లో 5,78,304 రన్నర్లకంటే ఇది చాలా అధికం. పురుషులతో దీటుగా మహిళా రన్నర్లు ఆసక్తి చూపడం విశేషం. 8 లక్షల 40 వేల ఔత్సాహికుల్లో 49 శాతం మహిళలు ఉన్నారు. మరీ ముఖ్యంగా యువతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పేర్లు నమోదు చేసుకున్న వారిలో 20 ఏళ్ల నుంచి 29 ఏళ్ల వయస్సున్న యువతులు ఏకంగా 105 శాతం పెరగడం విశేషం! ఇప్పటివరకు పూర్తి మారథాన్ పరుగు దూరాన్ని 55,646 మంది పూర్తి చేశారు. గత నవంబర్‌లో న్యూయార్క్ మారథాన్‌లో ఈ రికార్డు నమోదైంది. అయితే ఈసారి సుమారు ఎనిమిదిన్నర లక్షల మంది బరిలో దిగడానికి ఆసక్తి చూపడంతో పూర్తి చేసేవారి సంఖ్య కూడా ఆ స్థాయిలోనే పెరుగుతుందని నిర్వాహకులు, విశ్లేషకులు భావిస్తున్నారు. 'ఏప్రిల్ 27న జరిగే 45వ లండన్ మారథాన్ కొత్త మైలురాయికి చేరుకోబోతోంది. అత్యధిక సంఖ్యలో పరుగును పూర్తిచేసే రికార్డు సాకారం కానుంది. ఇదే జరిగితే ముమ్మాటికి మా మారథాన్ చరిత్ర పుటల్లోకి ఎక్కుతుంది' అని లండన్ మారథాన్ ఈవెంట్స్ సీఈఓ హ్యూజ్ బ్రాషెర్ తెలిపారు. నగరంలోని గ్రీన్‌విచ్ నుంచి ద మాల్ వరకు సాగే 42.195 కిలోమీటర్ల దూరాన్ని ఈసారి 56 వేల పైచిలుకు మంది పూర్తి చేస్తారనే నమ్మకంతో ఉన్నట్లు చెప్పారు. 1981లో లండన్ మారథాన్ మొదలైంది. ఆ ఏడాది తొలి మారథాన్‌లో ఏకంగా 13 లక్షల మంది బరిలోకి దిగారు.

దటీజ్.. ద్రవిడ్

చేతి కర్రలతో ప్రాక్టీస్ పర్యవేక్షించిన రాజస్తాన్ రాయల్స్ హెడ్ కోచ్





జైపూర్: నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనమైన భారత మాజీ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్... మరోసారి తన ప్రత్యేకత చాటుకున్నాడు. ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్తాన్ రాయల్స్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ద్రవిడ్.. చేతి కర్రల సాయంతో జట్టు ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు. ఇటీవల ఓ స్థానిక లీగ్ మ్యాచ్ ఆడుతున్న సమయంలో ద్రవిడ్ గాయపడ్డాడు. దీంతో కాలికి పట్టి, చేతి కర్రల సాయంతోనే మైదానానికి వచ్చిన ద్రవిడ్... ఆటగాళ్ల శిక్షణను పర్యవేక్షించాడు. దీనికి సంబంధించిన వీడియోను ఫ్రాంచైజీ తమ అధికారిక ఖాతాలో పోస్ట్ చేయగా... అది కాస్తా వైరల్‌గా మారింది. గోల్ఫ్ కార్ట్‌లో మైదానంలోకి వచ్చిన ద్రవిడ్... ప్లేయర్ల ఆటతీరును పరిశీలించాడు. ఒక్కో ఆటగాడి దగ్గరికి వెళ్లేందుకు చేతి కర్రల సాయం తీసుకున్న ద్రవిడ్... చాలాసేపు వారి ఆటతీరును పరిశీలించాడు. కాలికి మెడికల్ వాకింగ్ బూట్ ధరించిన ద్రవిడ్... యువ ఆటగాళ్లు రియాన్ పరాగ్, యశస్వి జైస్వాల్‌తో సుదీర్ఘంగా చర్చిస్తూ కనిపించాడు. 2022 నుంచి 2024 వరకు భారత జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన రాహుల్ ద్రవిడ్... గతేడాది టీమిండియా టి20 ప్రపంచకప్ గెలిచిన అనంతరం ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. దీంతో తిరిగి రాజస్తాన్ జట్టుకు హెడ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. శ్రీలంక క్రికెట్ దిగ్గజం కుమార సంగక్కర రాజస్తాన్ రాయల్స్ డైరెక్టర్‌గా కొనసాగుతుండగా... సంజూ సామ్సన్ జట్టు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు.

కొకైన్ కేసులో దోషిగా ఆసీస్ మాజీ క్రికెటర్ మెక్‌గిల్



సిడ్నీ: ఆస్ట్రేలియాకు చెందిన మాజీ లెగ్ స్పిన్నర్ స్టువర్ట్ మెక్‌గిల్‌ను కొకైన్ కేసులో సిడ్నీ జిల్లా కోర్టు దోషిగా తేల్చింది. 2021, ఏప్రిల్‌లో 3.3లక్షల ఆసీస్ డాలర్లు (రూ.1.80 కోట్లు) విలువ గల కేజీ కొకైన్ డ్రగ్ క్రయవిక్రయ ఒప్పందంలో నేరుగా పాల్గొన లేదని ధ్రువీకరించిన కోర్టు ఆ డ్రగ్ పంపిణీ మొత్తం వ్యవహారంలో అతనికి తెలియకుండానే క్రికెటర్‌కు భాగముందని దోషిగా తేల్చింది. దీనిపై తుది శిక్షను ఎనిమిది వారాల్లో ఖరారు చేయనున్నట్లు కోర్టు తెలిపింది. కేసు వివరాల్లోకి వెళితే... 2021లో మెక్‌గిల్‌కు చెందిన రెస్టారెంట్‌లో ఓ డ్రగ్ డీలర్‌కు, మెక్‌గిల్ బావమరిది మారినో సాటిరోపౌలోస్‌కు మధ్య కొకైన్ డ్రగ్ డీల్ జరిగింది. ఇది చట్టవ్యతిరేక డ్రగ్ వ్యవహారమని తెలియక ఆ ఒప్పందంలో తలదూర్చానని మాజీ స్పిన్నర్ తన వాదన వినిపించాడు. పలు సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నేరుగా అతని ప్రమేయం లేదని ధ్రువీకరించింది. అదే సమయంలో తెలిసి చేసినా, తెలియక చేసినా నేరం నేరమేనని ఇందులో శిక్ష అనుభవించక తప్పదని తీర్పు ఇచ్చింది. 54 ఏళ్ల మాజీ లెగ్‌స్పిన్నర్ ఆస్ట్రేలియా తరఫున 44 టెస్టులు ఆడి 208 వికెట్లు పడగొట్టాడు.

ఐపీఎల్‌లో ఆడకుండా హ్యారీ బ్రూక్‌పై రెండేళ్ల నిషేధం



న్యూఢిల్లీ: ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌పై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిషేధం విధించింది. రెండు సీజన్ల పాటు ఐపీఎల్‌లో పాల్గొనకుండా ఈ నిషేధం అమలుకానుంది. ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఎంపికైన అతను ఈ నెల 22 నుంచి జరిగే ఐపీఎల్ 18వ సీజన్‌లో పాల్గొనాల్సి ఉంది. అయితే ఈ సీజన్ ఐపీఎల్ నుంచి తప్పుకుంటున్నట్లు బ్రూక్ ప్రకటించాడు. దీనిపై బీసీసీఐ చర్యలు చేపట్టింది. ఐపీఎల్‌లో ఈ ఏడాది సవరించిన నిబంధనల ప్రకారం ఎవరైనా విదేశీ ఆటగాడు వేలంలో తన పేరు నమోదు చేసుకొని అమ్ముడైన తర్వాత సీజన్‌కు అందుబాటులో ఉండాల్సిందే. గాయం తప్ప ఇతరత్రా కారణాలను సాకులుగా చెబితే కుదరదు. ఇలా సీజన్ నుంచి అనూహ్యంగా తప్పుకున్న ఆటగాళ్లను రెండు సీజన్ల పాటు వేలంలో అలాగే లీగ్‌లో పాల్గొనకుండా నిషేధం విధిస్తారు. ఈ మేరకు ఐపీఎల్ నియమావళిలో పొందుపరిచారు. తాజా నిబంధన ప్రకారమే అతనిపై చర్యలు తీసుకున్నట్లు బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. 2025, 2026 సీజన్లలో అతను పాల్గొనేందుకు వీలుండదు. ఈ మేరకు సదరు క్రికెటర్‌తో పాటు, ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ)కు సమాచారం ఇచ్చారు. నిజానికి బ్రూక్ ఇలా చేయడం ఇదేం మొదటిసారి కాదు. గతేడాది కూడా తన నానమ్మ మృతి కారణం చూపుతూ ఏకంగా లీగ్ మొత్తానికి దూరంగా ఉన్నాడు. ఈ ఏడాది ఇంగ్లండ్ క్రికెట్‌కే తన ప్రాధాన్యత అని స్వదేశంతో భారత్ (జూన్‌లో)తో జరిగే సిరీస్‌కు ముందు పూర్తిస్థాయి ఉత్తేజంతో అందుబాటులో ఉండేందుకు ఐపీఎల్ నుంచి తప్పుకుంటున్నట్లు గత వారం వెల్లడించాడు.



చండీగఢ్‌లో గురువారం జరిగిన పంజాబ్ యూనివర్సిటీ (పీయూ) స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా 'పీయూ ఖేల్‌రత్న' పురస్కారం అందుకుంటున్న భారత మేటి షూటర్ మనూ భాకర్. గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు నెగ్గిన మనూ భాకర్ ఈ ఏడాది చండీగఢ్‌లోని డీఏవీ కాలేజీ నుంచి మాస్టర్స్ డిగ్రీ సాధించింది



జయహో జార్ఖండ్

- తొలిసారి జాతీయ సీనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ టైటిల్ సొంతం
- ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ హరియాణాపై 'షూటౌట్'లో విజయం

పంచ్‌కులా (హరియాణా): ఎట్టకేలకు జార్ఖండ్ మహిళల హాకీ జట్టు అనుకున్నది సాధించింది. తొలిసారి జాతీయ సీనియర్ మహిళల చాంపియన్‌షిప్‌లో విజేతగా అవతరించింది. 'షూటౌట్' వరకు కొనసాగిన టైటిల్ సమరంలో అల్బెలా రాణి టొప్పో నాయకత్వంలోని జార్ఖండ్ జట్టు 4-3 గోల్స్ తేడాతో డిఫెండింగ్ చాంపియన్ హరియాణా జట్టును ఓడించింది. 2011లో హాకీ ఇండియా (హెచ్‌ఐ) ఆవిర్భవించాక 15 సార్లు జాతీయ చాంపియన్‌షిప్ జరిగింది. జార్ఖండ్ జట్టు ఆరుసార్లు (2012, 2013, 2014, 2022, 2023, 2024) మూడో స్థానాన్ని దక్కించుకోగా... ఒకసారి (2015) రన్నరప్‌గా నిలిచింది. ఎనిమిదో ప్రయత్నంలో జార్ఖండ్ విన్నర్స్ ట్రోఫీని సొంతం చేసుకుంది. హరియాణాతో జరిగిన ఫైనల్లో నిర్ణీత సమయం ముగిసేసరికి రెండు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. హరియాణా తరఫున కెప్టెన్ రాణి (42వ నిమిషంలో), జార్ఖండ్ తరఫున ప్రమోదిని లాక్రా (44వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. స్కోర్లు సమం కావడంతో విజేతను నిర్ణయించేందుకు 'షూటౌట్' నిర్వహించారు. 'షూటౌట్'లో జార్ఖండ్ తరఫున రజని కెర్కెట్టా, నిరాలి కుజుర్, బినిమా ధన్, అల్బెలా రాణి టొప్పో సఫలంకాగా... ష్యామీ బారా విఫలమైంది. హరియాణ తరఫున సోనమ్, కెప్టెన్ రాణి గురి తప్పగా... పింకీ, అన్ను, మనీషా సఫలమయ్యారు. జార్ఖండ్ గోల్‌కీపర్ అంజలి బింజియా హరియాణా ప్లేయర్ల రెండు షాట్‌లను నిలువరించి తమ జట్టుకు తొలిసారి టైటిల్ దక్కడంలో కీలకపాత్ర పోషించింది. మరోవైపు మిజోరం జట్టు తొలిసారి మూడో స్థానాన్ని దక్కించుకుంది. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో మిజోరం జట్టు 2-1 గోల్స్ తేడాతో మహారాష్ట్ర జట్టును ఓడించింది. మహిళల విభాగంలో రైల్వేస్ జట్టు అత్యధికంగా 8 సార్లు టైటిల్ దక్కించుకోగా... హరియాణా (3 సార్లు) రెండో స్థానంలో ఉంది. మధ్యప్రదేశ్ రెండుసార్లు టైటిల్‌ను గెలవగా.. ఒడిశా, జార్ఖండ్ ఒక్కోసారి జాతీయ టైటిల్‌ను సొంతం చేసుకున్నాయి.


గురువారం కర్ణాటకలోని చిక్కమగళూరులో హోలీ ఆడుతున్న చిన్నారులు


పంజాబ్‌లోని అమృత్‌సర్‌లోని ఇస్కాన్ ఆలయం వద్ద రంగులు చల్లుకుంటున్న మహిళలు


పశ్చిమబెంగాల్‌లోని నదియాలో గులాల్ పూసుకుంటున్న యువతులు

ఇక్కడ పురుషులు హోలీ ఆడరు...

హోలీ.. రంగుల పండుగ. దేశమంతా ఉత్సాహంగా జరుపుకొనే ఈ వేడుకకు మార్కెట్లు రంగులతో కళకళలాడతాయి. వీధులన్నీ రంగులద్దుకుంటాయి. హోలీలో ఒక్కో ప్రాంతానికి ఒక్కో సంప్రదాయం ఉండగా.. రాజస్థాన్‌లోని ఓ గ్రామంలో పురుషులు మాత్రం ఈ వేడుకకు దూరంగా ఉంటారు. స్త్రీలు స్వేచ్ఛగా హోలీ ఆడుకుంటారు. ఈ ఆసక్తికర ఆచారం 500 ఏళ్లుగా కొనసాగుతోంది.

ధిక్కరిస్తే బహిష్కరణే...

ఈ సంప్రదాయం కొన్ని తరాలుగా కొనసాగుతోంది. 500 ఏళ్లుగా గ్రామస్తులు ఆచారాన్ని తప్పకుండా పాటిస్తున్నారు. మహిళలు బయట తిరగకుండా ఉంచిన పర్దా వ్యవస్థ నుంచి ఈ సంప్రదాయం వచ్చిందని స్థానికులు చెబుతారు. పురుషులు ఉండరు కాబట్టి మహిళలు స్వేచ్ఛగా వేడుకలు చేసుకుంటారు. ఈ సంప్రదాయాన్ని ధిక్కరించి పురుషులు గ్రామంలో ఉండిపోతే మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదు. వారిని వెంటనే గ్రామం నుంచి బహిష్కరిస్తారు. ఇక పురుషులకు హోలీ పండుగే ఉండదా అంటే.. ఉంటుంది. కాకపోతే తరువాతి రోజు పురుషులు, స్త్రీలు కలిసి ఈ వేడుకలు జరుపుకొంటారు. కేవలం రంగులు జల్లుకోవడం కాదు.. పురుషులను స్త్రీలు కొరడాలతో కొట్టడంతో పండుగ ముగుస్తుంది.

పురుషులు ఆలయానికి..

రాజస్థాన్‌లోని టోంక్ జిల్లాలో నాగర్ గ్రామంలో ఈ అసాధారణ సంప్రదాయం ఉంది. హోలీ రోజున ఉదయం 10 గంటలు కాగానే.. నాగర్‌కు చెందిన ఐదేళ్లు దాటిన పురుషులంతా గ్రామాన్ని వదిలి శివార్లలో ఉన్న చాముండేశ్వరీ దేవీ ఆలయానికి వెళ్తారు. అక్కడ జాతర చేసుకుంటారు. భక్తిగీతాలు వింటూ రోజంతా భక్తిశ్రద్ధలతో గడుపుతారు.

పురుషుల వేషధారణలో స్త్రీలు..

ఇంకేముంది ఊరంతా మహిళలదే. రోజంతా పండుగే. గ్రామాన్నంతా అలంకరించి రంగులు జల్లుకుంటూ శోభాయమానంగా మారుస్తారు. వయసుతో తేడా లేకుండా మహిళలంతా ఆనందోత్సాహాల్లో మునిగిపోతారు. ప్రత్యేక ఆచారం కావడంతో అంతగా ఇష్టపడనివారు సైతం కచ్చితంగా హోలీ ఆడతారు. కొందరు స్త్రీలు పురుషుల వేషధారణతో వేడుకల్లో పాల్గొంటారు.

-సాక్షి, నేషనల్ డెస్క్

రంగులు పూయొద్దన్నందుకు చంపేశారు

జైపూర్: రంగుల పండుగ హోలీలో కొందరి అత్యుత్సాహం ఒక కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. పరీక్షలకు ప్రిపేరవుతున్న ఓ విద్యార్థి తనకు రంగులు పూయవద్దని అన్నందుకు ఆగ్రహంతో అతడిని విపరీతంగా కొట్టి గొంతు పిసికి చంపేశారు ముగ్గురు వ్యక్తులు. ఈ దారుణం రాజస్తాన్‌లోని దౌసా జిల్లాలో చోటుచేసుకుంది. రల్వాస్ గ్రామానికి చెందిన అశోక్, బబ్లూ, కాలూరాం అనేవారు బుధవారం సాయంత్రం రంగులు చల్లుకుంటూ స్థానిక లైబ్రరీకి చేరుకున్నారు. అక్కడ పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న హన్స్‌రాజ్(25)పై రంగులు చల్లేందుకు ప్రయత్నించారు. అతడు వారించినా వినకుండా రంగులు పూశారు. మాటామాటా పెరగడంతో అతడిపై ముగ్గురూ దాడి చేశారు. బెల్టుతో అతడి గొంతు పిసికి చంపేశారు. విషయం తెలిసిన కుటుంబసభ్యులు, స్థానికులు మృతదేహంతో జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగమివ్వాలని, నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు నచ్చజెప్పి ఎట్టకేలకు అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో మృతదేహాన్ని రోడ్డుపై నుంచి తొలగించేలా ఒప్పించగలిగారు.

హోలీ రంగులు వద్దనుకుంటే దేశం విడిచి వెళ్లండి

యూపీ మంత్రి సంజయ్ నిషాద్ వివాదాస్పద వ్యాఖ్యలు

గోరఖ్‌పూర్: హోలీ అంటే ఇష్టంలేనివారు, రంగులంటే పడనివారు దేశం విడిచి వెళ్లాలని యూపీ మంత్రి, నిషాద్ పార్టీ చీఫ్ సంజయ్ నిషాద్ వ్యాఖ్యానించారు. ఈ ఏడాది హోలీ.. రంజాన్ మాసంలోని శుక్రవారం రోజే వచ్చింది. దీంతో హోలీ వేడుకలకు అసౌకర్యం కలగకుండా ముస్లింలు మధ్యాహ్నం వరకు ఇళ్లలోనే ఉండాలని, ఇళ్ల నుంచి బయటకు రావాల్సి వస్తే టార్పాలిన్‌తో కప్పుకోవాలని యూపీ, బీహార్‌లోని కొందరు రాజకీయ నాయకులు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం గోరఖ్‌పూర్‌లో హోలీ మిలన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిషాద్ మాట్లాడుతూ.. సమాజంలో విభేదాలు సృష్టించేందుకు కొందరు నేతలు ప్రయత్నిస్తున్నారని ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. హోలీ వేడుకలతో మతాన్ని ముడిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం ప్రార్థనల సమయంలో ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటారని, హోలీ ఆడేటప్పుడు కూడా అలాగే చేస్తారని చెప్పుకొచ్చారు. రెండూ ఐక్యతకు సంబంధించిన పండుగలే అయినా కొందరు రాజకీయ నాయకులు ఈ ఐక్యతను కోరుకోవడం లేదని, ఒక వర్గానికి చెందిన ప్రజల మనస్సులను విషపూరితం చేస్తున్నారని ఆరోపించారు. వారు కూడా ఈ దేశం పౌరులేనని, రంగులతో సమస్యలుంటే వారు దేశం విడిచి వెళ్లిపోవాలంటూ వ్యాఖ్యానించారు. రంగులు పూస్తే తమ విశ్వాసాలు దెబ్బతింటాయని భావిస్తారని, మరి రంగురంగుల దుస్తులు ఎలా ధరిస్తున్నారని ప్రశ్నించారు. రంగుల వ్యాపారులు సైతం ఆ సామాజిక వర్గానికి చెందినవారేనని వెల్లడించారు. పండుగలు ఆనందాన్ని పంచడానికి, ఐక్యతను వ్యాప్తి చేయడానికి ఉద్దేశించినవన్నారు.

లీకేజీలతో ప్రమాదంలో విద్యార్థుల భవిష్యత్తు

కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ ధ్వజం

న్యూఢిల్లీ: పరీక్ష పేపర్ లీకేజీలు వ్యవస్థాపరమైన వైఫల్యం, ఇది చాలా తీవ్రమైన సమస్య అని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఇటువంటివి పునరావృతం కారాదంటే అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వం విభేదాలను పక్కన బెట్టి కలిసికట్టుగా కఠిన చర్యలు తీసుకోవాలని రాహుల్ సూచించారు. పరీక్షా పత్రాల లీకేజీ మన యువత పాలిట పద్మవ్యూహంలా మారిందంటూ ఆయన బీజేపీ ఎన్నికల చిహ్నాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. లీకేజీలతో ఆరు రాష్ట్రాల్లోని 85 లక్షల మంది భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కష్టపడి చదివే విద్యార్థుల శ్రమ వృథా కావడంతోపాటు వారి తల్లిదండ్రులను ఒత్తిడికి గురి చేస్తోందన్నారు. ముమ్ముందు విద్యార్థులు కష్టపడి చదవడం కంటే దొడ్డిదారి వెతకడమే మేలన్న దురభిప్రాయానికి వచ్చే ప్రమాదముందని రాహుల్ హెచ్చరించారు. గతేడాది నీట్ పేపర్ లీకేజీ ఘటన నేపథ్యంలో దీనికి పరిష్కారమంటూ ప్రభుత్వం ఒక చట్టం తీసుకువచ్చిందని, కానీ ఇటీవల మరికొన్ని లీకేజీ ఘటనలు చోటుచేసుకోవడం చూస్తే ప్రభుత్వ ప్రయత్నం విఫలమైనట్టు రుజువైందన్నారు. పరీక్షల సమగ్రత విద్యార్థుల హక్కని, ఏదేమైనా దాన్ని కాపాడాలని రాహుల్ గురువారం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

ప్రతిష్టించిన రెండు రోజులకే అంబేడ్కర్ విగ్రహం చోరీ

ఛతర్‌పూర్ (మధ్యప్రదేశ్): ప్రతిష్టించిన రెండు రోజులకే అంబేడ్కర్ విగ్రహం కనిపించకుండా పోయింది. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్ జిల్లా బారిగ్రామంలో జరిగింది. ఒకటిన్నర అడుగుల అంబేడ్కర్ రాతి విగ్రహాన్ని కొనుగోలు చేసిన గ్రామస్తులు గ్రామంలోని బహిరంగ ప్రదేశంలో మంగళవారం ప్రతిష్టించారు. రెండు రోజుల తరువాత విగ్రహం కనిపించకుండా పోయింది. దీంతో గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని ప్రశ్నిస్తున్నారు. నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని, కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

గుజరాత్‌లో పరువు హత్య

వేరే కులం యువకుడిని ప్రేమించిందని యువతిని చంపిన తండ్రి

భావ్‌నగర్: గుజరాత్‌లోని భావ్‌నగర్ జిల్లాలో పరువు హత్య జరిగింది. వేరే కులం యువకుడిని ప్రేమించిందని ఓ యువతిని, ఆమె తండ్రి, బాబాయ్ కలిసి చంపేశారు. విషయం బయటికి రావద్దని రహస్యంగా దహనం చేశారు. బంధువులకు అనుమానం రావడంతో విషయం బయటకు వచ్చింది. జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన దీపక్ రాథోడ్‌కు ఇద్దరు కూతుళ్లు. 19 ఏళ్ల పెద్ద కూతురు వేరే కులానికి చెందిన యువకుడిని ప్రేమించింది. ఆ విషయం తెలుసుకుని ఆగ్రహానికి గురైన దీపక్.. సోదరుడు లాల్‌జీ రాథోడ్‌తో కలిసి హత్యకు పథకం పన్నాడు. సోదరులిద్దరూ కలిసి.. మార్చి 7న కూతుళ్లిద్దరినీ పిలిచారు. చెల్లెలు ముందే అక్కను గొంతు నులిమి చంపేశారు. అంతేకాదు.. అక్క చేసినట్లు చేస్తే నీకూ అదే గతి పడుతుందంటూ బెదిరించారు. ఆ తరువాత విషం తాగి ఆత్మహత్య చేసుకుందంటూ బంధువులకు చెప్పారు. దహనం కూడా చేశారు. అయినా దీపక్ చెప్పిన సమాధానంపై అనుమానం వచ్చిన బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో హత్యానేరం కింద దీపక్ రాథోడ్, లాల్‌జీ రాథోడ్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

పాక్‌లో ఆత్మాహుతి దాడి భగ్నం

పెషావర్: పాకిస్తాన్‌లో మరో ఉగ్రవాద దాడిని భద్రతా దళాలు భగ్నం చేశాయి. ఖైబర్ పఖ్తుంఖ్వాలోని వజీరిస్థాన్ జిల్లాలో ఉన్న జండోలా చెక్‌పోస్టుపై ఉగ్రవాదులు గురువారం దాడికి ప్రయత్నించారు. దీనిని భద్రతా బలగాలు తిప్పికొట్టాయి. ఫ్రంటియర్ కార్ప్స్ క్యాంప్ సమీపంలో ఓ వాహనంలో ఆత్మాహుతి బాంబర్ తనను తాను పేల్చుకున్నాడు. ఈ ఘటనలో పది మంది ఉగ్రవాదులు హతమయ్యారు. బలూచిస్తాన్‌లోని రైలును హైజాక్ చేసి, ప్రయాణికులను బంధించిన 33 మంది ఉగ్రవాదులను భద్రతా దళాలు హతమార్చిన మరుసటి రోజే ఘటన జరగడం గమనార్హం. 2025 జనవరిలో దేశంలో ఉగ్రవాదదాడులు గణనీయంగా పెరిగాయి. గతంతో పోలిస్తే 42శాతం పెరిగాయని ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలే చెబుతున్నాయి.

ఈజిప్టులో మినీ బస్సును ఢీకొన్న రైలు

కైరో: ఉత్తర ఈజిప్టులో రైలు మినీ బస్సును ఢీకొనడంతో 8 మంది మృతి చెందారు. 12 మంది గాయపడ్డారు. గాయపడినవారిలో ఓ చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది. ఇస్మాలియాలోని సూయజ్ కెనాల్ ప్రావిన్స్‌లో ఈ ప్రమాదం జరిగింది. మినీ బస్సు నిషిద్ధ మార్గం గుండా రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఈజిప్టులో రైల్వే వ్యవస్థ చాలా పాతకాలం నాటిది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. సరైన నిర్వహణ లేకపోవడం వల్ల రైలు పట్టాలు తప్పడం, ప్రమాదాలు ఇక్కడ సర్వసాధారణం. గతేడాది అక్టోబర్‌లో ప్యాసింజర్ రైలు చివరను లోకోమోటివ్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. సెప్టెంబర్‌లో రెండు ప్యాసింజర్ రైళ్లు ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందారు.

మధ్యప్రదేశ్‌లో గ్యాస్ ట్యాంకర్ బీభత్సం

ఏడుగురు మృతి, ముగ్గురికి గాయాలు

ధార్: అదుపుతప్పిన గ్యాస్ ట్యాంకర్ ఒకటి కారు, జీపులను ఢీకొన్న ఘటనలో ఏడుగురు చనిపోగా ముగ్గురు గాయాలపాలయ్యారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లాలో బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. బమన్‌సుటా గ్రామ సమీపంలోని బద్నావర్– ఉజ్జయిని హైవేపై గ్యాస్ ట్యాంకర్ ఒకటి రాంగ్ సైడ్‌లో వేగంగా వెళుతోంది. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న కారు, జీపును ఢీకొట్టింది. ఘటనలో అక్కడికక్కడే నలుగురు చనిపోగా తీవ్రంగా గాయపడిన ముగ్గురు ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారని పోలీసులు తెలిపారు. బాధితులు మధ్యప్రదేశ్‌లోని రట్లాం, జోధ్‌పూర్ జిల్లాలకు చెందిన వారు. మృతుల్లో నలుగురు కారులోని వారు కాగా, ముగ్గురు జీపులో ప్రయాణిస్తున్నారు. నుజ్జయిన వాహనాల్లో చిక్కుకుపోయిన వారిని క్రేన్‌సాయంతో వెలికి తీసేందుకు పోలీసులకు గ్రామస్తులు సహకారం అందించారు. గ్యాస్ ట్యాంకర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

96 జిల్లాల్లో తాగు నీటి కాలుష్యం

న్యూఢిల్లీ: దేశంలో తాగు నీటి కాలుష్యం పెరిగిపోతుండటంపై పార్లమెంటరీ కమిషన్ ఆందోళన వెలిబుచ్చింది. దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లోని 96 జిల్లాల్లో ఇది ఎక్కువగా ఉందని పేర్కొంది. మొత్తం 11,348 ఆవాస ప్రాంతాల్లోని జలాలు ఐరన్, నైట్రేట్, భార ఖనిజాలతో కలుషితంగా మారాయని తెలిపింది. జల వనరులపై ఏర్పాటైన స్టాండింగ్ కమిటీ ఇందుకు సంబంధించిన నివేదికను మంగళవారం పార్లమెంట్‌కు సమర్పించింది. ఆయా ప్రాంతాల్లో సురక్షితమైన తాగు నీటిని అందించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

ఏడు నెలలైనా డెత్ సర్టిఫికెట్ ఇవ్వలేదు

ఆర్‌జీ కర్ మృతురాలి తండ్రి ఆవేదన

కోల్‌కతా: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో తమ కుమార్తె(31) హత్యాచారానికి గురై ఏడు నెలలు గడిచినా ఇప్పటికీ అధికారులు డెత్ సర్టిఫికెట్ ఇవ్వలేదని ఆమె తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ కోల్‌కతాలోని ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయం, కోల్‌కతా మున్సిపల్ కార్యాలయం, ఆర్‌జీకర్ ఆస్పత్రి చుట్టూ తిరుగుతూనే ఉన్నామన్నారు. డెత్ సర్టిఫికెట్ జారీ చేయడం నిబంధనలకు విరుద్ధమంటూ తమను వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో సీఎం మమతా బెనర్జీ, ఆరోగ్య మంత్రి ఫిర్హాద్ హకీంకు ఈ విషయం తెలిసినట్లు తాము భావించడం లేదని చెప్పారు. గతేడాది ఆగస్టు 9న ఆర్‌జీ కర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో మహిళా డ్యూటీ డాక్టర్ దారుణ హత్యాచారానికి గురవడం తెల్సిందే.

ముంబై ఆస్పత్రిలో క్షుద్ర పూజల కలకలం

ముంబై: ముంబైలోని ప్రముఖ లీలావతి ఆస్పత్రిలో క్షుద్ర పూజలు జరిగాయన్న వార్త కలకలం రేపింది. తమ కార్యాలయం ఫ్లోర్ అడుగున మానవ ఎముకలు, పుర్రెలు, వెంట్రుకలు, బియ్యం, తదితర మంత్రాలకు ఉపయోగించే సామగ్రి కనిపించినట్లు ప్రస్తుత ట్రస్టీలు ఆరోపించారు. మాజీ ఉద్యోగుల నుంచి ఇందుకు సంబంధించిన సమాచారం అందుకున్న ట్రస్టీలు అక్కడ తవ్వి చూడగా ఇవన్నీ కనిపించాయి. ఈ తవ్వకాలను వారు చిత్రీకరించారు. ప్రశాంత్ మెహతా, ఆయన తల్లి చారు మెహతాలకు హాని తలపెట్టేందుకే మంత్రాలు చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, మాజీ ట్రస్టీలు రూ.1,250 కోట్ల మేర ఆస్పత్రి నిధులను పక్కదారి పట్టించారని ప్రస్తుత ట్రస్టీలు ఫిర్యాదు చేసిన నేపథ్యంలోనే ఈ ఘటన చోటుచేసుకుందని చెబుతున్నారు. అయితే, ఇవన్నీ నిరాధార, దురుద్దేశ పూర్వక ఆరోపణలని మాజీ ట్రస్టీ విజయ్ మెహతా, ఆయన కుటుంబీకులు, సన్నిహితులు కొట్టి పారేస్తున్నారు. లీలావతి ఆస్పత్రి వ్యవస్థాపకుడు కిశోర్ మెహతా సోదరుడే విజయ్ మెహతా. ఇలా ఉండగా, 2002లో కిశోర్ మెహతా వైద్యం కోసం విదేశాలకు వెళ్లగా విజయ్ మెహతా తాత్కాలికంగా ట్రస్టీ బాధ్యతలను చేపట్టారు. ఆ సమయంలో ఫోర్జరీ సంతకాలు, తప్పుడు పత్రాలతో తన కుమారులు, సన్నిహిత బంధువులను ట్రస్టీలుగా చేర్చుకున్నారు. శాశ్వత ట్రస్టీగా ఉన్న సోదరుడు విజయ్ మెహతాను ఆ హోదా నుంచి తప్పించారు. దీనిపై సుదీర్ఘ కాలం న్యాయ పోరాటం జరిగింది. చివరికి, 2016లో కిశోర్ మెహతా ట్రస్టీగా రాజీనామా చేయడంతో వివాదం ముగిసింది. 2024లో కిశోర్ చనిపోవడంతో ఆయన కుమారుడు ప్రశాంత్ మెహతా శాశ్వత ట్రస్టీ అయ్యారు. ప్రశాంత్ ఆస్పత్రి ఆర్థిక నిర్వహణపై పూర్తి స్థాయి ఆడిట్‌కు ఆదేశించగా భారీగా అవకతవకలు వెలుగు చూశాయి.

మధ్యప్రదేశ్‌లో దారుణం

మృతశిశువును నోట కరిచి సంచరిస్తున్న వీధికుక్క

రేవా(ఎంపీ): అప్పుడే పుట్టిన పసికందు తల్లి పొత్తిళ్లలో సేదతీరాల్సిందిపోయి చెత్తకుప్పపాలైంది. అప్పటికే మృతిచెందిన ఆ పసిగుడ్డును అక్కడే ఉన్న ఒక వీధికుక్క చూసి నోటకరిచి పరుగెత్తింది. వీధుల వెంట తిరుగుతున్న శునకాన్ని చూసి స్థానికులు హతాశులయ్యారు. ఏ తల్లి కన్నబిడ్డో ఇలా కుక్కపాలైందని ఆ హృదయవిదారక దృశ్యం చూసిన వారిలో కొందరు కంటతడి పెట్టుకున్నారు. మనసుల్ని కలచివేసే ఈ దృశ్యం మధ్యప్రదేశ్‌లోని రేవా నగరంలో సివిల్‌లైన్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జయస్తంభ్ చౌక్ కబడ్డీ మొహల్లాలో మంగళవారం జరిగింది. సంబంధిత వీడియో ఆన్‌లైన్‌లో వైరల్‌కావడంతో విషయం అందరికీ తెల్సింది. అల్లారుముద్దుగా పెంచుకోవాల్సిన పసిపాపను ఇలా నిర్దాక్షిణ్యంగా వదిలేసిన ఘటనపై పోలీసులు సీరియస్ అయ్యారు. కేసు నమోదుచేసి సంబంధిత వ్యక్తుల జాడ కోసం అన్వేషణ మొదలెట్టారు. చెత్తకుప్పపాల్జేసిన వ్యక్తుల జాడ తెలిస్తే తమకు వివరాలు ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని రేవా ఎస్పీ వివేక్ తెలిపారు. కుక్కను తరిమేసి చిన్నారి మృతదేహాన్ని ప్రస్తుతం మార్చురీకి తరలించారు. నగరంలో గత నెలన్నర వ్యవధిలో చిన్నారులు ఇలా చెత్తకుప్పల వద్ద నిర్జీవంగా కనిపించడం ఇది మూడోసారి. పసిపాపను కుక్క నోటకరిచి తీసుకెళ్లడం ఇటీవలికాలంలో ఇది రెండోసారి. ప్రభుత్వ వైద్యకళాశాల వద్ద ఈ ఘటన జరిగింది. మంగళవారం నాటి ఘటనలో కుక్క నోటకరిచి తీసుకెళ్తున్న వీడియోను ఎవరు చిత్రీకరించారు ?. ఎవరు ఆన్‌లైన్‌లో తొలిసారి షేర్ చేశారనే వివరాలపై పోలీసులు కూపీ లాగుతున్నారు.

బీజేపీ దేశాన్ని బలహీనపర్చింది: అఖిలేశ్

లక్నో: బీజేపీ పాలనలో దేశం ఆర్థికంగా, సామాజికంగా బలహీనంగా మారిందని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. 'సమాజంలో విద్వేషాల వ్యాప్తితో దేశం బలహీనమైంది. బీజేపీ నేతల నడవడిక, భాష తీరు సమాజంలో అంతరాలను పెంచాయి'అని గురువారం లక్నోలో జరిగిన మీడియా సమావేశంలో అఖిలేశ్ నిప్పులు చెరిగారు. 'బీజేపీ ప్రభుత్వం మార్కెట్లపై పెత్తనాన్ని ఇతరులకు అప్పగించింది. వీరు మన మార్కెట్లపై ఆధిపత్యం చెలాయిస్తున్నారు'అని విమర్శించారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తీస్ మార్ ఖాన్‌లా మాట్లాడుతున్నారంటూ దుయ్యబట్టారు. 'ఆయనకు 30 అంటే ఎంతో ఇష్టం. మహాకుంభ్ మేళా తొక్కిసలాటలో ఎందరు చనిపోయారు? సమాధానం 30. ఎంత వ్యాపారం జరిగింది? రూ.30 కోట్లు. ఇలా తీస్ మార్ ఖాన్‌లా మాట్లాడే వాళ్లు మన సీఎం కాకుండా మరెవరు ఉంటారు?'అంటూ అఖిలేశ్ ఎద్దేవా చేశారు. ఇటీవల సీఎం యోగి అసెంబ్లీలో మాట్లాడుతూ..మేళా సమయంలో బోటు నిర్వాహకుడొకరు రూ.30 కోట్లు సంపాదించారంటూ చేసిన ప్రకటనపై అఖిలేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అదేవిధంగా, కుంభ మేళా సమయంలో ప్రయాగ్‌రాజ్ యువత తమ బైక్‌లపై భక్తులను తరలించి, లక్షలాది రూపాయలు సంపాదించారన్న సీఎం వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ..ప్రైవేట్ వాహనాలను వ్యాపారాలకు సైతం వాడుకోవచ్చని ప్రభుత్వం ఎప్పుడు ప్రకటించిందో ఎవరైనా చెబుతారా?అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీనర్థం మళ్లీ 144 ఏళ్లకే యువతకు ఇలాంటి ఉపాధి అవకాశాలను కల్పిస్తారా? అని 144 ఏళ్లకోసారి వచ్చే మహా కుంభమేళా గురించి అఖిలేశ్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ముస్లింలే లక్ష్యంగా విద్వేషాలను వ్యాప్తి చేస్తున్న బీజేపీ ప్రభుత్వం రానున్న కాలంలో వెనుకబడిన, దళిత, మైనారిటీ కులాలను కూడా లక్ష్యంగా చేసుకుంటుందని హెచ్చరించారు.

ఢిల్లీ సీఎంవో 'ఎక్స్' ఖాతా పునరుద్ధరణ

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రభుత్వ అధికారిక 'ఎక్స్'ఖాతాను తిరిగి పునరుద్ధరించారు. ఫిబ్రవరి 5వ తేదీన జరిగిన ఎన్నికల్లో ఆప్ ప్రభుత్వం ఓడిపోవడం, బీజేపీ అధికార పగ్గాలు చేపట్టడం తెల్సిందే. అయితే, ఎన్నికల్లో ఓడిపోయాక ఢిల్లీ సీఎంవో 'ఎక్స్'ఖాతాకు ఆప్ ప్రభుత్వం 'కేజ్రీవాల్ ఎట్ వర్క్'అంటూ పేరు మార్చివేసింది. దీనిపై బీజేపీ తీవ్ర అభ్యంతరం తెలిపింది. అధికారిక సీఎంవో సామాజిక మాధ్యమ ఖాతాను ఆప్ చీఫ్, మాజీ సీఎం కేజ్రీవాల్ హైజాక్ చేశారంటూ ఆరోపించింది. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కోరింది. ఈ మేరకు ఖాతాలో తగు మార్పులు చేపట్టిన సీఎం రేఖా గుప్తా ప్రభుత్వం గురువారం..సీఎంవో 'ఎక్స్'ఖాతాను గత ఆప్ ప్రభుత్వం సరైన రీతిలో తమకు ఆధీనం చేయలేదని తెలిపింది.

కళ్ల ముందే కడతేర్చారు

పాకిస్తాన్‌లో రైలు హైజాక్ ఘటన నుంచి ఇంకా తేరుకోని ప్రయాణికులు

భీతావహ దృశ్యాలు ఇంకా తమ కళ్లముందు కదలాడుతున్నాయన్న ప్రత్యక్ష సాక్షులు

క్వెట్టా: తమ ప్రాంత స్వాతంత్ర్యం కోసం దశాబ్దాలుగా సాయుధబాటలో పయనిస్తున్న అతివాద బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) మంగళవారం పాకిస్తాన్‌లో ఏకంగా ఒక రైలునే తమ అధీనంలోకి తెచ్చుకుని ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. అయితే ఈ ఘటనలో ఎట్టకేలకు ప్రాణాలతో బయటపడిన ప్రయాణికులు ఇంకా ఆ దారుణ ఘటన నుంచి తేరుకోలేదు. తమ కళ్ల ముందే పాకిస్తానీ సైనికులను పిట్టల్ని కాల్చినట్లు కాల్చేసిన వైనాన్ని వారు గుర్తుచేసుకున్నారు. క్వెట్టా నుంచి పెషావర్‌కు 440 మంది ప్రయాణికులతో వెళ్తున్న జాఫర్ రైలుపై మెరుపుదాడి చేసి డజన్లకొద్దీ జనాలను, రైళ్లోని పాక్ సైనికులను బలూచిస్తాన్ వేర్పాటువాదులు చంపేసిన ఉదంతం తీవ్ర కలకలం రేపడం తెల్సిందే. చిన్నారులు, మహిళలతోపాటు వృద్ధులను వేర్పాటువాదులు ఇప్పటికే మానవతా దృక్పథంలో వదిలేయడంతో ఘటనాస్థలిలో వివరాలను ఆ వృద్ధులు మీడియాతో పంచుకున్నారు.

బోగీలపైకి బుల్లెట్ల వర్షం

''రైలు బోలన్ కనుమ సమీపానికి రాగానే పెద్ద పేలుడు జరిగింది. పట్టాలను వేర్పాటువాదులు పేల్చేశారు. దీంతో రైలు హఠాత్తుగా ఆగింది. రైలు ఆగీఆగడంతోనే బోగీలపైకి బుల్లెట్ల వర్షం కురిపించారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని సీట్ల కింద దాక్కున్నాం''అని మహబూబ్ హుస్సేన్ అనే వృద్ధుడు చెప్పారు. తర్వాత విడుదలైన ఒక రైల్వే పోలీసు అధికారి ఈ ఘటనను వివరించారు. ''రైలు ఆగాక వందలాది మంది బీఎల్‌ఏ ఫైటర్లు కిందకు దిగొచ్చి రైలును చుట్టుముట్టి కాల్పులు మొదలెట్టారు. నేను, నలుగురు రైల్వే పోలీసులు, ఇద్దరు పాకిస్తానీ పారా మిలటరీ ఫ్రంటియర్ కోర్ సభ్యులందరం కలిసి వేర్పాటువాదులను ఎదుర్కొనేందుకు ప్రయత్నించాం. మా వద్ద మందుగుండు అయిపోయేదాకా ప్రతిఘటించాం. తర్వాత మా వద్ద బుల్లెట్లు అయిపోయాయి. చివరకు చేతులెత్తేయక తప్పలేదు ''అని రైల్వే పోలీసు అధికారి చెప్పారు.

గుంపులుగా వేరుచేసి..

''అందర్నీ కిందకు దించి ఐడీ కార్డులు అడిగారు. పోలీసులు, మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇలా వేర్వేరు గుంపులుగా నిల్చోబెట్టారు. 'ప్రభుత్వానికి డిమాండ్లు పంపించాం. అవి నెరవేరితే సరే. లేదంటే ఎవ్వరినీ వదిలిపెట్టం''అని మాతో చెప్పారు. వాళ్లకు పైనుంచి ఆదేశాలు వస్తున్నాయి. అందుకు తగ్గట్లు వాళ్లు కొందరు సాధారణ పౌరులను, సైనికులను చంపుకుంటూ వెళ్లారు. మా కళ్లముందే ఈ ఘోరం జరిగింది''అని మరో ప్రత్యక్ష సాక్షి ఇషాక్ నూర్ చెప్పారు. ''అందర్నీ కిందకు దింపి ముసలివాళ్లను వదిలేశారు. వెనక్కి తిరిగి చూడకుండా ఇలాగే పట్టాల వెంట వెళ్లిపోవాలని నన్ను, నా భార్యను హెచ్చరించారు. బతుకుజీవుడా అనుకుంటూ అలాగే నడిచి రాత్రి ఏడు గంటలకు పనీర్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాం''అని భర్త నూర్ మొహమ్మద్ చెప్పారు. ''పిల్లలు, మహిళలు ఉన్నారు వదిలేయండని ఎంతో వేడుకుంటే మమ్మల్ని వదిలేశారు. మంగళవారం రాత్రి అక్కడి నుంచి బయటపడ్డాం. అందరం కలిసి ఏకధాటిగా నాలుగు గంటలపాటు నడిచి తర్వాతి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాం''అని ముహమ్మద్ అష్రఫ్ అనే వ్యక్తి చెప్పారు. పారిపోబోయిన కొందర్ని చంపేశారని పోలీసు అధికారి చెప్పారు. ''రాత్రి పొద్దుపోయాక వేర్పాటువాదుల్లో కొందరు అక్కడి నుంచి నిష్క్రమించారు. అదే సమయంలో కొందరు ప్రయాణికులు తప్పించుకునేందుకు విఫలయత్నంచేశారు. బందీలు తప్పించుని పరుగెత్తడం చూసిన సాయుధాలు వాళ్లపై బుల్లెట్ల వర్షం కురిపించారు. దీంతో వాళ్లంతా పిట్టల్లా పడి బుల్లెట్లకు బలయ్యారు'' అని చెప్పారు.

కొందర్ని కిడ్నాప్ చేసి వెంట తీసుకెళ్లిన వేర్పాటువాదులు

440 మంది ప్రయాణికుల్లో 300 మందిని విజయవంతంగా విడిపించామని పాక్ సైన్యం చెబుతోంది. అయితే మిగతా 140 మంది పరిస్థితి ఏంటనేది ఎవరూ చెప్పలేకపోతున్నారు. డజన్ల మంది చనిపోయారని వార్తలొచ్చాయి. అయితే మిగతా వారిని వేర్పాటువాదులు బంధించి తమ వెంట తీసుకెళ్లారని రాయిటర్స్, ఏఎఫ్‌పీ వార్తాసంస్థలు కథనాలు వెలువర్చాయి. దీనిపై పాక్ సైన్యం స్పందించలేదు. మిగతా ప్రయాణికుల్లో కొందరు పారిపోయి కొండల్లో దాక్కున్నారని, ఘటనాస్థలి చుట్టుపక్కన విస్తృతస్థాయి గాలింపు తర్వాత మరణాలు, బందీలు, విడుదలైన వారి సంఖ్యలపై స్పష్టత వస్తుందని సైన్యం చెబుతోంది.


వేర్పాటువాదుల చెర నుంచి బయట పడిన రైలు ప్రయాణికులు

క్వెట్టాలో ఖాళీ శవపేటికలు

ఘటనలో చనిపోయి విగతజీవులుగా ఇంకా ఘటనాస్థలిలో అనాథలుగా పడిఉన్న వారి మృతదేహాలను తీసుకొచ్చేందుకు క్వెట్టా నుంచి రైలు బుధవారం బలూచిస్తాన్ వైపు బయల్దేరింది. డజన్ల కొద్దీ ఖాళీ శవపేటికలను రైలులోకి ఎక్కించారని అక్కడి వారు చెప్పారు. మరోవైపు ఉదయం ప్రార్థనల వేళ కొందరు ప్రయాణికులు చాకచక్యంగా తప్పించుకున్నారు. ''రంజాన్ మాసం కావడంతో బుధవారం ఉదయం పూట వేర్పాటువాదులు ప్రార్థనలకు సిద్ధమయ్యారు. ఫజర్ కోసం వేర్పాటువాదులు బిజీగా ఉండటంతో ఇదే అదునుగా భావించి పాకిస్తాన్ రెస్క్యూ బృందాలు దాడి చేశాయి. దీంతో పోలీసులను ఎదుర్కోవడంపైనే వేర్పాటువాదులు దృష్టి సారించారు. అదే సమయంలో కొందరు పారిపోయారు. ''తప్పించుకునే క్రమంలో మాలో కొందరికి బుల్లెట్ గాయాలయ్యాయి. అయినాసరే ఏమాత్రం భయపడక క్షతగాత్రులను భుజాలపై మోస్తూ పరుగెత్తాం. ఎట్టకేలకు కొండకు సుదూరంగా చేరుకోవడంతో వేర్పాటువాదుల తుపాకీ గురి నుంచి తప్పించుకోగలిగాం''అని అల్లాహ్‌దితా చెప్పారు.

సాక్షి ప్లస్
శుక్రవారం । 14-3-2025

దేశ విభజనకు దారి తీసిన చట్టం ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత కౌన్సిల్ చట్టాలు

1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత దేశంలో పరిపాలనా సంస్కరణలను ప్రవేశపెట్టడానికి, భారతీయుల సహకారాన్ని పొందడానికి బ్రిటిష్ ప్రభుత్వం అనేక చట్టాలను రూపొందించింది. వీటినే కౌన్సిల్ చట్టాలు లేదా శాసన చట్టాలు అంటారు.

కౌన్సిల్ చట్టం-1861


భారతదేశంలో శాసన నిర్మాణ ప్రక్రియలో మొదటిసారిగా భారతీయులకు ప్రాతినిధ్యం కల్పించారు.

- ఈ చట్టం ప్రకారం కొంతమంది భారతీయులను అనధికార సభ్యులుగా కౌన్సిల్‌లోకి వైస్రాయ్ నామినేట్ చేస్తారు. ఇలా నామినేట్ అయిన వారిలో బెనారస్ రాజు, పాటియాలా మహారాజు, శ్రీ దినకర్‌రావు ఉన్నారు.
- 1773 చట్టం ద్వారా రద్దయిన బాంబే,మద్రాస్ ప్రెసిడెన్సీల శాసనాధికారాలను పునరుద్ధరించారు. ఆ విధంగా ఈ చట్టాన్ని 'వికేంద్రీకరణ ప్రక్రియ'కు నాందిగా చెప్పొచ్చు. బెంగాల్, పంజాబ్, ఈశాన్య సరిహద్దు ప్రావిన్సులతో నూతన లెజిస్లేటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేశారు.
- కౌన్సిల్‌లో కార్యక్రమాలను సజావుగా నిర్వహించడానికి అవసరమైన సూత్రాలు, నియమాలను జారీ చేసే అధికారాన్ని వైస్రాయ్‌కి ఇచ్చారు. 1859లో లార్డ్ కానింగ్ ప్రవేశపెట్టిన పోర్ట్‌ఫోలియో (మంత్రిత్వ శాఖలుగా విధుల కేటాయింపు) పద్ధతిని గుర్తించి కొనసాగించారు. తద్వారా వైస్రాయ్ కౌన్సిల్ మరిన్ని శాఖలను నిర్వహించే అవకాశాన్ని ఈ చట్టం కల్పించింది. శాసన కౌన్సిళ్ల సమ్మతి లేకుండానే ఆర్డినెన్సులు జారీ చేసే అధికారాన్ని వైస్రాయ్‌కు కల్పించారు. 1860లో బడ్జెట్ పద్ధతి ప్రవేశపెట్టారు.

కౌన్సిల్ చట్టం-1892

కౌన్సిల్ చట్టం-1861లోని లోపాలను సరిదిద్దడానికి ఈ చట్టం చేశారు. ముఖ్యంగా 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడటం, విద్యావంతులైన భారతీయులు బ్రిటిష్ పాలనలోని లోపాలపై ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తుండటంతో ఈ చట్టాన్ని రూపొందించారు. కేంద్ర శాసనసభలో అనధికార సభ్యుల సంఖ్య 10కి తగ్గకుండా 16 కంటే మించకుండా.. రాష్ట్ర శాసనసభల్లో 8 మందికి తక్కువ కాకుండా 20 మందికి మించకుండా నియంత్రించారు. కేంద్రశాసన మండలికి ఎంపికైన భారతీయ ప్రముఖులు.. గోపాలకృష్ణ గోఖలే, ఫిరోజ్ షా మెహతా, సురేంద్రనాథ్ బెనర్జీ, రాస్ బిహారీ ఘోష్. ఈ చట్టం ద్వారా శాసన మండలి అధికారాలను విస్తృతం చేశారు. బడ్జెట్‌పై చర్చించడం లాంటి అధికారాలను కల్పించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, శాసనసభల్లో ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రశ్నలు వేయడానికి సభ్యులకు అవకాశం కల్పించారు. అయితే ఈ ప్రశ్నలు అడిగేందుకు గవర్నర్, గవర్నర్ జనరల్‌ల ముందస్తు అనుమతి పొందాలి. శాసనసభల్లో తమ స్థానం నామమాత్రమేనని గ్రహించిన భారతీయులు ఈ చట్టాన్ని వ్యతిరేకించారు.

'సైమన్ కమిషన్ మొదటిసారిగా సమాఖ్య పద్ధతిని సూచించింది'. సైమన్ కమిషన్ అనేది భారత సమస్యలపై ఒక సమగ్ర అధ్యయనమని కూప్లాండ్ అనే రచయిత పేర్కొన్నారు. బ్రిటన్‌లోని అధికార లేబర్ పార్టీ ఈ కమిషన్ సమర్పించిన నివేదికలోని అంశాలపై సరిగా దృష్టిపెట్టలేదు. కానీ, ఆ తర్వాత రూపొందించిన భారత ప్రభుత్వ చట్టం-1935లో సైమన్ కమిషన్ ప్రతిపాదించిన అంశాలను పొందుపరిచారు.



భారత కౌన్సిల్ చట్టం-1909 లేదా మార్లే-మింటో సంస్కరణలు

1892 చట్టంలోని లోపాలను సవరించాలని, దేశంలో తీవ్రవాద జాతీయవాదంతో ఏర్పడిన పరిస్థితిని ఎదుర్కొనాలనే ఉద్దేశంతో ఈ చట్టానికి రూపకల్పన చేశారు. భారత రాజ్య కార్యదర్శి లార్డ్ మార్లే, భారత వైస్రాయ్ మింటో పేర్లతో ఈ చట్టాన్ని సూచించారు. అందువల్ల దీన్ని మార్లే- మింటో సంస్కరణ చట్టం అంటారు. కాంగ్రెస్‌లోని మితవాదులను మచ్చిక చేసుకోవడానికి బ్రిటిష్‌వారు ఈ చట్టం ద్వారా ప్రయత్నించారని చెప్పవచ్చు.

ముఖ్యాంశాలు

- కేంద్ర, రాష్ట్ర శాసన మండళ్లలో సభ్యుల సంఖ్యను పెంచారు.
- శాసన ప్రక్రియ కోసం వైస్రాయ్ కార్యనిర్వాహక కౌన్సిల్‌లోని సభ్యుల సంఖ్యను 16 నుంచి 60కి పెంచారు. అదేవిధంగా మద్రాస్, బెంగాల్, యునైటెడ్ ప్రావిన్స్, బిహార్, ఒరిస్సా రాష్ట్రాల శాసన మండళ్లలో సభ్యుల సంఖ్యను 50కి, పంజాబ్, అస్సాం, బర్మాల్లో 30కి పెంచారు.
- గవర్నర్ జనరల్ ఆధీనంలోని శాసన మండలిలో 4 రకాల సభ్యులు ఉంటారు.
  1. నామినేటెడ్ అధికార సభ్యులు
  2. నామినేటెడ్ అనధికార సభ్యులు
  3. హోదా రీత్యా సభ్యులు
  4. ఎన్నికైన సభ్యులు

మెజారిటీ సభ్యులు అధికార సభ్యులు కావడం వల్ల బిల్లుల ఆమోదం ప్రభుత్వానికి సులభమయ్యేది. వైస్రాయ్, గవర్నర్ల కార్యనిర్వాహక మండలిలో తొలిసారిగా భారతీయులకు సభ్యత్వం కల్పించారు. ఇలా సభ్యత్వాన్ని పొందిన తొలి భారతీయుడు సత్యేంద్ర ప్రసాద్ సిన్హా. ముస్లింలు, వ్యాపార సంఘాల సభ్యులకు ప్రత్యేక ప్రాతినిధ్యాన్ని కల్పించారు. ముస్లిం జనాభాకు మించిన ప్రాధాన్యాన్ని ఈ చట్టం కల్పించింది. ముస్లిం సభ్యులను ముస్లింలే ఎన్నుకునే వీలు కల్పించింది. దీని కోసం ప్రత్యేక మతపరమైన నియోజక గణాలను ఏర్పాటు చేశారు. ఈ చట్టం మతతత్వానికి చట్టబద్ధత కల్పించింది. అందుకే లార్డ్ మింటోను 'మత నియోజక గణాల పితామహుడి'గా పేర్కొంటారు. ప్రెసిడెన్సీ కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, భూస్వాములు, వ్యాపార సంస్థలకు కూడా ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించారు. కేంద్ర, రాష్ట్ర శాసనమండళ్లలో సభ్యులు సైనిక, దౌత్య, మతపరమైన విషయాలు మినహా ఇతర ఏ అంశంపైనైనా ప్రశ్నలు, అనుబంధ ప్రశ్నలు అడగడానికి అధికారం లభించింది. కేంద్ర, రాష్ట్ర శాసనమండళ్లలో పోటీచేసే అభ్యర్థులకు ఈ చట్టం కచ్చితమైన అర్హతలను నిర్ణయించింది.

విమర్శ: ఈ చట్టంలోని అంశాలు 'అసలైన స్వరూపానికి బదులు కేవలం నీడ లాంటి ఆకారా'న్ని మాత్రమే అందించడం వల్ల 1909 చట్టాన్ని చంద్రకాంతితో పోల్చారు. ఈ చట్టం హిందూ, ముస్లింల మధ్య వేర్పాటు బీజాలు నాటి అడ్డుగోడలు సృష్టించిందని, దేశవిభజనకు దారి తీసిందని నెహ్రూ అభిప్రాయపడ్డారు.

భారత ప్రభుత్వ చట్టం-1919 లేదా మాంటెగు-ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు

భారతదేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం 1917 ఆగస్టు 20న ఒక ప్రకటన చేసింది. అందులో భాగంగా భారత రాజ్య కార్యదర్శి లార్డ్ మాంటెగు 1917 నవంబర్‌లో భారతదేశాన్ని సందర్శించాడు. వైస్రాయ్ ఛెమ్స్‌ఫర్డ్‌తోపాటు భారతీయ నాయకులతో ఆయన చర్చలు జరిపి ఈ సంస్కరణలను ప్రకటించాడు. అందువల్ల వీటిని మాంటెంగు-ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు అంటారు.

ముఖ్యాంశాలు

- భారత రాజ్య కార్యదర్శి జీతభత్యాలను భారత ఆదాయం నుంచి కాకుండా బ్రిటిష్ నిధి నుంచి చెల్లిస్తారు.
- రాష్ట్ర స్థాయిలో ద్వంద్వ పాలన ప్రవేశపెట్టారు. రాష్ట్రాల అధికారాలను రిజర్వ్‌డ్, ట్రాన్స్‌ఫర్డ్‌గా విభజించారు. రిజర్వ్‌డ్ విభాగంలో 28 పాలనా అంశాలను చేర్చారు. విత్తం, భూమి శిస్తు, న్యాయం, నీటి పారుదల, పరిశ్రమలు, మొదలైన వాటిని ఇందులో పేర్కొన్నారు.
- ఈ అంశాలకు సంబంధించిన పరిపాలనా వ్యవహారాలను బ్రిటిష్ కౌన్సిలర్ల సహాయంతో ఆయా రాష్ట్ర గవర్నర్లు నిర్వహిస్తారు. అయితే బ్రిటిష్ కౌన్సిలర్లు తమ విధి నిర్వహణలో రాష్ట్ర శాసనసభకు బాధ్యత వహించరు.
- ట్రాన్స్‌ఫర్డ్ విభాగంలో 22 అంశాలను పేర్కొన్నారు. స్థానిక పాలన, వ్యవసాయం, ప్రజా ఆరోగ్యం, విద్య, సహకారం, మొదలైన అంశాలు ఇందులో ఉన్నాయి.
- రాష్ట్ర గవర్నర్ ఈ అంశాల పాలనా వ్యవహారాలను భారతీయ మంత్రుల సహాయంతో నిర్వహిస్తారు. భారతీయ మంత్రులు ఆయా రాష్ట్ర శాసనసభల్లో సభ్యులై ఉంటారు. తమ విధుల నిర్వహణలో శాసనసభకు బాధ్యత వహిస్తారు.
- దేశంలో మొదటిసారి కేంద్ర స్థాయిలో ద్విసభా పద్ధతిని ప్రవేశపెట్టారు. ఎగువసభను రాష్ట్రాల మండలి(కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్), దిగువసభను కేంద్ర శాసనసభ(సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ)గా వ్యవహరిస్తారు.
- ఎగువసభ అయిన కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్‌లో 60 మంది సభ్యులు ఉంటారు. ఇందులో 34 మంది ఎన్నికైనవారు, 26 మందిని గవర్నర్ జనరల్ నియమిస్తారు. వీరి పదవీకాలం అయిదేళ్లు. అధ్యక్షుడిని వైస్రాయ్ నియమిస్తారు. దిగువసభ అయిన సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో 145 మంది సభ్యులుంటారు. ఇందులో 104 మంది ఎన్నికైనవారు, 41 మంది నియమితులైనవారు ఉంటారు. ఈ సభ పదవీకాలం మూడేళ్లు.
- మత ప్రాతినిధ్యాన్ని సిక్కులు, క్రిస్టియన్లు, ఆంగ్లో-ఇండియన్లు, ఐరోపా వారికి కూడా వర్తింపజేశారు. ఆస్తి పన్ను చెల్లింపు ప్రాతిపదికపై పరిమిత ఓటు హక్కును కల్పించారు. లండన్‌లో భారత వ్యవహారాలను, ముఖ్యంగా రెవెన్యూ, పరిపాలన మొదలైన అంశాలను పర్యవేక్షించడానికి భారత హై కమిషనర్ పదవిని సృష్టించారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లను వేరు చేశారు.
- లీ కమిషన్(1923-24) సూచన మేరకు భారత దేశానికి విడిగా ఒక ఆడిటర్ జనరల్‌ను, 1926లో ఒక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు.
- కేంద్ర, రాష్ట్రాల మధ్య, వివిధ రాష్ట్రాల మధ్య ఉత్పన్నమయ్యే వివాదాలను పరిష్కరించే అధికారం వైస్రాయ్‌కి ఇచ్చారు. ఈ చట్టం అమలు తీరును సమీక్షించడానికి పదేళ్ల తర్వాత చట్టబద్ధత ఉన్న కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

విమర్శ:

ఈ చట్టం ప్రతిపాదించిన అంశాలపై అనేక విమర్శలు వచ్చాయి.

- 1919 సంస్కరణలు అసంతృప్తి, నిరాశతోపాటు 'సూర్యుడు లేని ఉదయం'లా ఉన్నాయని బాలగంగాధర్ తిలక్ అభిప్రాయపడ్డారు.
- ఈ సంస్కరణలను బ్రిటిష్‌వారు ప్రకటించి ఉండాల్సింది కాదని, ఈ చట్టాన్ని భారతీయులు స్వీకరించడం తగదని అనిబిసెంట్ వ్యాఖ్యానించారు.
- భారతదేశంలో ద్వంద్వ పాలన దాదాపు దూషణ పదంగా మారింది. ఒక వ్యక్తి, ఇంకొక వ్యక్తిని నీవు 'డైయార్కి'వి అని అరవడం విన్నానని సర్ బట్లర్ అనే రచయిత తెలిపాడు.
- ద్వంద్వ పాలనను ఎప్పటికీ ఆదర్శంగా భావించలేం. మరో ఉత్తమ ప్రయోజన స్థితికి ఇది ఓ మెట్టు మాత్రమే. ఆ ఉత్తమ ప్రయోజనమే 'పరిపూర్ణ స్వపరిపాలిత భారతదేశం' అని పలాండే అనే రచయిత పేర్కొన్నారు.

ఈ సంస్కరణలు స్వపరిపాలన దిశగా చెప్పుకోదగ్గ ముందంజ కాబట్టి భారత రాజ్యాంగ చరిత్రలో ముఖ్య పరిణామంగా పరిగణిస్తారు. ప్రేరణను, భవితవ్యం కోసం అనుభవం సంపాదించడానికి ఈ చట్టం తగిన అవకాశం ఇచ్చిందని కూడా చెప్పవచ్చు.

సైమన్ కమిషన్ - నవంబర్ 1927

భారత ప్రభుత్వ చట్టం 1919 ద్వారా ప్రవేశపెట్టిన రాజ్యాంగ సంస్కరణలను సమీక్షించడానికి నిర్ణీత సమయం కంటే రెండేళ్ల ముందే బ్రిటన్ ప్రధాని స్టాన్లీ బాల్డ్‌విన్ 1927 నవంబర్‌లో సర్ జాన్ సైమన్ నాయకత్వంలో ఆరుగురు సభ్యులతో ఒక రాయల్ కమిషన్‌ను నియమించారు. ఇందులోని సభ్యుడైన క్లిమెంట్ అట్లీ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చే సమయానికి ఇంగ్లండ్ ప్రధానిగా ఉన్నారు. ఈ కమిషన్‌లో సభ్యులందరూ ఆంగ్లేయులు కావడం వల్ల భారతీయులు దీన్ని పూర్తిగా వ్యతిరేకించారు. ఈ కమిషన్ భారతదేశంలో రెండు సార్లు పర్యటించింది. 1928 ఫిబ్రవరి 3 నుంచి మార్చి 31 వరకు తొలిసారి, 1928 అక్టోబర్ 11 నుంచి 1929 ఏప్రిల్ 6 వరకు రెండోసారి పర్యటించింది. ఈ కమిషన్ 1930లో నివేదికను సమర్పించింది.

ముఖ్యాంశాలు

- రాష్ట్రాల్లో ప్రవేశపెట్టిన ద్వంద్వ పాలనను రద్దు చేయడం, మంత్రులు శాసనసభకు బాధ్యత వహించేలా చేయడం.
- ప్రభుత్వ నిర్వహణలో భారతీయులకు పూర్తి స్వయంప్రతిపత్తి కల్పించడం.
- రాష్ట్ర శాసన మండళ్లలో సభ్యత్వ సంఖ్యను పెంచడం. ఏక కేంద్ర వ్యవస్థ భారతదేశానికి సరిపడదు కాబట్టి సమాఖ్య వ్యవస్థను అభివృద్ధి చేసుకోవడం.
- హైకోర్టుపై కేంద్ర ప్రభుత్వానికి పాలనాపరమైన నియంత్రణ ఏర్పాటు.
- సార్వజనీన వయోజన ఓటు హక్కు వెంటనే సాధ్యం కాదు కాబట్టి దీన్ని కాలానుగుణంగా విస్తృతం చేయడం.

మాదిరి ప్రశ్నలు

1. రెగ్యులేటింగ్ చట్టం 1773కి సంబంధించి సరైంది?
   1) మొదటి లిఖిత రాజ్యాంగగా పరిగణిస్తారు
   2) కంపెనీ పాలనపై పార్లమెంట్ తొలి నియంత్రణ
   3) ఏదీకాదు 4) 1, 2
2. కింది వాటిలో భారత కౌన్సిల్ చట్టాలేవి?
   1) 1909 2) 1861
   3) 1813, 1892 4) పైవన్నీ

సమాధానాలు: 1) 4; 2) 4.

పేదలకు లబ్ధి చేకూర్చేందుకే భూసంస్కరణలు

జాతీయ స్థాయిలో భూసంస్కరణలు

భూ సంస్కరణలలోని వివిధ అంశాలను పరిశీలించడానికి 1972లో తొమ్మిది మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సూచనలకు అనుగుణంగా.. 1972లో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో మొదటిసారిగా భూ సంస్కరణలను జాతీయ అంశంగా గుర్తించి, జాతీయస్థాయిలో కొన్ని మార్గదర్శకాలను రూపొందించారు.

జాతీయ మార్గదర్శక సూత్రాలు

- సంవత్సరానికి రెండు పంటలు పండే భూమి గరిష్ఠ పరిమితి 10 నుంచి 18 ఎకరాలు.
- సంవత్సరానికి ఒక పంట పండే భూమి (నీటి పారుదల సౌకర్యాలున్న భూమి) గరిష్ఠంగా 27 ఎకరాలకు మించకూడదు.
- మిగతా రకాల భూముల గరిష్ఠ పరిమితి, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప (ఎడారి ప్రాంతాలు మొదలైనవి) 54 ఎకరాలకు మించరాదు.
- కమతం పరిమాణాన్ని నిర్ణయించేటప్పుడు ఐదుగురు సభ్యులున్న కుటుంబాన్ని లెక్కలోకి తీసుకోవాలి. కుటుంబం అంటే భార్యా భర్త, ముగ్గురు మైనర్ పిల్లలుగా గుర్తించాలి. అంతకంటే ఎక్కువ మంది సభ్యులుంటే కొంత భూమిని అదనంగా పొందవచ్చు. కానీ ఆ మొత్తం కుటుంబ కమతానికి రెండు రెట్ల కంటే ఎక్కువ ఉండ కూడదు.
- భార్యాభర్త పేర్ల మీద వేర్వేరుగా భూములున్నప్పటికీ వారిద్దరి భూములను కలిపి గరిష్ఠ పరిమితిని నిర్ణయించాలి.
- మేజర్ అయిన కుమారుడిని ప్రత్యేక కుటుంబంగా గుర్తించాలి.
- నూతన సవరణలతో భూ సంస్కరణల చట్టాలను 1972 డిసెంబర్ 31లోగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాలి.
- ఈ నూతన సవరణలతో చట్టాలను ఎప్పుడు రూపొందించినా అమలు మాత్రం 1971 జనవరి 24 నుంచే జరగాలి.

మినహాయింపులు

- కాఫీ, తేయాకు, రబ్బరు, కోకో మొదలైన తోట పంటలను పండించే భూములకు గరిష్ఠ పరిమితి నుంచి మినహాయింపు ఇవ్వాలి.
- భూదాన ఉద్యమ భూములు, సహకార బ్యాంకులు, జాతీయ బ్యాంకులు, కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థల భూములకు గరిష్ఠ పరిమితి వర్తించదు.
- వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, పరిశోధనా కేంద్రాల భూములకు మినహాయింపు ఉండాలి.
- రాష్ట్ర ప్రభుత్వాల అభీష్టం మేరకు మతపరమైన సంస్థలు, చారిటబుల్ ట్రస్టులు, విద్యాలయాల భూములకు మినహాయింపు ఇవ్వవచ్చు.
- చెరకు పండించే కమతాలకు మినహాయింపులు ఉండరాదు. పరిశోధన కోసం ఉపయోగపడే భూములు, పంచదార ఫ్యాక్టరీ పరిధిలో ఉండే భూముల విషయంలో మినహాయింపు వంద ఎకరాలకు మించకూడదు.

మిగులు భూమి పంపకం - ప్రాధాన్యం

- మిగులు భూమిని పొందే పేద వర్గాల కొనుగోలు శక్తిని దృష్టిలో ఉంచుకొని నష్టపరిహారాన్ని మార్కెట్ విలువ కంటే తక్కువగా నిర్ణయించాలి.
- మిగులు భూమి పంపిణీలో భూమిలేని వ్యవసాయ కార్మికులు ముఖ్యంగా హరిజన, గిరిజనులకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- భూ సంస్కరణలను అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. దీని కోసం అధికారులతో వివిధ స్థాయుల్లో కమిటీలను ఏర్పాటు చేయాలి. పటిష్ఠమైన పాలనా వ్యవస్థను ఏర్పర్చుకోవాలి.

మొదటి దశ భూ సంస్కరణలు (1947-1970)

భూ సంస్కరణల అమలును ముఖ్యంగా మూడు అంశాలుగా పేర్కొనవచ్చు. అవి...

- మధ్యవర్తుల తొలగింపు చట్టాలు
- కౌలు సంస్కరణలు
- కమతాల గరిష్ఠ పరిమితి

మధ్యవర్తుల తొలగింపు చట్టాలు

- భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో అఖిల భారత కాంగ్రెస్ వ్యవసాయ సంస్కరణల కమిటీ (కుమారప్ప కమిటీ) లేదా ప్రణాళిక సంఘం సూచనల మేరకు భూ సంస్కరణలు అమలు చేశారు. కానీ తెలంగాణ ప్రాంతంలో పోలీసు చర్య తర్వాత(కుమారప్ప కమిటీ సూచనలకు ముందే) జాగీర్దార్ల రద్దు, కౌలు సంస్కరణల చట్టాలను అమలు చేశారు.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఎకానమీ

తెలంగాణ ప్రాంతంలో జాగీర్దార్ల రద్దు

- తెలంగాణ(హైదరాబాద్ రాష్ట్రం)లో జాగీర్ల రద్దు చట్టాన్ని 1949 ఆగస్టు 15న ప్రకటించారు. ఈ చట్టం ద్వారా రూ.18 కోట్లను నష్ట పరిహారంగా చెల్లించి జాగీర్దార్లను, సంస్థానాధీశులను తొలగించారు.

తెలంగాణ ప్రాంతంలో ఇనాందార్ల రద్దు

- 1955లో తెలంగాణ ప్రాంతంలో ఇనాంల రద్దు చట్టం చేశారు. కానీ ఈ చట్టంలో దేవాదాయ, ధర్మాదాయ భూములకు మినహాయింపులు ఇచ్చారు.
- 1967 నుంచి ఈ చట్టాన్ని అన్ని రకాల ఇనాంలకు వర్తింపజేశారు.
- సరైన నష్ట పరిహారం ప్రకటించలేదనే కారణంతో 1970 ఏప్రిల్ 3న హైకోర్టు ఈ చట్టాన్ని కొట్టివేసింది.
- 1973 నవంబర్ 1న ప్రభుత్వం ఈ చట్టాన్ని పునరుద్ధరించి ఇనాం భూములను సేద్యం చేస్తున్న రైతులకు పట్టాలు ఇచ్చింది.

కౌలు సంస్కరణలు

షక్మీదార్లు (శాశ్వత కౌలుదార్లు)

- హైదరాబాద్ ప్రాంతంలో 12 ఏళ్లుగా సాగు చేసే వారిని షక్మీదార్లుగా గుర్తించేవారు. వీరు శాశ్వత కౌలుదార్లు.
- రక్షణ, భూమిని సాగు చేసే హక్కు ఉన్న కౌలుదార్లను షక్మీదార్లు అనేవారు.

అసామి షక్మీదార్లు

- వీరికి భూమిపై అధికారం ఉండదు.
- వీరు ఏ హక్కులు లేని కౌలుదార్లు.
- కౌలుభూమి 12 ఏళ్లపాటు అసామి షక్మీదార్ల స్వాధీనంలో ఉంటే వారు షక్మీదార్లుగా గుర్తింపు పొందుతారు.
- భరూచా కమిటీ సిఫారసుల మేరకు హైదరాబాద్ సంస్థానంలో 1944లో 'అసామి షక్మీ చట్టం' చేశారు.
- ఈ చట్టం ప్రకారం ఆరు సంవత్సరాలు భూమిని కౌలుకు చేసే వారు అసామి షక్మీదార్లు(రక్షిత కౌలుదార్లు) అవుతారు. వీరిని తొలగించే వీలుండదు. భూస్వాముల ఒత్తిడి కారణంగా ఈ చట్టం అమల్లోకి రాలేదు.
- అసామి షక్మీ చట్టం ద్వారా చట్ట వ్యతిరేక లెవీ పద్ధతిని, సెస్‌లను, పన్నులను, వెట్టిచాకిరీని నిషేధించారు. కానీ ఈ చట్టం వల్ల తీవ్ర దుష్ఫలితాలు తలెత్తాయి.
- హైదరాబాద్ లేదా తెలంగాణ ప్రాంతంలో 3 రకాల కౌలు చెల్లింపు పద్ధతులు ఉండేవి.

అవి.

బెతాయి: కౌలుగా ధాన్యం చెల్లిస్తారు. ఇది పంటలో 20 శాతం నుంచి 40 శాతం ఉండేది.

నగదు రూపకౌలు: నగదు రూపంలో చెల్లించే కౌలు. ఇది ద్రవ్యరూప కౌలు, స్థిరమైన కౌలు.

గల్లామక్తా: ఉత్పత్తితో సంబంధం లేకుండా ఒక ఎకరానికి కనీస మొత్తంగా ధాన్యరూపంలో చెల్లించే కౌలు(స్థిరమైంది). కొన్ని సందర్భాల్లో 2/3వ వంతు ఉండేది.

ఈ మూడు పద్ధతుల్లోనూ కౌలు పరిమాణం అధికంగా ఉండేది.

- ఈ కౌలు రేట్లు నికర ఉత్పత్తిలో 2/3వ వంతు కంటే ఎక్కువగా ఉండేవని, నగదు రూపంలో చెల్లించే కౌలు భూమి అసెస్‌మెంట్ కంటే 5 నుంచి 12 రెట్లు వరకు ఉండేదని భరూచా కమిటీ నివేదిక తెలిపింది. ఇవే కాకుండా భూమిని కౌలుకు తీసుకునే ముందు, రెన్యూవల్ కోసం నజరానాలు కూడా చెల్లించాల్సి ఉండేది.

హైదరాబాద్ (తెలంగాణ) కౌలు వ్యవసాయ భూముల చట్టం 1950

- 1944 నాటి 'హైదరాబాద్ వ్యవసాయ సంస్కరణల కమిటీ' సూచనల మేరకు 1950 జూన్ 10న ఈ చట్టాన్ని ప్రకటించారు.

ముఖ్యాంశాలు

1. ఆరేళ్ల కౌలుదార్లుగా ఉన్నవారిని రక్షిత కౌలుదార్లుగా పేర్కొంటారు.
2. కౌలు ఒప్పందం మౌఖిక రూపంలో కాకుండా ఎంఆర్‌వో సమక్షంలో రాత పూర్వకంగా ఉండాలి.
3. కౌలు పరిమాణం భూస్వామి ప్రభుత్వానికి చెల్లించే శిస్తు కంటే 3-5 రెట్లు మాత్రమే ఉండాలి. అంత కంటే ఎక్కువ ఉండొద్దు.

- ఈ చట్టంలోని లోపాలను సవరించి హైదరాబాద్ ప్రివెన్షన్ ఆఫ్ ఎవిక్షన్ ఆర్డినెన్స్ -1952ను జారీ చేశారు.
- భూస్వాములు భారీ సంఖ్యలో కౌలుదార్లను తొలగించారు. దీంతో కౌలుదార్లను తొలగించవద్దని, వారికి భూములను వెనక్కి ఇప్పించాలని, కౌలుదార్ల అనుమతి లేకుండా అమ్మిన భూములకు గుర్తింపు లభించదని ఈ ఆర్డినెన్స్‌లో పేర్కొన్నారు.
- 1955లో ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఈ ఆర్డినెన్స్‌ను అమలు చేశారు. తెలంగాణ అంతటా దీన్ని వర్తింపజేయగా భూస్వాములు కోర్టుకు వెళ్లారు.
- ఈ చట్టం ప్రకారం భూస్వాములు తొలగించిన కౌలుదార్లందరికీ మళ్లీ భూమిని అప్పగించడంతో పాటు కౌలు పరిమాణాన్ని కూడా ప్రభుత్వమే నిర్ణయించింది.
- మాగాణి భూమికి - 1/3వ వంతు
- మెట్ట భూమికి - 1/4వ వంతు.

కమతాల గరిష్ఠ పరిమితి

- కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు వార్షికంగా రూ. 3,600 నికర ఆదాయం సంపాదించే కమతం ఆధారంగా కమతాల గరిష్ఠ పరిమితి చట్టాన్ని 1961లో చేశారు.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూముల గరిష్ఠ పరిమితి చట్టం - I

- ఈ చట్టం 1961 జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చింది.
- ఈ చట్టంలో మాగాణి భూమిని ఐదు రకాలుగా, మెట్ట భూమిని మూడు రకాలుగా వర్గీకరించారు.

భూమి రకాలు	రెండు పంటలు పండే భూమి	ఒక పంట పండే భూమి
మాగాణి ఐదు రకాలు		
క్లాస్ - ఎ	6	27
క్లాస్ - బి	8	36
క్లాస్ - సి	10	45
క్లాస్ - డి	12	54
క్లాస్ - ఇ	24	108
మెట్ట మూడు రకాలు		
క్లాస్-ఎఫ్	36	162
క్లాస్ - జి	48	216
క్లాస్-హెచ్	72	324

- ఈ చట్టం ప్రకారం ప్రతి కుటుంబంలోని ప్రతి సభ్యుడిని యూనిట్‌గా తీసుకొని, ప్రతి యూనిట్‌కు కుటుంబ కమతానికి 4 1/2 రెట్ల భూమిని గరిష్ఠ పరిమితిగా నిర్ణయించారు.
- ఈ చట్టం ప్రకారం ఒక కుటుంబానికి ఆరు ఎకరాల నుంచి 324 ఎకరాల మధ్య భూమి ఉండవచ్చు.
- దేశంలోని రాష్ట్రాలన్నీ గరిష్ఠ పరిమితి విషయంలో సీఎల్‌ఆర్‌ను పాటించాయి. అయితే సీలింగ్‌లో రాజస్థాన్‌లో ఎక్కువ గరిష్ఠ పరిమితి ఉండగా, పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో తక్కువ పరిమితి ఉంది.
- ఈ చట్టం ద్వారా 2,384 ఎకరాల మిగులు భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకుగానూ నష్టపరిహారం చెల్లించారు.
- ఈ చట్టంలో గరిష్ఠ పరిమితి ఎక్కువగా ఉండటం వల్ల ఆశించిన రీతిలో మిగులు భూమి లభించలేదు.
- అందువల్ల కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు 1961 చట్టం స్థానంలో 'భూ గరిష్ఠ పరిమితి చట్టం - 1973'ను ప్రవేశపెట్టారు.

షక్మీదార్లు (శాశ్వత కౌలుదార్లు)

- హైదరాబాద్ ప్రాంతంలో 12 ఏళ్లు సాగు చేసే వారిని షక్మీదార్లుగా గుర్తించేవారు. వీరు శాశ్వత కౌలుదార్లు.
- రక్షణ, భూమిని సాగు చేసే హక్కు ఉన్న కౌలుదార్లను షక్మీదార్లు అనేవారు.

అసామి షక్మీదార్లు

- వీరికి భూమిపై అధికారం ఉండదు.
- వీరు ఏ హక్కులు లేని కౌలుదార్లు.
- కౌలుభూమి 12 ఏళ్లపాటు అసామి షక్మీదార్ల స్వాధీనంలో ఉంటే వారు షక్మీదార్లుగా గుర్తింపు పొందుతారు.

కాకతీయుల చివరి రాజు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

మాదిరి ప్రశ్నలు

1. శ్రీముఖ శాతవాహనుడి కాలంనాటి నాణేలు ఎక్కడ లభించాయి?
   ఎ) వరంగల్ బి) ఉట్నూరు
   సి) కరీంనగర్ డి) చెన్నూరు
2. 'వాత్స్యాయనుడు' ఏ పాలకుల ఆస్థానంలో ఉండేవారు?
   ఎ) కాకతీయులు బి) విజయనగర రాజులు
   సి) తూర్పు చాళుక్యులు
   డి) శాతవాహనులు
3. శాతవాహన వంశ స్థాపకుడెవరు?
   ఎ) గౌతమీపుత్ర శాతకర్ణి బి) శ్రీముఖుడు
   సి) యజ్ఞశ్రీ శాతకర్ణి డి) హాలుడు
4. కాకతీయులు మొదటగా ఏ రాజులకు సేనానులుగా పనిచేశారు?
   ఎ) తూర్పు చాళుక్యులు
   బి) కళ్యాణి చాళుక్యులు
   సి) రాష్ట్రకూటులు డి) పాండ్యులు
5. మొదటిసారిగా ఏ శాసనంలో కాకతీయుల ప్రస్తావన కనిపించింది?
   ఎ) హాతిగుంఫా శాసనం
   బి) మాగల్లు శాసనం
   సి) బయ్యారం చెరువు శాసనం
   డి) పాకాల శాసనం
6. కాకతీయులు మొదట ఏ ప్రాంతాన్ని పాలించారు?
   ఎ) కొరివి బి) ఓరుగల్లు
   సి) ముదిగొండ డి) హన్మకొండ
7. తూర్పు చాళుక్య రాజైన దానర్ణవుడికి సహాయం చేసిన కాకతీయ సేనాని?
   ఎ) బేతరాజు బి) ప్రోలరాజు
   సి) కాకర్త్యగుండన డి) రుద్రదేవుడు
8. పల్నాటి యుద్ధంలో జోక్యం చేసుకున్న కాకతీయ పాలకుడెవరు?
   ఎ) రుద్రదేవుడు బి) గణపతిదేవుడు
   సి) మహాదేవుడు డి) ప్రతాపరుద్రుడు
9. 'చలమర్తి గండ' అనే బిరుదు ఎవరిది?
   ఎ) కాకర్త్యగుండన బి) దుర్గరాజు
   సి) మొదటి బేతరాజు
   డి) మొదటి ప్రోలరాజు
10. కాకతీయుల మొదటి రాజధాని ఏది?
    ఎ) హన్మకొండ బి) ఓరుగల్లు
    సి) కొరివి డి) కోటిలింగాల
11. ఓరుగల్లు పట్టణ నిర్మాత?
    ఎ) గణపతి దేవుడు బి) రుద్రదేవుడు
    సి) కాకర్త్యగుండన డి) మహాదేవుడు
12. కాకతీయుల పాలనా కాలం?
    ఎ) క్రీ.శ. 950 నుంచి 1300 వరకు
    బి) క్రీ.శ. 1000 నుంచి 1368 వరకు
    సి) క్రీ.శ. 1000 నుంచి 1323 వరకు
    డి) క్రీ.శ. 950 నుంచి 1342 వరకు
13. 'ఆంధ్రదేశాధీశ్వర' బిరుదు పొందిన పాలకులెవరు?
    ఎ) కాకతీయులు బి) శాతవాహనులు
    సి) ఇక్ష్వాకులు డి) విజయనగర రాజులు
14. రామప్ప ఏ జిల్లాలో ఉంది?
    ఎ) నల్గొండ బి) ఖమ్మం
    సి) వరంగల్ డి) కరీంనగర్
15. ఎవరి పాలనా కాలంలో 'మార్కోపోలో' మోటుపల్లి రేవును సందర్శించాడు?
    ఎ) ప్రతాపరుద్రుడు బి) రుద్రమదేవి
    సి) గణపతి దేవుడు డి) మహాదేవుడు
16. కాకతీయుల కాలంలో ఏ మతం ఆధిపత్యంలో ఉండేది?
    ఎ) శైవం బి) వైష్ణవం
    సి) బౌద్ధం డి) జైనం
17. హనుమకొండ ప్రాంతంపై పూర్తి వంశపారంపర్య హక్కులను మొదటి ప్రోలరాజు ఎవరి ద్వారా పొందాడు?
    ఎ) చాళుక్య దానర్ణవుడు
    బి) కాలచూరి బిజ్జలుడు
    సి) చాళుక్య రెండో తైలపుడు
    డి) చాళుక్య మొదటి సోమేశ్వరుడు
18. 'బయ్యారం చెరువు శాసనాన్ని' వేయించిన వారు?
    ఎ) రుద్రమదేవి బి) మైలమదేవి
    సి) గణపాంబ డి) అనితల్లి
19. కిందివారిలో కాకతీయ రాజ్య పునఃస్థాపనకు సహాయపడినవారెవరు?
    ఎ) రుద్రమదేవి బి) మైలాంబ
    సి) కామసాని డి) అనితల్లి
20. కాకతీయ వంశ మూలపురుషుడు?
    ఎ) వెన్ననృపుడు బి) కాకర్త్యగుండన
    సి) మొదటి బేతరాజు డి) కాకతీరాజు
21. ఏకవీర దేవి ఆలయం ఎక్కడ ఉంది?
    ఎ) ఘణపురం బి) కొలనుపాక
    సి) మొగిలిచర్ల డి) ఇనుగుర్తి
22. కిందివాటిలో సరికాని జత ఏది?
    ఎ) వల్లభా చార్యుడు - నీతిసార యోగం
    బి) రుద్రదేవుడు - నీతిసారం
    సి) విద్యానాథుడు - ప్రతాపరుద్ర యశోభూషణం
    డి) జాయపసేనాని - నృత్త రత్నావళి
23. మొదటగా చెరువులను తవ్వించిన కాకతీయ రాజు?
    ఎ) మొదటి బేతరాజు
    బి) మొదటి ప్రోలరాజు
    సి) రుద్రదేవుడు డి) రుద్రమదేవి
24. వేయి స్తంభాల గుడి నిర్మాత ఎవరు?
    ఎ) గణపతి దేవుడు బి) ప్రతాపరుద్రుడు
    సి) రుద్రదేవుడు డి) మహాదేవుడు



25. దేవాలయాలను నిర్మించిన మొదటి కాకతీయ పాలకుడెవరు?
    ఎ) రుద్రదేవుడు బి) మహాదేవుడు
    సి) మొదటి ప్రోలరాజు
    డి) మొదటి బేతరాజు
26. స్వతంత్రంగా కాకతీయ రాజ్య పాలనను ప్రారంభించినవారెవరు?
    ఎ) కాకర్త్యగుండన బి) వెన్ననృపుడు
    సి) మొదటి ప్రోలరాజు
    డి) రెండో ప్రోలరాజు
27. హనుమకొండలో కాకతీయ వంశ పాలనను ప్రారంభించినవారు?
    ఎ) మొదటి ప్రోలరాజు
    బి) మొదటి బేతరాజు
    సి) రుద్రదేవుడు డి) కాకర్త్యగుండన
28. కరీంనగర్ ప్రాంతాన్ని కాకతీయుల కాలంలో ఏ పేరుతో పిలిచేవారు?
    ఎ) ముల్కినాడు బి) సబ్బినాడు
    సి) రేనాడు డి) పాకనాడు
29. కాకతీయుల కాలంలో గ్రామపాలనను పర్యవేక్షించేవారిని ఏమని పిలిచేవారు?
    ఎ) ఆయగారు బి) ఇనామ్‌దార్
    సి) గ్రామణీ డి) గోమేయక
30. కాకతీయుల శిల్పకళకు సంబంధించి ప్రత్యేకమైన నిర్మాణాలేవి?
    ఎ) కోటగుళ్లు బి) తోరణ స్తంభాలు
    సి) త్రికూటాలయాలు
    డి) ఆలయాల ప్రాకారాలు
31. పాకాల సరస్సును తవ్వించిన వారెవరు?
    ఎ) బయ్యన నాయకుడు
    బి) రేచర్ల రుద్రుడు
    సి) మల్యాల గొండప్ప
    డి) జగదల ముమ్మడి నాయకుడు
32. 'భట్టారకులు' అంటే ఎవరు?
    ఎ) సైనికులు బి) వ్యాపారులు
    సి) ప్రభుత్వ ఉద్యోగులు
    డి) రాయబారులు
33. తెలుగు ప్రాంత విమోచన ఉద్యమ నాయకుడెవరు?
    ఎ) ముసునూరి ప్రోలయ నాయకుడు
    బి) ముసునూరి కాపయ నాయకుడు
    సి) అద్దంకి వేమారెడ్డి
    డి) రాచకొండ పద్మనాయకుడు
34. కాకతీయుల చివరి రాజు?
    ఎ) రుద్రదేవుడు బి) రుద్రమదేవి
    సి) ప్రతాపరుద్రుడు డి) గణపతిదేవుడు
35. 'ఆంధ్ర సుల్తాన్‌లు'గా పేరు పొందిన పాలకులు ఎవరు?
    ఎ) బహమనీ సుల్తాన్‌లు
    బి) నిజాం షాహీలు
    సి) అసఫ్ జాహీలు
    డి) కుతుబ్ షాహీలు
36. హుస్సేన్‌సాగర్ (హైదరాబాద్) చెరువును తవ్వించినవారు?
    ఎ) నిజాం అలీఖాన్ బి) సాలార్‌జంగ్
    సి) ఇబ్రహీం కుతుబ్ షా
    డి) అబుల్ హసన్ తానీషా
37. హైదరాబాద్ నగర నిర్మాత ఎవరు?
    ఎ) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
    బి) అసఫ్ జా మీర్ ఉస్మాన్ ఖాన్
    సి) ఇబ్రహీం కుతుబ్‌షా
    డి) సుల్తాన్ కులీ కుతుబ్‌షా
38. చార్మినార్‌ను నిర్మించినవారు?
    ఎ) అబుల్ హసన్ తానీషా
    బి) సుల్తాన్ కులీ కుతుబ్‌షా
    సి) ఇబ్రహీం కుతుబ్ షా
    డి) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
39. హైదరాబాద్‌లోని పురాతనమైన కట్టడాలు ఎక్కువగా ఏ రకమైన సంస్కృతికి సంబంధించినవి?
    ఎ) ఇండో - ఆర్యన్ బి) ఇండో-గ్రీకు
    సి) ఇండో - యూరోపియన్
    డి) ఇండో - పర్షియన్
40. తెలంగాణలో అసఫ్ జాహీల పాలన ఏ సంవత్సరంలో ప్రారంభమైంది?
    ఎ) 1723 బి) 1724
    సి) 1725 డి) 1726
41. 'మహత్‌సిబ్' అనే అధికారి ప్రధాన విధి?
    ఎ) రాజు ముఖ్య సలహాదారుడు
    బి) గూఢచర్యం సి) ముఖ్య లేఖకుడు
    డి) నైతిక విలువల ప్రచారం
42. దాశరథీ శతకాన్ని ఎవరు రచించారు?
    ఎ) అద్దంకి గంగాధర కవి
    బి) కందుకూరి రుద్రకవి
    సి) పొన్నెగంటి తెలగనార్యుడు
    డి) కంచెర్ల గోపన్న
43. గోల్కొండపై మొట్టమొదటి కోటను నిర్మించినవారు?
    ఎ) కాకతీయులు బి) కుతుబ్ షాహీలు
    సి) నిజాం షాహీలు డి) అసఫ్ జాహీలు
44. తెలుగు కవులు 'మల్కిభరాముడు'గా ఎవరిని కీర్తించారు?
    ఎ) భక్త రామదాసు
    బి) అబుల్ హసన్ తానీషా
    సి) ఇబ్రహీం కుతుబ్ షా
    డి) సుల్తాన్ కులీ కుతుబ్ షా
45. గోల్కొండ రాజ్యాన్ని సందర్శించిన ఫ్రెంచి యాత్రికుడు?
    ఎ) నికోలో కాంటె బి) న్యూనిజ్
    సి) టావెర్నియర్ డి) మార్కోపోలో
46. కాకతీయుల కాలంలో గోల్కొండను ఏమని పిలిచేవారు?
    ఎ) మంగళపురం బి) రుద్రారం
    సి) చాపల బండ డి) గోవుల కొండ
47. కోహినూర్ వజ్రం ఎక్కడ లభించింది?
    ఎ) వజ్రకూరు బి) నేలకొండపల్లి
    సి) కొల్లూరు డి) చెన్నారం
48. గోల్కొండ నుంచి రాజధానిని హైదరాబాద్‌కు మార్చిన కుతుబ్ షా పాలకుడు?
    ఎ) ఇబ్రహీం బి) మహమ్మద్ కులీ
    సి) సుల్తాన్ కులీ
    డి) అబుల్ హసన్ తానీషా
49. అసఫ్ జాహీల మొదటి రాజధాని ఏది?
    ఎ) హైదరాబాద్ బి) ఔరంగాబాద్
    సి) రాయచూర్ డి) పర్బనీ
50. ఔరంగాబాద్ నుంచి తన రాజధానిని హైదరాబాద్‌కు మార్చిన అసఫ్ జాహీ రాజు?
    ఎ) నాసర్‌జంగ్ బి) నిజాం అలీఖాన్
    సి) మీర్ ఉస్మాన్ అలీఖాన్
    డి) నిజాం ఉల్ ముల్క్
51. సికింద్రాబాద్ నగరాన్ని ఎవరి పేరు మీద నిర్మించారు?
    ఎ) మొదటి అసఫ్ జా బి) రెండో అసఫ్ జా
    సి) మూడో అసఫ్ జా డి) నాలుగో అసఫ్ జా
52. ఉస్మానియా విశ్వ విద్యాలయ స్థాపకుడు?
    ఎ) మీర్ ఉస్మాన్ అలీఖాన్
    బి) నిజాం అలీఖాన్
    సి) మీర్ మహబూబ్ అలీఖాన్
    డి) నిజాం అలీఖాన్
53. 'కాశీయాత్ర చరిత్ర'ను రాసిందెవరు?
    ఎ) దాశరథి
    బి) కొనగంటి సత్యనారాయణ
    సి) ఏనుగుల వీరస్వామి
    డి) కోలా శేషాచలం
54. 'హైదరాబాద్ అంబేద్కర్'గా పేరు పొందిన వారెవరు?
    ఎ) భాగ్యరెడ్డి వర్మ
    బి) అరిగే రామస్వామి
    సి) బొజ్జం నర్సింహులు
    డి) బి.ఎస్. వెంకటరావు
55. చార్మినార్ ఎత్తు ఎంత?
    ఎ) 52 మీ. బి) 50.2 మీ.
    సి) 49.8 మీ. డి) 48.7 మీ.

సమాధానాలు

1) సి; 2) డి; 3) బి; 4) సి;
5) బి; 6) ఎ; 7) సి; 8) ఎ;
9) బి; 10) ఎ; 11) బి; 12) సి;
13) ఎ; 14) సి; 15) బి; 16) ఎ;
17) డి; 18) బి; 19) సి; 20) ఎ;
21) సి; 22) ఎ; 23) బి; 24) సి;
25) డి; 26) డి; 27) బి; 28) బి;
29) ఎ; 30) బి; 31) డి; 32) సి;
33) ఎ; 34) సి; 35) డి; 36) సి;
37) ఎ; 38) డి; 39) డి; 40) బి;
41) డి; 42) డి; 43) ఎ; 44) సి;
45) సి; 46) డి; 47) సి; 48) బి;
49) బి; 50) బి; 51) సి; 52) ఎ;
53) సి; 54) డి; 55) డి;

A minor is admitted to the partnership firm as?

BANK EXAMS

BANKING AWARENESS

Model Questions

1. The payment of a lost demand draft is made to the ______?
   a) Purchaser b) Payee
   c) Nominee d) Any of the above
   e) None of these
2. In the case of granting loan against a life insurance policy, the banker should see ______?
   a) The existence of insurable interest
   b) The surrender value
   c) The admission of age
   d) All of the above
   e) None of the above
3. When a debtor owes several debts to a banker and makes a payment, the right to appropriation lies with ______?
   a) The banker b) The debtor
   c) The court
   d) All of the above
   e) None of the above
4. In terms of Section 31 of the Reserve Bank of India Act, 1934 a demand draft payable to bearer may be issued only by ______?
   a) Nationalized Banks
   b) Scheduled Commercial Banks
   c) Reserve Bank of India
   d) Foreign Banks
   e) None of the Above
5. Unsigned demand draft is presented for payment, the drawee branch will ______?
   a) Honour it
   b) Dishonour it since it does not have a mandate of the drawer bank to pay it.
   c) Honour it after seeking confirmation from the collecting bank
   d) Honour it if it is for small amount
   e) None of the above
6. When was SBI established?
   a) 1st April 1935
   b) 31st July 1969
   c) 5th May 1955
   d) 1st July 1955
   e) None of the above
7. The maximum number of partners in a non-banking partnership firm is ______?
   a) 20 b) 10 c) 25 d) 11
   e) None of the above



8. Which of the following agencies /organizations has recently decided that all the Stock Exchanges would introduce physical settlement of Equity Derivatives?
   a) Reserve Bank of India
   b) Bombay Stock Exchange
   c) Registrar of Companies
   d) Securities & Exchange Board of India
   e) All of the above
9. How much bad loans was accumulated with the public sector banks as on 31st March 2015 as disclosed by the Finance Ministry on 21st July 2015?
   a) Rs. 2.76 lakh crore
   b) Rs. 2.54 lakh crore
   c) Rs. 2.67 lakh crore
   d) Rs. 2.27 lakh crore
   e) None of the above
10. In Mutual Funds, NAV is the price of ______?
    a) Entire fund value
    b) One unit of a fund
    c) Surrender value
    d) Average value of shares
    e) Dividends paid in a year
11. Presently which Indian Bank has the largest number of foreign branches?
    a) SBI
    b) Canara Bank
    c) Bank of Baroda
    d) Bank of India
    e) None of the above
12. Cash deposit ratio means____ ?
    a) The percentage of cash-in-hand-balance with the Central Bank to the aggregate deposits
    b) The percentage of total deposits received by Banks
    c) The percentage of total cash money received as deposits by banks
    d) All the above
    e) None of the above
13. Central Government has appointed Sriram Kalyanaraman as the Managing Director (MD) and Chief Executive Officer (CEO) of which of the following organisations:
    a) NABARD
    b) National Housing Bank (NHB)
    c) I.F.C d) IDRBT e) B.I.R.D
14. In case of a usance bill a grace period of........ Will be allowed to calculate due date of payment.
    a) 3 days b) 2 days
    c) 1 day d) 4 days
    e) None of the above
15. In the case of FCNR accounts the payment of interest is effected in ____?
    a) Indian Rupee
    b) Only in Pound (£)
    c) Same currency in which deposit stands
    d) Yen e) None
16. Working capital requirement depends upon ______?
    a) Level of activity
    b) Types of business carried
    c) Nature of Production cycle
    d) All the above
    e) None
17. In which of the Acts, specimen of the cheque, bill, promissory note is given?
    a) Negotiable Instruments Act
    b) Banking Regulation Act
    c) Mercantile Law
    d) All of the above e) None
18. RBI permitted CBS-enabled Co-operative Banks to issue ATM cards in tie-up with:
    a) State Bank of India
    b) Any Nationalised Bank
    c) a sponsor bank.
    d) NABARD e) b &c
19. Who headed the RBI panel that has submitted its report titled 'Data Format for Furnishing of Credit Information to Credit Information Companies'.
    a) Urjit Patel b) A.K.Sharma
    c) Aditya Puri d) R.Gandhi
    e) None of these
20. India's first post office savings bank ATM facility has been recently inaugurated in which of the following places?
    a) Chennai b) Bengaluru
    c) Mumbai d) Delhi
    e) None of these
21. The main function of an Asset Management Company is to:
    a) hold the securities of various schemes
    b) manage the funds by making investments in various types of securities
    c) hold its property for the benefit of the unit holders
    d) act on behalf of SEBI
    e) All the above
22. Which country on 30 June 2015 became the first-ever developed economy to default on a loan with the International Monetary Fund (IMF)?
    a) Afganisthan b) Australia
    c) Bangaladesh d) Greece
    e) Canada
23. The minimum period under which a term deposit under Reinvestment Plan can be issued is ___?
    a) 24 months b) 12 months
    c) 6 months d) 9 months
    e) None
24. A minor is admitted to the partnership firm as ______?
    a) Agent b) Partner
    c) Minor d) Beneficiary
    e) None
25. Which bank on 4th July 2015 became the first in the country to launch the MUDRA Card, under the Pradhan Mantri MUDRA Yojana (PMMY) scheme?
    a) Andhra Bank
    b) Bank of Baroda
    c) Central Bank
    d) Corporation Bank
    e) Union Bank of India
26. Who was named as the first Chairman of the to be opened Bandhan Bank, which announced its Board of Directors on 9th July 2015?
    a) Ashok K. Lahiri
    b) Subir Gokaran
    c) S.S.Mundra
    d) Pratik Choudhary
    e) T.S.Vijayan
27. What is the limitation of the number of persons in a joint savings bank account?
    a) Two b) Four c) Five
    d) Twenty e) No limit
28. After acceptance of a bill, the primary liability on a Bill of Exchange is that of ______?
    a) Payee b) Acceptor
    c) Drawee d) Endorsee
    e) All of the above
29. The full form of SREP used in Basel framework is :
    a) Standard Review and Evaluation Process
    b) Supervisory Review and evaluation Process
    c) Standardised Revision and Evaluation Practice
    d) Supervisory Review and Electronic Process e) None
30. In order to enable private sector banks to attract and retain professional directors, the Reserve Bank has issued guidelines on compensation for non-executive Directors for implementation by private sector banks, that will reflect market realities and will be within the parameters specified in the:
    a) Banking Regulation Act, 1949
    b) The Indian Companies Act, 2013 (Amended)
    c) RBI Act 1934
    d) As per the directives of Indian Banks Association
    e) Both a&b
31. An executor of deceased account is appointed under ______?
    a) Trust b) Court c) Will
    d) Family tradition
    e) None of the above
32. Relationship between the RBI and the bank maintaining currency chest will be of ______?
    a) Trustee and beneficiary
    b) Principal and agent
    c) Licensor and licensee
    d) Creditor and debtor
    e) None of the above
33. The Reserve Bank has advised all public sector banks and select private sector and foreign banks to appoint an internal Ombudsman. The internal Ombudsman would be designated as ______:
    a) Chief Ombudsman Service Officer
    b) Chief Customer Ombudsman Officer
    c) Internal Ombudsman Customer Service Officer
    d) Chief Customer Service Officer
    e) Chief Transaction Audit Officer

Answers

1) a; 2) d; 3) b; 4) c;
5) b; 6) d; 7) a; 8) d;
9) c; 10) b;11) a; 12) a;
13) b; 14) a; 15) c;16) d;
17) e; 18) c; 19) c; 20) a;
21) b; 22) d; 23) c; 24) d;
25) d;26) a; 27) e; 28) b;
29) b; 30) e; 31) c; 32) b;
33) d.